వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 4 హైదరాబాద్ 153 ఏప్రిల్ 2014 పేజీలు : 68 రు. 20

- రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం - మంచీ చెడూ
- నరహంతక మోడీ అబద్ధ ప్రచారాలు
- తెలంగాణ ఉద్యమానికి ఎన్‌జిఒల ప్రమాదం
- 'హిందూ మత చరిత్ర' ఉపసంహరణ ఎందుకు?
- 2014 ఎన్నికల రైతు ఎజెండా
- అంబేద్కర్ 'కుల నిర్మూలన' పుస్తక వివాదం
- వెనిజులా నేర్పుతున్న పాఠాలు

వీక్షణం రచయితల సమావేశం (మార్చ్ 9, 2014) దృశ్యాలు







ISSN 2231-6892

153

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2014
సంపుటి : 12
సంచిక : 4

లోపలి పేజీల్లో...

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజెన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

- వీక్షణం రచయితల సమావేశానికి హాజరైన రచయితలు, శ్రేయోభిలాషులు వీక్షణంను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో అక్కడికక్కడే ఆర్థిక సహాయం అందించారు. మెరుగు రాజయ్య (గోదావరి ఖని), చిమ్మె జాన్‌బర్నబాస్ (కర్నూల్), కె. ప్రభాకర్ (నల్గొండ), ఎన్. సుధాకర శర్మ, పి. రవిందర్ రెడ్డి, టి. నళిని, కె.ఆర్. చౌదరి (హైదరాబాద్) లు అందించిన మొత్తం సొమ్ము రు. 14,500. ఎస్. ఆశాలత ప్రతి నెలా రు. 500 విరాళంగా ఇస్తానని వాగ్దానం చేశారు.
- 'నిత్యజీవితంలో సోషలిజం' పుస్తక రచయిత బి.ఎస్. రాజు తన పుస్తకం అమ్మకాల మీద వచ్చిన సొమ్మును వీక్షణంకు విరాళం ఇస్తానని ప్రకటించారు. తొలి విడత రు. 4000 అందజేశారు.
- పేరు చెప్పడానికి ఇష్టపడని వీక్షణం అభిమాని ఒకరు విజయవాడ నుంచి రు. 10,000 వీక్షణం అకౌంట్‌లోకి ఎలక్ట్రానిక్ బదిలీ చేశారు.

వీరందరికీ కృతజ్ఞతలు. - సం.

కోస్తా, రాయలసీమలో త్వరగా రాజధాని ఏర్పాడాలనే కోరిక మొదలైంది, అలాగే హైదరాబాద్ లాగ రాజధానిలో ఉపాధి అవకాశాల కేంద్రీకరణ జరగకూడదనే కోరిక బలంగా ఉంది. ఇప్పటికైనా, ఆ ప్రాంతపు ప్రజా సంస్థలు వాటి కోసం ఆందోళన చేస్తే మంచిది. దీనికి అనువైన ఆచరణ గురించి చర్చలు మొదలవ్వాలి. ఉమ్మడి రాజధాని, కోర్టులు వంటివి విడిపోయిన తరువాత అభిలషణీయం కాదు. తెలంగాణ సమాజం చేసిన ప్రయోగం గురించి వారు మూల్యాంకనం చేసుకోవడానికి కూడా ఈ ప్రక్రియ ఎంత వేగంగా జరిగితే అంత మంచిది. హైదరాబాద్ మీద ఆధారపడే అవసరం ఎంత త్వరగా ముగించగలిగితే అంత మంచిది.

– కె. నరేంద్రమోహన్, ఆస్ట్రేలియా

వీక్షణం మార్చ్ సంచిక చదివిన తరువాత నాకు కొన్ని విషయాలు అవగాహనకు వచ్చాయి. 1) ఆంధ్ర, సీమ ప్రాంతాలలోనే ఆధిపత్య వర్గాలు ఉన్నాయి. తెలంగాణలో లేవు. 2) ఆంధ్ర, సీమ ప్రాంతాలలోని అన్ని వర్గాలు దోపిడీదారులు, తెలంగాణ లోని వారు దేవతలు. 3) కేవలం ఆంధ్ర, సీమ 'పాలకవర్గాలు' మాత్రమే ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, విద్వేషాలు రెచ్చగొడతాయి. 4) గుజరాత్‌లో మాత్రమే 2002లో మత ఘర్షణలు జరిగాయి. స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో మరే ప్రాంతంలోనూ అటువంటి అనుభవం లేదు. 5) బ్రాహ్మణ మావోయిస్ట్ గౌరవ డా. ఎన్. వేణుగోపాల్ తదితరులు కోరినట్టుగా ఆంధ్రసీమలోని ఐదు కోట్ల మంది ప్రజల మీద సామూహిక శిక్ష విధించమని అడిగే బదులు బిజెపి నాయకుడు ఎం. వెంకయ్యనాయుడు ఆంధ్ర – సీమకు కొన్ని రొట్టె ముక్కలు కావాలని అడిగే క్షమార్హం కాని నేరం చేశాడు. 6) జ్ఞానం మీద, విద్య మీద తరతరాలుగా ఉన్న బ్రాహ్మణ గుత్తాధిపత్యాన్ని సవాలు చేయడమనే దారుణ నేరానికి ఒడిగట్టిన కృష్ణా – గుంటూరు కమ్మలే సమైక్యాంధ్ర ఉద్యమాన్ని సృష్టించారు. 7) ఆంధ్ర ప్రాంతానికి పోలవరం ప్రాజెక్ట్ రాకుండా అడ్డుకోకపోవడం ద్వారా తెలంగాణ నాయకులు ఆ ప్రాంత ప్రజలకు ద్రోహం చేశారు. 8) ఆంధ్ర ప్రజల ఉద్యమాన్ని ఎత్తి చూపుతూ, ఆంధ్ర – తెలంగాణల మధ్య శత్రుత్వాన్ని మీడియా రెచ్చగొట్టింది. నిజానికి ఆంధ్రులు చాలా మెత్తని వారు. హైదరాబాద్‌ను కెసిఆర్‌కు, డా. ఎన్. వేణుగోపాల్‌కు ఒదిలి పెట్టడానికి సంతోషంగా అంగీకరించారు. 9) ఆంధ్ర నాయకులు మాత్రమే తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమ ప్రజలకు ద్రోహం చేశారు. కాగా, తెలంగాణ నాయకులు ఎల్లప్పుడు తమ ప్రజల కోసం పోరాడారు. 10) ఆంధ్ర నాయకులు మాత్రమే హైదరాబాద్‌లో భూములు ఆక్రమించి భవనాలు నిర్మించుకున్నారు. కాగా, తెలంగాణ నాయకులు మురికివాడల్లో నివసిస్తారు. బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట చెరువు గర్భం భూమిని విజయవాడ, గుంటూరుల నుంచి వచ్చిన వారే ఆక్రమించారు. ఈ జ్ఞానోదయం కలిగించినందుకు కృతజ్ఞతలు.

– మాగ్జిం గోర్కీ
gorky1926@gmail.com

(వీక్షణంకు ఇ–మెయిల్ ద్వారా అందిన ఇంగ్లిష్ లేఖకు అనువాదం. ఈ లేఖ స్వరాన్ని బట్టే రచయిత ఉద్దేశం ఏమిటో పాఠకులు తేల్చుకోగలరు. ఒకే ఒక సవరణ : ఉత్తర రచయిత వ్యంగ్యంగా డా. ఎన్. వేణుగోపాల్ అని రెండుసార్లు ప్రస్తావించారు కాని వీక్షణం సంపాదకుడికి డాక్టరేట్ లేదు.)

వీక్షణంలో రెగ్యులర్‌గా రంగనాయకమ్మగారి రచనలు, ఆమె తప్పులను కూడ భగవత్ ప్రసాదంగా భావించే భజనపరుల ఉత్తరాలు రావడం చూసి ఆశ్చర్యం, విచారం కలుగుతున్నాయి. తెలుగుదేశం ఎంత గొడ్డుబోయినా దిగంబరకవులది కవిత్వమనుకునేంత గొడ్డుబోయిందా అని ఒకప్పుడు రాచమల్లు రామచంద్రారెడ్డి గారన్నారు. దిగంబర కవుల కవిత్వం గురించి ఆయన మాటలు నిజం కావు గాని, ఆయన పద్ధతిలోనే ఇప్పుడు రంగనాయకమ్మ కుతర్కాన్ని, సంకుచితత్వాన్ని, మూర్ఖ ప్రేలాపనలను మార్క్సిజం అనుకునేంతగా తెలుగుసీమలో జ్ఞానశూన్యత ఆవరించిందా అని అడగాలనిపిస్తున్నది. లోకసంచారి, తోలేటి జగన్మోహన రావు, కార్ల్ మార్క్స్ ఎవరు రాసిన వాటిలోనైనా తప్పులు, పొరపాట్లు ఉండవచ్చు. వాటిని ఎత్తి చూపడానికి ఒక పద్ధతి ఉంటుంది. అసలు అవి తప్పులు కూడ కాకపోవచ్చు. రంగనాయకమ్మ వంటి వారికి తప్పులుగా కనిపించవచ్చు. నాకు ఇది తప్పుగా అనిపిస్తున్నది, మరొక అర్థమేదైనా వస్తుందా, దీన్ని మరొక రకంగా అర్థం చేసుకోవాలా అని అడిగే వినయం ఉండాలి. కాని, నాకు తెలిసిందే సర్వస్వం. నేను అర్థం చేసుకున్నట్టే అందరూ అర్థం చేసుకోవాలి, నాకు నచ్చినదే సరైనది, మిగిలినవన్నీ తప్పులు అనడం మూర్ఖత్వం. ఇటీవలి ఆత్మకథాత్మక నవలలో ఐదు సంవత్సరాల పాపాయి వస్త్రధారణ మీద రంగనాయకమ్మ ఇటువంటి దుర్మార్గమైన కామెంట్లు చేసారు. దుస్తులు వేసుకునే పద్ధతి వేరువేరు సంస్కృతులలో, వేరువేరు అభిరుచులను బట్టి ఉంటుందని ఆమెకు తెలియదు. ఆమెకు తెలిసిన పద్ధతి ఒక్కటే సరైనది. మిగిలినవన్నీ తప్పు. అటువంటి అభిప్రాయాలు ఉన్న రచయితకు మూఢభక్తులు ఉండడం చూస్తే తెలుగు మేధోలోకం భవిష్యత్తు మీద నిరాశ కలుగుతున్నది. ఎవరి రచనలోనైనా ఏదైనా తప్పు కనిపిస్తే, నాకు ఈ కారణాలవల్ల తప్పుగా అనిపిస్తున్నది అని వివరించే వాదనా పటిమ ఉండాలి. కాని తోలేటి అంటే ఎక్కడికి తోలేటి, మేం వస్తాం అంటే ఎక్కడి నుంచి వస్తారు, మీరంటే ఎవరు, అసలు ఎక్కడికి వెళ్లారు లాంటి ప్రశ్నలు వేసి గొప్ప విమర్శ చేసానని అనుకోవడం, ఆమె గొప్ప విమర్శ చేసిందని భక్తులు రాయడం విచారకరం. ఈ పద్ధతి వాక్యాలు, వాదనలు నవలారచనలో పనికొస్తాయి గాని అది సీరియస్ చర్చా పద్ధతి కాదు. హాస్యంగా, పరిహాసాస్పదంగా ఉంటుంది గాని సైద్ధాంతికంగా ఉండదు. తోలేటి జగన్మోహనరావు గారి పుస్తకంలో తప్పనిసరిగా ఖండించవలసిన లోతైన విషయాలెన్నో ఉన్నాయి. రంగనాయకమ్మ గారికి బహుశా అవి అర్థం కావనుకుంటాను, పైపైన హాస్యస్ఫోరక సంభాషణ కొంత చేసి అదే విమర్శ అనుకుంటున్నారు. అయినా, స్వయంగా రచయితే ఖండించారు తప్ప మరెవరూ రంగనాయకమ్మ గారి దుర్విమర్శకు జవాబులు రాయలేదా, అవి వేయడానికి వీక్షణానికి కూడ భయమా? 'రచనలో వ్యక్తమైన అభిప్రాయాలతో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు' అనే ముసుగు కింద తప్పుడు అభిప్రాయాలు వేయకండి. మీకు ఏకీభావం ఉన్నా లేకపోయినా తప్పు తప్పే, ఒప్పు ఒప్పే. జాగ్రత్త వహించండి.

– పి. సాగర్
ఢిల్లీ (ఇ–మెయిల్ ద్వారా)

ఉరిపోసుకు చనిపోవడమా, సముద్రమున పడిపోవడమా?

ఎన్ని తీర్ల ఎన్నికలు, ఎన్నెన్ని ఎన్నికలు. ఎన్ని కలలు. ఎన్ని కలతలు. ఎన్ని నిరాశలు. ఈ నెలంతా ఎండలు మండిపోయినట్టు ఎన్నికలు నిండిపోతున్నాయి. రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలు, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు. వాటి గొడవ వదలగానే శాసన సభ ఎన్నికలు. పార్లమెంటు ఎన్నికలు. ఎన్నిసార్లు వోటు వేసినా ఏమి ఒరిగిందని! పదిహేను లోకసభలు గడిచి పదహారో లోకసభకు తయారీ జరుగుతుంటే దేశం ముందుకు పోతున్నదా, వెనక్కి పోతున్నదా? దారిద్ర్యం తగ్గిందా, పరపాలన తగ్గిందా, ఆకలి తగ్గిందా, రోగం తగ్గిందా, దుఃఖం తగ్గిందా? బతుకు బాగుచేయడం కోసమే గద్దెనెక్కుతున్నామన్న వాగ్దానాలు నీటిమీద రాతలవుతుంటే ఎన్నికలలో అసలెందుకు పాల్గొనాలి? ఒకడు కాకపోతే ఒకడైనా ఏదైనా చిన్నమెత్తు మేలు చేస్తాడనుకుంటే, గొర్రెలు తినేవాడు పోయి బర్రెలు తినేవాడే వస్తున్నాడు గాని రాజకీయాలంటే ప్రజాసేవ అని ఏ ఒక్కడికైనా గుర్తుందా?

ఈ దేశంలో పార్లమెంటరీ రాజకీయాల పట్ల, ఆరు దశాబ్దాలకు పైగా జరుగుతున్న బూటకపు ప్రజా ప్రాతినిధ్య తంతు పట్ల, ఎన్నికల ప్రహసనాల పట్ల ఇదీ సామాన్యుడి ఆవేదన. ఆ సమగ్ర దృక్పథం ఉంచుకుంటూనే, ప్రస్తుత పార్లమెంటరీ ఎన్నికల గురించి ఆలోచించ వలసి ఉంది. మన సమాజంలో కులం, మతం ఎటువంటి పాత్రలను పోషిస్తున్నాయో, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కూడ అటువంటి మత్తుమందు పాత్రను, ప్రజలను చీలదీసే పాత్రను, అసలు వాస్తవాల నుంచి దూరం చేసి మైమరపించే పాత్రను పోషిస్తున్నది. ప్రత్యామ్నాయ ఆలోచనలను, ఆచరణను అతి క్రూరంగా అణచివేస్తున్న దేశంలో అత్యధిక ప్రజానీకానికి పార్లమెంటరీ ఎన్నికలు తప్ప గత్యంతరం లేని స్థితి ఉంది. ఎన్నికలలో ఏ పార్టీ గెలిచి ఏ పార్టీ ఓడినా తమకు ఒరిగేదేమీ లేదని, అంతిమంగా తామే ఓడిపోతున్నామని ప్రజలందరికీ తెలుసు. కాని బలప్రయోగం, ఆకర్షణలు, తాత్కాలిక భ్రమలు, కుల, మత, ప్రాంత సమీకరణాలు ప్రజలను పదేపదే ఎన్నికల జూదంలోకి లాగుతున్నాయి.

ఆ జూదం మరొకసారి ఈ ఏప్రిల్–మేలలో జరగనున్నది. తెలంగాణ లో ఏప్రిల్ 30న, ఆంధ్రప్రదేశ్‌లో మే 7న లోకసభకు జరిగే ఎన్నికలలో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోవలసి ఉంది. ఈ 42 స్థానాలలో పోటీ చేసే అభ్యర్థుల గుణగణాలను, వ్యక్తిగత మంచిచెడులను పక్కనపెట్టి వారు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పక్షాలను, సామాజిక దృక్పథాలను, వారి రాజకీయపక్షం అధికారంలోకి వస్తే అమలుచేయబోయే రాజకీయార్థిక విధానాలను పరిశీలించవలసి ఉంది.

ఇవాళ లోకసభ ఎన్నికలలో ప్రధాన రాజకీయపక్షాలుగా ఒకవైపు కాంగ్రెస్, దాని నాయకత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ భాగస్వామ్య పక్షాలు, మరొకవైపు భారతీయ జనతా పార్టీ, దాని నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ భాగస్వామ్య పక్షాలు, ఇంకొకవైపు పార్లమెంటరీ వామపక్షాలు, మధ్యేమార్గ రాజకీయ పక్షాలతో రూపొందిన థర్డ్ ఫ్రంట్ పోటీ పడుతున్నాయి.

వీటిలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ రెండు దఫాలుగా అధికార పక్షంగా ఉన్నది. గత అరవై రెండు సంవత్సరాల ఎన్నికైన ప్రభుత్వాల కాలంలో నలభై ఐదు సంవత్సరాలకు పైగా దాని పాలనే సాగింది. దేశంలోని సకల దుర్మార్గాలకూ కన్నతల్లిగా పేరు తెచ్చుకున్న పార్టీ కాంగ్రెస్. ఈ దేశ వనరులను దేశదేశాల సంపన్నులకు దోచిపెట్టడం లో, దేశంలో బడాభూస్వామ్య, దళారీ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల అనుకూల రాజకీయార్థిక విధానాలు సాగించడంలో ఆ పార్టీ అగ్రగామి. గత రెండున్నర దశాబ్దాలుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో దేశాన్ని తెగనమ్ముతున్న పార్టీ అది. ఇవాళ మరొకసారి మేకతోలు కప్పుకుని సంక్షేమ రాజ్య జపం చేస్తూ ప్రజలను వంచించడానికి బయల్దేరుతున్నది.

ఇక భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి గతంలో ఆరు సంవత్సరాలకు పైగా కేంద్ర ప్రభుత్వ అధికారంలో ఉంది. భాజపా గాని, దాని ముందరి రూపాలు గాని సొంతంగా కేంద్రంలో మరికొద్ది కాలం పాటు, రాష్ట్రాలలో అనేక దఫాలు అధికారం చలాయించాయి. ఈ పార్టీ పాలన ప్రజానుకూలం కాకపోవడం మాత్రమే కాదు, ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే దుర్మార్గానికి ప్రతీకగా సాగింది. రామజన్మభూమి నిర్మాణం, అధికరణం 370 తొలగింపు, ఉమ్మడి పౌరచట్టం అనే నినాదాల భూమికగా పనిచేసే ఈ పార్టీ ఈ మూడు నినాదాల ద్వారా ముస్లిం వ్యతిరేక విషం, జాతుల అణచివేత, మత మైనారిటీల అణచివేత తన సిద్ధాంతంగా ప్రకటించుకుంటున్నది. మనుస్మృతిని నమ్మే సంఘపరివారంలో భాగంగా ఈ పార్టీ వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడే హిందూత్వ, మతోన్మాద రాజకీయాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నది. ఈ రాజకీయ, సామాజిక ద్వేష విధానాలను త్రికరణశుద్ధిగా అమలు చేసే నరహంతక నరేంద్ర మోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా, మోడీకరణ నినాదం ద్వారా భవిష్యత్తులో తానేమి చేయదలచుకున్నదో ఈ పార్టీ స్పష్టంగానే చెపుతున్నది.

ముందు నుయ్యి, వెనుక గొయ్యి లాంటి ఈ కూటములను, పార్టీలను పక్కనపెట్టి మూడో ప్రత్యామ్నాయం ఆలోచిద్దామంటే పార్లమెంటరీ వామపక్షాలు, మధ్యేమార్గ పార్టీలు అన్నీ కూడ ఎప్పుడో ఒకసారి కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారానికి వచ్చి తామూ ఆ తానులో ముక్కలమేనని చూపుకున్నవే. ఒక్కటంటే ఒక్కపార్టీ కూడ తాను భిన్నమైన దాన్నని, ప్రజానుకూలమైన దాన్నని ఒక్క విధానం ద్వారానైనా చూపుకోలేదు. అవినీతి రహిత పాలన, పారదర్శక పాలన వంటి ఆదర్శవంతమైన నినాదాలతో ముందుకొస్తున్న కొత్త పార్టీలు కూడ ఈ దొంగల ముఠాలో భాగమేనని అతి త్వరలోనే రుజువు చేసుకున్నాయి. ఎవరినీ ఎన్నుకోదలచుకోలేదు అనే మీటకు కూడ అర్థవంతమైన ఫలితం ఉండే అవకాశం లేదు.


ఒక్కమాటలో చెప్పాలంటే ఇవాళ పార్లమెంటరీ ఎన్నికల రణరంగంలో ఉన్నవన్నీ పాలకవర్గ పార్టీలే. పాలకవర్గ ముఠా తగాదాలే. ఒక్కటంటే ఒక్కటైనా ప్రజల పార్టీ లేదు. అసలు ఈ ఎన్నికల వ్యవస్థ తయారైన పద్ధతే అక్కడ ప్రజా పార్టీ ఉండడానికి అవకాశం ఇవ్వడం లేదు. ఈ వాస్తవాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ఎన్నికల బూటకత్వాన్ని గుర్తెరిగి, నిజమైన ప్రజా ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడమే ఇవాళ దేశం ముందున్న తక్షణావసరం. వీ

తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల అంశాలేమిటి?

లోకసభ సార్వత్రిక ఎన్నికలతో పాటే రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు కూడ ముంచుకొస్తున్నాయి. గత ఐదు సంవత్సరాల తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల వల్ల వేడెక్కిన, కొంతవరకు వైమనస్యం పెరిగిన వాతావరణంలో రెండు రాష్ట్రాలలోను రాజకీయ పక్షాలు ప్రజలలో తమ పట్ల ఆదరణను, తమ భవిష్యత్తును పరీక్షించుకోనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైనందుకు కృతజ్ఞత తెలపడం, తెలంగాణ పునర్నిర్మాణ సమర్థతను గుర్తించడం అనేవి తెలంగాణలో ఎన్నికల అంశాలుగా ఉంటాయి. రాష్ట్రాన్ని విభజించి నందుకు వ్యతిరేకత, ఆ విభజనలో భాగస్వామ్యం వహించినందుకు నిరసన తెలపడం, విభజనానంతర ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగినవారిని గుర్తించడం అనేవి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అంశాలుగా ఉంటాయి. అయితే ఎన్నికలలో ప్రధానాంశాలు ఏవైనప్పటికీ కులం, మతం, డబ్బు, బలప్రయోగం ప్రధాన పాత్ర వహించడం భారత పార్లమెంటరీ ఎన్నికల చరిత్రలో సర్వసాధారణమే. ఈ అన్ని కారణాలూ కలిసి ఇటు తెలంగాణలోనూ అటు ఆంధ్రప్రదేశ్ లోనూ 2014 శాసనసభ ఎన్నికలను అత్యంత ఆసక్తిదాయకంగా మారుస్తున్నాయి. తెలంగాణలో ఉద్యమంలో పాల్గొన్న అన్ని పార్టీలకూ – తెలంగాణ రాష్ట్ర సమితి, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ, న్యూ డెమొక్రసీ – లకు వారి వారి పాత్రలను బట్టి కృతజ్ఞతా సూచకంగా వోట్లు పడవచ్చు. అందులోనూ కాంగ్రెస్, భాజపాల ద్వంద్వ వైఖరి స్పష్టంగానే ఉంది గనుక ఆమేరకు ఆ కృతజ్ఞతకు గండి కూడ పడవచ్చు. తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇప్పుడు ఎన్ని మాటలు చెపుతున్నా ఉద్యమ క్రమంలో ప్రదర్శించిన వ్యతిరేకత వల్ల వారికి కృతజ్ఞతా వోట్లు రాకపోవచ్చు. ఈ స్థితిలో పునర్నిర్మాణం ఎవరు చేయగలరనే ప్రాతిపదిక మీద పడే వోట్లకే నిర్ణయాత్మకత ఉంటుంది. ఆ విషయంలో తెరాస, కాంగ్రెస్ తెలంగాణ అధికారానికి పోటీ పడతాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక నాయకులు సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగమైనప్పటికీ ప్రజలలో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత కలిగించడంలో ప్రతిపక్షాలు విజయం సాధించాయి. తామే సమైక్యాంధ్ర నినాదానికి గుత్తేదారులమని జై సమైక్యాంధ్ర పార్టీ, తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ నాలుగూ పోటీ పడుతున్నాయి. కనుక సమైక్యాంధ్ర వోట్లు ఈ నలుగురి మధ్య చీలి చివరికి కాంగ్రెస్ కే మేలు జరగవచ్చు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ సామర్థ్యం తనకే ఉందని తెలుగుదేశం చేస్తున్న ప్రచారం ఆ పార్టీకి కొంత మేలు చేయవచ్చు. రానున్న రెండువారాల్లో రూపొందనున్న పొత్తులవల్ల ఈ మొత్తం దృశ్యం కూడ మారిపోవచ్చు. మొత్తానికి విభజనానంతర తెలుగు రాష్ట్రాలు రెండిటి లోను అనిశ్చితికే ఎక్కువ అవకాశం కనబడుతున్నది. సంఖ్యాపరంగా చూసినా ప్రభుత్వం స్థాపించడానికి తెలంగాణలో అవసరమైన 60 స్థానాలు, ఆంధ్రప్రదేశ్ లో అవసరమైన 83 స్థానాలు ఏ ఒక్క పార్టీ కూడ సొంతంగా తెచ్చుకోగల అవకాశాలు కనబడడం లేదు. అందువల్ల ఎన్నికల పొత్తులు, ఎన్నికల అనంతర పొత్తులు, మిశ్రమ ప్రభుత్వాలు తప్పని పరిస్థితి ఏర్పడనుంది. ఒకరకంగా పాలకవర్గ ముఠాల మధ్య ఎంత తగాదాలు ఉంటే ప్రజలకు అంత వెసులుబాటు దొరుకుతుంది గనుక రెండు రాష్ట్రాలలోనూ ప్రజలకు ఆశావహ భవిష్యత్తే ఉండనాలి. వీ

సామ్రాజ్యవాదమంటే యుద్ధమని రుజువు చేస్తున్న క్రిమియా


సామ్రాజ్యవాదమంటే యుద్ధమే అని లెనిన్ వంద సంవత్సరాల కింద చేసిన విశ్లేషణను సామ్రాజ్యవాదం ప్రతిరోజూ రుజువు చేస్తున్నది. ఒకప్పుడు ప్రత్యక్షంగా సైనిక దురాక్రమణల ద్వారానో, మార్కెట్ ఆక్రమణల ద్వారానో కావచ్చు, మరొకప్పుడు పరోక్షంగా ఉద్రిక్తతలను ఎగసన దోయడం ద్వారా కావచ్చు. లేదా నిరంతరం ఆయుధాల తయారీ, కొత్త ఆయుధాల అన్వేషణ, ఆయుధాల అమ్మకాల ద్వారా కావచ్చు. యుద్ధం లేకుండా సామ్రాజ్యవాదం ఒక్క క్షణం కూడ మనుగడ సాగించజాలదు. పాత సోవియట్ యూనియన్ లో అంతర్భాగమైన, 1991లో స్వతంత్ర దేశంగా అవతరించిన ఉక్రెయిన్‌లో ఒకవంక ఇటు రష్యా అనుకూల శక్తులకూ, అటు అమెరికా–యూరపియన్ యూనియన్ అనుకూల శక్తులకూ మధ్య ఘర్షణ సాగుతుండగానే, ఆ రెండు శక్తులే ఉక్రెయిన్ దక్షిణ కొసన, నల్లసముద్రంలో ద్వీపకల్పంగా ఉన్న క్రిమియాలో ఉద్రిక్తతలను ప్రారంభించాయి. ఉక్రెయిన్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించు కున్నప్పుడు దానిలో భాగంగా మారి, ఆ తర్వాత స్వతంత్ర ప్రతిపత్తి కోసం పెనుగులాడుతున్న క్రిమియాలో అది రష్యాలో విలీనం కావడం గురించి మార్చ్ 16న ఒక ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. క్రిమియా మీద సార్వభౌమాధికారం రష్యాకు చెందుతుందా, ఉక్రెయిన్‌కు చెందుతుందా అనేది సుదీర్ఘకాలంగా సాగుతున్న చర్చ. నిజానికి ఇరవై ఏడు వేల చ.కి.మీ. వైశాల్యంతో, ఇరవై మూడు లక్షల జనాభాతో మాత్రమే ఉన్న ఈ చిన్న ప్రాంతం మీద ఇంత ఘర్షణ అవసరం లేదనిపిస్తుంది. కాని మధ్యధరా సముద్రానికి, బాల్కన్ దేశాలకు, పశ్చిమాసియా దేశాలకు సులభమైన రవాణా సౌకర్యానికి వీలుకల్పించే సముద్ర తీరం, ఓడరేవులు ఉన్నందువల్ల క్రిమియా సామ్రాజ్యవాదుల అత్యాశలకు బలిపీఠంగా మారింది. అంతేగాక, క్రిమియా భూభాగం లోనూ, సముద్ర జలాల్లోనూ ఇప్పటికే గుర్తించిన, ఇంకా అన్వేషించని అపారమైన చమురు, సహజవాయు నిక్షేపాలున్నాయి. భౌగోళికంగా క్రిమియాకు ఉన్న ప్రాధాన్యత వల్ల ఆధునిక కాలంలో మాత్రమే కాదు, రోమన్ సామ్రాజ్యం నాటినుంచీ కూడ అనేక యుద్ధాలకు అది వేదిక అయింది. ఒకవైపు ఉక్రెయిన్‌లో సంక్షోభం సాగుతుండగా ఫిబ్రవరి నుంచీ రష్యా అనుకూల శక్తులు క్రిమియా మీద పట్టు సాధించాయి. ఆ తర్వాత అతి వేగంగా జరిగిపోయిన అనేక పరిణామాలలో క్రిమియా మార్చ్ 11న ఉక్రెయిన్ నుంచి విడిపోయి స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. మార్చ్ 16న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో వోటు వేసిన వారిలో 96 శాతం మంది క్రిమియాను రష్యన్ ఫెడరేషన్‌లో విలీనం చేయాలని కోరారు. స్థానిక తాతార్ జాతి ప్రజలు, ఎంతో మంది ప్రత్యర్థులు ఈ ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని, అందులో ఎన్నో అక్రమాలు జరిగాయని పాశ్చాత్య పత్రికలు రాస్తున్నాయి. ఈ ప్రజాభిప్రాయ సేకరణను ఉక్రెయిన్, అమెరికా, యూరపియన్ యూనియన్‌లు ఖండించాయి. రష్యా మీద, ఈ విలీనానికి సహకరించినవారి మీద ఆంక్షలు విధించాయి. పుతిన్ నాయకత్వాన రష్యన్ ఫెడరేషన్ ఇక్కడితో ఆగదని, ఇరుగుపొరుగు ప్రాంతాలను కూడ కబళిస్తుందని ఆరోపిస్తూ యూరపియన్ యూనియన్ దేశాలు అక్కడ సైనిక మోహరింపు జరుపుతున్నాయి. రష్యా కూడ యుద్ధ సన్నాహాలకు సిద్ధంగా ఉన్నానని ప్రకటిస్తున్నది. ఇలా సామ్రాజ్యవాదం మరొక యుద్ధరంగం తెరవడానికి ఉవ్విళ్లూరుతుండగా సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించవలసిన ప్రజాశక్తుల నిష్క్రియాపరత్వం, అసంసిద్ధత, అసమర్థత విచారకరమైన స్థాయిలో కొనసాగుతున్నాయి. వీ



❖ **కరువు కాటకాల కన్నీటి కోన – నేటి రాయలసీమ** (చారిత్రక పరిశీలన) – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : పాణి, ఇ.నెం. 50–348/2–19బి2, అరోర నగర్, బి–క్యాంప్, కర్నూల్–2; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **అధికార మార్పిడికి పూర్వ, అనంతర కాలం నుండి – దళిత ప్రతిఘటనా పోరాటాల నినాదం** – కారంచేడు నుండి లక్ష్మింపేట దాకా (1985–2013) – సంపాదకులు : పాపని నాగరాజు – జాబాలి ప్రచురణలు – 742 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు: పాపని నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సామాజిక తెలంగాణ మహాసభ, 16–9–569/10/4/2, అయోధ్యనగర్, ఓల్డ్ మలక్‌పేట్, హైదరాబాద్–36, ఫోన్: 9948872190
email : nagarajupapani@gmail.com




❖ **కాంత పున్నం వెన్నెల** – కథ – పద్మకుమారి – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **కాలాన్ని గెలుస్తూ..** – ప్రత్యేక ప్రతిభావంతులపై కవితా సంకలనం – సంపాదకుడు: బిల్ల మహేందర్ – వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఉపాధ్యాయ సంఘం ప్రచురణ – 200 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : బిల్ల మహేందర్, ఇ.నెం. 2–6–1145. గోకుల్‌నగర్, హన్మకొండ–1; సెల్: 9177604430; email : billamahisari@gmail.com



❖ **ప్రజా ప్రత్యామ్నాయాల్లో నూరేళ్ల కాళోజీ** – వరవరరావు – స్వేచ్ఛా సాహితి ప్రచురణ – 109 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : స్వేచ్ఛా సాహితి, జి1, మైత్రీ రెసిడెన్సీ, 3–6–394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500029; అన్ని ప్రముఖ పుస్తకాల దుకాణాల్లో




❖ **దాక్షిణ్యవాదం నుంచి దండకారణ్యం దాక భారత మహిళా ఉద్యమం** – వ్యాసాలు – ఎం. రత్నమాల – నూతన ప్రచురణలు – 328 పేజీలు, 1/8 డెమీ, రు. 200



❖ **పాఠకులతో నూతన సంభాషణ** – ఎం. రత్నమాల – నూతన ప్రచురణలు – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 80


పై రెండు ప్రతులకు : ఎం. రత్నమాల, మేఘా అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 302, నల్లకుంట, హైదరాబాద్ – 44; ఫోన్: 27662957; సెల్ : 9440329445



❖ **లీడర్స్ బియాండ్ మీడియా ఇమేజెస్** – కె. బాలగోపాల్ – పర్‌స్పెక్టివ్ పబ్లికేషన్ – 130 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; నవోదయ బుక్‌హౌస్




❖ **జ్వలిత దీక్ష** – తెలంగాణను కుదిపేసిన పదకొండు రోజులు – గటిక విజయ్‌కుమార్ – సుగుణ ఫిల్మ్స్ అండ్ పబ్లిషర్స్ – 359 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : గటిక విజయ్ కుమార్, ఇ.నెం. 3–287/1/91, ఎస్‌విఎస్ హోమ్స్, జవహర్‌నగర్, వడ్డేపల్లి, హనమకొండ, వరంగల్ – 506001, ఫోన్: 9553955355, 9490338666
email : vijaynekkonda@gmail.com



❖ **రేపు** – కథ – వెర్నన్ గొంజాల్విస్, అనువాదం: ఎన్. రవి – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 31 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్‌మార్క్; నవోదయ బుక్‌హౌస్




❖ **చంద్రయానం** – బి. చంద్రశేఖర్ వ్యాసావళి – భువనగిరి చంద్రశేఖర్ స్మారక సంఘం – 364 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు : ఎ. సుబ్రహ్మణ్యం, జిఎఫ్1, సుధా అపార్ట్‌మెంట్స్, 6/13ఎ, బ్రాడిపేట, గుంటూర్–522001; ఫోన్: 9000389389; email : subrahmanyam.a@gmail.com




❖ **రెండు పోరాట గాథలు** – భారతి కథలు – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం; నవోదయ బుక్‌హౌస్



❖ **తెలంగాణ సాహిత్యం – ప్రాంతీయ అస్తిత్వం** – వ్యాస సంపుటి – డా. వేలూరి శ్రీదేవి – శ్రీ శివసాయి ప్రచురణలు – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : డా. శ్రీమతి వేలూరి శ్రీదేవి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్; సెల్: 9866963615




❖ **రిజర్వేషన్లు – సామాజిక న్యాయం** – ఎం. శ్రీనివాస్ – స్పృహ సాహితీ సంస్థ – 95 పేజీలు, 1/8 డెమీ, రు. 50



❖ **చారిత్రక సందర్భం** – ఎం. శ్రీనివాస్ – స్పృహ సాహితీ సంస్థ – 127 పేజీలు, 1/8 డెమీ, రు. 60

పై రెండు ప్రతులకు : స్పృహ సాహితీ సంస్థ, 1–8–702/33/20ఎ, పద్మకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 44



❖ **ప్రపంచీకరణలో ఆగమౌతున్న బతుకులు** – వ్యాసాల సంకలనం – చెవ్వ రఘుపతిరావు – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ హౌస్; సమాంతర

రాష్ట్రపతి పాలన

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేయడంతో మార్చ్ ఒకటిన రాష్ట్రపతి పాలనకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోగా, అదే రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చ్ ఒకటి నుంచే రాష్ట్ర గవర్నర్ నరసింహన్ పాలన అధికారాలను చేపట్టారు. 41 ఏళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో మరల రాష్ట్రపతి పాలన విధించారు.

పిఒడబ్ల్యు మహాసభలు

హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోని విఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) ఆరవ మహాసభలు మార్చ్ ఒకటి నుంచి మూడు వరకు జరిగాయి. ఈ సభల్లో వక్తలు స్త్రీలపై జరిగే అత్యాచారాలను తీవ్రంగా ఖండిస్తూ, స్త్రీలపై జరిగే అన్ని హింసలకు ప్రపంచీకరణ ఆర్థిక విధానాలే కారణమన్నారు. అలాగే స్త్రీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కలిపించాలని డిమాండ్ చేశారు. ఈ సభలకు పిఒడబ్ల్యు అధ్యక్షురాలు సంధ్య, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహిత కాత్యాయని విద్మహేలతో అనేక మంది పాటు వివిధ జిల్లాల నుంచి మహిళలు హాజరయ్యారు.

అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్‌లోని సోమాజిగూడలోని హోటల్ కత్రియాలో మార్చ్ 7 నుంచి 10 వరకు అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సును తెలంగాణ విద్యావంతుల వేదిక, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, డెమోక్రసీ డైలాగ్ సంఘాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సు 'ప్రజాస్వామ్యం – సోషలిజం 21వ శతాబ్దపు నూతన దృక్పథాలు' అనే అంశంపై జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు సమాజంలో అంతరాలకు, ప్రకృతి విధ్వంసానికి పెట్టుబడిదారీ విధానమే కారణమన్నారు. ఈ సదస్సుకు కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, హెచ్ఎంటివి చీఫ్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, సిపిఎం కేంద్ర కార్యదర్శి ప్రకాశ్‌కారత్, సిపిఐ కేంద్ర కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, పాటు 25 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. చివరి రోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభ జరిగింది.

తెలంగాణ జర్నలిస్టుల జాతర

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టిజెఎఫ్) ఆధ్వర్యంలో మార్చ్ 9న 'తెలంగాణ జర్నలిస్టుల జాతర' బహిరంగ సభ జరిగింది. ఈ సభ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టు ఫోరంను 'తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు' గా పేరు మార్చారు. ఈ సభకు హాజరైన వక్తలు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగం కావాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ఈ సభకు జర్నలిస్టులతో పాటు రాజకీయ నాయకులు, వివిధ ప్రజా సంఘాలు, సాంస్కృతిక సంఘాలు పాల్గొన్నాయి.

మరో రెండు కొత్త పార్టీలు

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి మార్చ్ 10న హైదరాబాద్‌లో 'జై సమైక్యాంధ్ర పార్టీ' స్థాపించారు. తమ పార్టీన్నీ గెలిపిస్తే రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచుతానని వాగ్దానం చేశారు. ఈ సభకు లగడపాటి రాజగోపాల్, ఉండవల్లి అరుణ్‌కుమార్, హర్షకుమార్, పితాని సత్యనారాయణ, తులసిరెడ్డితో పాటు అనేక మంది హాజరయ్యారు. అలాగే సినీ హీరో పవన్‌కళ్యాణ్ హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్ హోలులో మార్చ్ 14న జనసేనపార్టీని స్థాపించారు. 'ఇది సామాన్యుడి సేన, ఇది ప్రతి ఒక్కరి సేన, ఇది మనసేన, ఇది జనసేన' అనే నినాదంతో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన అభిమానులు అనేక మంది హాజరయ్యారు.

చొప్పకట్ల చంద్రమౌళి మృతి

అభ్యుదయ రచయిత చొప్పకట్ల చంద్రమౌళి (78) అనారోగ్యంతో మార్చ్ 13న హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చనిపోయారు. ఆయనది కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం. ఆయన విప్లవ రచయితల సంఘంలో కూడా పనిచేశారు. ఆయన సమతాదీపాలు, దీపశిఖ అనే పుస్తకాలుతో పాటు కథలు, కవితలు, నవలలు కూడా రాశారు. ఆయనది ఉపాధ్యాయ వృత్తి.

రాజకీయ ఖైదీల విడుదల కోసం ధర్నా

హైదరాబాద్‌లోని ఇందిర పార్క్ దగ్గర మార్చ్ 23న 'రాజకీయ ఖైదీల విడుదల కమిటీ (సిఆర్‌పిపి),' 'దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం)'ల ఆధ్వర్యంలో రాజకీయ ఖైదీల విడుదల కోసం ధర్నా జరిగింది. ధర్నాలో పాల్గొన్న వక్తలు దేశవ్యాప్తంగా వివిధ జైళ్లో సుదీర్ఘకాలంగా శిక్ష అనుభవిస్తున్న రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏడేళ్ల జైలు శిక్షను పూర్తి చేసుకున్న వారిని బేషరత్తుగా విడుదల చేయాలని, రాజకీయ ఖైదీల విడుదలపై అన్ని పార్టీలు, వాటి వైఖరిని పార్టీ మానిఫెస్టోల్లో వెల్లడించాలని, యుఎపిఎ వంటి చట్టాలను రద్దు చేయాలని, ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయాలని, విశాఖ, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి గ్రామాలపై జరుగుతున్న నిర్బంధాన్ని నిలిపివేయాలని ఈ కమిటీలు తీర్మానించాయి. ఈ ధర్నాకు విద్యావేత్త చుక్కా రామయ్య, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వెంకటేశ్వరరావు, వరవరరావు అల్లం నారాయణ, బొజ్జా తారకం, దుడ్డు ప్రభాకర్‌తో పాటు అనేక మంది హాజరయ్యారు.

మనుషుల అక్రమ రవాణా

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి 'మానవ వనరుల అభివృద్ధి సంస్థ' కార్యాలయంలో మార్చ్ 22న ఆంధ్రప్రదేశ్ జూడిషియల్ అకాడమి, కేంద్ర హోంశాఖల ఆధ్వర్యంలో 'మనుషుల అక్రమ రవాణా' అనే అంశం మీద సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు దేశంలో రోజురోజుకు మనుషుల అక్రమ రవాణా పెరుగుతుందని, రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. కొంతమంది స్వార్థపరులు ఆడపిల్లలను అక్రమంగా రవాణా చేసి వారిని వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారన్నారు. ఈ సదస్సుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్ జ్యోతిసేన్ గుప్తా, జూడిషియల్ అకాడమి అధ్యక్షులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెసి భానులతో పాటు అనేక మంది న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికలు

రాష్ట్రవ్యాప్తంగా 1096 జిల్లా పరిషత్తు స్థానాలకు, 11939 మండల పరిషత్తు స్థానాలకు ఏప్రిల్ 6న ఎన్నికలు జరుగనున్నాయి. కావున వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టిడిపి నుంచి జెడ్‌పిటిసి – 1037, ఎంపిటిసి – 10074, కాంగ్రెస్ నుంచి జెడ్‌పిటిసి – 745, ఎంపిటిసి – 5840, బిజెపి నుంచి జెడ్‌పిటిసి – 369, ఎంపిటిసి – 1992, వైఎస్ఆర్‌సిపి నుంచి జెడ్‌పిటిసి – 777, ఎంపిటిసి – 7514, టిఆర్ఎస్ నుంచి జెడ్‌పిటిసి – 389, ఎంపిటిసి – 3225, సిపిఐ నుంచి జెడ్‌పిటిసి – 78, ఎంపిటిసి – 600, సిపిఎం నుంచి జెడ్‌పిటిసి – 188, ఎంపిటిసి – 1095, ఇతరులు జెడ్‌పిటిసి – 1477, ఎంపిటిసి – 6810 స్థానాలకు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల కోడ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు మార్చ్ 25 వరకు అక్రమంగా తరలిస్తున్నా రు. 60 కోట్లను, లక్ష లీటర్లకు పైగా మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సందర్భంగా సీమాంధ్రకు 215, తెలంగాణ కు 140 బలగాలతో పాటు లక్ష మంది రాష్ట్ర పోలీసులు బందోబస్తులో పాల్గొనున్నారు. వీ

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం - మంచీ చెడూ

ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అనే రెండు రాష్ట్రాలుగా విభజించిన చట్ట నిబంధనల గురించి వివరిస్తున్నారు

ఎన్. వేణుగోపాల్

పాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి కొత్తగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా రూపొందించడానికి రాజ్యాంగ అధికరణం 3 ప్రకారం సంక్రమించిన అధికారాలతో లోకసభ ఫిబ్రవరి 18న, రాజ్యసభ ఫిబ్రవరి 20న ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు 2014 ను చర్చించి ఆమోదించాయి. తద్వారా ఆంధ్ర ప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం, 2014 తయారై, రాష్ట్రపతి సంతకంతో మార్చ్ 1న గెజిట్ ప్రకటన వెలువడింది. ఈ చట్టం వల్ల తెలంగాణ ఏర్పడడమే తెలంగాణకు జరిగిన గొప్ప మేలుగా తెలంగాణ నాయకులు భావిస్తుండగా, ఈ చట్టం వల్ల అవశేష ఆంధ్రప్రదేశ్ కు చాల అన్యాయం జరిగిపోయినట్టుగా కోస్తా, రాయలసీమ నాయకులు భావిస్తున్నారు. ఆ నాయకుల ప్రకటనలను ప్రజలు కూడ అమాయకంగా నమ్మే పరిస్థితి ఉంది. నిజానికి ఈ చట్టం వల్ల జీవితాలు ప్రభావితమయ్యే ఇరు ప్రాంతాల ప్రజలకు అసలు ఆ చట్టంలో ఏమి ఉన్నదో చెప్పే పని రెండు ప్రాంతాల నాయకులు తీసుకోవడం లేదు.

ఆ బిల్లుకు, చట్టానికి ఉన్న సుదీర్ఘ చరిత్ర, వాటిపై జరిగిన చర్చ ఒకవైపు, ఆ బిల్లు పట్ల, చట్టం పట్ల పూర్తి వివరాలు తెలియని స్థితి మరొకవైపు ఆశ్చర్యం కలిగిస్తాయి. 2013 జూలై 30న కాంగ్రెస్ పార్టీ కేంద్ర వర్కింగ్ కమిటీ తెలంగాణ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం, అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గం కూడ ఆమోదించడంతో, ఈ బిల్లు తయారైంది. దాన్ని డిసెంబర్ 5న కేంద్ర మంత్రివర్గం ఖరారు చేసి రాష్ట్రపతికి పంపించింది. రాష్ట్రపతి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు చర్చకోసం డిసెంబర్ 12న పంపించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ దాన్ని ఎనిమిది వారాలపాటు తనదగ్గర పెట్టుకుని తూతూమంత్రంగా చర్చను ముగించి, బిల్లును తిరస్కరిస్తూ జనవరి 30న తీర్మానించింది. ఆ బిల్లుపై కేంద్ర మంత్రివర్గ బృందం ఫిబ్రవరి 4న కొన్ని సూచనలు చేయగా, పూర్తి మంత్రివర్గం ఫిబ్రవరి 7న చర్చించి మార్పులతో పార్లమెంటులో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తర్వాత లోక్ సభలో, రాజ్యసభలో దానిమీద చర్చలు జరిగాయి. ఇంత జరిగినా, చాల మంది తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమకారులకు, పత్రికా పాఠకులకు కూడ ఆ బిల్లులోనూ, ప్రస్తుతం చట్టంలోనూ ఏమున్నదో, చట్టంలోని నిబంధనలకు ఉండగల దీర్ఘకాలిక ప్రభావాలు ఏమిటో, చట్టం వల్ల జనజీవితం ఎటువంటి మార్పులకు గురికానున్నదో తెలుస్తున్నట్టు లేదు.

చట్టంలో ఏముంది?

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం, 2014 లో 12 భాగాలలో 108 సెక్షన్లు, 13 షెడ్యూళ్లు ఉన్నాయి. **చట్టంలోని 12 భాగాలు:** 1. ఉపోద్ఘాతం. 2.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ. 3. చట్ట సభలలో ప్రాతినిధ్యం. 4. హైకోర్టు. 5. వ్యయ అధికారం, ఆదాయ పంపిణీ. 6. ఆస్తుల, అప్పుల విభజన. 7. కొన్ని కార్పొరేషన్ల గురించి నిబంధనలు. 8. ఉద్యోగాల గురించి నిబంధనలు. 9.జల వనరుల నిర్వహణ, అభివృద్ధి. 10. మౌలిక సౌకర్యాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు. 11. ఉన్నత విద్యావకాశాలు. 12. చట్టపరమైన, తదితర నిబంధనలు. **ఇక షెడ్యూళ్లు:** 1. రాజ్యసభ సభ్యుల కాలపరిమితి 2. పార్లమెంటు, అసెంబ్లీ సభ్యత్వాల రిజర్వేషన్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు. 3. శాసన మండలి సభ్యుల రిజర్వేషన్లు. 4. శాసనమండలి సభ్యులు. 5. తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు. 6. తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగలు. 7. ప్రభుత్వ నిధుల వివరాలు. 8. పెన్షన్ బకాయిల విభజన. 9. ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు. 10. కొన్ని ప్రభుత్వ సంస్థలలో సౌకర్యాల కొనసాగింపు. 11. నదీజలాల నిర్వహణ బోర్డుల విధులు. 12. బొగ్గు, చమురు, సహజవాయువు, విద్యుచ్ఛక్తి వనరులు. 13. విద్య, మౌలిక సౌకర్యాలు.

సాధారణంగానే భారతదేశంలో ఏ చట్టమైనా బ్రిటిష్ వలసవాదులు ప్రారంభించిన సంప్రదాయానికి లోబడి నిర్మాణమవుతుంది. అంటే ప్రజల జీవితాలను శాసించే చట్టాలను ప్రజలకు అర్థం కాకుండా, అర్థమైనా అన్ని రకాల అర్థాలకు, వ్యాఖ్యానాలకు వీలు కల్పించే విధంగా తయారు చేయడమే శాసననిర్మాణ వ్యవస్థ లక్ష్యం. అందువల్ల ఈ చట్టం పైపైన చదివితే ఏమీ అర్థం కాదు. కాని లోతుగా చదివితే, అది ఇటు తెలంగాణలో గాని, అటు ఆంధ్రప్రదేశ్ లో గాని అట్టడుగు ప్రజలకు పెద్దగా ప్రయోజనకరంగా తయారు కాలేదని స్పష్టమవుతుంది. తెలంగాణ ప్రజలు ఏ ఆకాంక్షలతో, ఏ ప్రయోజనాల కోసం ప్రత్యేక రాష్ట్రం కోరుకున్నారో ఆ ఆకాంక్షలను, ప్రయోజనాలను నెరవేర్చే నిబంధనలు ఈ చట్టంలో చాల తక్కువ. తెలంగాణ ఉద్యమం ఏ అన్యాయాలను తొలగించమని కోరుతూ వచ్చిందో, ఆ అన్యాయాలు చట్టంలోని కొన్ని నిబంధనల వల్ల మరింత పెరుగుతాయి. అంతేకాదు, తెలంగాణను విభజించినందువల్ల కోస్తా, రాయలసీమ ప్రజలకు ఏ నష్టాలు జరుగుతాయనే అబద్ధాలతో అక్కడి ప్రజలను రెచ్చగొట్టడానికి పాలకవర్గాలు ప్రయత్నించాయో ఆ నష్టాలను నివారించే పేరు మీద చట్టం కొన్ని అనవసరమైన నిబంధనలను ప్రవేశపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో అమలయిన కేంద్రీకృత అభివృద్ధి నమూనా వల్ల జరిగిన నష్టాలను తగ్గించి, ప్రస్తుతమైనా వికేంద్రీకృత, ప్రజానుకూల అభివృద్ధి నమూనా ద్వారా ప్రజలకు అదనపు సౌకర్యాలు కల్పించగల అవకాశం ఉండగా చట్టం ఆ పని కూడ చేయలేదు. మొత్తం మీద ఈ చట్టం ద్వారా రెండు ప్రాంతాలలోను పాలకవర్గ ముఠాలకు ఎంతో కొంత దక్కింది గాని ప్రజలకు దక్కినదేమీ లేదు.

బిల్లు తయారైనప్పటినుంచి రాజ్యసభలో చర్చ దాకా రెండు వైపుల నుంచీ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి, సవరణ సూచనలు వచ్చాయి గాని కేంద్ర పాలకవర్గాలు ఈ అభ్యంతరాలను, సవరణలను ఎంతమాత్రం పట్టించుకోలేదు. కొంతవరకు భారతీయ జనతా పార్టీ

సూచించిన, కోస్తా, రాయలసీమ పాలకవర్గాలకు ఉపయోగపడగల సవరణలను ఆమోదించినప్పటికీ, తెలంగాణ పాలకవర్గాలు సూచించిన సవరణలను కూడ ఆమోదించకుండా, 'మీకు రాష్ట్రమే ఇస్తున్నాం గదా' అనే బుజ్జగింపుతో సరిపెట్టాయి. అటు ఆంధ్ర ప్రజలకు అనుకూలమైన, అవసరమైన సవరణలు సూచించేవారే లేకపోయారు. తెలంగాణ ప్రజలకు అనుకూలమైన సవరణల గురించి తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీలు కూడ నోరెత్తకుండా ఉండిపోయాయి.

తెలంగాణ వైపు నుంచి అభ్యంతరాలు

ఈ చట్టానికి సంబంధించినంతవరకు తెలంగాణ వైపు నుంచి పది, పన్నెండు అంశాలలో అభ్యంతరాలు ఉండే అవకాశం ఉంది. అవి పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, ఉమ్మడి రాజధాని, ఉమ్మడి గవర్నర్, గవర్నర్ ప్రత్యేకాధికారాలు, ఉమ్మడి హైకోర్టు, ఆదాయ వ్యయాల విభజన, ఆస్తులు–అప్పుల విభజన, ఉమ్మడి కార్పొరేషన్లు, ఉద్యోగాలు, జలవనరులు, ప్రత్యేక ఆర్థిక చర్యలు, ఉన్నత విద్యావకాశాలు.

పోలవరం

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, దాని నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు, పోలవరం జలాశయ ముంపు నిర్వాసితుల సమస్యలో అంతర్రాష్ట్ర వివాదాన్ని అరికట్టేందుకు సెక్షన్ 3, సెక్షన్ 90 వీలు కల్పిస్తాయి. ఇందులో సెక్షన్ 3 తెలంగాణ రాష్ట్రాన్ని నిర్వచిస్తూ, పోలవరం ముంపు ప్రాంతాలను తెలంగాణ నుంచి వేరు చేసింది. ఈ పని కూడ ఎంత హాస్యాస్పదంగా, అమానుషంగా జరిగిందంటే, పోలవరం ముంపు విషయంలో ఇప్పటికి బిల్లు స్థాయి నుంచి చట్టం తర్వాతి స్థాయి వరకు కేంద్ర మంత్రివర్గం నాలుగు సార్లు తన అభిప్రాయం మార్చుకుంది. మొదట తయారుచేసిన, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు వచ్చిన బిల్లులో ఖమ్మం జిల్లా మొత్తం తెలంగాణలో ఉంటుందని ఉంది. అంటే పోలవరం ముంపు ప్రాంత మండలాలన్నీ తెలంగాణ రాష్ట్రంలో ఉంటాయని అంది. ఆ బిల్లు ఆంధ్రప్రదేశ్ నుంచి వెనక్కి వెళ్లిన తర్వాత మంత్రివర్గ బృందం 236 గ్రామాలను తెలంగాణ నుంచి విడదీసి ఆంధ్రప్రదేశ్ లో కలపాలని సవరించింది. ఆ తర్వాత పూర్తి మంత్రివర్గం ఆ గ్రామాల సంఖ్యను 397కు పెంచింది. కాని మళ్లీ లోకసభలో ప్రవేశపెట్టే సమయానికి ఆ గ్రామాల సంఖ్యను 134కు తగ్గించారు. దాన్ని లోకసభ, రాజ్యసభ కూడ ఆమోదించిన తర్వాత, చట్టం రాష్ట్రపతి సంతకం పొందిన మర్నాడు కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యే గ్రామాల సంఖ్యను మళ్లీ 397కు పెంచింది. సాంకేతిక కారణాల వల్ల ఆ ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదముద్ర దొరకలేదు గాని కుకునూరు, వేలేరుపాడు, బూర్గంపాడు, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, భద్రాచలం మండలాలలోని ఆ గ్రామాలన్నిటి మీద ఆ కత్తి ఇంకా వేలాడుతూనే ఉన్నది.

నిజానికి ఈ గ్రామాల బదిలీలో చాల సాంకేతిక సమస్యలు కూడ ఉన్నాయి. స్వయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005 జూన్ 27న విడుదల చేసిన ఒక జి.ఒ. ప్రకారం పోలవరం ముంపు గ్రామాల సంఖ్య 134 మాత్రమే. అటువంటప్పుడు ఇవాళ పోలవరం పేరు చెప్పి 397 గ్రామాలను బదిలీ చేయడం చెల్లదు. అలాగే, ఈ గ్రామాలన్నీ ఆదివాసి గ్రామాలు గనుక అమలులో ఉన్న చట్టాల ప్రకారం ఈ గ్రామాల గ్రామసభల అనుమతి లేనిదే వాటిని నిర్వాసితం చేయడానికి వీలులేదు. ఈ గ్రామాల గ్రామసభలు పోలవరం నిర్మాణాన్ని వ్యతిరేకించడం మాత్రమే కాదు, తాము తెలంగాణ రాష్ట్రంలోనే ఉంటామని తీర్మానాలు చేసి పంపి ఉన్నాయి గనుక ఆ గ్రామాలను బదిలీ చేయడం చట్టరీత్యా చెల్లదు. అంతేకాక, అంతర్రాష్ట్ర వివాదాన్ని అరికట్టడానికే ఈ గ్రామాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం అంటున్నదంటే, అందుకోసం ప్రధాన ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ కూడ ఒత్తిడి చేసిందంటే, 'ఆ మూడు లక్షల మంది ఆదివాసులను నిర్వాసితులను చేయడం మా ఉద్దేశం. అందుకు పొరుగురాష్ట్రం ఒప్పుకోక పోవచ్చు గనుక, వారిని మాకే ఇస్తే, మా ఉద్దేశం నెరవేరుతుంది' అని నిస్సిగ్గుగా అమానుష ఉద్దేశాన్ని ప్రకటించారన్నమాట.

ఇక ఈ అంశానికే సంబంధించిన సెక్షన్ 90 లో నాలుగు సబ్ సెక్షన్లున్నాయి. మొదటి రెండు సబ్ సెక్షన్లు పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడం గురించి, ప్రజా ప్రయోజనాల రీత్యా అది అత్యవసరమైనదని ప్రకటించడం గురించి మాట్లాడగా సబ్ సెక్షన్ 3, 4 దుర్మార్గమైన అంశాలను ప్రకటిస్తాయి. సబ్ సెక్షన్ 3 ప్రకారం 'ఏర్పడనున్న తెలంగాణ రాష్ట్రం పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చినట్టుగా అనుకోవడం జరుగుతుంది' అంటుంది. ఇంకా పుట్టని రాష్ట్రం అనుమతి ఇవ్వడమేమిటి, ఆ అనుమతి ఇచ్చినట్టుగా అనుకోవడం ఏమిటి అనే కనీస ఇంగిత జ్ఞానపు ప్రశ్నలు చట్టం తయారీదారులకు, దానిమీద చర్చించి ఆమోదించిన వారికి వచ్చినట్టు లేదు. ఒక సంస్థ రూపొందకముందే అది తన అనుమతినో, నిరాకరణనో ప్రకటించే అవకాశమే లేదు. అది రూపొందిన తర్వాత అనుమతిస్తుందని అనుకుంటున్నాం అని దాని తరఫున మరొకరు అనడం అనైతికం, అప్రజాస్వామికం, చట్టవ్యతిరేకం. ఇక సబ్ సెక్షన్ 4 పోలవరం నిర్మాణానికి అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులు, పునరావాస, పునఃస్థిరీకరణ చర్యలను కేంద్రప్రభుత్వమే చేస్తుందని అంటుంది. నిజానికి ఈ పర్యావరణ, అటవీ అనుమతులకు, పునరావాసానికి సంబంధించి ఎన్నో వివాదాలున్నాయి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణ రాష్ట్ర సమితి, తదితరులు సుప్రీంకోర్టులో వేసిన కేసులు ఇంకా విచారణలో ఉన్నాయి. ఆ వివాదాలు తేలకుండానే కేంద్ర ప్రభుత్వమే ఒక చట్టంలో ఇలా రాయడం ఈ ప్రభుత్వానికి న్యాయవ్యవస్థ మీద, చట్టాల మీద, న్యాయం మీద ఏపాటి గౌరవం ఉన్నదో చూపుతున్నది.

ఉమ్మడి రాజధాని

ఇక సెక్షన్ 5 తెలంగాణ రాష్ట్రానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది సంవత్సరాల వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అంటుంది. ఈ సెక్షన్ కు వివరణలో హైదరాబాద్ అంటే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతమంతా అని నిర్వచిస్తుంది. ఇది చరిత్రలో ఎప్పుడూ లేని అసాధారణమైన ఏర్పాటు. గతంలో రాష్ట్రాల విభజన, కొత్త రాష్ట్రాల ఏర్పాటు జరిగినప్పుడు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికే రాజధానులను ఏర్పాటు చేయడం జరిగింది. ఒక నగరం చిన్నదైనా పెద్దదైనా రాజధానిగా అభివృద్ధి చేయడం జరిగింది. ప్రస్తుత సందర్భంలో ఒక కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టవలసిన అవసరం లేదు. సుదీర్ఘకాలం రాష్ట్ర విభజనోద్యమం నడిచి, ఎంతో కొంత వైమనస్యం ఏర్పడి ఉన్నప్పుడు ఒకే నగరం నుంచి రెండు రాష్ట్రాల రాజధానులు నడవడం విపరీత పరిణామాలకు దారితీయవచ్చు. అనవసరమైన వివాదాలకు, చిన్న వివాదాలు కూడ చిలికి చిలికి గాలివాన కావడానికి దారితీయవచ్చు. మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని వేరు చేసినప్పుడు, అప్పటికే తమిళ, తెలుగు నాయకుల మధ్య వైమనస్యం ఏర్పడి ఉన్నందువల్ల, విభజన తర్వాత ఒక్కరోజైనా ఆంధ్ర రాష్ట్ర కార్యాలయాలను మద్రాసులో ఉండనివ్వబోమని అప్పటి మద్రాస్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. అంత తీవ్రమైన ఘర్షణ ప్రస్తుతం

లేదు గాని, ఉమ్మడి రాజధాని అందుకు దారి తీయవచ్చు. ఇప్పుడే ఒక రాజధానిని ప్రకటించి, అక్కడికి మారడానికి సంధికాలంగా కొంతకాలాన్ని నిర్ణయించడం సముచితంగా ఉండేది.

నిజానికి ఉమ్మడి రాజధాని అనేది హైదరాబాద్ విషయంలో చాల అసహజంగా ఉంటుంది. ఏకైక ఉమ్మడి రాజధాని అనుభవం చండీగఢ్‌లో ఉన్నప్పటికీ, అక్కడ రెండు రాష్ట్రాల నుంచి నేరుగా తమ రాజధానికి వెళ్లే వీలుంది. కాని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పౌరులు తమ సరిహద్దు దాటి రెండు మూడు వందల కిలోమీటర్లు ప్రయాణిస్తే గాని ఉమ్మడి రాజధానికి చేరుకోలేరు. అది అనవసరమైన, అసహజమైన ప్రయాస. ఈ ఉమ్మడి రాజధాని భావన వెనుక కోస్తా, రాయలసీమ ప్రజల ప్రయోజనం ఏమీ లేదు, వారికి ఇబ్బందులే తప్ప. హైదరాబాదులో ఆస్తులు, స్వార్థ ప్రయోజనాలు ఉన్న పిడికెడు మంది రాజకీయ నాయకులు, కంట్రాక్టర్లు, ఉద్యోగులు తమ సౌకర్యం కోసం, తమ ప్రాంత ప్రజలకు ఎంత అసౌకర్యం కలిగినా సరే అనుకుని కోరిన అప్రజాస్వామిక మైన కోరిక ఇది. 'హైదరాబాదుతో కూడిన తెలంగాణ కావాలి' అని కోరిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ వాంఛను దెబ్బతీయాలనే పాలకవర్గ కుట్రలో భాగమే తప్ప ఉమ్మడి రాజధాని కోస్తా, రాయలసీమ ప్రజలకు కూడ ఉపయోగకరమైనది కాదు.

కేవలం రాజధాని అవసరాల కోసమే అయితే దాన్ని కొన్ని భవనాలకు, లేదా కొన్ని ప్రాంతాలకు పరిమితం చేయవచ్చు గాని సువిశాలమైన నగరాన్నంతా ఉమ్మడి రాజధానిగా ప్రకటించనక్కరలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రతిపత్తి గలిగినవైనప్పుడు ఆ రెండూ ఒకే నగరంలో ఉంటే ఆ నగరం తప్పనిసరిగా మూడో చేతిలో ఉండవలసి వస్తుంది. అందుకే దొడ్డిదారిన గవర్నర్‌కు అసాధారణ అధికారాలు కట్టబెట్టడం జరిగింది.

ఉమ్మడి గవర్నర్

'రాష్ట్రపతి నిర్ణయించినంత కాలం' అని సన్నాయి నొక్కు ఉన్నప్పటికీ, సెక్షన్ 7 ప్రకారం రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి గవర్నర్ ఉంటారు. సెక్షన్ 8 ప్రకారం 'ఉమ్మడి రాజధాని ప్రాంతంలో నివసించే వారందరి జీవన భద్రత, స్వేచ్ఛ, ఆస్తుల రక్షణ' ఆ గవర్నర్ ప్రత్యేక బాధ్యతగా ఉంటాయి. 'ప్రత్యేకంగా శాంతి భద్రతలు, అంతర్గత భద్రత, కీలక సంస్థల భద్రత, ప్రభుత్వ భవనాల నిర్వహణ, కేటాయింపు వంటి అంశాలకు గవర్నర్ బాధ్యతలు విస్తరిస్తాయి' అని ఈ సెక్షన్‌లోని సబ్ సెక్షన్ 2 చెపుతుంది. ఉమ్మడి గవర్నర్ అనేదే పెద్ద రాష్ట్రాల విషయంలో అసాధారణమైన ఏర్పాటు. అసలు గవర్నర్ వ్యవస్థే కేంద్ర ప్రభుత్వపు కీలుబొమ్మగా రాష్ట్రాల ఫెడరల్ అధికారాల మీద గొడ్డలిపెట్టుగా మారుతున్నదని సుదీర్ఘకాలంగా రాజకీయపక్షాలన్నీ వాదిస్తున్నాయి. గవర్నర్ల పాత్రను, బాధ్యతలను తగ్గించే వైపుగా రాజకీయ గమనం సాగుతుండగా తెలంగాణ విషయంలో గవర్నర్ పాత్రను, బాధ్యతలను పెంచడం, ఆ గవర్నర్ ను మరొక రాష్ట్రంతో పంచుకోవాలని నిర్దేశించడం అప్రజాస్వామికం. అనవసరం. పైగా ఒక నగరంలో నివసించే మరొక రాష్ట్రం వారి జీవనభద్రత, స్వేచ్ఛ, ఆస్తుల రక్షణ ప్రమాదంలో పడ్డాయన్నట్టుగా గవర్నర్ చేతికి ఇవ్వడం అంటే దేశంలో ఒక ప్రాంతంలో నివసించే మరొక ప్రాంతం వారందరికీ వర్తించే ఒక కొత్త, అసాధారణ ఏర్పాటు చేయడంతో సమానం. ఇది దేశవ్యాప్తంగా కందిరీగల తుట్టెను రేపుతుంది. ప్రతి నగరంలోను ఇతర రాష్ట్రాల ప్రజలు గణనీయంగానే ఉన్నారు. వారి రక్షణ పేరుతో శాంతిభద్రతలను గవర్నర్ చేతిలో పెట్టడం రాజ్యాంగ వ్యతిరేకం. రాజ్యాంగం రాష్ట్రాల జాబితాలో పెట్టిన అంశాలను కేంద్రం తన చేతుల్లోకి తీసుకోవడం.

ఉమ్మడి హైకోర్టు

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక ప్రత్యేక హైకోర్టు ఏర్పాటయ్యేవరకూ' అనే షరతుతోనే అయినా సెక్షన్ 30 ప్రకారం రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి హైకోర్టుగా హైదరాబాదులోని హైకోర్టు పనిచేస్తుంది. సరిగ్గా ఉమ్మడి రాజధానికి వర్తించే వాదనలే ఇక్కడ కూడ వర్తిస్తాయి. 'ప్రతి రాష్ట్రానికీ ఒక హైకోర్టు ఉంటుంది' అనే రాజ్యాంగ అధికరణం 214ను ఉటంకించి మరీ, ఈ సెక్షన్ ఉమ్మడి హైకోర్టు గురించి మాట్లాడింది. తెలంగాణ ఉద్యమ క్రమంలో న్యాయవాదుల పాత్ర రీత్యా చూసినా, ఉమ్మడి రాష్ట్రంలో అనేక వివాదాలకు హైకోర్టు వేదిక అయిన అనుభవం రీత్యా చూసినా మొట్టమొదట విభజన జరగవలసిన సంస్థలలో హైకోర్టు ఒకటి. పైగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు కూడ హైదరాబాదులోనే ఉండడం న్యాయవాదులకు ఉపయోగకరం కావచ్చు గాని, కోస్తా, రాయలసీమ ప్రజలకు, కక్షిదారులకు ఇబ్బందే అవుతుంది.

ఆస్తుల, అప్పుల విభజన

ఆస్తుల, అప్పుల విభజన గురించి నిర్దేశించే భాగం 6 (సెక్షన్లు 47 నుంచి 67)లో ప్రధానంగా గుర్తించవలసిన మూడు అంశాలున్నాయి. ఒకటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆస్తులు, అప్పులు 58 సంవత్సరాలలో ఎలా, ఎక్కడ పోగుపడ్డాయో ఆ చరిత్రనంతా పరిగణనలోకి తీసుకోకుండా దాదాపు ప్రతి సెక్షనూ ఆస్తి గురించి అయినా, అప్పు గురించి అయినా 'రెండు రాష్ట్రాల మధ్య జనాభా ప్రాతిపదికపై విభజించాలి' అని నిర్దేశిస్తుంది. ఈ జనాభా దామాషా పద్ధతి పైకి చూడడానికి చాల న్యాయబద్ధమైనదిగా, ప్రజాస్వామికమైనదిగా, ఆదర్శవంతమైనదిగా కనబడుతుంది. కాని చారిత్రక నేపథ్యంలో చూసినప్పుడు ఆరు దశాబ్దాల పాటు ఆ జనాభా దామాషా పద్ధతి అమలు కాకపోవడం వల్లనే వివాదం తలెత్తింది. అప్పుడు అమలు జరగని పద్ధతిని ఇప్పుడు అమలు జరిపితే అన్యాయం జరిగినవారికే మరింత అన్యాయం జరుగుతుంది. ఉదాహరణకు ఉమ్మడి రాష్ట్రం వందకోట్ల రూపాయలు అప్పు తెచ్చి, అందులో ఎనభై కోట్ల రూపాయలు కోస్తా మీద, ఇరవై కోట్ల రూపాయలు తెలంగాణ మీద ఖర్చు పెట్టిందనుకుందాం. (నిజానికి ఇది కూడ చాల ఉదారమైన అంచనా. చాల సందర్భాలలో తెచ్చిన అప్పు మొత్తానికి మొత్తంగా కోస్తా, రాయలసీమల మీద ఖర్చు పెట్టిన ఉదాహరణలున్నాయి. ఆ ఖర్చు వల్ల ఆ ప్రాంతాల ప్రజలకేదో ఒరిగిందని ఎంతమాత్రమూ కాదు, ఆ ప్రాంత రాజకీయ నాయకుల, కంట్రాక్టర్ల సొంత ఖజానాల్లోకే ఆ డబ్బంతా ప్రవహించింది!) కాని ఇప్పుడు ఆ వంద కోట్ల రూపాయల అప్పును 'జనాభా ప్రాతిపదికన' ఆంధ్రప్రదేశ్ బకాయి 58 కోట్ల రూపాయలు, తెలంగాణ బకాయి 42 కోట్ల రూపాయలు అని నిర్ధారిస్తే, తెలంగాణ అనవసరంగా తాను తీసుకున్న దానికన్న రెట్టింపు చెల్లించవలసి వస్తుంది. అసలు చరిత్ర ప్రస్తావన లేకుండా జనాభా ప్రాతిపదిక అనడమే తప్పుడు పద్ధతి.

రెండు, ఇంకా ఆశ్చర్యంగా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రం లోపల ఇచ్చిన రుణాలన్నీ వసూలు చేసి, ఆ రుణం ఏ రాష్ట్రంలోని ప్రాంతం నుంచి వసూలైతే ఆ రాష్ట్రమే తీసుకోవాలి అని సెక్షన్ 51 (2) చెపుతుండగా, ఉమ్మడి రాష్ట్రం బైటి సంస్థలకు ఇచ్చిన రుణాలను వసూలు చేసుకునే హక్కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుంది అని సెక్షన్ 51 (2) చెపుతుంది. కాకపోతే అలా వసూలు చేసిన రుణాలను 'జనాభా ప్రాతిపదికన' రెండు రాష్ట్రాలూ పంచుకోవాలి అని సన్నాయి నొక్కు నొక్కుతుంది గాని ఆ 'హక్కు' ఒక రాష్ట్ర ప్రభుత్వానికే ఎందుకు ఇచ్చిందో తెలియదు.

మూడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వాణిజ్య, పారిశ్రామిక సంస్థల ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉన్నప్పటికీ ఆ సంస్థల ఆస్తులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికే చెందుతాయి అని సెక్షన్ 53 అంటుంది. ఇక్కడ మాత్రం ప్రధాన కార్యాలయాలలో ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే ఉన్నాయి గనుక ఈ ప్రత్యేక నిబంధన చేర్చి, అప్పటిదాకా ఊదరగొట్టిన 'జనాభా ప్రాతిపదిక'ను పక్కన పెట్టారు.

ప్రావిడెంట్ ఫండ్ బకాయిల గురించి సెక్షన్ 58, పెన్షన్ బకాయిల గురించి సెక్షన్ 59 ఆయా ఉద్యోగులను ఏ ప్రాంతానికి కేటాయిస్తే ఆ రాష్ట్రమే భరించాలని చెపుతాయి. నిజానికి ఉద్యోగుల కేటాయింపు విషయంలో చాల గందరగోళం ఉన్నప్పుడు, గత ఆరు దశాబ్దాలలో ఉద్యోగుల నియామకాలలో అక్రమాలు జరిగాయని స్వయంగా ప్రభుత్వ కమిటీలు, కమిషన్లే గుర్తించినప్పుడు పెన్షన్ల భారాన్ని చరిత్రతో సంబంధం లేకుండా వారిని కేటాయించిన రాష్ట్రానికి, పదవీ విరమణ చేసిన రాష్ట్రానికి ఇవ్వడం అన్యాయాన్ని కొనసాగించడమే అవుతుంది.

ప్రభుత్వ సంస్థలు

చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్ లో 89 రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల జాబితా, పదో షెడ్యూల్ లో 107 ప్రభుత్వ సంస్థల జాబితా ఇచ్చి ఈ సంస్థల భవిష్యత్తుకు వర్తించే నిబంధనలను భాగం 7 (సెక్షన్ 68 – 75) లో పొందుపరిచారు. వీటిలో సెక్షన్ 69 ప్రకారం విద్యుదుత్పత్తి, సరఫరా, నీటి సరఫరాల విషయంలో కొత్త రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా మార్పులు చేయవచ్చునని అనుమానిస్తే, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లనే కొనసాగిస్తుంది. అంటే విద్యుదుత్పత్తిలో, విద్యుత్ సరఫరాలో, నీటి సరఫరాలో తమ ప్రాంతానికి అన్యాయం జరిగిందని ఇంతకాలం వాదిస్తూ వచ్చిన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ ఏర్పాట్లను మార్చడానికి ప్రయత్నిస్తే, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇప్పుడు ఉన్న స్థితినే కొనసాగిస్తుందన్న మాట.

ఇక సెక్షన్ 75 ప్రకారం పదో షెడ్యూల్ లో జాబితా ఇచ్చిన సంస్థలలో ఇప్పటివరకూ ఇతర రాష్ట్ర (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర) ప్రజలకు ఏ సౌకర్యాలు అందుతున్నాయో, అంతకన్న తక్కువ ప్రయోజనాలు అందడానికి వీలులేదు. ఈ సంస్థలను భవిష్యత్తులో ఎలా మార్చాలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాది లోపల కలిసి కూచుని అంగీకరించేవరకూ అవే సౌకర్యాలు కొనసాగాలి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకారానికి రాకపోతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. ఈ నిబంధనను మామూలు మాటల్లో చెప్పాలంటే ఈ 107 సంస్థలలోను కనీసం ఏడాది పాటు యథాస్థితి కొనసాగుతుంది. ఆ సంస్థల ద్వారా తెలంగాణ ప్రజలకే ప్రయోజనం దక్కాలని తెలంగాణ ఉద్యమం ఆశించిన ఫలితం మాత్రం ఏడాది వరకు దక్కదు. ఆ తర్వాత కూడ ఆ సంస్థలు ఏమవుతాయో, అవి తెలంగాణకు మిగులుతాయో లేదో, వాటిని కేంద్రం ఏం చేస్తుందో అగమ్యగోచరమే.

ఉద్యోగులు

ఇక ఉద్యోగుల గురించి నిబంధనలు అనే భాగం 8 (సెక్షన్ 76 – 83) లో సెక్షన్ 77 (2) ఉద్యోగుల నుంచి ఆప్షన్లు (వారు ఎక్కడ ఉండాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం) స్వీకరించి, వాటిని పరిగణనలోకి తీసుకుని ఉద్యోగుల కేటాయింపు జరపాలంటుంది. స్థానిక, జిల్లా, జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులు తమ కాడర్ లలోనే ఉంటారని, వారు ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతంలోనే కొనసాగుతారని అంటుంది. అధికారులందరూ తమ పాత ఉద్యోగాలలోనే కొనసాగుతారని సెక్షన్ 79 అంటుంది. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులందరూ ఏడాది వరకూ తమ ఉద్యోగాల లోనే కొనసాగుతారని సెక్షన్ 82 అంటుంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటయ్యేవరకూ తెలంగాణ ఉద్యోగ అవసరాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చూస్తుందని సెక్షన్ 83 అంటుంది.

నిజానికి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మౌలిక భూమికలలో ఉద్యోగాలలో జరిగిన అన్యాయం ఒకటి. ఉద్యోగాలలో తెలంగాణ ప్రాంతీయులకు జరిగిన అన్యాయాలను 1969లోనే ప్రభుత్వం అంగీకరించి, అక్రమంగా తెలంగాణ ప్రాంతపు ఉద్యోగాలలో చేరిన వారిని వారి ప్రాంతాలకు పంపించాలని జి.వో. జారీ చేసింది. ఆ తర్వాత ముల్కీ నిబంధనలను రద్దు చేసినా, ప్రాంతీయులకే ఉద్యోగాలు కల్పించడానికి రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాయి. అవి కూడ ఉల్లంఘనకు గురయ్యాయని ప్రభుత్వమే నియమించిన జైభారత్ రెడ్డి కమిటీ చెప్పిన ఫలితంగానే జి.వో. 610 వచ్చింది. అది కూడ ఉల్లంఘనకు గురయిందని, గిర్‌గ్లాని కమిషన్ నిర్ధారించింది. ఈ స్థితిలో ప్రతి ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్ ప్రకారం ఏ ప్రాంతానికి చెందినవారో గుర్తించి ఆ ప్రాంతానికి పంపించడం జరగాలి కాని ఆప్షన్లు కోరాలని, ఉద్యోగులందరూ తమ తమ కాడర్ లలో, పాత స్థలాలలోనే ఉంటారని చట్టమే అనడమంటే ఆరు దశాబ్దాల అన్యాయాన్ని మరింత పకడ్బందీగా చట్టబద్ధం చేస్తున్నట్టే.

జలవనరుల నిర్వహణ, అభివృద్ధి

చట్టంలోని భాగం 9 (సెక్షన్ 84 – 91) జలవనరుల నిర్వహణ, అభివృద్ధి గురించి మాట్లాడుతుంది. గోదావరి, కృష్ణా నదుల నిర్వహణకు రెండు బోర్డులను నియమించడం గురించి సెక్షన్ 84 (1), రెండు నదుల జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అనుమతి, నిర్మాణం వంటివి ఈ బోర్డుల బాధ్యతలని సెక్షన్ 84 (2) అంటాయి. సెక్షన్ 90 పోలవరం గురించి మాట్లాడుతుందని ఇదివరకే చూశాం. నిజానికి కృష్ణా, గోదావరి జలాలను రెండు ప్రాంతాల మధ్య గతంలోనే బచావత్ ట్రిబ్యునల్ పంపిణీ చేసింది. 1975లో జరిగిన ఈ పంపిణీలో గోదావరి జలాలలో తెలంగాణ వాటా వాడుకోవడానికి నలభై ఏళ్లు గడిచినా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించలేదు. కృష్ణ మీద కొత్త ట్రిబ్యునల్ పంపిణీ కూడ జరిగింది గాని నికరజలాలను వాడుకునే ప్రాజెక్టులన్నీ నిర్మాణమైపోయాయి. ఇక కొత్త నిర్మాణాలకే అవకాశం లేదు. అందువల్ల ఇక జరగవలసింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన జలవనరుల వినియోగానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకోవడం, దానికి కేంద్రం సహాయం చేయడం మాత్రమే. ఇప్పుడు ఉమ్మడి బోర్డులు ఏర్పాటు చేయడం, వాటికి ఆకుకు అందని, పోకకు పొందని బాధ్యతలు పెట్టడం అనవసరమైన వివాదాలు సృష్టించడానికే గాని, తెలంగాణ ప్రయోజనాలకో, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకో కాదు.

మౌలిక సౌకర్యాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు

పన్నెండు, పదమూడో షెడ్యూళ్లలో మౌలిక సౌకర్యాల కల్పన, ప్రత్యేక ఆర్థిక చర్యలు, విద్యారంగాలను చేర్చి ఆ రంగాలలో ప్రత్యేక చర్యలను ఈ భాగంలో పేర్కొన్నారు. వీటిలో సెక్షన్ 92 ప్రకారం బొగ్గు, చమురు, సహజవాయువు, విద్యుచ్ఛక్తి రంగాలలో కేంద్ర ప్రభుత్వ సూత్రాలను, సలహాలను, మార్గదర్శకత్వాన్ని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలని, పది సంవత్సరాలలో రెండు రాష్ట్రాలూ ప్రగతినీ, సుస్థిరాభివృద్ధినీ సాధించడానికి తగిన చర్యలన్నిటినీ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని సెక్షన్ 93లో, రెండు రాష్ట్రాలలోను పారిశ్రామికాభివృద్ధినీ, ఆర్థిక ప్రగతినీ

(మిగతా 37వ పేజీలో...)

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన

***రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరిచే అవకాశం ఉన్న యుపిఏ ప్రభుత్వం తన ప్రయోజనాల కోసం రాష్ట్రపతి పాలన విధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను ప్రయోగించి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దివాళా కోరు రాజకీయాలకు నిదర్శనం. ఆర్టికల్ 356 ప్రకారం, శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు కానీ, విధులు నిర్వహించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందినప్పుడు కానీ, రాష్ట్ర అసెంబ్లీలో అధికార పార్టీ మెజారిటీ కోల్పోయినప్పుడు కానీ రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాజ్యాంగంలోని సంప్రదాయాలూ, ప్రమాణాలూ పాటించ కుండా, చట్టాలంటే గౌవరం లేకుండా, రాజ్యాంగాన్ని, గవర్నర్ వ్యవస్థనూ శాసనసభా వ్యవస్థనూ బలహీనం చేస్తూ, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించడం విచారకరం. అటు ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ఇచ్చినట్లే ఇచ్చి కేజ్రీవాల్ ప్రభుత్వం, జనలోక్‌పాల్ బిల్లు తీసుకురాగానే మద్దతు ఉపసంహరించి, రెండు రోజుల్లోనే రాష్ట్రపతి పాలనను విధించారు.

రాష్ట్రంలో ఫిబ్రవరి 19న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేస్తే, ఆ రోజు నుంచీ, కాంగ్రెస్ పార్టీ తన స్వలాభం కోసం రాజకీయ పార్టీలతో బేరసారాలు చేయగా, చివరకు కుదరక, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక, దిక్కులేని పరిస్థితులలో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడానికి కేంద్రంలోని భాగస్వామ్య పక్షాలతో చర్చించి, రాష్ట్రపతి పాలన కిందకు ఈ రాష్ట్ర పరిపాలనను తీసుకొని వచ్చింది. అంతా అధికార స్వామ్యమే. ప్రజల ప్రజాస్వామిక హక్కులకూ, పౌరహక్కులకూ భంగం కలిగే పరిస్థితి పోలీసులకు మరిన్ని అధికారాలూ, మరింత రక్షణ లభిస్తాయి. పోలీసు రాజ్యం మరింత బలపడే అవకాశం కల్పించబడింది.

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించిడం ఇది రెండవ సారి కాగా, తెలుగు వారికి మాత్రం ఇది మూడవ అనుభవం. మూడు సార్లు కూడా రాష్ట్ర విభజన అంశమే ప్రధాన కారణం కావడం విశేషం. మద్రాసు రాష్ట్రం నుంచీ విభజించి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు తొలి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు. 1953 అక్టోబర్ ఒకటిన ఆంధ్రరాష్ట్రం ఏర్పడగా, ప్రకాశం పంతులు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి పడగొట్టడంతో ఆంధ్రరాష్ట్రం 1954 నవంబర్ 15 నుంచీ, 1955 మార్చ్ 29లో ఎన్నికలు జరిగేంత వరకూ రాష్ట్రపతి పాలన అమలులో ఉండింది. అప్పుడు గవర్నర్‌గా సిఎం త్రివేది ఉన్నారు. అనగా తెలుగువారు తొలి రాష్ట్రం ఏర్పాటు చేసుకునేలోపే రాష్ట్రపతి పాలన అనుభవాన్ని చవిచూశారు. 1972లో వచ్చిన జై ఆంధ్ర ఉద్యమం తర్వాత రాజకీయ అస్థిర పరిస్థితుల్లో 1973 జనవరి 11 నుంచి డిసెంబర్ 10 వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారి రాష్ట్రపతి పాలన విధించారు. ఇప్పుడు మళ్లీ మరోసారి 2014 మార్చ్ ఒకటి నుంచి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండవసారి రాష్ట్రపతి పాలన విధించినట్లయింది. అసెంబ్లీని సుషుప్తావస్థలో పెట్టి రాష్ట్రపతి పేరు మీద గవర్నర్ పాలన సాగిస్తారు. ఆరు నెలల కాలానికి రాష్ట్రపతి పాలన విధిస్తారు. ఆ తర్వాత పొడిగించడానికి, భారత పార్లమెంట్ అనుమతి తప్పనిసరి అవసరం. ఈలోగానే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి కాబట్టి, రెండు రాష్ట్రాలలోనూ ప్రజా ప్రభుత్వాలు ఏర్పడే అవకాశం ఉన్నందున, రాష్ట్రపతి పాలన పొడిగించే అవసరం ఉండదు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ కాలపరిమితి జూన్ రెండు వరకు ఉంది.

రాష్ట్రపతి పాలన మంచి – చెడులను విశ్లేషించే ముందు, దాని న్యాయ న్యాయాలను, పాలనా ఫలితాలను చర్చించుకుంటే బాగుంటుంది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కేవలం మూడు నెలలు మాత్రమే ఉండవచ్చు. ఎందుకనగా అంతలోనే శాసనసభకు కొత్త సభ్యులు ఎన్నికవుతారు. కొత్త ప్రభుత్వం రెండు రాష్ట్రాలలోనూ (తెలంగాణ – ఆంధ్రప్రదేశ్‌లలో) ఏర్పడుతుంది. కేవలం రాజకీయ నాయకుల అసమర్థత, అస్తవ్యస్త పరిస్థితులను సృష్టించుకోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడింది.

వాస్తవానికి ఉన్న శాసనసభ్యులలోనే తెలంగాణ రాష్ట్రంలో ఒక ముఖ్యమంత్రి – ప్రభుత్వం మిగిలిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న మిగతా శాసనసభ్యులతో మరో రాష్ట్రం ఏర్పడవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ పని చేస్తే, వారి పార్టీపై ప్రజలలో అత్యంత త్వరగా వ్యతిరేక నిర్ణయం తీసుకున్నారనే సంకేతం ఉండడం వలన కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికం – అనైతికం. సాధారణంగా శాంతి భద్రతల సమస్య తలెత్తినపుడు, ప్రజలలో (సమాజంలో) అసాంఘిక చర్యలు మితి మీరినపుడు రాష్ట్రపతి పాలన విధించాలి. కానీ ఈ రాష్ట్రంలోని రాజకీయ అనిశ్చితిని పరిష్కరించడానికి రాష్ట్రపతి పాలన విధించడం విచారకరం. ప్రజల చేత – ప్రజల కోసం అనేది ప్రజాస్వామ్యానికి నిర్వచనం – నిదర్శనం. కానీ గవర్నర్ కోసం ప్రజలు – ప్రజాస్వామ్య వ్యవస్థ అని అనిపించుకోదు. ఇది కేవలం అధికారుల పాలన మాత్రమే.

ప్రజలకు అత్యవసరంగా ఏదైనా సమస్యవచ్చినపుడు ప్రజా ప్రతినిధులను సంప్రదించేవారు. కానీ ఇప్పుడు అంతా గవర్నర్ పాలన కాబట్టి ఆయనను సంప్రదించవలసి ఉంటుంది. అందులోనూ ఆయనకు ఇద్దరు సలహాదారులుంటారు. వారు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు.

భారతదేశ ఎన్నికల తీరుతెన్నులు

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికల తంతు వ్యాపార లావాదేవీగా మారిపోయిందనీ, ప్రభుత్వాలు మారినా దేశ ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు చేకూరే విధానాలు అవలంబించవనీ అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

భారత ఎన్నికల కమీషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. 16వ సార్వత్రిక ఎన్నికలు 2014 ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు తొమ్మిది అంచెలుగా పార్లమెంట్‌కు జరుగనున్నాయి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసనసభలకు కూడ ఎన్నికలు జరుగ నున్నాయి. ఎన్నికల ఫలితాలు మే 16న వెలువడు తాయి. మొత్తానికి ఈసారి వేసవితాపంతో పాటు హోరాహోరీ ఎన్నికల పోరు తీసుకొచ్చే రాజకీయ వేడిని కూడ జనం చవిచూడక తప్పదు. ఈ ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హత కలిసిన మొత్తం ఓటర్లు 81 కోట్ల పైచిలుకే. ఇందులో సుమారు 10కోట్ల మంది మొదటిసారిగా ఓటు వేయనున్నారు. పార్టీలు వేరైనా అందరూ ఒకే గూటి పక్షులని ఇంతకాలం ఎన్నికలకు దూరంగా ఉన్నవారికి ఈ ఎన్నికల్లో తొలిసారి ఏ పార్టీ అభ్యర్థి నచ్చలేదని తిరస్కరణ ఓటును వినియోగించుకునే వీలును ఎన్నికల కమీషన్ కల్పించింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలు తప్పనిసరి. ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థలో రాజకీయ పార్టీలు ఒక ఉప వ్యవస్థ. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం పనితీరు రాజకీయ పార్టీల పాత్రపైనే ఆధారపడి ఉంటుంది. భారత రాజకీయ పార్టీలకు, పాశ్చాత్య దేశాలలోని రాజకీయ పార్టీలతో పోలికలేని కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. మనదేశ పార్టీల మధ్య సిద్ధాంతపరమైన వ్యత్యాసాలు చాల తక్కువ. ప్రతి పార్టీ సోషలిజం మా ధ్యేయమని చెపుతాయి. ఆచరణలో పరాధీన ఆర్థిక విధానాన్ని అనుసరిస్తాయి. సిద్ధాంతపరమైన నిబద్ధతగాని, ప్రత్యామ్నాయంపై ఆసక్తిగాని పార్లమెంటరీ రాజకీయాలలో కనిపించదు. మరొక ప్రధాన అంశం ఓటర్లను ఆకర్షించడానికి ఇచ్చే నినాదాలలో, జనాకర్షణ విధానాలను ప్రకటించడంలో ఒక దానితో ఒకటి తీవ్రంగా పోటి పడుతాయి. సిద్ధాంత ఆకర్షణ, ప్రత్యామ్నాయ విధానాలు తగ్గిపోయి జనాకర్షణ విధానాల ప్రాబల్యం పెరిగిపోయింది. నాయకుల వ్యక్తిత్వం, ఆకర్షణల ఆధారంగా పార్టీలు ఏర్పడడం, అంతేకాకుండా పార్టీలకు వాటి సిద్ధాంతాలు, ఆదర్శాలు ఆధారంగా కాకుండా వాటి నాయకుల ఆధారంగానే గుర్తింపు ప్రచారం లభిస్తుంది. జాతీయ, ప్రాంతీయ పార్టీలలో కన్పించే మరొక లక్షణం చీలికలు – కలయికలు. కులం, జాతి, వర్గం, వ్యక్తిత్వాలు ఆధారంగా ప్రాంతీయ, ఉప – ప్రాంతీయ పార్టీలు అవతరిస్తున్నాయి.

భారతదేశంలో ఆరు దశాబ్దాలకు పైగా గడిచిన కాలంలో పార్లమెంట్ ప్రమాణాలు, విలువలు కూడ బాగా దిగజారి పోయాయని రుజువుచేసే పలు సంఘటనలు జరిగాయి. ప్రథమంగా తాత్కాలిక పార్లమెంట్‌లోనే ఒక అవినీతి వ్యవహారం బయటపడింది. కాంగ్రెస్ పార్టీ సభ్యుడు హెచ్‌జి ముద్గల్ బులియన్ అసోషియేషన్ తరపున రు. 2700 లంచం తీసుకున్నందుకు సభ్యత్వం రద్దయింది. 1975 జూన్ 26న ఇందిరాగాంధీ 'అత్యవసర పరిస్థితి' ప్రకటించింది. పౌరహక్కులు రద్దుచేసి, ప్రతిపక్ష

ప్రజలు వీరిని సంప్రదించవలసి ఉంటుంది. వీరు ఎంతమందికి అందుబాటులోకి వస్తారు. అధికారులుగా వీరికి ఎంత వరకు అనుభవం ఉంటుంది. సచివాలయంలోని కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల నుంచి, మంత్రులు, ముఖ్యమంత్రుల వరకూ వెళ్లే ఫైళ్లు, ఇప్పుడు ఈ సలహాదారుల వద్దకు వెళ్లతాయి. కేబినేట్ తీసుకోవలసిన నిర్ణయాలను వీరు తీసుకుంటారు. అనగా రాజకీయ నాయకులు చేసే పైరవీలు, అవినీతి అక్రమాలు ఇప్పుడు అధికారులు చేస్తారు. అంతా చట్టబద్ధ పాలన.

దోపిడీ అంతా చట్టబద్ధంగానే జరుగుతూ ఉంటుంది. అయితే ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూలు విధి ప్రకటించింది. కాబట్టి ప్రజా ప్రతినిధుల పాలన మాదిరిగానే వీరు కూడా కేర్‌టేకర్ (సంరక్షకులు) ప్రభుత్వంగా కొనసాగాల్సిందే. విధాన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుండదు. ఒకవేళ తీసుకోవలసి వస్తే, ఎన్నికల సంఘాన్ని సంప్రదించి, అనుమతి తీసుకోవలసి ఉంటుంది.

పెట్రోల్ బంకుల్లో మోసాలు పెరిగి పోతుండడంతో, తూనికలు కొలతలు శాఖ అధికారులు, రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు చేపట్టి, కేసులు నమోదు చేయడంతో, రాష్ట్రంలోని పెట్రోల్ బంకులన్నీ, ఒకే రోజు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. సమ్మె జరుగుతున్న పెట్రోలు బంకుల యజమానులతో అధికారులు సంప్రదించి (గవర్నర్ అనుమతితోనే) చర్చలు జరిపారు. గవర్నర్ ప్రత్యక్ష్యంగా జోక్యం చేసుకొని పెట్రోల్ బంక్ యజమానులతో మాట్లాడారు. మరుసటి రోజు నుంచే పెట్రోలు బంకులన్నీ తెరుచుకున్నాయి. బంక్ యజమానులు బంద్ విరమించారు. రాష్ట్రపతి పాలనలో గవర్నర్ దర్బార్ నిర్వహించి, సమస్యను పరిష్కరించారు. ఇదొక ఉదాహరణ మాత్రమే. ఏది ఏమైనప్పటికీ, రాష్ట్రపతి పాలన – ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదు. అది ప్రజాస్వామ్య పునాదులను పెకలించే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య హక్కులనూ, ప్రజాస్వామ్య విలువలనూ కాపాడుకునేందుకు, మనమంతా పోరాడాలి. లేనిచో భవిష్యత్తు మరింత ప్రమాదకర మవుతుంది. అందుకు మనమంతా సంఘటిత పడాలి.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

నాయకులను అరెస్టుచేసి జైళ్లలో నిర్బంధించింది. ఆ రోజు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత దుర్దినం. స్వాతంత్ర్యం, న్యాయం కొరబడి వ్యవస్థల పట్ల విశ్వాసం సన్నగిల్లింది. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక ఎడిటోరియల్ రాసింది. 1993 జూలైలో పివి నరసింహారావు నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓట్లు వేయడానికి నేతలు జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), జనతాదళ్ వర్గం ఎంపిలకు ముడుపులు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై దర్యాప్తు జరిగింది. ఇందులో పివి, బూటాసింగ్‌ల పాత్ర ఉందని 2000లో ప్రత్యేక కోర్టు పేర్కొనగా, తర్వాత ఈ తీర్పును ఉన్నత న్యాయస్థానం కొట్టేసింది. 2005లో 11 మంది ఎంపిలు పార్లమెంటులో ప్రశ్నలు అడగడానికి లంచాలు తీసుకుంటున్నారనే ఉదంతం వెలుగులోకి వచ్చింది. 2008 జూలై 22న లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి ఎంపిలు ముగ్గురు నోట్ల కట్టలను ప్రదర్శించారు. ఆ రోజున యూపిఎ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఓటు వేయడానికి తమకు ఆ ముడుపులు ఇచ్చారని ఆ ముగ్గురు (అశోక్ అర్గల్, ఫగన్‌సింగ్ కులస్తే, మహావీర్ భగోరా) వెల్లడించారు. 'ఓటుకు నోటు' కుంభకోణంగా పేరొందిన ఈ వ్యవహారంపై తర్వాత దర్యాప్తు జరిగింది. సమాజ్‌వాద్ పార్టీ నేత అమర్‌సింగ్, సోనియాగాంధీ రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ ఈ డబ్బు ఇచ్చారని పేర్కొన్నారు. అమర్‌సింగ్ తదితరులు అరెస్టయ్యారు. స్పీకర్‌పై విరుచుకుపడిన, రోజుల తరబడి పార్లమెంట్‌ను స్తంభింపచేసిన సంఘటనలు ఎన్నో జరిగాయి. ఇప్పుడు పరిస్థితులు గతం కంటే మరింత దారుణంగా ఉన్నాయి.

భారతదేశం ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామిక దేశమని సంబర పడేవాళ్లు లేకపోలేదు. మన దేశ జనాభాలో 18 సంవత్సరాలు మించిన వారే ఓటు వేస్తారు. అయితే వీరిలో 70 శాతం మించి ఏనాడు ఓటు వేయలేదు. ఓటు వేసిన వారంత స్వయంగా ఓటు వేశారా? అంటే అనుమానమే. రాజకీయ పార్టీల సిద్ధాంతాల కంటే, విధానాలకంటే ఎక్కువగా ఓటర్లను ప్రభావితం చేస్తున్న అంశాలు డబ్బు, సారాయి, కులం, మతం, రిగ్గింగ్ అన్నది మనందరికి తెలుసు. ఇక అన్నింటికంటే ముఖ్యమైనది అధికారం చెలాయించిన ఏపార్టీకి మొత్తం పోలైన ఓట్లలో సగం ఓట్లు ఏనాడు రాలేదు. అంటే గడిచిన ఆరు దశాబ్దాల పాలన అంతా మైనారిటీ పాలనేనన్నది అధికారిక ఘనాంకాలే తెలుపుతున్నాయి. 60 శాతంగా ఉన్న రైతాంగానికి, 20 శాతంగా ఉన్న కార్మిక వర్గానికి ఏనాడు పార్లమెంట్‌లో పదిశాతం సీట్లు దక్కలేదు. అలాగే 50 శాతంగా ఉన్న మహిళలకు కూడ పదిశాతం సీట్లు దక్కలేదు. కేవలం పదిశాతంగా ఉన్న ఉన్నత వర్గాల, ఉన్నత కులాల నుండే 50 శాతం మంది ఎన్నికవుతున్నారు. అరకొర మధ్యతరగతి, వెనుక బడిన వర్గాల నుండి ఎన్నికవుతున్నారు. 2009 ఎన్నికలను గమనిస్తే సగానికి పైగా నేరస్తులు, ధనాఢ్య వర్గాలవారే ఎన్నికయ్యారు. 70 శాతంగా ఉన్న గ్రామీణ ప్రాంత రైతాంగానికి, శ్రామిక వర్గానికి ప్రాతినిధ్యం లేకుండా వాళ్ల సమస్యలను ఎవరు చర్చిస్తారు? ఎలా పరిష్కరిస్తారు? అంటే అది అసాధ్యమని మన అనుభవమే చెపుతుంది. ప్రజల మౌలిక సమస్యల్లో ఏ ఒక్కటి ఈ నాటికి పరిష్కరించలేదు. అందుకే ఇది ప్రజాస్వామ్యం కానేకాదు. ముమ్మాటికి ధనస్వామ్యమేనని తేట తెల్లమవుతోంది.

ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులు చేసే వ్యయాన్ని ఎన్నికల కమీషన్ పెంచింది. అయితే ఇది కూడా లోపభూయిష్టమే. లోక్‌సభకు పోటీ చేసేవారు రు. 70 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసేవారు రు. 28 లక్షలు మించి వ్యయం చేయకూడదని నిబంధనలు చెతున్నాయి. అయితే, అభ్యర్థులు చేసే వ్యయానికి విధించిన పరిమితులు వాస్తవికతకు దూరంగా ఉన్నాయి. ఏ అభ్యర్థీ తాను వాస్తవంగా చేసిన ఖర్చును వెల్లడించదు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను రూ. 8 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందని 2013 ఫిబ్రవరిలో సీనియర్ బిజెపి నేత గోపీనాథ్ ముండే నోరుజారి చిక్కుల్లో పడ్డారు. వాస్తవానికి ఆ ఎన్నికల్లో తనకు రు. 19 లక్షలు ఖర్చయిందని అప్పట్లో ఎన్నికల సంఘానికి ఆయన లెక్కలు చెప్పారు. రు. 19 లక్షలెక్కడ? రు. 8 కోట్లు ఎక్కడ? ఎన్నికల సంఘం ఎలాంటి నిఘాలు పెట్టినా, ఎన్ని ఏర్పాట్లు చేసినా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇవాళ అధికారాన్ని ధనవంతుల సంతలో సరకును కొన్నట్టుగా కొంటున్నారు. ఈ సారి పోటి చేస్తున్న అభ్యర్థులు మొత్తంగా చేసే వ్యయం 40 వేల కోట్లు దాటనుందని అంచనా. ఇలాంటి ధనస్వాములు రాజ్యాంగబద్ధ, ప్రజాస్వామ్య యుత పాలనకు ఏ మాత్రం దోహదపడరు.

'రాజ్యాంగం, ఓటుహక్కు, ఎన్నికలు ఉంటే చాలు ఆ దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టే అని భావించడం పొరపాటు. అవన్ని పాలక వర్గానికే ఉపయోగపడుతున్నాయి. పైగా వారి పెత్తనానికి, దోపిడీకి చట్టబద్ధత కల్పిస్తున్నాయని, వాటివల్ల ఒరుగుతున్నదేమి లేదని, ప్రజల ఆర్థిక సామాజిక జీవితాల్లో మౌలిక మార్పులను తెచ్చే ప్రభుత్వ రూపమే ప్రజాస్వామ్యం' అంటాడు అంబేద్కర్. గత ఆరు దశాబ్దాలుగా ప్రజల సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ముసుగులో జరిగే ఎన్నికలు ఒక తంతు మాత్రమే. ఎంఎల్ఏగా గెలవాలంటే 5 నుంచి 10 కోట్లు, ఎంపిగా గెలవాలంటే 10 నుంచి 20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. గత కొంతకాలంగా జరుగుతున్న ఎన్నికల తంతు పరిశీలిస్తే మధ్యతరగతి బుద్ధిజీవులు కూడ డబ్బులు తీసుకొని ఓటేస్తున్నారు. అంతెందుకు చట్టసభలకు ఎన్నికైన వారే డబ్బులు తీసుకొని ఓటు వేస్తుంటే ప్రజాస్వామ్యం ఇంకెక్కడ ఉంది. మన దేశంలో రాజకీయాలు లాభసాటి వ్యాపారంగా మారాయి. రైతుల, శ్రామికుల, దిగువ శ్రేణి ఉద్యోగుల జీవితాలు మారడంలేదు కాని ఒక్కసారి ఏదో ఒక పదవికి ఎన్నికైతే ఐదు సంవత్సరాలు నిండేసరికి అతగాని ఆర్థికస్థితి గతం కంటే ఎన్నోరెట్లు పెరుగుతున్నది. స్వల్పకాలంలో, శ్రమించకుండా, అత్యధికంగా సంపాదించాలంటే ఏదో ఒక పార్టీ నుంచి గెలవాలి. అందుకే కోట్లాది రూపాయలు ఇచ్చి ఎంఎల్ఎ, ఎంపి టికెట్లు కొనుక్కుంటున్నారు. ఇలా సీట్లు కొనుక్కొని గెలిచిన వారు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతినిధులు కావడం అపచారమే అవుతుంది.

స్వాతంత్ర్యోద్యమం కాలం నాటి నాయకులకు ప్రజా ఉద్యమాలతో కొందరికైనా సంబంధం ఉండేది. కాని నేటి రాజకీయ ఆదర్శం కాని, దూరదృష్టిగాని, ప్రజల సమస్యల పట్ల శ్రద్ధగాని లేవు. కేవలం ఒక్క అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కేవలం వారి కుటుంబ ఆస్తులను కాపాడుకొనేందుకు వారసత్వంగా రాజకీయ అధికారాన్ని

పొందాలనే తపన వారిది. నిజానికి వారసత్వ అధికారం ప్రజాస్వామ్య సూత్రానికి, విలువకు వ్యతిరేకమైంది. అలాగే కేంద్రీకృత అధికారం కూడ ప్రజాస్వామ్యానికి హాని చేసేదే. నెహ్రూ, గాంధీల కుటుంబాలు భారత రాజకీయాలను సొంతం చేసుకొన్నాయి. ఆ గాంధీ, నెహ్రూ కుటుంబాన్నే ఒక నమూనాగా తీసుకొని ఇతర రాజకీయ పార్టీలు వారసత్వ, కుటుంబ అధికార పాలనకు సిద్ధమవుతున్నాయి. ఆధునిక రాజరికాలుగా పరిణామం చెందుతున్నాయి. అందువలన సమాజాన్ని, దేశ సంపదను దోచుకోవడం వలన ఎంత నష్టపోతున్నామో ప్రజలు, ఓటర్లు ప్రత్యామ్నాయం ఆలోచించాలి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే ప్రజలే తమను తాము పాలించుకోవడం అనేది మూల సూత్రం. అయితే దళారీ పాలక వర్గాలు ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చాయి. బడాబాబులు తప్ప మామూలు ప్రజలు ప్రస్తుత ఎన్నికల భారాన్ని తట్టుకోలేమన్న భావన బలపడిపోయింది. పదవి మోహంతో నేతలు పార్టీలు మార్చడం, మాటలు మార్చడం చూస్తే జుగుప్స కలుగుతోంది. ఆయారాం, గయారాం సంస్కృతి పరాకాష్టకు చేరి ప్రజాజీవిత విలువలను పరిహాసం చేస్తున్నది. ఇతర పార్టీల నుంచి వచ్చినవారు తమ సిద్ధాంతాలు నచ్చి వచ్చారనీ, తమ నుంచి వెళ్లిపోయిన వారు ద్రోహులనీ అనడం రివాజుగా మారింది. కప్పల తక్కెడ చందంగా పార్టీలు మార్చే వీరెవరికీ సిద్ధాంతాలూ, సూత్రాలూ బొత్తిగా పట్టేవి కావు. అందుకే నీతి, రీతి లేకుండా ఎగిరి ఎక్కడైనా వాలుతుంటారు. ఇవాళ ఏ సిద్ధాంతం లేకపోవడమే రాజకీయ సిద్ధాంతంగా మారి నందున వారికి ఏ పార్టీ అయినా ఒకటే. ఈ నీతిమాలిన వ్యవహా రాలకు స్వస్తి పలుకాలంటే వ్యవస్థలో మౌలిక మార్పులు వస్తే తప్ప ఈ భ్రష్టుపట్టిన రాజకీయ సంస్కృతి మారదు.

ఒక సంక్లిష్ట, తీవ్ర ఆందోళనకర పరిస్థితిలో 16వ లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. ఆర్థిక సంక్షోభం, పెరుగు తున్న ద్రవ్యోల్బణం, ముంచుకొస్తున్న మతోన్మాదం, వెలుగులోకి వస్తున్న అవినీతి కుంభకోణాలు, పేదరికం, నిరుద్యోగం, మహిళలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు, పౌష్టికాహార లోపం లాంటి సమస్యలతో ప్రజలు చితికి పోతున్నారు. యుపిఎ ప్రభుత్వపు పదేళ్ల పాలన దేశాన్ని దుర్భరస్థితిలోకి నెట్టింది. ఒకవైపు శతకోటీశ్వర్లు, కోటీశ్వర్లు పెరుగుతుంటే మరోవైపు దారిద్ర్యం, నిరుద్యోగం పెరుగు తున్నాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను తీర్చే విధానాలను పాలకులు అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారు. దీనితో ఉత్పత్తి రంగాలైన పరిశ్రమల ప్రైవేటీకరణే కాకుండా, విద్య, వైద్యం వంటి సామాజిక సేవారంగాలను, మౌలిక అవసరాలను కూడా ప్రైవేటీకరించారు. ప్రభుత్వరంగ సంస్థల అమ్మివేత నిరాటంకంగా సాగు తోంది. నూతన ఆర్థిక విధానాలు ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలనూ వినాశనానికి గురిచేస్తున్నాయి. అవి ధనికులకు, పేదలకూ మధ్య అంతరాలను అనేక రెట్లు పెంచాయి. ప్రభుత్వ, ప్రైవేటురంగ పరిశ్రమ లన్నింటిలోనూ ఉపాధి కల్పన నానాటికీ కుచించుకు పోతున్నది. కాంట్రాక్టు, కాజువల్ కార్మికులను పెంచివేస్తున్నారు. వ్యవసాయ రంగం లో ఉత్పాదకత తగ్గిపోయి రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం చూప కుండా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు ఎన్ని అడ్డదారులు తొక్కైన సరే అధికారం చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తు న్నాయి. ప్రపంచ బ్యాంక్ విధానాలు అవలంబిస్తూ స్వావలంబన, స్వయం పోషక విధానాలకు స్వస్తి పలికి, ప్రభుత్వరంగ సంస్థలను బలహీనం చేస్తూ, పకృతి సహజ వనరులను కొల్లగొడుతూ, ప్రజా ధనాన్ని లూటి చేస్తూ, ప్రజలపై భారాలు మోపుతూ సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో ప్రభుత్వాలను నడపడమే ఈ రెండు పార్టీల, కూటముల ప్రధాన ధ్యేయం. రాజకీయార్థిక విధానాల్లో రెండు పార్టీలకు తేడాలేదు. ఒకే నాణానికి బొమ్మబొరుసు లాంటివి ఈ పార్టీలు. విదేశీ పెట్టుబడితో అభివృద్ధి అనే వారి విధానం దేశ ఆర్థిక వ్యవస్థను విదేశీ కార్పొరేట్ల పరం చేసింది. ఇనుము, బొగ్గు, బాక్సైట్, చమురు, గ్యాస్ వంటి సంపద్వంత సహజ వనరులను సామ్రాజ్యవాదులకూ దేశీయ దళారీ బడా బూర్జువాలకూ కారు చౌకగా కట్టబెట్టింది. ఈ దేశద్రోహ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు ఏమాత్రం ప్రతిఘటించినా రాజ్యం పాశవిక నిర్బంధానికి పూనుకుంటోంది. దండ కారణ్యంలో జల్ జంగల్ జమీన్ కొరకు ఉద్యమిస్తున్న ఆదివాసులను వారికి అండగా నిలుస్తున్న విప్లవకారులపై గ్రీన్‌హంట్ పేరుతో సైనిక దాడికి పూనుకుంది. ఆదివాసులను అకారణంగా ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేస్తోంది. ఇతర ప్రాంతాల్లో ఈ నిర్బంధకాండకు గురవుతున్నది శ్రామిక ప్రజలు, దళితులు, ఆదివాసులు, మహిళలే.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు వచ్చాక ప్రజా ధనాన్ని కొల్లగొట్టడం విచ్చలవిడిగా పెరిగింది. రాజకీయ నాయకులు, కార్పొరేట్లు, బ్యూరోక్రాట్లు ఈ మూడు శక్తుల అపవిత్ర కూటమి ఏర్పడింది. దీనితో అవినీతి విషవృక్షం విశృంఖలంగా పెరుగుతోంది. 2జి స్పెక్ట్రమ్, ఇస్రో కుంభకోణం, కామన్వెల్త్ గేమ్స్, కోల్‌గేట్, సహజవాయువు ధర పెంపు వగైరాలతో సహా రాష్ట్రంలో భూ కేటాయింపుల వరకూ అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రుల పదవులు కోల్పోవడమేగాక న్యాయస్థానాల్లో బోనెక్కవలసి వచ్చింది. కొందరు అమాత్యులతో సహా ప్రజాప్రతినిధులు నెలలు, ఏళ్లూ జైలులోనే గడిపిన దుస్థితి దాపురించింది. అవినీతి యుపిఎకే పరిమితం కాలేదు. కర్ణాటకలో గాలి జనార్దనరెడ్డి మైనింగ్ అక్రమాలు బిజెపి పాలనలోనే జరిగాయి. యడ్యూరప్ప అవినీతి, గడ్కరీ గడ్డిమేత కాషాయ పార్టీ బండారాన్ని వెల్లడించాయి.

బిజెపి స్వయాన ఒక మతతత్వ పార్టీకాగా, కాంగ్రెసు ఆయా సందర్భాల్లో మత చాందస శక్తులపట్ల ఉదాసీనంగా ఉండడం, కొన్ని సందర్భాలలో ఓటు అవసరాలకు వారితో మిలాఖత్ కావడం కాంగ్రెస్ నైజంగా ఉంది. అందువల్ల రెండూ పార్టీలు సెక్యులర్ పార్టీలు కావు. రానున్న ఎన్నికలు మోడీ – రాహుల్ మధ్య పోటీగా లేదా సెక్యులర్ – మతతత్వాల మధ్య పోటీగా ప్రచారం జరుగు తోంది. ప్రజల మౌలిక సమస్యలుగాని, సామ్రాజ్యవాద దోపిడీ గాని, పెచ్చరిల్లిన అవినీతి గాని, పెరుగుతున్న నిరుద్యోగం, పేదరికంలాంటి సమస్యలుగాని ఏ మాత్రం చర్చకు రావడం లేదు. ఈ ఎన్నికల్లో కొత్త ఆలోచనలు, ఆకాంక్షలు, ఆవేశం మెండుగా ఉండే యువతరం పాత్రపై వక్కాణిస్తున్నారు. యువత గతంలోలాగా ఇవాళ త్యాగాలను కోరుకోవడం లేదు. జీవితంలో వృద్ధి లోకి వచ్చే అవకాశాలను కోరుకుంటున్నారు. మహిళలకు 'సాధికారత' కల్పించకపోతే భారతదేశం 'అర్ధ సూపర్‌పవర్'గా ఉంటుందని

అంటున్నారు. ఇలా స్థూల ప్రకటనలు తప్ప ప్రజల ఆకాంక్షను సాకారం చేయగల కార్యక్రమం ఏమిటో ఏ పార్టీ నిర్దిష్టంగా ప్రకటించలేదు.

గత పది సంవత్సరాల యుపిఏ పాలనపై ప్రజల్లోని ఆగ్రహాన్ని అవకాశంగా తీసుకుని, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ఎన్నికల రంగంలోకి దిగింది. నరేంద్రమోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందు గానే ప్రకటించింది. దీనిననుసరించి కాంగ్రెస్ కూడా రాహుల్‌గాంధీని కాబోయే ప్రధానిగా ప్రకటించింది. గుజరాత్ అభివృద్ధి నమూనా అంటే స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు దోచి పెట్టడమే. పారిశ్రామిక, వ్యాపారవేత్తల అభివృద్ధి నమూనానే, అంబానీ, అద్వానీలకు సహకరించి సామాన్యుల సంక్షేమాన్ని గాలికి వదిలేసే నమూనానే. ఎన్‌డిఏ కార్యక్రమమేమిటి? నరేంద్రమోడీని 'వికాస్ పురుష్'గా చిత్రించడం ద్వారా గుజరాత్‌లో నరేంద్రమోడీ అనుసరించిన విధానాన్నే ప్రధానిగా అనుసరిస్తాడని ప్రకటించింది. ఈ విధానం యుపిఏ అమలు జరిపిన విధానానికి భిన్నమైనది కాదు. అనేక రాయితీల రూపంలో రాష్ట్రం నుండి ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు బడా పెట్టుబడిదారులకు 'గుజరాత్ నమూనా' అవకాశమిచ్చింది. బిజెపి సంఘ్‌పరివార్ కూటమి అధికారంలోకి రావడమంటే, దేశంలోని లౌకికచట్రంపై దాడి తీవ్రం కావడమే. హిందుత్వ అజెండాతో దేశం మొత్తాన్ని గుజరాత్‌గా మార్చే తమ అసలు లక్ష్యానికి ముసుగుగానే బిజెపి అభివృద్ధి, సుపరిపాలన, నల్లధనం వెలికితీత, అవినీతిని అరికట్టడం వంటి నినాదాలు అదే పనిగా ఇస్తుంది. దేశానికి మోడీ ప్రధాని కాబోతున్నాడని కార్పొరేట్ మీడియా కోడై కూస్తోంది. ఇప్పుడు డబ్బిచ్చి వివిధ రాజకీయ పార్టీలు ఓపినియన్ పోల్స్ నివేదికలు తమకు అనుకూలంగా తెచ్చుకున్నట్లు కనబడుతోంది. సామ్రాజ్యవాదుల, దళారీ బడా బూర్జువాల ప్రయోజనాల పరిరక్షణ కోసం మతప్రాతిపదికపై ప్రజలను విభజించి భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలనే లక్ష్య సాధన కోసమే. ఎన్‌డిఏ అధికారం లోకి రావడమంటే, దృఢమైన భారతదేశ నిర్మాణం పేరున యుద్ధో న్మాదాన్ని పెంపొం దించడమే. అప్రతిహతంగా బడా పెట్టుబడిదారుల మార్గాన్ని సుగమం చేసేందుకు ప్రజాహక్కులను ఫాసిస్టు తరహాలో కాల రాయడమే.

దేశంలో ఏక పార్టీ పాలనకు కాలంచెల్లి 1977 నుంచి సంకీర్ణ రాజకీయాలు వేళ్లూనుకుంటున్నాయి. కాంగ్రెస్, బిజెపి కూటములకు వ్యతిరేకంగా 11 వామపక్ష సెక్యులర్ పార్టీలు సంఘటితమై మూడవ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. ఇప్పుడు 11 పార్టీలతో మొదలైనా అది ఎన్నికల వరకు 15 పార్టీలుగా విస్తరించవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వీరి ప్రకటనలో ప్రజాస్వామ్య, లౌకిక, ఫెడరల్ ప్రజా అనుకూల ఎజెండాను తాము చేపడతామని వెల్లడించాయి. అధిక ధరలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, తదితర సమస్యలతో జనం చితికి పోతున్నారని ప్రకటించారు. మూడవ కూటమి తరపున ప్రధాని ఎవరన్నది ఎన్నికల అనంతరమే నిర్ణయిస్తామన్నారు. కాంగ్రెస్, బిజెపి ఒకే నాణేనికి బొమ్మా బొరుసులంటూ – ఆ రెండింటినీ ఓడించే ప్రత్యామ్నాయం తామేనని పదకొండు పార్టీల కొత్త కూటమి ప్రకటించింది. అధికార పీఠం నుంచి కాంగ్రెస్‌ను కూలదోసి, బిజెపి, మతతత్వ శక్తుల్ని ఓడించి అవి అధికారం చేపట్టకుండా నిలువ రించాల్సిన సమయం ఆసన్నమైందని తృతీయ కూటమి దేశ రాజధాని వేదికగా ప్రకటించింది.

బిజెపి లేదా కాంగ్రెస్ పార్టీలే వాటి నాయకత్వంలోని యుపిఏ, ఎన్‌డిఏ కూటమిగా కూడా 272 స్థానాలు సాధించగల పరిస్థితి ఏ మాత్రం లేదన్నది కళ్లెదుట కనిపిస్తున్న వాస్తవం. అతిపెద్ద రాష్ట్రాలైన యుపి, బీహార్, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తదితర చోట్ల ఆ రెండుపార్టీలూ తృతీయ, చతుర్థ స్థానాలకు పోటీ పడే పరిస్థితి. ఇవే గాక ఒడిశా, అసోం, కేరళ లాంటి రాష్ట్రాల్లో మూడో ప్రత్యామ్నాయంగా వస్తున్న కూటమి పార్టీలు ప్రధానశక్తిగా ఉన్నాయి. అయితే నాలుగు వామపక్ష శక్తులతో పాటు ఏడు ప్రాంతీయ పార్టీల సమాహారమైన ఈ కూటమి భాగస్వామ్య పక్షాలు తమతమ ప్రాబల్య ప్రాంతాల్లో సొంతంగానే గెలుస్తాయట, ఆ తరవాత జాతీయ స్థాయిలో కలుస్తాయట. ఎన్నికలు జరుగకముందే, ఆశించిన స్థానాలు గెలువక ముందే భాగస్వామ్య పార్టీల నేతలు తమకుతామే ప్రధానిపదవికి అర్హులమని ప్రకటించుకుంటున్నారు.

ఏ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ వీరంత సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు అమలు చేసినవారే. భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలు కాపాడిన వారే. వీరు పాలించిన రాష్ట్రాలలో మానవాభివృద్ధి సూచికలో ఏ రంగంలో కూడా ముందుకు వెళ్లలేదు. హక్కుల కొరకు ఉద్యమించిన కార్మికుల, రైతుల, ఇతర శ్రామిక ప్రజల ఉద్యమాలన్నింటినీ అణచివేసిన వారే. ముఖ్యంగా సామ్రాజ్యవాద దళారీ బడా బూర్జువాల, భూస్వాముల దోపిడీ కొనసాగిస్తూ దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై అణచివేతను ప్రయోగిస్తున్న ఈ వ్యవస్థను పరిరక్షిస్తున్న వారే. అందువలన వచ్చే ఎన్నికల తర్వాత, ఏ కూటమి అధికారంలోకి వచ్చినా, ప్రస్తుతం అమలు జరుగుతున్న ఆర్థిక, రాజకీయ విధానాలలో మౌలిక మార్పులుంటాయని ఆశించలేం. అయితే, రానున్న ఎన్నికల తర్వాత దేశంలో రాజకీయ అస్థిరత్వం కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వివిధ పీడిత వర్గాల ప్రజలు సంఘటితపడే అవకాశాలు, పోరాటాలకు వీధుల్లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

పాలకవర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్న ఈ వ్యవస్థను మార్చకుండ పాలకులను మార్చినంత మాత్రనా ప్రజలకు ఒరిగేదే ముండదు. ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తూ, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా శ్రమశక్తిని, సహజ వనరులను, ప్రజల జీవనాధారాలను కొల్లగొడుతున్న, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించాలి. ప్రజలు తమ హక్కుల కొరకు ఉద్యమిస్తుంటే పాశవికంగా ఎందుకు అణచివేస్తున్నారో? ఎవరి ప్రయోజనాల కొరకు పాలన సాగిస్తున్నారో? పార్టీలను నిలదీయాలి. ప్రజాస్వామిక, లౌకిక విలువలకు కట్టుబడి, స్వావలంబన స్వయంపోషక విధానాలను అమలుపరిచే, సామ్రాజ్యవాదాన్ని, మతోన్మాదాన్ని వ్యతిరేకించి భూసంస్కరణలను అమలు పరిచే, పౌరహక్కులను గౌరవించే పార్టీలు, వ్యక్తులకు మద్దతివ్వాలి. అటువంటివారు లేకుంటే తిరస్కర ఓటు వినియో గించడమే సము చితం. ప్రజాస్వామిక ఉద్యమంలో ఓటు బహిష్కరణ, ఓటు తిరస్కరణ కూడ ఉద్యమంలో ఒక భాగమే. ప్రత్నామ్నాయ ప్రజా రాజకీయాలను నిర్మించి, అమలు పరిచే దిశనిర్దేశం ప్రజానుకూల పార్టీలకు అత్యంత అవశ్యకం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ఫాసిస్టు పాలన స్థాపనకు మోడీ తాపత్రయం

ఈ దేశం సామ్రాజ్యవాదుల చేతుల్లోకి, మతోన్మాదుల చేతుల్లోకి వెళ్లకుండా ఉండాలంటే నేడు ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గమే గత్యంతరమని అంటున్నారు **ఎల్. అరణ్య**

వివేకానందున్ని ఆదర్శంగా తీసుకొని తానొక నేతగా నిరంతరం చెప్పుకుంటున్న నరేంద్రమోడీ వివేకానందుని మార్క్ ఐడియాలజికల్ ఫాసిజం దశను దాటి ఎంతో ముందుకెళ్లి 2002 మారణకాండ రూపంలో దాన్ని విజయవంతంగా ఆచరించి చూపిన దశకు చేరి కూడా దాదాపు పన్నెండేళ్లు దాటింది. వివేకానందుని పుస్తకాలు చదివి తదాత్మ్యం చెందే చాలా మంది మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలు నరేంద్రమోడీ ప్రసంగాలనూ అంతే తదాత్మ్యంతో స్వీకరిస్తున్నారు. ఆ ఇద్దరు ఫాసిస్టులనూ సంస్కృతి పరిరక్షకులుగా, జాతి పరిరక్షకులుగా, హిందూ ధర్మ పరిరక్షకులుగా చూస్తూనే ఉన్నారు. మోడీని ఎలాగైనా సరే ఈదేశ ప్రధాన మంత్రిగా గెలిపించుకోవాలని ఆరాటపడుతున్నారు.

నిజానికి నరేంద్రమోడీ ఒక ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా పని చేశాడు. మతం మత లక్షణాలను దాటి ఉన్మాద లక్షణాలను సంతరించుకునే క్రమంలో భాగంగా కొందరు మతోన్మాదులు సహజంగానే పుట్టుకు వస్తారు. వాళ్లు ఉన్మాద లక్షణాలను ఎప్పటికప్పుడూ బతికిస్తూ పోతారు. ప్రవీణ్ తొగాడియా, బాల్‌ఠాకరే, రాజ్‌ఠాకరే లాంటి వాళ్లు ఈ కోవలోకే వస్తారు. ఇప్పుడు మోడీ కూడా వస్తాడు. మోడీ ఆ ఉన్మాదాన్ని తీవ్రస్థాయికి ఎలా పెంచగలడంటే టెర్రరిస్టు కార్యక్రమాల పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని చెప్తూ 'టెర్రరిస్టులంటే ఎవరో తెలుసా' ? అని అడుగుతాడు. సభలోని పిల్లలు వెంటనే ముస్లింలు అని బదులిస్తే చిరునవ్వు నవ్వుతాడు. సాక్షాత్తు ముఖ్యమంత్రి అయి ఉండీ యూనివర్సిటీ పిల్లలు తమ శత్రువులు ముస్లింలే అని ఠక్కున బదులిచ్చేలాగా, సులభంగా రెచ్చిపోయేలాగా ప్రసంగాలిచ్చి మరీ రెచ్చగొట్టగలడు.

నరేంద్రమోడీ సంఘ్‌పరివార్ కార్యకర్తగా ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నరనరాన జీర్ణించుకున్న మనిషి. ఈ దేశాన్ని సమూలంగా హైందవీ కరించాడానికి కంకణం కట్టుకున్నది ఆర్ఎస్ఎస్. మతం అనేది ప్రతి సమస్యను పరిష్కరించడానికి ఒక సాధనమని, ఆ మతపిచ్చిలో ప్రజలు కొట్టుకుపోయి, చైతన్యాన్ని మరిచిపోయి, మతోన్మాదంతో దొరికిన వాళ్లను వాళ్లు ఇతర మతస్తులైతే చాలు నిట్టనిలువునా నరకడానికైనా వెనకాడవద్దని ఆర్ఎస్ఎస్ నేరుగానే చెప్తుంది. ప్రవీణ్‌తొగాడియా లాంటి వాళ్లు అలా చంపడానికి కావల్సిన త్రిశూలాలు, కత్తుల్లాంటి ఆయుధాలను సభలు పెట్టి మరీ పంచుతారు. హిందూమత సిద్ధాంతాలను రుద్దుతూ ఈ దేశంలోనే కాదు ప్రపంచంలోని అన్ని మతాల కన్నా హిందూమతం గొప్పదని చెప్తారు. ఇతర మతాలన్నీ హీనమైనవని, వాటిని నిర్మూలించి ప్రపంచమంతా హిందూ రాజ్య స్థాపన చేయాలనే దుర్మార్గపు లక్ష్యమున్న ఆర్ఎస్ఎస్ అందులో భాగంగా ఆ ఇతర మతస్తుల ప్రాణాలను హరించే పనిని లక్ష్యంగా పెట్టుకుంది. తన లక్ష్యాన్ని సాధించేందుకు గాను తన భావాలను ప్రచారం చేసే పని హింసను ప్రయోగించడం ద్వారా మాత్రమే సాధ్యమని ఆర్ఎస్ఎస్ నమ్మకం. అందుకే ఏకాత్మతా ఉపన్యాసాలు ఇచ్చి కొందరు రెచ్చగొడుతుంటే వారి మాటలకు ఊగిపోయి కాషాయ రిబ్బన్‌లు నెత్తికి కట్టుకున్న వాళ్లు దాడులకు దిగుతుంటారు. రథయాత్రల పేరుతో దేవుని పిచ్చిని కొందరు రెచ్చగొడితే, పారలు, పలుగులు పట్టుకుని కొందరు మసీదులను, చర్చీలను కూలగొడుతుంటారు. విదేశీ సంస్కృతులంటూ కొందరు వేలు చూపిస్తే ప్రేమికుల ముక్కు, చెవులను కోస్తారు. ముఖ్యమంత్రి అధికారాన్ని వాడుకొని, సైగచేస్తే చాలు రెండేసి వేల మందిని ఊచకోత రక్తపుటేర్లు పారిస్తారు కొందరు. ఆర్ఎస్ఎస్ రెచ్చగొడుతున్న హిందూ జాతీయవాద సిద్ధాంతాల్లో జాతి నిర్మాణంలో ఇతర మతస్తులకు భాగం ఉండదు. అసలు వాళ్లు ఈ జాతికి అనవసరం. అందులోనూ ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు. అందుకే వాళ్లంతా తన చెప్పుచేతుల్లో ఉండాలని ఆర్ఎస్ఎస్ భావిస్తుంది. సొంతమతం, ఇతర మతం అనే 'అడ్డుగోడలు పోయి' అంతా సొంతమతమే అయిపోవాలి. అలా కావడానికి కేవలం చెప్పుచేతుల్లోనే ఉంటే సరిపోదు, ఆ ఇతర మతస్తులను నిర్మూలిస్తేనే అది సాధ్యం అని ఆర్ఎస్ఎస్ భావన. అందుకే ఆ నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించే ఒక మాఫియా వ్యవస్థకు, గూండాలకు ఆర్ఎస్ఎస్ శిక్షణలిచ్చి మరీ తయారు చేసుకుంది. అలాంటి శిక్షణ నుంచి బయటకు వచ్చిన వాడే నరేంద్రమోడీ. ఆర్ఎస్ఎస్ పూనుకున్న ఈ నరసంహార ప్రక్రియను చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని అడ్డు పెట్టుకొని మరీ నిర్వహించడానికే నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాడు. ఇప్పుడు దేశ ప్రధానమంత్రి కావాలనుకుంటున్నాడు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ సమాజంలో హిందూ మూకలను పెంచిపోషించి తాననుకున్నట్లు 2002 నరమేధాన్ని నిర్వహించాడు. దానికి ముందస్తు భూమికగా మెజారిటీ మైనారిటీలుగా సమాజాన్ని చీల్చి వారి మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి మైనారిటీలంతా ప్రమాదాకరమని మెజారిటీలకు ఉద్బోధ చేస్తూ వచ్చాడు. ఆ ఉద్బోధ ముగిసినాక దానికి ఆచరణ రూపంగా 2002 నరమేధం గావించాడు. ఇప్పుడు అదే ప్రణాళికను దేశమంతటికీ వర్తింపచేయాలని చూస్తున్నాడు. కానీ మారుతున్న సమాజాలు, ప్రజల రీత్యా తన మతోన్మాద ప్రణాళిక నేరుగా అమలవడం కష్టమని గ్రహించాడు. అందుకే మతం మాట కాస్త పక్కన పెట్టి ప్రజల మనసులు గెలిచేందుకు అభివృద్ధి పాట ఎత్తుకున్నాడు. 'వైబ్రంట్ గుజరాత్' అని ప్రచారం చేసుకుని, దేశాన్ని కూడా గుజరాత్

మార్గంలో నడిపిస్తానంటున్నాడు. నిజానికి గుజరాత్ అభివృద్ధి చేందడమనేది పచ్చి అబద్ధం. గాంధీనగర్, అహ్మదాబాద్, సూరత్, వడోదర వంటి అనేక నగరాల్లో, పట్టణాల్లో వందలాది, వేలాది మంది మురికి కాల్వల గట్ల మీద, ఊరవతల చిన్న చిన్న దేరాల్లో, బస్‌స్టాపుల్లో బతుకులీడుస్తున్నారు. ఉద్యోగాల సంగతి దాకా ఎందుకు గానీ కనీసం రోజు కూలీ కూడా దొరకని దుర్భర పరిస్థితిలో లక్షలాది ప్రజలున్నారు. గ్రామీణ నిరుద్యోగం తీవ్రంగా ఉంది. అమెరికన్ సామ్రాజ్యవాదానికి ఎర్రతివాచి పరిచిన మోడీ స్థానిక వృత్తులను, చేతి పనులను, గృహ పరిశ్రమలను నాశనం చేశాడు. రైతులు, రైతుకూలీలు, వృత్తి ఆధారితులు, శ్రామికులనందరినీ బిచ్చగాళ్లుగా మార్చాడు. ఆధునిక సాంకేతిక సాధనాలతో పనులు చేయించి, దాని వల్ల పెరిగిన నిరుద్యోగం గురించి ఎక్కడా మాట్లాడకుండా గుజరాత్ సాంకేతికతను సాధించిందని గొప్పలు చెప్పుకుంటున్నాడు. మెడపై తుపాకులు పెట్టి పోలీసులు, అధికార గణం సాయంతో పేద రైతుల భూములు వేలాది ఎకరాలను ఎస్సార్ వంటి కంపెనీలకు కట్టబెట్టారు. ప్రజలకు పౌరహక్కుల మాటేలేదు. గుజరాత్‌లో చిన్న పిల్లలకు పౌష్టికాహార లోపంతో రక్తహీనత తీవ్రంగా ఉందని యునిసెఫ్ రిపోర్ట్ చెప్పింది. గుజరాత్‌లో అవినీతి, లంచగొండితనం దారుణంగా పెరిగిపోయింది. లంచం లేనిదే అక్కడ ప్రభుత్వ కాంట్రాక్టులు దొరకవు, అధికారులు, నాయకులు పని చేయరు. అలా లంచాలు తీసుకునేలా మోడీ ప్రభుత్వంలోని పెద్దలే ప్రోత్సహిస్తుంటారు. అలా చేయక నిజాయితీతో ఉండే పోలీసులను, అధికారులను మోడీ వేధించాడు. అక్కడ వందల, వేల కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచే సంస్కృతి తయారైంది. మోడీ రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయించాడు. బిజెపి అభ్యర్థులపై పోటీకి దిగిన ఇతర పార్టీ అభ్యర్థులపై కేసులు పెట్టించాడు. ప్రతిపక్షాల వారిని కొనడమో, చంపించడమో చేస్తున్నాడు. అక్కడి మైనారిటీల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ముస్లిం ప్రాంతాల్లో మంచినీటి వసతి ఉండదు. వారికి ఉద్యోగాలివ్వరు. వారికి బడులుండవు. వారికి రుణాలివ్వరు. పథకాల అమలు ఉండదు. వారికి పండుగల సమయంలో ఊరేగింపు తీసుకొనే స్వేచ్ఛ ఉండదు. చివరికి వాహనాల్లో కూడా రెట్టింపు చార్జీలు వసూలు చేస్తారు. ఇవన్నీ బాధలు చాలవన్నట్లు మైనారిటీలను పాశవికంగా ఎన్‌కౌంటర్లు చేయించే భయంకర చరిత్రకు మోడీ తెరలేపాడు. కార్పొరేట్ అనుకూల సంస్కరణల అమలుతో మరగుదొడ్లు, రక్షిత మంచినీరు చివరికి ఒక్కపూట తిండి కూడా దొరకని స్థితిలో ఎందరో పేదలు, వ్యవసాయం దెబ్బతిని ఎందరో రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలు దెబ్బతిన్నాయి. మొత్తంగా పేదలను ముంచి పెద్దలకు పట్టం కట్టే పాలన గుజరాత్‌లో కొనసాగుతుంది.

ఇదంతా సరిగ్గా అమెరికా ఆలోచనలకు సరిపోయే విధంగా ఉండడం తో ఒకప్పుడు 2002 అల్లర్ల కారణంగా మోడీకి వీసా నిరాకరించిన అమెరికా ఇప్పుడు మోడీని మోస్తున్నది. రేపు దేశం మొత్తంలో చిన్న పనులన్నింటినీ దెబ్బకొట్టి దేశాన్ని తనకు తాకట్టు పెట్టే విధేయుడైన భక్తునిగా అమెరికా మోడీని ఆరాధిస్తున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ను అమెరికా నేతృత్వంలో అమలు పరిచి బహుళజాతి సంస్థల, వాటికి ఇక్కడ నిర్వహించే దేశీయ పెట్టుబడిదారుల, దళారీల చేతుల్లో సంపదను కేంద్రీకరించే పనిని మన్మోహన్‌సింగ్ కంటే సమర్థవంతంగా మోడీ నిర్వహించగలడని కితాబిచ్చింది. ఈదేశంలోని సహజ వనరులను దోచుకోవడానికి, వాటిని కాపాడుతున్న మావోయిస్టులను, ప్రజా సంఘాల వాళ్లను నిర్మూలించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా మోడీ నిర్వహించగలడని అమెరికా ఆశ. ఆర్ఎస్ఎస్ సహాయంతో మోడీ ప్రజలను మత పిచ్చిలోకి నెట్టి తన దోపిడిని యథేచ్ఛగా సాగించవచ్చుననే కోరికతో అమెరికా నరేంద్రమోడీ గెలవాలని కోరుకుంటున్నది. అంత నమ్మకం మోడీ పైన ఎందుకంటే గుజరాత్‌లో మోడీ చేసిన విధ్వంసాన్ని అమెరికా పరిశీలించింది గనుక. ప్రజల ఆకలికేకల, ఆర్తనాదాలను పట్టించు కోకుండా గుజరాత్‌లో పెట్టుబడులను ప్రవహింప చేసి సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చి పేదలను ఆత్మహత్యల పాలు చేసిన మోడీ మార్క్ అభివృద్ధిని అమెరికా చూసింది కనుక. అందుకే అమెరికాకు పచ్చి ఫండమెంటలిస్టు అయిన మోడీపైన హఠాత్తుగా ప్రేమ పుట్టుకు వచ్చింది. మోడీ రాకతో తమ వేల, లక్షల కోట్ల వ్యాపారాలను మరింత వృద్ధి చేసుకోవచ్చని దేశీయ పెట్టుబడిదారులు కూడా కలలు కంటున్నారు. అందుకే ముఖేష్ అంబానీ 'మోడీ నేతలకే నేత, రాజులకే రారాజు, వికాస్ పురుషుడు' అని భజన చేస్తున్నాడు.

వారందరి కలలు నిజం చేయడానికి నరేంద్రమోడీ ఎన్నికల వేళ విరామం లేకుండా ప్రచారం చేస్తున్నాడు. తనను తాను చాయ్‌వాలాగా, వెనకబడిన కులాల వ్యక్తిగా చెప్పుకుంటూ ప్రజలకు సానుభూతి కలిగేలా, ఆ సానుభూతి ఓట్లు రాల్చేలా సానుభూతి రాజకీయాలు నడుపుతున్నాడు. సంఘ్ పరివార్ భావాల కఠినత్వాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టి మైనారిటీల, దళితుల, ఆదివాసుల మెప్పుపొందాలని ప్రసంగాలు చేస్తున్నాడు. కరుడు గట్టిన హిందూ భావజాల అంశాలను మోడీ తన ప్రసంగంలో చేర్చడం లేదు. రామమందిరం, కశ్మీర్ అంశం వంటి వివాదాస్పద, సున్నిత అంశాల జోలికి పోవడం లేదు. ప్రతి రాష్ట్రంలో బుల్లెట్ కార్లు, రాష్ట్రానికి ఐఐటి, ఐఐఎంలు నెలకొల్పుతామని ఎప్పుడు చూసినా అభివృద్ధి జపమే చేస్తున్నాడు. ఏవేవో చెప్పి 'సమున్నత, శక్తివంతమైన భారత్'ను నిర్మిస్తానంటున్నాడు. పులి తనను తాను శాఖాహారినని నమ్మించుకుంటే గాని వేట సాధ్యపడదు. పులికున్న ప్రధాన సమస్య అది. అందుకే ఇప్పుడు మోడీ దేశ ప్రధానమంత్రి అవడం కోసం మేకవన్నె పులై నటిస్తున్నాడు. దేశంలోని మధ్యతరగతి వర్గాలు ఆ నటనను నిజమే అనుకొని నమ్ముతున్నాయి. తమలోనే భాగమైన దళితులు, గిరిజనులు, ఆదివాసులు, ముస్లింలు, క్రైస్తవుల వంటి సమూహాలపైన హిందుత్వ మూకల దాడులు నిత్యకృత్యమయ్యే పరిస్థితి దాపురించబోతుందని తెలియని ఆ వర్గాలు హిందూత్వ నినాదాన్ని మోయడానికి ఆసక్తి చూపుతున్నాయి.

దేశంలో సామాజిక, రాజకీయ సంక్షోభం నెలకొన్నప్పుడు మతోన్మాదం పెరుగుతుంది. ఆ మతోన్మాదాన్ని అమలు పరిచే ఉన్మాద నాయకులు అవతరిస్తారు. అలా అవతరించిన మోడీ అధికారం కోసం ఎన్నో మాయ మాటలు చెపుతున్నాడు. మతపరమైన విభజనలను ఆసరగా చేసుకొని రాజకీయాలు నడుపుతున్నాడు. ఎన్నో సమస్యలతో ఉన్న గుజరాత్ అభివృద్ధి చెందిందని అబద్దాలు చెపుతున్నాడు.

మరిచిపోగూడని మోడీ

***గుజరాత్‌లో ముస్లిం ప్రజలను పాశవికంగా చంపించిన నరేంద్రమోడీ దేశానికి కాదగిన ప్రధానమంత్రి అంటూ జాతీయ మీడియా పెద్ద ఎత్తున అబద్ధపు ప్రచారం చేస్తున్నదనీ, దేశ ప్రజలు జాగరూకంగా లేకపోతే అది నిజమయ్యే అవకాశాలు ఉన్నాయనీ అంటున్నారు* ముకుల్ దూబే**

నా చుట్టూ చెప్పలేనంత మతిమరపు కనబడుతున్నది. 'బెస్ట్ బేకరీలో అమాయకులైన చిన్నపిల్లలు, నిస్సహాయులైన స్త్రీలు తగులబడి పోతుండగా ఆధునిక కాలపు నీరోలు అటు చూడకుండా తల పక్కకు తిప్పుకుని ఉండిపోయారు...' అని భారత సుప్రీంకోర్టు 2004 ఏప్రిల్‌లో చెప్పిన నీరోల గుంపుకు అధినాయకుడు నరేంద్ర దామోదర్ దాస్ మోడీ. ఇప్పుడు ఆ మనిషి దేశానికి ప్రధానమంత్రి కాదగిన వాడని కొందరు అనుకుంటున్నారు. ఆయనను 'వికాస్ పురుష్' అనీ అభివృద్ధి కారకుడనీ అంటున్నారు. ఆయన మీదా, ఆయన చుట్టూరా ఉన్న నెత్తుటి మరకల మీదా రంగులద్దడానికి అతి ఖరీదైన ప్రచార బృందం పని చేస్తున్నది.

ఈ రంగులద్దే పనికి అవసరమైన డాలర్లు ఎవరు అందజేస్తున్నారో నాకు తెలియదు. ఆ ఖర్చు భరిస్తున్నది భారతీయ జనతా పార్టీ - రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కాకపోతే, అది గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వమైతే, ఆ రాష్ట్రంలో అత్యవసరమైన పనులకు కాకుండా ఇటువంటి పనులకు ఆ రాష్ట్ర నిధులు తరలిపోతున్నాయనుకోవాలి. ఆ అత్యవసరమైన పనుల్లో ఒకటి అక్కడి శిశుమరణాల సంఖ్యను తగ్గించడం. సెప్టెంబర్ 2013లో వచ్చిన ఒక పత్రికా వార్త ప్రకారం, "దేశంలోకెల్లా అత్యధిక శిశుమరణాల రేటు నమోదైన జిల్లాలలో ఆరు జిల్లాలతో గుజరాత్ అగ్రభాగాన ఉంది. ఐదు జిల్లాలతో ఆంధ్రప్రదేశ్, మూడు జిల్లాలతో అరుణాచల్ ప్రదేశ్, రెండు జిల్లాలతో జమ్ము-కశ్మీర్, ఒక్కొక్క జిల్లాతో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఆ తర్వాతి స్థానాలలో ఉన్నాయి."

మోడీ నాయకత్వాన జరుగుతున్న అభివృద్ధి పిడికెడు మందికి విపరీతంగా సంపద పెంచిందని, అసంఖ్యాక పేద ప్రజలను మరింత దారిద్ర్యంలోకి, లేదా, ఇక మిగిలిన ఒకేఒక్క ప్రత్యామ్నాయమైన ఆత్మహత్యల వైపుకు నెట్టిందని ఎంతో మంది రాస్తున్నారు.

'గుజరాత్‌లో జరిగిన ఆర్థికాభివృద్ధి అనేదాని కోసం అక్కడి సాధారణ ప్రజానీకం భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది. భారతదేశంలో దారిద్ర్య స్థాయి అతి ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో గుజరాత్ ఒకటి. విస్తారమైన భూక్షేత్రాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడంతో లక్షలాది రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, వ్యవసాయ కూలీలు, దళితులు, ఆదివాసులు నిర్వాసితులయ్యారు... దేశంలో దాదాపు అంతే తలసరి ఆదాయం ఉన్న ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు ఆకలి తీవ్రత అతి ఎక్కువగా, మానవాభివృద్ధి సూచికలు అతి తక్కువగా నమోదైన రాష్ట్రం గుజరాత్. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అతి ఘోరంగా అమలైన పెద్ద రాష్ట్రాలలో గుజరాత్ ఒకటి. దారిద్ర్యం, ఆకలి, విద్య, అభద్రత వంటి ఏ సూచికలు తీసుకున్నా అక్కడ ప్రత్యేకించి ముస్లింలు అత్యంత దారుణమైన స్థితిలో ఉన్నారు' అని రోహిణి హెన్స్‌మన్ రాశారు.

కాని ప్రస్తుతం ప్రచార సాధనాలన్నీ నిస్సిగ్గుగా మోడీ భజన సాగిస్తున్నాయి. అచ్చు పత్రికల కన్న టెలివిజన్ ఛానళ్లు ఈ పనిలో మరింత చురుగ్గా ఉన్నాయని విన్నాను (నేను టివి చూడను). ఇవాళ ఆ మనిషిని ముందుకు తోస్తున్న చాల మంది 2002లోనూ, ఆ తర్వాత కూడ ఆయన పట్ల విమర్శనాత్మకంగానే ఉన్నారు. మరి వారి జ్ఞాపకాలు ఇప్పుడు వారిని వదిలిపోయినట్టున్నాయి. తామిప్పుడు కొత్త నాయకుడిగా కీర్తిస్తున్న వ్యక్తినే తాము గతంలో హంతకుడు అన్నామన్న సంగతి వాళ్లు మరచిపోయినట్టున్నారు.

కాని మనలో కొందరికి ఇంకా ఆ జ్ఞాపకాలు సజీవంగానే ఉన్నాయి. మనం చాల విషయాలే గుర్తుపెట్టుకున్నాం. ఎటువంటి నాయకత్వ స్థానానికైనా మోడీ పేరు సంపూర్ణమైన తప్పుడు ఎంపిక అవుతుందని మన జ్ఞాపకాలు చెపుతున్నాయి.

'మూడు రోజుల పాటు హిందువులు తమ కోపం తీర్చుకోనివ్వండి' అని మోడీ తన పోలీసులకు, అధికారవర్గానికి చెప్పలేదని మాటవరుసకు అనుకుందాం. ఆ హత్యాకాండకు, జనహననానికి ఆయన రూపశిల్పి అనగూడదనే అనుకుందాం. చివరికి ఆయనను 'ఆధునిక కాలపు నీరో' అని కూడ అనగూడదనుకుందాం. మరి అప్పుడిక నిస్సందేహంగా మనకు మతోన్మాదానికి హిందూ జాతీయవాదం అని పేరుపెట్టి ఆ ముసుగులో గుజరాత్ మారణకాండను సృష్టించాడు. దేశం దాన్ని మరిచి పోవడానికి అభివృద్ధి జపం చేస్తున్నాడు. అందులో భాగంగా కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడేందుకు గుజరాత్‌ను తాకట్టు పెట్టాడు. రేపు మొత్తం దేశాన్ని తాకట్టు పెట్టాలను కుంటున్నాడు. అలా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి ప్రజల జీవితాలను నెట్టి, ప్రభుత్వాన్ని ఆ శక్తులకు దాస్యం చేసేలా మార్చి ఈ దేశంలో ఫాసిజాన్ని నెలకొల్పాలని చూస్తున్నాడు. దేశాన్ని అమెరికాకు, దేశీయ సంపన్నులకు అర్పించడం, దేశంలో మైనారిటీలను పూర్తిగా నిర్మూలించి దేశాన్ని హైందవీకరించి, అటు తర్వాత బ్రాహ్మణీకరించడమే లక్ష్యంగా చేసుకొని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు గాను ప్రధానమంత్రి కావాలని చూస్తున్న నరేంద్రమోడీని ఓడించడం ఈ దేశ ప్రజల బాధ్యత. దేశం ఉన్మాదుల బారినపడకుండ, దేశం అమెరికాకు అమ్ముడుపోకుండానో, అంబానీ లాంటి వాళ్ల కనుసన్నల్లో ప్రజల జీవితాలు ఉండకుండా ఉండాలంటేనో ప్రజలు ఆ బాధ్యతను నెరవేర్చుకోవడంలో సఫలీకృతులవ్వడమే ఏకైక మార్గం.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

2014 ఎన్నికలకు రైతుల ఎజెండా

ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ప్రజల ప్రధాన జీవనోపాధి అయిన వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశాయనీ, కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలైనా రైతులకు ప్రయోజనాలు చేకూర్చే అంశాలను తమ ఎన్నికల ఎజెండాలో చేర్చాలనీ అంటున్నారు **ఆశాలత**

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వచ్చేసింది. ఏ పార్టీ విజయావకాశాలు ఎలా ఉన్నాయి? ఏ పార్టీలో చేరితే ఎన్నికలలో గెలవవచ్చు? ఏ పార్టీ, ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోతోంది? లాంటి అంశాలపై ప్రధానంగా చర్చ సాగుతోంది. కానీ, ప్రజల సమస్యలు రాజకీయ పార్టీల ఎజెండాలోకి మానిఫెస్టోలోకి తీసుకురావడం గురించి ఎక్కడా చర్చ జరగడం లేదు.

రాష్ట్ర జనాభాలో 60 శాతం ప్రజలు జీవనోపాధి కోసం వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలైన ఉద్యాన పంటల పెంపకం, పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, చేపల వేట, పెంపకం, వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి మొదలైన వాటిపై ఆధారపడి ఉన్నారు. గత 20 సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన అన్నీ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. ప్రభుత్వ విధానాలలో ఈ రంగానికి అతి తక్కువ ప్రాధాన్యత నిచ్చాయి. గత 18 సంవత్సరాలలో 35,898 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే అది అధికారంలో ఉన్న అన్ని పార్టీల వైఫల్యాన్ని సూచిస్తుంది. దీనికి తోడు గత దశాబ్ద కాలంలో 13.68 లక్షల మంది వ్యవసాయం నుండి వైదొలిగి వ్యవసాయ కూలీలుగా మారిపోయారు.

ప్రభుత్వ విధానాల మూలంగా ఏర్పడిన ఈ సంక్షోభాన్ని, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం ద్వారా, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులను నిలదొక్కుకునేలాగా చేయడం ద్వారా తిప్పి కొట్టవచ్చు. వాస్తవ సాగుదార్లకు సాధికారతను కల్పించడం, భూమి సమస్యలను పరిష్కరించడం, రైతులకు ఆదాయ భద్రతను, సుస్థిరతను కల్పించడం పై కేంద్రీకరించాలి. ఇందుకోసం సహకార సంఘాలు, ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా వ్యవసాయ ఆధారిత గ్రామీణ వృత్తులను, వ్యాపారాలను ప్రోత్సహించాలి. ఇందుకోసం వ్యవస్థలలో జవాబుదారీతనం, వికేంద్రీ కరణ ఉండాలి. మద్దతు వ్యవస్థలను ప్రజలే నిర్వహించు కునేలాగా రూపొందించాలి.

వ్యవసాయం దాని అనుబంధ కార్యకలాపాలు, అందులో భాగస్వాములైన ప్రజలకే సంబంధించిన విషయాలు కావు. ఆహార భద్రత, గ్రామీణ జీవనోపాధులు, ఆరోగ్యం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్యత, పర్యావరణం మార్పు వంటి దేశానికి ప్రాధాన్యత గత అంశాలకు కూడా అవి అత్యంత ముఖ్యమైనవి.

రైతులు, దళిత బహుజనులు, వ్యవసాయ కూలీలు, మహిళా రైతులు, కౌలు రైతులు, ఆదివాసులు, సమాజం పట్ల బాధ్యతగా ఆలోచించే యూనివర్సిటీ ప్రొఫెసర్లూ, ఆర్థికవేత్తలూ, వ్యవసాయ శాస్త్రవేత్తలూ గత కొంత కాలంగా చర్చించి ముందుకు తెస్తూ ఉన్న పై డిమాండ్లను రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల సందర్భంగా తమ మానిఫెస్టోలలో చేర్చి ప్రాథమిక జీవనోపాధి రంగమైన వ్యవసాయానికి, రైతాంగానికి తమ బాధ్యతను చాటు కోవాలి.

ప్రధాన డిమాండ్లు:

వ్యవసాయానికి బడ్జెట్‌లో 10 శాతం కేటాయించాలి. ప్రతి సంవత్సరం 25 శాతం పెంచుతూ పోవాలి.

వ్యవసాయానికి భూమి అత్యంత ముఖ్యమైన వనరు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే, సెటిల్‌మెంట్‌ను నిర్దిష్ట కాల పరిమితిలో జరపాలి. గ్రామీణ ప్రాంతాల భూ వినియోగ ప్రణాళికను రూపొందించాలి.

మిగిలే నిర్ధారణ ఏమంటే ఒక పాలకుడిగా ఆయన అత్యంత దారుణంగా విఫలమయ్యాడని ఒప్పుకోవడమే. దుర్మార్గమైన దాడులు చేస్తున్న హిందూ గూండా బలగాలకు ఆయన ప్రభుత్వం బ్రహ్మాండమైన రవాణా ఏర్పాట్లు చేసింది. కాని పేరుకు సైన్యాన్ని తరలించినప్పటికీ అవసరమైన రవాణా ఏర్పాట్ల సూచనలే లేవు. అయినా ఆ సైన్యాన్ని దించడం కూడ చాల ఆలస్యంగా, ఏ ఫలితమూ సాధించలేని స్థితిలో జరిగింది.

చివరికి వాజపాయి కూడ, ఆయనా స్వయంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మనిషే అయినప్పటికీ, మోడీకి రాజధర్మం గురించి గుర్తు చేయవలసి వచ్చిందని మనం గుర్తు చేసుకుందాం.

నిర్వాసితులైన ముస్లింలు బలవంతంగా మగ్గవలసి వచ్చిన శరణార్థి శిబిరాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సహాయమూ అందించ లేదు. అంతమాత్రమే కాదు, ఆ శరణార్థి శిబిరాలు 'పిల్లలను పుట్టించే కేంద్రాలు' అని స్వయంగా మోడీ తిరస్కారంగా అన్నాడని మనం గుర్తు చేసుకుందాం. ఆ మాట ఆయన 2002 సెప్టెంబర్ 9న బెచరాజిలో చేసిన హమ్ పాంచ్ హమారే పచ్చీస్ ఉపన్యాసంలో భాగంగా అన్నాడని మనం గుర్తు చేసుకుందాం.

చిట్టచివరిగా, పదవీ ప్రమాణస్వీకార సమయంలో ప్రతి ముఖ్యమంత్రీ తీసుకునే ప్రతిజ్ఞ కూడ మనం గుర్తు చేసుకుందాం. '......అనబడే నేను... భారత రాజ్యాంగము పట్ల యదార్థమైన శ్రద్ధానిష్ఠలను కలిగి యుందుననియు... భయ, పక్షపాత, రాగ, ద్వేష రహితముగా రాజ్యాంగమునకు అనుగుణ్యముగా సకల జనులకు న్యాయము చేకూర్తుననియు... ప్రతిజ్ఞ చేయుచున్నాను' అనే ప్రకటన అది.

గౌరవనీయ మోడీ ఈ ప్రతిజ్ఞను ఎంత మాత్రం నెరవేర్చలేదని మనకు తెలుసు. మన జ్ఞాపకాలు యదాతథంగా ఉన్నాయి.

(మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక, కౌంటర్ కరెంట్స్ వెబ్ పత్రిక సౌజన్యంతో)

(రచయిత న్యూఢిల్లీకి చెందిన ఫొటోగ్రాఫర్, సంపాదకుడు) వీ

జీవనోపాధి, ఆహార భద్రత, జాతి ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ భూములను, వ్యవసాయేతర అవసరాలకు మళ్లించడాన్ని పూర్తిగా తగ్గించాలి. భూమి లేని వారికి భూమి పంపిణీ చేయాలి.

గ్రామీణ సాగు భూమి మార్కెట్ సరుకుగా మారి విపరీతమైన ఒడిదుడుకులకు గురవుతూ సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. వ్యవసాయేతరులు, వ్యవసాయ భూమిని కొనకుండా నిషేధం విధించాలి. భూ సేకరణ చట్టం అమలులో గ్రామ సభల భాగస్వామ్యాన్ని పెంచాలి.

మహిళలకు భూమి పట్టాలు ఇవ్వడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. హిందూ వారసత్వ చట్టం 2005ని అనుసరించి మహిళలకు భూమి పట్టాలు ఇవ్వాలి. మహిళలకు సాగుయోగ్యం కాని ప్రభుత్వ భూములను గాక సీలింగ్ అదనపు భూములను పంపిణీ చేయాలి. మహిళలను రైతులుగా, సాగుదారులుగా గుర్తించి, వారికి అన్నిరకాల సహాయ, సహకారాలు అందించేలా ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి.

రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలన్నిటికీ 421 జిఒ ప్రకారం పరిహారం చెల్లించేలా విధాన నిర్ణయం తీసుకోవాలి. ఆయా కుటుంబాలకు నెలకు రెండు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి. పరిహారాన్ని లక్షన్నర నుండి ఐదు లక్షలకు పెంచాలి. ఆయా కుటుంబాలు వ్యవసాయాన్ని కొనసాగించేందుకు, ఇతర జీవనోపాధులను ఏర్పరుచుకోవడానికి మద్దతును అందించాలి.

ఆదివాసి ప్రాంత వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఆదివాసేతరులు షెడ్యూల్డ్ ఏరియాలో భూములు కొనకుండా, కౌలు చేయకుండా నిషేధిస్తూ 1/70 చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలి. ఆ ప్రాంతాలలో రసాయన ఎరువులు, పురుగు విషాల అమ్మకంపైన, పంటల జీవవైవిధ్యాన్ని హరించే జన్యుమార్పిడి పంటలపైనా నిషేధం విధించాలి. సాంప్రదాయ ఆహార పంటల సాగుకు మద్దతు కల్పించాలి. ఆదివాసులు సాగు చేసుకుంటున్న భూములను అభివృద్ధి పథకాలకు సేకరణ చేయకుండా నిషేధించాలి. నాన్ షెడూల్డ్ ప్రాంతాలలో ఆదివాసులు ప్రధానంగా ఉన్న 800 పైబడిన గ్రామాలను షెడూల్డ్ ప్రాంతాల పరిధిలోకి తేవాలి.

విత్తనరంగంపై కార్పొరేట్ కంపనీల నియంత్రణను తొలగించాలి. విత్తనోత్పత్తి చేసే రైతులకు రక్షణ కల్పిస్తూ, విత్తన నాణ్యత, ధరలు, నకిలి విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం తదితర అంశాలకు హామీ ఇస్తూ రాష్ట్ర స్థాయిలో విత్తన చట్టం తేవాలి.

పటిష్టమైన జీవ భద్రత వ్యవస్థ అమలులోకి తీసుకురానంత వరకు జన్యు మార్పిడి పంటల క్షేత్ర ప్రయోగాలను నిలిపి వేయాలి.

లక్షలాది మంది దళితులకు, వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం భూములను అసైన్డ్ చేసింది. కానీ లబ్ధిదారులు ఆ భూముల నుండి ప్రయోజనం పొందడంలో చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. అసైన్డ్ భూములను సాగుయోగ్యంగా మార్చడానికి, కనీస సాగునీటి వసతి కల్పించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేయాలి. అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆపాలి. అసైన్డ్ భూములకు సంబంధించి వివిధ అంశాలతో సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలి.

వర్షాధార వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం, కొన్ని సాగునీటి ఆధారిత పంటలకే మద్దతు ఇచ్చే విధానాల వల్ల వ్యవసాయ సంక్షోభం పెరిగింది. వర్షాధార వ్యవసాయాన్ని పునరుజ్జీవింపచేసేందుకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి. దీని అమలు కోసం శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పరచాలి. ఈ కార్యక్రమం మెట్టపంటలను ప్రోత్సహించడం, వైవిధ్యమైన తృణ ధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సమగ్ర పంటల వ్యవస్థ, పశుపోషణ, మేత, పచ్చిక బయళ్లతో కూడిన సమగ్ర వ్యవసాయ అభివృద్ధి, తదితర అంశాలతో కొనసాగించాలి.

రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతుల్ని అందిపుచ్చుకోవడానికి తగిన ప్రోత్సాహకాల్ని, మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. రసాయనాలతో, పెద్దఎత్తున సాగించే వ్యవసాయ పద్ధతులతో సమానంగా వివిధ పంటలలో ఉత్పాదకతను సాధించడానికి ఇది చాలా అవసరం. ఇది రసాయన ఎరువుల, పురుగువిషాల, కలుపు విషాల వినియోగం గణనీయంగా తగ్గడానికి దారి తీస్తుంది. ఇది రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాక, భూసార క్షీణతను అరికడుతుంది. జీవావరణాన్ని కాపాడుతుంది

రైతులకు ఆదాయ భద్రత కల్పించాలి. వ్యవసాయ ఆధారిత జీవనోపాధులకు న్యాయమైన గౌరవ ప్రదమైన ఆదాయాలకు హామీ ఇవ్వాలి. ప్రభుత్వం అన్ని పంటల న్యాయమైన మద్దతు ధరలను ప్రకటించడమే కాదు, ఆహార పంటలు పండిరచే రైతులు, కనీస మద్దతు ధరలు కచ్చితంగా పొందేలా చూడడానికి ఒక వ్యవస్థను ఏర్పరచాలి. ధరల స్థిరీకరణకు 1000 కోట్ల నిధిని ఏర్పాటు చేయాలి.

వ్యవసాయదారుల ఆదాయాలు పెరగాలంటే అనేక అంశాలు ఒక దగ్గర చేసి పరిష్కరించాలి. ఉత్పాదకాల ఖర్చు తగ్గాలి. మద్దతు ధరలు ఉండాలి. రైతు నియంత్రణలో మార్కెట్ వ్యవస్థ ఉండాలి. ఊహించని పంట నష్టానికి బీమా సదుపాయం, న్యాయమైన వడ్డీ రేట్లకు బ్యాంకు రుణాలు, ప్రకృతి వైపరీత్యాలకు సరిపడినంత నష్టపరిహారం, వీటన్నిటికీ జవాబుదారీతనం ఉన్నప్పుడే రైతు కుటుంబాలకు సరిపడినంత ఆదాయం వస్తుంది. రైతుల ఆదాయాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి కనీస ఆదాయాలకు హామీ కల్పించడానికి రైతుల ఆదాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.

గ్రామీణ ప్రాంతంలో సాముదాయిక వనరుల పరిరక్షణ యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ముఖ్యంగా బీడు భూములు, చెరువులు, బీల భూములు, చెట్లు, అడవులను గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉంచి రక్షించాలి.

ప్రస్తుతం పెద్ద డ్యాంలు, ఎత్తిపోతల పథకాల మీద పెడుతున్న దృష్టిని, చిన్న, మధ్య తరహా సాగునీటి వ్యవస్థలను బలోపేతం చేయడం మీదికి మళ్లించాలి. ముఖ్యంగా ఎక్కడ సాధ్యమైతే అక్కడ చెరువుల వ్యవస్థను పునరుద్ధరించాలి. రైతులకు, అత్యధిక సాగునీరు వాడుకునే పంటలకు, సాగునీటి వినియోగ పద్ధతులకు భిన్నంగా ఇప్పుడున్న ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నీటిని చెరువులను నింపడానికి ఉపయోగించాలి. ఈ క్రమం భూగర్భ జల మట్టాలను పెంచుతుంది. వ్యవసాయ విద్యుత్ అవసరాలను సోలార్ విద్యుత్‌తో నెరవేర్చడానికి ప్రభుత్వం తగినంత పెట్టుబడులు పెట్టాలి.

చిన్న సన్నకారు రైతుల ప్రయోజనాలను దెబ్బ తీసే చిల్లర వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

(రచయిత్రి రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్) వీ

తెలంగాణ ఉద్యమంలో ఎన్‌జిఒల ప్రమాదం

ఎక్కడైతే ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటారో అక్కడ ఎన్‌జిఒలు ప్రవేశించి ప్రజల పోరాట పటిమను బలహీనం చేసి వ్యవస్థపై భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తాయని అంటున్నారు **నలమాస కృష్ణ**

రైతు ఒకనాడు విత్తనాల కోసం పట్టణం వెళ్తుండగా బస్సులో దొంగ రైతు జేబులో ఉన్న రు. 5,000 కొట్టేశాడు. బస్సు దిగగానే జేబులోని డబ్బు పోయిందన్న విషయం తెలుసుకున్న ఆ రైతు లబోదిబోమని మొత్తుకున్నాడు. ఇంతలో వెనుక నుండి పెద్ద అరుపుతో ఎవరు తీశారో చెప్పండని దొంగే ఎవడ్రా దొంగా? అని అల్లరి చేసి చివరికి దొంగెవరో తేలకుండా కథ ముగిస్తాడు ఆ దొంగ. దొంగే దొంగని పట్టుకునే అద్భుత నటనకు, చాకచక్యానికి ముగింపుగా ఆ రైతు తిరుగు ప్రయాణం ఖర్చుల కోసం వంద రూపాయలిస్తాడు ఆ దొంగ. పాపం ఆ రైతు దొంగ చూపిన ఔదార్యానికి సంతోషపడి నీ కడుపు చల్లగుండ, నీలాంటివాడు ఊరుకొక్కడున్నా దేశంలో మానవత్వం మిగిలి ఉంటుంది. నీ బాంచన్! చచ్చి నీ కడుపున పుడతా! అని దండంపెట్టి వచ్చిన తొవ్వలో ఏడ్చుకుంటూ ఇంటిదారి పడతాడు.

ఇప్పుడు మన రాజకీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న తీరు అలానే ఉంది. ఇంకా దోపిడీ వర్గాలు ప్రజలను పీడించడానికి, పాలించడానికి ఏమేమి చేయగలవో వాటి బహు రూపాలు ప్రజలకు బాగా తెలుసు. మనకు తెలిసిన వాటికి కొత్త ముసుగులేసుకుని ఎలా రావాలో పార్టీలకూ తెలుసు. ఇదీ సైకిల్ చక్రంలా తిరుగుతూ జరుగుతూనే ఉంటుంది. రూపం వేరైనా అంతస్సారంలో దోపిడీ, పీడన, ఆధిపత్యాన్ని కొనసాగించడమే పాలకవర్గాలకు ముఖ్యమైన అవసరం.

ఊసరవెల్లిలా ఎన్నో రూపాలను ధరించే దోపిడీవర్గాలు పరిశ్రమలు పెడతాయి. కాలుష్యాన్ని వెదజల్లుతాయి. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇస్తాయి. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొంది, రాజకీయ పార్టీలకు ముడుపులు ఇచ్చి చట్టాలనే మారుస్తాయి. అవసరమైనప్పుడు వాటినే తయారు చేస్తాయి. ప్రభుత్వాలను నిలబెడ్తాయి, కూలగొడతాయి. ఈ దోపిడివర్గాలు ఏమైనా చేస్తాయి. వారికి తిరిగి లాభించే కీర్తికోసం కేటాయిస్తాయి. కానీ దోపిడీవర్గాలు వారికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నడపడం కోసం డబ్బులెందుకు కేటాయిస్తారు? దీనికి సమాధానం చెప్పడం కొంత కష్టమే. నియమగిరి కొండల్లో ఆదివాసుల పాదాల కింద నిక్షిప్తమై ఉన్న అపారమైన బాక్సైట్ సంపదను తరలించుకొని పోవడానికి వేదాంత కంపెనీకి ఆటంకంగా ఉన్నదెవరు? దాన్ని ప్రతిఘటిస్తోంది ఎవరంటే అడవిని కాపాడడంలో రాజీలేని పోరాటం చేస్తున్న ఆదివాసులు. కానీ వేదాంత కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో కొన్ని బృందాలకు వేదాంత కంపెనీయే డబ్బు కేటాయించడాన్ని, ఆర్థిక సహాయం అందించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇది వినడానికి, చూడడానికి తెలియని వారికి కొత్తగా ఆసక్తి కలిగించే అంశమే. ఇలాంటి ఆసక్తిగొలిపే, ఒళ్లు గగుర్పొడిచే అంశాలు చాలా లోతుగా అర్థం చేసుకుంటే తప్ప, మన చుట్టూ ఉన్న ప్రపంచం అర్థం కాదు.

20సంవత్సరాల క్రితం చదువుకున్న వాళ్లను నమ్మొద్దని అనుకునే పెద్దవాళ్లకు భయాలు ఉండేవి. చదువుకున్నోళ్లు వాళ్లకున్న తెలివితోని మోసం చేస్తరని వారి అభిప్రాయం. అది పూర్తిగా కరెక్ట్ కాకపోవచ్చు. కానీ ఆ చదువుకున్న తెల్లబట్టల వారిపట్ల వారు ఆ అవగాహనను స్థిరీకరించుకోవడానికి కారణాలు ఉన్నాయి.

తెల్లబట్టలోల్లను చూసి ఏజెన్సీలోని లోతట్టు ప్రజలు ఇప్పటికీ భయపడ తారు. సరిగ్గా తెలంగాణ ప్రజలు ఇలాంటి పరిస్థితిని మరో కొత్తరూపంలో ఎదుర్కోబోతున్నారు. ఇది చెప్పడానికే పై ఉపోద్ఘాతమంతా చెప్పవలసి వచ్చింది.

నియమగిరిలో బాక్సైట్ తవ్వకాల కోసం లక్షల మంది ప్రజలను నిర్వాసితులను చేస్తున్న వేదాంత అనే బహుళజాతి కంపెనీ కోట్లు ఖర్చు చేసి ఉద్యమాన్ని నడిపించాలని చూసినట్టే తెలంగాణలో కూడా నూతన శకం ప్రారంభమైయింది. ప్రపంచ గుత్తసంస్థలు, బహుళజాతి కంపెనీలకు తమ దోపిడీ నిరాటంకంగా సాగడానికి అనుకూల పరిస్థితి ఉండాలి. గనుల ద్వారా, నదుల ద్వారా, అట ద్వారా సహజ సంపదను కొల్లగొట్టి పర్యావరణాన్ని నాశనం చేస్తున్న కార్పొరేట్ దోపిడీ శక్తులను ప్రజలు ప్రశ్నిస్తారు, ప్రతిఘటిస్తారు. అందుకే వారికి ప్రతిఘటించే ప్రజా పోరాట శక్తిని బలహీనపరిచే గొప్ప సాధనాలు కావాలి. ఆ సాధనాలు ఎల్లవేళలా వారి దోపిడీ సామ్రాజ్యాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించడానికి ఆల్సేషియన్ (జర్మనీ) డాగ్‌లాగా పనిచేస్తాయి. అవే ఎన్‌జిఒ'లు (నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్)

ఎన్‌జిఒలు ప్రజాసేవ ముసుగేసి ప్రజలకు సేవ చేస్తాయి. పోరాటం ముసుగు వేసుకుని పోరాటం చేస్తాయి. ఎప్పటివరకంటే వాటికి నిధులు ఇస్తున్న బహుళజాతి సంస్థల అవసరాలు ఉన్నంత వరకూ మాత్రమే.

భారతదేశంలో దాదాపు 22 లక్షల ఎన్‌జిఒలున్నాయి. వీటిలో విద్య, వైద్య, సంక్షేమం, చిన్నపిల్లలు, కార్మికులు, మహిళలు, ముస్లింలు, దళితులు, ఆదివాసులు మొదలైన అనేక రకాల ప్రజల సామాజిక, రాజకీయార్థిక అంశాలపై పనిచేసే ఎన్‌జిఒలు ఉన్నాయి. దాదాపు సంవత్సరానికి వేల కోట్ల రూపాయలు ఇవి విదేశీ, స్వదేశీ సంస్థల నుండి దండుకుంటు న్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఈ లక్షలాది పరాన్నబుక్కులకు ప్రజల ఆకలే పెట్టుబడిగా మారుతోంది. పేదరికం, నిరక్షరాస్యత, అంటరానితనం, వివక్ష, అణచివేత, కులం, మతం, దోపిడీ పీడన మొదలైన సామాజిక అణచివేతల రుగ్మతలే ఎన్‌జిఒలకు పెట్టుబడి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజల దుర్భర దారిద్ర్యం, వెనుకబాటు తనం, ఆకలి, ఆవేదనే ఎన్‌జిఒలకు సామాజిక పునాది. ఈ పునాదినే ఉపయోగించుకొని అన్ని రంగాల్లోకి ప్రవేశించి సమాజాన్ని ప్రభావితం చేయడంలో క్రియాశీలకంగా పని చేస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతున్న సందర్భంలో సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదారులు అప్రమత్తం అయ్యారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి కావలసిన అనుకూల పరిస్థితులను తయారు చేసుకునే ప్రయత్నంలో ఎంఎన్‌సిలు వాటి ఏజెన్సీలు ముమ్మర

ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. తెలంగాణలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితిపై సామ్రాజ్యవాదులకు స్పష్టమైన అవగాహన ఉంది. అపారమైన ఖనిజ సంపద, నిక్షేపాలు, సహజ వనరులున్న తెలంగాణ ప్రాంతాన్ని దోచుకునే క్రమంలో సంపన్న వర్గాలకు తెలంగాణ ప్రజల రాజకీయ చైతన్యం తప్పకుండా వారిని నిరోధిస్తుందని తెలుసు. అందుకే ప్రజల రాజకీయ చైతన్యాన్ని దారి మళ్లించే కుట్రలు ప్రారంభమయ్యాయి.

ఈ కుట్రలో భాగంగానే తెలంగాణ విద్యావంతుల వేదిక, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్, యాక్షన్ ఏయిడ్ అనే మూడు సంస్థలు కలిసి (డెమొక్రసీ డైలాగ్స్ పేరుతో) మార్చ్ 7 నుండి 10వ తేదీ వరకూ తెలంగాణ రాజధానిలోని నాలుగు నక్షత్రాల హోటల్‌లో నాలుగు రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించాయి.

21వ శతాబ్దంలో సోషలిజం సాధించడం ఎలా అనే సైద్ధాంతిక ప్రశ్నతో 'ప్రజాస్వామ్యం-సోషలిజం' అనే అంశంపై ప్రారంభమైన సెమినార్ చివరికి 'లాటిన్ అమెరికా తోవలో తెలంగాణ నిర్మాణం' జరగాలని పిలుపునిచ్చింది. ప్రపంచంలోని పలు దేశాల నుండి అనేక మంది ప్రతినిధులు, ఈ దేశంలోని బూర్జువా కమ్యూనిస్టు పార్టీలు, దిగజారిపోయిన విప్లవకారులు, ఉదారవాద మేధావులు అనేక మంది ఈ సదస్సులో పాల్గొన్నారు. ఇలాంటి సదస్సులు సామ్రాజ్యవాదులు నిర్వహించడం కొత్త కాదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించడం ఒక ప్రత్యేకత. ఇది పెట్టుబడికున్న ప్రత్యేక శ్రద్ధను తెలియజేస్తుందని అనడానికి సదస్సును కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి ప్రారంభించడమే తార్కాణం.

ప్రకాశ్‌కారత్, జైపాల్‌రెడ్డి ఇద్దరూ కూడా సామ్రాజ్యవాదాన్ని, దాని ఎజెండా ఫలితాలను తూర్పారబట్టారని పత్రికలు ఘోషించాయి. జైపాల్‌రెడ్డి పెట్టుబడిదారీ వ్యవస్థ రద్దు కావాలని కోరడం, సమసమాజ స్థాపన జరగాలని భావించడం....ఇంతకన్నా హాస్యాస్పదమేముంటుంది? ఆయన ఆ సదస్సును ప్రారంభించడాన్ని బట్టే దీని వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను వ్యక్తం చేస్తుంది.

నాలుగు రోజులు అంతర్జాతీయ సెమినార్ ఎటువంటి సంకేతాలు ఇవ్వదలచుకుందో చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ ప్రాంతానికి సుదీర్ఘమైన పోరాట చరిత్ర ఉంది. కేవలం పోరాట చరిత్రే కాదు ఆ అనుభవాల నుండి ప్రత్యామ్నాయమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నమూనా ఎలా ఉండాలో కూడా స్పష్టత ఉంది. 60 సంవత్సరాల క్రితం గ్రామరాజ్య కమిటీలు నిర్మాణం చేసుకున్న ప్రజలు నైజాం నిరంకుశ పాలన స్థానంలో తమదైన అధికారాన్ని స్థాపించారు. అది చాలా తాత్కాలికమే కావచ్చు. బీజ ప్రాయమే కావచ్చుగానీ భారతదేశంలో ఆనాటికి అదే మొట్టమొదటి ప్రజా ప్రత్యామ్నాయం. ఆ తరువాత వచ్చిన ప్రజా ప్రత్యామ్నాయాలకు కూడా తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ ప్రాంతానికున్న సుదీర్ఘమైన పోరాట చరిత్రతో పాటు అనేక ప్రత్యేకతలున్నాయి. దీని నుండి గడించిన అనుభవాలే ఈనాడు తెలంగాణ ప్రాంతానికి దిశ - దశను చూపించగలవు. అది ఏ మార్గంగుండా ప్రయాణించాలనేది ఏ వర్గం ఆ వర్గ ప్రయోజనాలను బట్టి కోరుకుంటు న్నాయి. అందుకే నాలుగు రోజుల సదస్సు లాటిన్ అమెరికా దారి తెలంగాణకు చూపించాలని భావించింది. ఈ భ్రష్టుపట్టిపోయిన దుర్మార్గపు రాజకీయ వ్యవస్థ స్థానంలోకి కొద్దిమంది లేదా చిన్న సమూహాలు వచ్చి చేరితే అంతా సర్దుకుని ప్రజాస్వామ్యం పెదవిల్లుతుందని సిద్ధాంతీ కరించడం కన్నా కుట్ర మరొకటి ఉండదు. తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకునే తీరు భవిష్యత్ గురించి మేథోమథనం జరుపుతున్న క్రమంలో ఆలోచనలను పక్కతోవ పట్టించే ప్రయత్నాన్ని ప్రతి తెలంగాణ బిడ్డ ఖండించి తీరవలసిందే.

సమాజాన్ని పట్టి పీడిస్తోన్న వేదాంత, ఎస్సార్ లాంటి బహుళజాతి సంస్థలకు, సామ్రాజ్యవాదులకు, సంపన్నవర్గాలకు ఇప్పుడు 'ప్రజాస్వామ్యం - సోషలిజం' ఎందుకు గుర్తొచ్చాయి? ఒకవైపున దేశవ్యాప్తంగా ఆదివాసులను, దళితులను నిర్వాసితం చేస్తున్న ఈ గుత్తసంస్థలు నియంతృత్వానికి, హక్కుల హననానికి కేంద్ర బిందువుగా ఉన్నాయి. అకస్మాత్తుగా వీరికి మానవహక్కులు ఎందుకు గుర్తొస్తున్నాయి? ఎంఎన్‌సిల నిధులతో వారి ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలు నెరవేర్చడానికి కార్యక్షేత్రం సిద్ధం చేసే ఎన్‌జిఒలు సైద్ధాంతిక చర్చలు నిర్వహించడం ఊహకందనిది కాదు. ఇలాంటి ప్రయత్నాలు గతంలో అనేకం జరిగినాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు పెద్దఎత్తున ముందుకొస్తున్న క్రమంలో లేదా అటువంటి అవకాశాలు ఉన్నప్పుడు ప్రజా పోరాటాలను, నిజమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజలకు అందకుండా చూసేందుకు పోరాట గమనాన్ని గతితప్పిం చేందుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఎన్‌జిఒలు ముందుకొస్తాయి.

ఈ సంస్థల ద్వారా టీనా సిద్ధాంతాన్ని వివిధ ఉద్యమశక్తుల్లో చొప్పిం చడం, రెండు విప్లవ ప్రత్యామ్నాయాన్ని బలపరచకుండా ఆలోచించ కుండా చేయడం. వీరి దీర్ఘకాలిక లక్ష్యాలు ఈ ప్రధాన లక్ష్యాలతోని సామ్రాజ్యవాద అనుకూల భావ ప్రచార ఎన్‌జిఒలు ప్రచారం సాగకుండా 2001లో భారీ ఎత్తున సామ్రాజ్యవాద సంస్థలు ఆసియా సోషల్ ఫోరం, అనంతరం 2004లో ముంబాయిలో వరల్డ్ సోషల్ ఫోరం నిర్వహించాయి. పూర్తిగా ఎంఎన్‌సిలు, పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక సహాయంతో నిర్వహించబడ్డ ఈ సమావేశాలకు ప్రకటిత, అప్రకటిత ఎజెండాలు ఉన్నాయి. ఏ వర్గానికి, ప్రాంతానికి, సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహించే వారెవరైనా వారి ఆలోచనలను ప్రకటించవచ్చు. సిద్ధాంతాలను ప్రతిపాదించవచ్చని సామ్రాజ్యవాద ఫోరంలు ప్రకటించడం ఒక ఎత్తుగడ మాత్రమే. ఏ సమస్య అయినా కేవలం చర్చలు, సంప్రదింపుల ద్వారానే పరిష్కారం అవుతుందనే సైద్ధాంతిక మార్గం వైపు మరల్చడం ఇటువంటి వేదికల అసలు లక్ష్యం.

ఎక్కడ పోరాటముంటే అక్కడ గద్దల్లా వాలిపోయే ఎన్‌జిఒలు భారతదేశంలో 22 లక్షలున్నాయి. వీటిలో విదేశీ నిధులు సామ్రాజ్యవాద కంపెనీల నుండి సంవత్సరానికి 50 లక్షల కోట్ల రూపాయల పైనే నిధులు పొందుతున్నాయి. ప్రజల భాషే మాట్లాడుతూ, ప్రజల భావోద్వే గాలతో భాగం అవుతూ, ప్రజాపోరాటాలను ఎలా పక్కదోవ పట్టించవచ్చో ఎన్‌జిఒలు నిర్దేశిత లక్ష్యాలు వాటి ఉద్యమాల చరిత్రను కొంచెం గమనిస్తే అర్థం కాగలదు. హోటల్ కత్రియాలో నాలుగురోజుల అంతర్జాతీయ సెమినార్‌లో ప్రధానమైన ఎన్‌జిఒ సంస్థ అయిన యాక్షన్‌ఏయిడ్ (డెమొక్రసీ డైలాగ్) ఈ సంస్థ పేదరిక నిర్మూలన కోసం పని చేస్తుంది. గత 25 సంవత్సరాల్లో ఈ సంస్థ వివిధ కంపెనీల నుండి సంవత్సరానికి 15 నుండి 20 కోట్ల చొప్పున దాదాపు 400 కోట్లు తెచ్చింది. దీనికి పెట్టుబడి తెలంగాణలోని పేదరికం. డబ్బు తెచ్చింది, స్వాహా చేసింది మాత్రం ఆంధ్రా ఆధిపత్య కులాల్లోని సంపన్నులు.

ఈ సంస్థ భద్రాచలం ఏజెన్సీలో పోలవరం బాధితుల తరపున కూడా పోరాటం చేయడం మరో విశేషం. పెట్టుబడిదారుల నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి ప్రజాసేవ ముసుగేసుకున్న ఈ సంస్థలు చేపట్టే కార్య క్రమాలు చాలా ఆకర్షణీయంగానూ, అవసరంగానూ, అనివార్యం గానూ కనిపిస్తాయి. ఆ స్థితిలో సరైన రాజకీయ ప్రత్యామ్నాయం అందక పోవడం ఓ ప్రధానమైన కారణమే కానీ, అందకుండా చేయడం ఎన్‌జిఒల

విశాల ఎజెండాల భాగమే. పోలవరం ముంపు ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న అనేక ఆదివాసి, విప్లవ, నిర్వాసిత వ్యతిరేక పర్యావరణ సమస్యలు ఎదుర్కొంటున్న సమస్యలే ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఆ ముంపు ప్రాంతంలో పనిచేసే వారికి అక్కడున్న రాజ్య నిర్బంధం దృశ్య ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. వోటర్ ఐడి కార్డు, లేదా రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ కాదు రాజ్య ఆమోదిత పత్రం, పోలీసు అనుమతి పత్రం పొందాలి. ఈ దేశంలో ఈ అనుమతులు పొందడం ప్రజల పక్షాన పోరాడే సంస్థలకు, అందునా భద్రాచలం ప్రాంతంలో సాధ్యమే కాదు. ఇదే కోణంలో ప్రవేశించిన ఎన్‌జిఒలు అక్కడ బాధితుల, నిర్వాసితుల, ప్రతి పార్శ్వాన్ని రికార్డ్ చేసి లాభాలుగా, మరింత లాభాలుగా మలచుకుంటాయి. ఉద్యమ సంస్థలకన్నా మిక్కిలిగా ప్రోగ్రెసివ్ ఫోజ్ పెడతాయి.

వామపక్ష పదజాలం, ప్రజల నాడి, సామ్రాజ్యవాద పెట్టుబడి కలసి రాజ్య ఆమోదిత పోరాటంగా అర్థించి చివరిదాకా ప్రజలను భ్రమల్లో ఉంచే ప్రయత్నాలను ఈ సంస్థలు చేయగలుగుతున్నాయి. అర్జీలు, విజ్ఞాపనలు, సావనీర్‌లు, పేపర్లలో ఫోటోలతో ఇలా కాలం గడిపి, ఇక క్రమంగా నిర్వాసితులకు సరైన, న్యాయమైన నష్ట పరిహారం అనే నినాదాన్ని ఎత్తుకుంటున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఎలా నిర్మించుకోవాలనేది ఇప్పుడు విస్తృతంగా జరుగుతున్న చర్చ. తెలంగాణ రాష్ట్రం నాలుగు కోట్ల జనాభా కలిగిన పది జిల్లాల పాలనా పరమైన ఒక రాష్ట్రం మాత్రమే. భారత విదేశాంగ విధానం నుండి మొదలుకుంటే ఆర్థిక రాజకీయ విధానాలు కేంద్రానికి లోబడే ఉంటాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే తెలంగాణ ఉద్యమంలో వివిధ వర్గాల ప్రజలు లేవనెత్తిన మౌలిక అంశాలు ప్రస్తుత రాజకీయ వ్యవస్థ పరిష్కరించలేనివి చాలా ఉన్నాయి. కాబట్టి ప్రజల అవసరాలు, ఆకాంక్షలు, హక్కులు సాధించడానికి సంస్కరణలను ఏకైక మార్గంగా చూపించే ప్రయత్నాలను వ్యతిరేకించాలి. వ్యవస్థ మౌలిక మార్పుకోసం జరిగే వర్గ పోరాటాలను దెబ్బతీసే ఎన్‌జిఒల కుట్రలను గట్టిగా తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రగతిశీల విప్లవ శక్తులపైనే ఉంది.

రూపంలో అనుమానపడడానికి వీలులేని పరిస్థితిని ఏర్పరచుకున్న దళారీ పెట్టుబడిదారులు, ఏజెంట్లు, ప్రజలు ఆ ప్రజా పోరాటంలతో అభివృద్ధి చేసుకున్న మేధావులను సైతం మింగుతున్నారు. ఎన్‌జిఒలు నిర్వహించే కుహనా సోషలిజం చర్చల్లో భాగం కాకుండా పోతే ప్రజా చైతన్యంలో లోటు వస్తుందని భావించే స్వీయాత్మక స్థితిని మేధావులను ఎన్‌జిఒలు నెట్టివేస్తున్నాయి. ఫలితంగా విప్లవ వేదికల మీద ప్రసంగాలు ఇచ్చే వాళ్లు కూడా జైపాల్‌రెడ్డి లాంటి దళారీ పాలకులు నిర్వచించిన సోషలిస్టు వ్యవస్థలపై అదే వేదిక నుండి వ్యాఖ్యానాలిస్తున్నారు.

'చిన్న ఆర్థిక, రాజకీయ అవసరాల కోసం, కీర్తి కోసం ఏ రూపంలో నైనా మేధావులు ప్రజా పక్షాన్ని వీడినా అది ప్రజలకు తీరని నష్టాన్ని కలిగిస్తుంది. ప్రజలు అశేషమైన త్యాగాలతో, పోరాటాలతో నిర్మించుకున్న చరిత్ర నుండి ఉద్భవించిన మేధావులు మాత్రం ఈ సంగతి మరచి పోరాదు. ఉద్యమ క్రమంలో ఎన్నో సందర్భాల్లో ఆధిపత్య వర్గ రాజకీయాలను విస్పష్టంగా విమర్శించిన వారు ప్రజా మేధావులుగానే ఉంటే నమ్ముకున్న ప్రజలకు అండగా ఉండగలరు. వివిధ ఏజెన్సీల ద్వారా సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను బలహీన పరచడం, పక్కతోవ పట్టించడం, అణచివేయడం, గందరగోళ పరచడం అనే బహుముఖ పద్ధతిని అమలు చేస్తుంది.

ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణ క్రమంలో ఎన్‌జిఒల చొరబాటును ప్రజా ఉద్యమాలు భావజాల పరంగా గట్టిగా ఎదుర్కోగలగాలి. ఆదివాసీల పేదరికం, విద్య, వైద్యం గురించి పరిశోధన చేస్తున్న ఎన్‌జిఒలు, మహిళా, దళిత, ముస్లింల సమస్యలపై పరిశోధన చేస్తున్న ఎన్‌జిఒలు పెట్టుబడిదారీ విధానంపైగానీ, ఎమ్‌ఎన్‌సిల దుర్మార్గపు, అమానవీయ దోపిడీపై ఎందుకు మాట్లాడవు? వాటిపై ఎందుకు పరిశోధనలు చేయవు? వీటన్నింటికీ ఎన్‌జిఒలు జవాబు చెప్పవు. నిత్యం సామాజిక సేవే జీవిత లక్ష్యంగా ఉన్నట్లు కనిపించే ఎన్‌జిఒలు విప్లవకారులను మైమరిపించే ఆదర్శాన్ని ప్రదర్శించగలవు. వారి సాధారణ జీవితం వెనుక సామ్రాజ్యవాదుల దోపిడీని శాశ్వతం చేసే 'సేఫ్టీవాల్' అనే సిద్ధాంతం ఉందనే విషయం ఆయా ఎన్‌జిఒల్లో పని చేస్తున్న సాధారణ ఉద్యోగులకు తెలియదు కూడా!

కానీ ఖరీదైన బంగ్లాల్లో, కార్లల్లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ల్లో తిరగే ఎన్‌జిఒలకు వారు చేస్తున్నదేమిటో బాగా తెలుసు. ఇక్కడి ప్రజలను చూపించి వీరు పొందుతున్న కోట్ల రూపాయలకు విదేశీ పెట్టుబడిదారీ వర్గానికి మాత్రమే ఎన్‌జిఒలు జవాబుదారీ. కానీ ప్రజలకు కాదు.

సంక్షోభంలో ఉన్న పెట్టుబడిదారి విధానాన్ని శాశ్వతంగా కొనసాగించడానికి దోపిడీ వర్గం సేఫ్టీవాల్వ్ థియరీని ఆశ్రయించడం ఎప్పటి నుండో ప్రారంభం అయింది. 1980ల నుండి ఈ ప్రయోగాలు లాటిన్ అమెరికా దేశాల్లో జరిగాయి. 1990 తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఎన్‌జిఒ పెద్దఎత్తున నడుస్తుంది. రాజ్యాన్ని, దోపిడీ వ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లు వాటికి వ్యతిరేకంగా పనిని చేస్తున్నట్లు ప్రజలను భ్రమింపచేస్తున్నాయి. నిజానికి దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్న ఉద్యమాలపైనే వీటి దాడి కొనసాగుతుంది. తెలంగాణ ఉద్యమంలో ఎన్‌జిఒలు అనుసరించిన వ్యూహం ఇదే. తిరిగి ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణంలో కూడా కొత్త కొత్త పద్ధతుల్లో ఉద్యమం ముసుగులో కొత్త కొత్త ముఖాలు కనబడుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీల్లో పనిచేసి సిద్ధాంతం పట్ల విశ్వాసం సడలిన వారు మాజీ విప్లవకారులను వివిధ రంగాల్లో ప్రజా సేవ చేస్తున్న వారిని, అనేక అవకాశాలు ఎరగా చూపి ఎట్టకేలకు తనవైపు తిప్పుకోగలగడం ఎన్‌జిఒలకున్న విశిష్ట లక్షణం. సారాంశంలో దోపిడీ వర్గం ఎత్తుగడ అన్నమాట.

ఎన్‌జిఒల అవగాహన, వాటి కార్యక్రమాల గురించి మధ్య తరగతిలో చాలా భ్రమలున్నాయి. 'ఇదీ ఒక రకమైన సమాజ సేవే కదా!' అని భావించి, నమ్మే స్థితిలో చాలా మంది ఉన్నారు. ఎన్‌జిఒలను నడుపుతున్న వారి వాక్చాతుర్యం, కపటత్వం, ఆర్థిక అవసరాలు, పరాధీనత వారిని ప్రజలను నమ్మింపజేసే, భ్రమింపజేసే ప్రక్రియలో ప్రావీణ్యులుగా తయారుచేసింది. మేధావి వర్గం సామ్రాజ్యవాదానికి పెట్టుబడిదారీ వర్గానికి ఏ విధంగా మేధోపరమైన గొప్ప వనరుగా మారిందో అది ప్రజా ఉద్యమాలకు ఎలా అపకారం చేయగలదో వివరిస్తూ ప్రముఖ రచయిత మేధావి జేమ్స్ పెట్రాస్ ఇలా రాశాడు – 'నేను చిలీలో పర్యటించేటప్పుడు ఒక సంఘటన జరిగింది.

ఒక పరిశోధక సంస్థ డైరెక్టరు తమ ప్రాంతం నుంచి వాళ్ల అమ్మను శాంటియాగోకు ఆహ్వానించాడు. అతడు వాళ్ల అమ్మను రిసీవ్ చేసుకునేందుకు తన కొత్త పిగోట్ కారులో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాడు.

ఆ కారును చూసి ఆశ్చర్యపోతూ వాళ్లమ్మ 'ఇంత అందమైన కారు నీకెక్కడిది?' అని అడిగింది. 'మా సంస్థ దీన్ని కొనుక్కునేందుకు ఆర్థిక సహాయం చేసింది. నియంతృత్వాన్ని కూలదోసేందుకు నేను చేస్తున్న పరిశోధనకు నాకు ఈ కారు అవసరం' అని అతను సమాధానమిచ్చాడు.

నగర శివార్లలోని అతని ఇంటికి వచ్చాక ఆ ఇల్లు చూసి ఆశ్చర్యంతో దిగ్భ్రాంతి చెందిన వాళ్లమ్మ 'ఇంత అద్భుతమైన ఇల్లు నీకెక్కడిది?' అని

ఆధునిక దేవాలయాలు-ప్రజలకు శ్మశానాలు

అభివృద్ధి పేరుతో తొలినాళ్లలో నిర్మించిన బహుళార్థసాధక ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన ప్రజలు ఇప్పటికీ నిలువ నీడ లేకుండా ఎలా జీవిస్తున్నారో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల కూడా అలాంటి పరిస్థితులే ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు **నతాషా**

1947లో అధికార మార్పిడి జరిగి తెల్లదొరల స్థానంలో నల్లదొరలు ఢిల్లీ పీఠాన్ని అధిరోహించిన తర్వాత 'స్వతంత్ర భారతావనిని' ప్రగతి పథంలో ముందుకు తీసుకుపోవడానికి నెహ్రూ నాయకత్వంలోని పాలక వర్గాలు పెద్ద ఆనకట్టల నిర్మాణం (బహుళార్థసాధక ప్రాజెక్టులు) తప్పనిసరి అని భావించాయి. అందుకే వెంటనే బాక్రానంగల్, హీరాకుడ్ లాంటి పెద్ద ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రారంబించాయి. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో మహానదిపై హీరాకుడ్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ 1948 ఏప్రిల్ 12న ఆనాటి ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూ డ్యాం మూలంగా నిర్వాసితులైన లక్షకుపైగా ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నాడు 'స్వతంత్ర భారతదేశంలో పెద్ద ఆనకట్టలు ఆధునిక దేవాలయాల్లాంటివి. వీటి నిర్మాణం మూలంగా మీకు కష్టాలు అనుభవించాల్సి వస్తే దేశ ప్రయోజనాల కోసం మీరు త్యాగాలు చేయక తప్పదు'.

శతాబ్దాల బ్రిటిష్ పీడన విరుగుడయిందనే సంతోషం, స్వతంత్ర భారతదేశం అనే మురిపెం, తమ కొత్త పాలకులు దేశాన్నెంతో అభివృద్ధి చేస్తారనే ఊహల్లో ఉన్న ప్రజలకు ఆ రోజు నెహ్రూ చెప్పిన మాటల్లోని 'దేశ ప్రయోజనాల' నిగూఢార్థం తెలియడానికి అవకాశం తక్కువే గానీ ఆరున్నర దశాబ్దాల తర్వాత అదే హీరాకుడ్ ప్రాజెక్ట్ దగ్గర నిలబడి, మరీ ముఖ్యంగా హీరాకుడ్ నిర్వాసిత ప్రజల పక్షాన నిలబడి ఆలోచిస్తే స్పష్టంగా అర్థం అవుతాయి.

అబద్ధాలకు, అర్ధ సత్యాలకు రంగులద్ది ప్రచారం చేసే 'విషపుత్రికల్ని' ముందేసుకుని అప్పుడప్పుడు అనివార్యంగా అందులో మిణుకు మిణుకుమనే సత్యాల్ని ఏరుకుని ఒకచోట కుప్పబోసి చూస్తే 'ఆధునిక దేవాలయాల' నిజస్వరూపం ఒళ్లు జలదరించేలా ఉంది. దాన్ని చూసే ముందు అప్పటి ఒడిశా ముఖ్యమంత్రి చల్లటి మాటల్ని కూడా గుర్తు చేసుకుందాం. 1950 మార్చ్ 13న ఒడిశా విధానసభలో అప్పటి ముఖ్యమంత్రి నవకృష్ణ చౌదరి హీరాకుడ్ డ్యాం నిర్మాణ సందర్భాన్ని పురస్కరించుకుని 'ఒక కొత్తయుగం ప్రారంభమయింది రాష్ట్రంలో ప్రతి వ్యక్తి అభివృద్ధి ఫలాల్ని తప్పక రుచి చూస్తాడు' అని అన్నాడు.

హీరాకుడ్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించే నాటి అంచనాల ప్రకారం 95 గ్రామాలు ముంపుకు గురవుతాయన్నారు. చివరికి ఒడిశాకు చెందిన 292 గ్రామాలు మధ్యప్రదేశ్‌కు చెందిన 34 గ్రామాలు కలిపి మొత్తం 326 గ్రామాలు జలగర్భంలో కలిసిపోయాయి. ఒక లక్షా ఇరవై మూడు వేల ఎకరాల సాగుభూమి ముంపుకుగురయింది. 26,501 కుటుంబాలకు చెందిన లక్షకు పైగా ప్రజలు నిర్వాసితులయ్యారు.

డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న (1946 నవంబర్ 12న సంబల్‌పూర్‌లో లక్ష మంది ప్రజలు హర్తాళ్ చేశారు) సమయంలో న్యాయమైన నష్టపరిహారం ఇస్తామని మాయ మాటలు చెప్పి1894 నాటి బ్రిటిష్ వాడు రూపొందించిన భూ ఆక్రమణ చట్టానికి ఒడిశా ప్రభుత్వం 1946లో సవరణ చేసింది. 1894 చట్టం ప్రకారం డ్యాం కింద భూములు కోల్పోయిన వాళ్లకు ప్రతి ఎకరానికి 16 సంవత్సరాల కాలం పాటు అందులో పండే పంట విలువను లెక్కగట్టి నష్టపరిహారం కింద ఇవ్వాల్సి ఉండగా ఒడిశా ప్రభుత్వ సవరణ ప్రకారం ఇల్లు, భూమి, చెట్లు, చేపలు, అటవి ఉత్పత్తులు మొదలగు అన్నిరకాల నష్టాన్ని నిర్వాసితులతో ప్రభుత్వ అధికారులు చర్చించి నష్టపరిహారాన్ని నిర్ణయించాలి. ఇది కాకుండానే ప్రతీ కుటుంబానికి పది డిస్మిల్ భూమిని పట్టాతో సహా మరోచోట ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి అందమైన ఆశలన్నీ చూపి చివరికి పోరాటాన్ని నీరుగార్చి డ్యాం నిర్మాణం

అడిగింది. 'దీన్ని కొనేందుకు మా సంస్థ నాకు ఆర్థిక సహాయం చేసింది. నియంతృత్వాన్ని కూల దోసేందుకు నేను చేస్తున్న పరిశోధనకు ఈ ఇల్లు నాకు అవసరం' అని అతను సమాధానమిచ్చాడు.

వాళ్లు డైనింగ్ హాలులోకి ప్రవేశించారు. టేబుల్ మీద ఆహారం వాళ్ల కోసం ఎదురు చూస్తోంది. ఆ టేబుల్ మీద సముద్రపు చేప, కోడి మాంసం, సలాడ్, పండ్ల, ద్రాక్ష సారాయి ఉన్నాయి. ఆనందంగా తింటూ ఆమె మళ్ళీ అడిగింది. 'ఇంత మంచి ఆహారం నీకెక్కడ దొరికింది?' 'మా సంస్థ దీనికి ఆర్థిక సహాయం చేసింది. నియంతృత్వాన్ని కూలదోసేందుకు నేను చేస్తున్న పరిశోధనకు నాకు ఈ ఆహారం అవసరం'.

అప్పుడు వాళ్లమ్మ అతని చెవి దగ్గరకు లాక్కుని గుసగుసలాడుతూ ఇలా అంది – 'నియంతృత్వాన్ని కూలదోయకుండా జాగ్రత్త వహించు. లేకుంటే సర్వస్వం కోల్పోతావు నువ్వు' అని చెప్పింది. వారి సర్వస్వాన్ని కోల్పోకుండా ఉండాలంటే వ్యవస్థ మార్చగలిగే పోరాటాలు రాకుండా చూడడం వారి విద్యుక్త ధర్మం.

తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటంతో, త్యాగాలతో తమ ఆకాంక్షను సాకారం చేసుకున్నారు. అమరవీరుల ఆశయాలు సిద్ధించాలంటే దోపిడీ, పీడన, అసమానతలపై నిరంతర పోరాటం సాగించాలి. అందుకే లాటిన్ అమెరికా నమూనా తెలంగాణకు అవసరం లేదు. ఎన్‌జిఒల నాయకత్వంలో ప్రజా ఆకాంక్షలు నెరవేరతాయనేది 21వ శతాబ్ధంలోనే అతిపెద్ద అబద్ధం. తెలంగాణ ప్రజలు ప్రపంచానికి ఎన్నో పాఠాలు నేర్పినారు. ప్రపంచం నుండి నేర్చుకున్నారు. విముక్తిని సాధిస్తారు. కుహనా మేధావుల పట్ల, సామ్రాజ్యవాద ఎన్‌జిఒల పట్ల తెలంగాణ ఉద్యమం మరింత అప్రమత్తంగా ఉండాలి. దోపిడీ వర్గం కుట్రను తిప్పికొట్టడానికి సిద్ధంకావాలి.

(రచయిత తెలంగాణ ప్రజాఫ్రంట్ ప్రధాన కార్యదర్శి) వీ

పూర్తిగావించారు. తీరా ఇప్పుడు చూస్తే నిర్వాసితులైన 26,501 కుటుంబాల్లో 9944 కుటుంబాలకు మాత్రమే నామమాత్రపు నష్టపరిహారమైనా దొరికింది. మిగిలిన కుటుంబాలకు అదికూడా గతిలేదు. 702 కుటుంబాలకు మాత్రమే పది డిస్మిల్‌ల బాపతు భూమి లభించింది. వాటికి పట్టాల్లేవు. నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీల్లో సరియైన తాగునీటి సదుపాయం లేదు. కరెంట్ సదుపాయం లేదు. ఇండ్లకు పట్టాల్లేవు. ఈమాత్రపు డిమాండ్ల కోసం నువాఖిండ గ్రామస్తులు 1957 నుండి ఇప్పటివరకు తహసిల్దార్ నుండి మొదలుకొని ముఖ్యమంత్రి వరకు ప్రతీఏటా అర్జీలు ఇస్తూనే ఉన్నారు. ధర్నాలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఏ ప్రభుత్వ అధికారిగానీ, రాజకీయ నాయకుడుగానీ పట్టించుకున్నది లేదు.

ఈ సందర్భంగా రేంగాలి డ్యాం గురించి కూడా కొన్ని వివరాలు చూద్దాం. ఎందుకంటే అది కూడా ఆధునిక దేవాలయమే గనుక. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా ప్రజల నిరసనల మధ్యనే నిర్మించబడింది. 1973 డిసెంబర్ 23న ఇందిరాగాంధీ శంకుస్థాపనతో ఈ జలసమాధి నిర్మాణం మొదలై 1980 తర్వాత పూర్తయింది.

ఈ ఆధునిక దేవాలయం కింద 249 గ్రామాలు, 10,893 కుటుంబాలు, 1,20,594 ఎకరాల సాగుభూమి ముంపుకు గురయ్యింది. 887 కుటుంబాలకు ఇప్పటికీ ఎలాంటి నష్ట పరిహారం దొరకలేదు. రేంగాలి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజల పోరాటం ఉధృతంగా కొనసాగు తున్న కాలంలో వోట్ల పార్టీలన్నీ పోరాటాన్ని తెగ సమర్ధించాయి. ఎన్నికల్లో గెలిస్తే డ్యాం నిర్మాణాన్ని మొత్తంగానే ఆపివేస్తామని వాగ్దానాలు చేశాయి. ఈ వాగ్దానాలు చేసిన వాళ్లల్లో అప్పటి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి బిజూ పట్నాయక్, ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన నీలమణి రావుత్ రాయ్‌లు ఉన్నారు. ఎన్నికల్లో గెలిచాక ప్లేట్ ఫిరాయించి యుటర్న్ తీసుకున్నారు. 1978 మే 7న జరిగిన బహిరంగ సభలో ఇంత ఖర్చు చేసి కొంత పని జరిగాక ఆపడం బాగుండదు కాబట్టి దాన్ని పూర్తి చేద్దాం అన్నారు. ఈ సందర్భంగా బిజూపట్నాయక్ మాట్లాడుతూ 'మొదట నిర్వాసితులకు పునరావాసం కల్పించాక మీ కొత్త ఇండ్లల్లో నేను వచ్చి పొఖాల్ భాత్ (రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లుపోసి పెట్టి పొద్దున్నే ఉల్లిపాయలు కారం నంజుకుని తినడాన్ని ఒడిశాలో ఇలా అంటారు) తిన్నంకనే డ్యాం పనులు ప్రారంభిద్దామన్నాడు. మాటల తడి ఆరకముందే మూడవ రోజున డ్యాంలోకి నీళ్లు వదలడంతో ఈ హఠాత్తు పరిణామానికి ప్రజలు కట్టు బట్టలతో పారిపోయి తలదాచుకోవాల్సి వచ్చింది.

ఇంత విధ్వంసం మీద నిర్మాణమైన ఈ ఆధునిక దేవాలయాల మూలంగా ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతున్నదో పెట్టుబడిదారు లకు ఏం లాభం కలుగుతున్నదో చూద్దాం.

పోలవరం ప్రాజెక్టను జాతీయ ప్రాజెక్టగా నిర్ణయించి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, సీమాంధ్ర, చత్తీస్‌గడ్, ఒడిషా నాలుగు రాష్ట్రాల నడుమ ఆరిపోని రావణకాష్టాన్ని రగిలించింది. పెద్దసంఖ్యలో ప్రజల్ని నిర్వాసితుల్ని చేసే పర్యావరణానికి భారీ నష్టాన్ని కలిగించే భూకంపాలకు దారి తీసే కాలం చెల్లిన భారీ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడాలి. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నాలుగు రాష్ట్రాల ప్రజలు ప్రజాస్వామిక వాదులు పర్యావరణ ప్రేమికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

శవాలను పీక్కతినడానికి వాలిన రాబందుల్లాగా డ్యాం నిర్మాణ పనులు ఒకపక్క నడుస్తుండగానే మరోపక్క నదితీరంలో పెట్టుబడిదారుల కంపెనీలు వెలిశాయి. హీరాకుడ్ తీరంలో మొదట వాలిన రాబందు బిర్లా. ఇంగ్లీషోడి ఆల్కాన్ కంపెనీతో పొత్తు కలిసి హిండాల్కో పేరుతో అల్యూమినియం తయారుచేసే కంపెనీ ఏర్పరిచారు. 1958లో స్థాపించిన ఇప్పటికీ ఆసియా ఖండంలోనే అతిపెద్ద స్టీలు ఉత్పత్తిదారిగా, ఎగుమతి దారిగా కొనసాగుతోంది. దీనితోపాటు పదుల సంఖ్యలో స్టీలు, థర్మల్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పబడ్డాయి. చిపిలిమా, బుర్లా దగ్గర రెండు జల విద్యుత్ కేంద్రాలున్నాయి.

నీటి వినియోగం

డ్యాంలోని నీళ్లు ఇప్పటికే ఇరవై ఏడు కంపెనీలకు ఇస్తుండగా మరో పదిహేడు కంపెనీలకు సప్లై చేయడానికి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. డ్యాంలోని నీళ్లపై ఆధారపడి సంబల్ పూర్, బొలంగీర్, బర్గడ్, సువర్ణపూర్ రైతాంగం వ్యవసాయం చేస్తున్నారు. ప్రారంభ సంవత్సరాల్లో ఇచ్చినన్ని నీళ్లు కూడా ఇప్పుడివ్వక పోవడంతో ప్రతీ ఏటా రైతాంగం రబీ పంటకు నీళ్ల కోసం ప్రభుత్వంతో పోరాడాల్సి వస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా ఎండాకాలంలో జల విద్యుత్ కేంద్రాలకు నీరు సరిపోవడం లేదనే నెపంతో రబీ పంటకు ఇచ్చే నీటిలో కోత విధిస్తుండడంతో కాల్వ చివరి భూములకు నీళ్లందక ఏటా వందలాది ఎకరాల పంట భూములు పడావు పడుతు న్నాయి. సముద్రం తలాపున పెట్టుకుని చేప దూపకేడ్చిన చందంగా రైతుల పరిస్థితి ఉంటే ఫ్యాక్టరీల యజమానులైన కార్పొరేట్ దొరబాబులు మాత్రం ఇప్పటికే రు. 500 కోట్లకు పైగా నీటిపన్ను బకాయిలున్నప్పటికీ చుక్కనీరు కూడా కోతకు గురికాకుండా పుష్కలమైన నీటి సప్లైతో కార్ఖానాలను విస్తరిస్తూ కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈమధ్యనే బర్గడ్ జిల్లా ఆంబబానా ప్రాంతంలో రైతులు నీటిపన్ను చెల్లించలేదనే కారణంతో ప్రభుత్వ అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వమని బెదిరించారు. గుర్తింపు కార్డులు లేకుండా రైతులు తాము పండించిన ధాన్యాన్ని మార్కెట్లో అమ్ముకోలేరు. భూమిని నమ్ముకొని బురద బుక్కి భూమి నుంచి బంగారం పండించే భూమిపుత్రుల దుస్థితి ఇలా ఉండగా వందల కోట్ల రూపాయల నీటి పన్ను ఎగవేసిన కార్పొరేట్ ఘరానాల్ని పల్లెత్తుమాట అనకుండా మీ మునిపాదాలకు ముల్లంటితే మా పంటితో పీకుతాం అన్న చందంగా ఇంకా 17 కంపెనీలకు నీళ్లిస్తానని ఒప్పందం చేసుకునే ప్రభుత్వాల్ని ఏమనాలి?

కాలుష్యం

దేశవ్యాప్తంగా చర్చ జరిగిన బొగ్గు కుంభకోణంలో రాష్ట్రాల నుండి కేంద్రం దాకా ఎవరెవరి చేతులకు ఎంత మసి అంటిందో అందరికీ తెలిసిందే. ఒడిశాలో నవీన్‌బాబు కూడా తక్కువేం తినలేదు. తన చేతులకే కాకుండా మూతికి కూడా మసి ఎక్కువే అంటింది. వేదాంత, జిందాల్, కుమారమంగళం, టాటాలాంటి కార్పొరేట్ ఘరానాలంటే నవీన్‌బాబుకు ప్రాణం. బొగ్గుగనుల కేటాయింపుల్లో కేంద్రం అనుమతి నిరాకరించి నప్పటికీ వాళ్ల మేలును కోరి ప్రత్యేక సిఫారస్‌లు చేశాడు. ఈ ప్రస్తావన ఎందుకంటే హీరాకుడ్ తీరంలో హిండాల్కో సహా మరో ఎనిమిది పవర్ ప్లాంట్లన్నీ థర్మల్ విద్యుత్ కేంద్రాలే. వీటి నుండి విడుదలయ్యే కాలుష్యం వివరాలు చూద్దాం.

హిండాల్కో కంపెనీ రోజుకు 367.5 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి చేస్తూ 3,528 టన్నుల బూడిద విడుదల చేస్తుంది. భూషణ్ కంపెనీ రోజుకు 380 మెగావాట్ల కరెంట్ కోసం 3,648 టన్నులు, రాఠి కంపెనీ 20 మెగావాట కరెంట్ కోసం 192టన్నులు, ఆర్యన్ ఇస్పాత్18 మెగావాట కోసం1720 టన్నులు, డ్యాం DRI 85 మెగావాట కోసం 816 టన్నులు, విరాజ్ స్టీల్ 16 మెగావాట కరెంట్ కోసం 153.6

టన్నులు. మొత్తంగా ఎనిమిది కంపెనీలు రోజుకు 8,510 టన్నుల చొప్పున బూడిదను వ్యర్థ పదార్థంగా విడుదలవుతోంది. సంవత్సరాల తరబడి పోగవుతున్న బూడిద గుట్టలుగా మారి గాలికి, వర్షానికి కొట్టుకపోయి విపరీతమైన వాయు, జల కాలుష్యంగా మారుతోంది. జనావాసాలన్నీ బూడిదమయం అవుతున్నాయి. కార్ఖానాల నుండి వెలువడే విషపూరితమైన రసాయన వ్యర్థ పదార్థాలన్నీ యథేచ్ఛగా డ్యాంలోకి వదులుతుండడంతో డ్యాంలోని నీళ్లన్నీ విషపూరితం అవుతున్నాయి. ప్రారంభ సంవత్సరాల్లో స్వచ్ఛమైన నీళ్లతో కళకళలాడే డ్యాం ఇప్పుడు పూర్తిగా విషపూరితం అయిపోయింది. మొదట్లో ఉన్న మత్స్య సంపదలో 50 రకాల చేప జాతులు కాలుష్యం మూలంగా అంతరించి పోయాయి. సంబల్‌పూర్ పట్టణానికి మంచినీరు సప్లై చేసే పైప్‌లైన్ డ్యాంలో నుంచి ఎక్కడైతే నీళ్లను తీసుకుంటుందో దాని పక్కనే ప్యాక్టరీల నుండి వదులుతున్న విషపూరిత రసాయనిక పదార్థాలు వచ్చి చేరుతుండడంతో తాగునీరు కూడా విషపూరితం అవుతున్నది. నదుల్లోని నీళ్లపైననే ఆధారపడి బతికే గ్రామాల ప్రజలు అనేక రకాల చర్మరోగాలకు గురవుతున్నారు. వాగుల్లోని నీళ్లు తాగిన పశువులు కూడా రోగాల బారిన పడుతున్నాయి. కార్ఖానాల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాయు ధ్వని కాలుష్యం మూలంగా ముక్కు, చెవి శ్వాస సంబంధమైన జబ్బులతో బాధపడుతున్నారు.

మహానది చత్తీస్‌గడ్‌లో పుట్టి ఒడిశా గుండా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. రెండు రాష్ట్రాల ప్రజలు దీనిని జీవనదాయినిగా భావిస్తారు. చత్తీస్‌గడ్ ప్రభుత్వం మహానదిపై చిన్న పెద్ద 36 డ్యాంలను నిర్మాణం చేసింది. ఖారూన్, శివనాథ్, అర్స, హంసనాథ్ మొదలగు నదులు కూడా మహానదిలో సంగమిస్తాయి. చత్తీస్‌గడ్‌లో పారిశ్రామిక నగరాలుగా పేరుపొందిన భిలాయ్, బిలాస్‌పూర్, రాయపూర్, కోర్బ, రాయగడ్‌లల్లో అభివృద్ధి పేరుతో నెలకొల్పిన అనేక కార్ఖానాలు పర్యావరణ నియమాల్ని పాటించకుండా విచ్చలవిడిగా విడుదల చేసే వ్యర్థ పదార్థాలన్నీ పై నదుల్లోకి వదులుతుండడంతో అవన్నీ మహానదిలో చేరి కలుషితం చేస్తున్నాయి. థర్మల్ పవర్‌ప్లాంట్లు ఉన్నచోట అవి విడుదల చేసే బూడిద గాలిలో కలిసిపోయి విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. చత్తీస్‌గడ్‌లో అనాదిగా ఒక సంప్రదాయం ఉండేది. శరద్‌పూర్ణిమ రోజు పాయసం వండి పండు వెన్నెల్లో రాత్రంతా ఆరుబయట వాకిళ్లలో, ఇంటికప్పుల మీద మూతలు లేని పాత్రలలో ఉంచి తెల్లవారి తినేవాళ్లు. ఇప్పుడలా పెడితే తెల్లారేసరికి విషంగా మారుతోంది. దాంతో ఆ సంప్రదాయం కూడా కనుమరుగవుతోంది. ఈరకంగా ప్రజల జీవితాలు ఆరోగ్యపరంగానే కాక సాంస్కృతికంగా కూడా దెబ్బతింటున్నాయి.

ప్రతి ఏటా వర్షాకాలంలో కంపెనీల నుండి వెలువడే విషపూరితమైన రసాయన పదార్థాలు వర్షపు నీటితో కలిసి ప్రవహించి రైతుల పంట పొలాల్లోకి రావడంతో పొట్టకొచ్చిన వరి పసుపుపచ్చగా మారిపోయి నాశనమవుతోంది. గత సంవత్సరం అక్టోబర్ 12,13 తేదీలలో ఒడిశాలో వచ్చిన పైలిన్ తుఫాన్ సందర్భంగా హీరాకుడ్ దగ్గరి హిండాల్కో కంపెనీ నుండి లీకైన ఫ్లోరైడ్ గ్యాసు, వర్షపు నీటితో కలిసి పంట పొలాల్లోకి రావడంతో నువాజామ్డా, గుజాతల్, గుండారుపాడా, తిలేయిమాల్, గడ్‌ముండా, చమూర్ పాడా, మహ్మద్‌పూర్ మొదలగు గ్రామాల్లో వందలాది ఎకరాల పంట నష్టం జరిగింది. జార్సిగూడా జిల్లాలో వేదాంత కంపెనీ కాలుష్యంతో కురేబ్‌గా గ్రామానికి చెందిన వందలాది ఎకరాల పంట దెబ్బతిన్నది. నష్టపరిహారం ఇవ్వాలని ప్రతిఏటా రైతులు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కంపెనీ యజమాన్యాలు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై కంపెనీల కారణంగానే నష్టం జరిగిందన దానికి రుజువు ఏమిలేదు పొమ్మంటూ మొండి చేయి చూపుతున్నారు. రైతాంగం కంపెనీల మీద వేసిన వందలాది కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఒఎస్‌పిసిబి (ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు) ఇచ్చిన ఆదేశాల్ని కంపెనీలు లెక్క చేయడం లేదు. 2012 సెప్టెంబర్‌లో 'ఆన్ లాయిన్ నిఘరాని ప్రణాళిక' ఏర్పర్చాలని 29 కంపెనీలను ఆదేశించగా రూర్కేల స్టీల్ ప్లాంట్, ఎన్‌టిపిసి సెల్ పవర్ కంపెనీ లిమిటెడ్, ఆధునిక స్టీల్. భూషణ్ పవర్ ప్లాంట్, నాల్కో పవర్ ప్లాంట్, విజా స్టీల్స్, నీలాచల్ ఇస్పాత్, బిల్ట్ సేవా మొదలగు కంపెనీలు ఇప్పటికీ ఆ పరికరాన్ని ఏర్పర్చనే లేదు. కంపెనీల దాదాగిరిని అర్థం చేసుకోవడానికి ఓ చిన్న ఉదాహరణ చూద్దాం. భూషణ్ స్టీల్ లిమిటెడ్ అనే కంపెనీ ఢెంకనాల్ – అనుగుల్ జిల్లాల బార్డర్‌లో నరేంద్రపూర్ గ్రామం దగ్గర 2006లో ప్రారంభించబడి సంవత్సరానికి 31 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేస్తోంది. ఝూర్సిగూడా లేల్ కులి వద్ద మరో థర్మల్ పవర్‌ప్లాంట్ ఉంది. పర్యావరణ నియమాల్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా రక్షణ నియమాల్ని తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా దోపిడీ చేయడమే కాకుండా ప్రజలపై కార్మికులపై దాదాగిరి చేయడంలో మొదటి స్థానంలో ఉంది. నరేంద్రపూర్ దగ్గరి కంపెనీ ఏర్పడ్డనుండి ఇప్పటి వరకు 30 సార్లు ప్రమాదాలు జరిగాయి. 2013 నవంబర్ 13న ఫర్నేస్ – 2 ప్లాంట్‌లో జరిగిన భారీ పేలుడు ప్రమాదంలో 28 మంది కార్మికులు మరణించారు. మరికొంత మంది మాయమయ్యారు. యజమాన్యం మాత్రం ఒక్క కార్మికుడే చనిపోయినట్లు తప్పుడు లెక్కలు చూపించి మిగిలిన 27 శవాల్ని ఎలక్ట్రానిక్ పర్నేస్లైతో కాల్చి బూడిద చేసి ఆనవాల్లు కూడా లేకుండా చేయడంలో సఫలం అయ్యింది. ఇప్పటి వరకు ఈ కంపెనీలో జరిగిన ప్రమాదాల్లో వంద మందికి పైగా మరణించారు. అయినప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటీసులు లేకుండా కంపెనీ నిర్భయంగా నిరాటంకంగా తన లాభాలు దండుకుంటూనే ఉంది. ఇలా దాదాపు అన్ని కంపెనీల పరిస్థితి ఇదే.

ఇక కంపెనీల నిర్మాణం జరిగితే స్థానికులకు ఉద్యోగాలు దొరుకుతాయి అనేది ఎంత బూటకమో మరో ఉదహరణ చూద్దాం. ఝూరస్‌గూడా జిల్లాలో సుమారు 50కి పైగా కంపెనీలున్నాయి. ఇక్కడ 2013 నవంబర్‌లో జిల్లా స్థాయి రోజ్ గార్ మేలా జరిగింది. జిల్లా ప్రభుత్వం నిరుద్యోగులందరినీ మేళాకు రావాల్సిందిగా ప్రకటించింది. అటు 50 కంపెనీలకు ముందే సమాచారం ఇచ్చింది. వేలాది మంది నిరుద్యోగులు ఎంతో ఆశతో హాజరు కాగా కంపెనీల తరపున మాత్రం ఒకే ఒక్క కంపెనీ హాజరై 700 మంది పేర్లను నమోదు చేసుకోగా అందులో 90 మందికి మాత్రం (ఉద్యోగం కాదు సుమా) కేవలం శిక్షణనివ్వడానికి అంగీకరించింది. చివరికి రోజ్ గార్ మేళా ప్రహసనం ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండానే ముగిసింది.

నిర్వాసితులకు పునరావాసం విషయంలో గానీ, సరైన నష్టపరిహారం ఇచ్చే విషయంలో గానీ, స్థానికులకు ఉద్యోగాల విషయంలో గానీ, ఏ ఒక్క విషయంలో ప్రజలకు ప్రయోజనం కలుగక పోగా స్వచ్ఛమైన గాలి నీరు పంట పొలాలన్నీ కలుషితమై ప్రజలను మొండి రోగాలకు గురిచేసి పర్యావరణానికి ప్రాణ సంకటంగా మారిన ఆధునిక దేవాలయాల అభివృద్ధి నమూన ప్రజల పాలిట స్మశానంగానే రుజువైంది. కార్పొరేట్ శక్తులకు మాత్రం బంగారు బాతు గుడ్డుగా తేలి పోయింది. ఇలాంటి పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం పోలవరం పేరుతో గోదావరి నదిపై మరో ఆధునిక దేవాలయం నిర్మిస్తానంటుంటే చూస్తూ ఊరుకుందామా?

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

హిందూ మత చరిత్ర - వెండీ డానిగర్ పుస్తకం

నాలుగు సంవత్సరాల కోర్టు వివాదం తర్వాత పెంగ్విన్స్ ప్రచురణ సంస్థ 'హిందూ మత చరిత్ర' పుస్తకాన్ని ఉపసంహరించడం వెనుక చరిత్రను వివరిస్తున్నారు సురేశ్ కొలిచాల

ఏ ప్రాచీన నాగరికతకైనా కథలు, కథనాలు ఉంటాయి. శక్తిమంత మైన పౌరాణిక గాథలు ఏ జాతికైనా వారసత్వ సంపద. నా దృష్టిలో భారత, భాగవత, రామాయణ కథలను తరతరాలుగా చెప్పుకుంటూ వస్తున్న వారంతా హిందువులే. అయితే, ఈ ఇతిహాస, పురాణ కథల ఆధారంగా మన ప్రాచీన చరిత్రను నిర్మించుకోగలమా? ఇతర ఆధారాల ద్వారా మనకు తెలిసిన చరిత్రను ఉపయోగించి ఈ కథల్లో నిజానిజాలను, అంతరార్థాలను నిర్ధారించగలమా? ఈ విషయంపై గత 50 సంవత్సరాలు గా పరిశోధనలు చేస్తున్న ఒక శాస్త్రవేత్త అభిప్రాయాలివి:

'మనం చరిత్రనూ, పురాణాన్నీ ఒకదానితో మరొకదాన్ని అర్థం చేసుకునేటప్పుడు వాటిని ఎట్లా వాడుతామనే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అది వాస్తవం కాదని విస్తారమైన సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ ఒక ప్రజా సమూహం సుదీర్ఘకాలంగా నమ్ముతున్న కథనే పురాణం అని ఈ సందర్భంలో నేను నిర్వచిస్తాను. మనం పురాణాన్ని అర్థం చేసుకోవాలంటే చరిత్రను వాడాలి – అంటే ఒక గ్రంథం ఎలా రూపొందిందో, పదేపదే ఎలా పునరుక్తి అయిందో అర్థం చేసుకోవాలి. కాని ఆ గ్రంథం వెనుక ఉన్న వాస్తవ చరిత్రను పునర్నిర్మించడానికి పురాణాన్ని వాడుకోలేం. ఆ గ్రంథమే ఆధారమని అనలేం. అటువంటి పురాణాల సంఘటనల కన్నా ఎక్కువగా భావోద్వేగాల చరిత్రను చెప్పగలవు. చారిత్రక ఉద్యమాల కన్న ఎక్కువగా, ఆ కథలను ప్రేరేపించిన నేపథ్యాల గురించి చెప్ప గలవు.

ఈ మాటలు రాసిన పరిశోధకురాలు ప్రస్తుతం వివాదాస్పదమైన అమెరికన్ రచయిత్రి వెండీ డానిగర్. ఈ మాటలు పెంగ్విన్ – ఇండియా ప్రచురణ సంస్థ ఉపసంహరించుకున్న ది హిందూస్: యాన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ పుస్తకంలోవి. ఈ పుస్తకాన్ని నేను నాలుగేళ్ల క్రితమే చదివాను. హిందూ మత చరిత్రను కూలంకషంగా చర్చించిన ఈ పుస్తకంలో కొన్ని విషయాల్లో డానిగర్ అభిప్రాయాలతో నేను పూర్తిగా ఏకీభవించ లేను. అలాగే, కొన్నిచోట్ల ఆమె విశ్లేషించిన తీరుపై నాకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయి. ఆమె ఇచ్చిన సమాచారంలో చిన్న చిన్న పొరపాట్లు కూడా కనిపించాయి. హిందూ మతానికి ముఖ్యమైన అంశాలు కొన్నింటిని స్పృశించకుండా వదిలేయడం వల్ల ఈ పుస్తకంలో కొన్ని చర్చలు అసమగ్రమనిపించాయి.

అయితే, నాకు ఈ పుస్తకంలో హిందువులను అవమానపరిచే అంశాలు గాని, హిందూమతాన్ని పనిగట్టుకొని కించపరిచే ఉద్దేశం గాని ఏ కోణానా కనిపించలేదు. ప్రతి పేజీలోను పరిశోధకురాలు తాను ఎన్నుకున్న అంశంపై అన్ని దృక్కోణాలనూ విశ్లేషించడానికి, అన్ని ప్రత్యామ్నాయ కథనాలను వీలైనంతగా చర్చించడానికి పడే తాపత్రయమే కనబడింది. ప్రతి అంశంపై ఇప్పటిదాకా మనకు తెలిసిన సమాచారం అసమగ్రమేనని, ఇంకా ఎన్నో పరిశోధనలకు ఆస్కారం ఉందని అడుగడుగునా చెప్పుకునే సత్య శోధనా తత్పరతే కనిపించింది. విదేశీ వనితగా తాను చేసే విశ్లేషణల్లో తనకు తెలియకుండానే 'పాశ్చాత్య పక్షపాతం' చొరబడే ప్రమాదం ఉందని ఒప్పుకునే నిజాయితీ కనబడింది.

అందుకే, ఈ పుస్తకాన్ని నిషేధించాలని 'శిక్షా బచావో ఆందోళన్' అనే సంస్థ ద్వారా దీనానాథ్ బాత్రా కోర్టుకు వెళ్లాడని విని ఆశ్చర్యపోయాను. అంతేకాక, భారతదేశంలో ఈ పుస్తకాన్ని ప్రచురించిన పెంగ్విన్–ఇండియా నాలుగేళ్ల కోర్టు పోరాటం తరువాత కోర్టు వెలుపల రాజీ చేసుకొని ఈ పుస్తకాన్ని మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవాలని, మిగిలిన ప్రతులను తగులబెట్టాలని నిర్ణయించిందని విని మరింత విస్తుపోయాను.

ఎవరీ వెండీ డానిగర్?

వెండీ డానిగర్ అమెరికాలో భారతీయ శాస్త్రాన్ని గత 50 ఏళ్లుగా అధ్యయనం చేస్తున్న ప్రొఫెసర్. ఆమె న్యూయార్క్‌లో యూదుల కుటుంబంలో 1940లో జన్మించింది. ఆమె తండ్రి లెస్టర్ డానిగర్ ఒక ప్రచురణ సంస్థను నడిపేవాడు. వెండీ డానిగర్ 'సంస్కృతం – భారతీయ విద్య' అంశాలతో రాడ్‌క్లిఫ్ కాలేజీలో బి.ఎ. చేసి, అదే అంశంపై హార్వర్డ్ యూనివర్సిటీ నుండి 1963లో ఎం.ఎ., ఆపై 1963 – 64లలో ఇండియాలో గడిపి, 1968లో హార్వర్డ్ నుండే ఎసెటిసిజం అండ్ సెక్సువాలిటీ ఇన్ ది మైథాలజీ ఆఫ్ శివా పై పిఎచ్ డి. తరువాత 1973లో ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో ది ఆరిజిన్స్ ఆఫ్ హెరెసీ ఇన్ హిందూ మైథాలజీ అన్న అంశంపై డి. ఫిల్. పట్టాలు పుచ్చుకున్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో హిస్టరీ ఆఫ్ రిలిజియన్స్ విభాగంలో, విశిష్ట అధ్యాపకురాలిగా పనిచేస్తున్న వెండీ డానిగర్ హిందూ మతంపై ఎన్నో పుస్తకాలు రాశారు, అనువాదాలు చేశారు. 1975లో సంస్కృతంలోని శివపురాణ కథలకు అనువాదాన్ని, 1981లో ఋగ్వేదంలో 108 సూక్తాలకు, 1991లో మనుధర్మ శాస్త్రానికి, 2002లో వాత్సాయన కామసూత్రానికి, 2006లో హర్షుని ప్రియదర్శిక, రత్నావళి కావ్యాలకు అనువాదాలు ప్రచురించారు. మొదట్లో ఫ్రాయిడ్ సిద్ధాంతాలను ఆధారం చేసుకొని హిందూమతాన్ని, పురాణాలను విశ్లేషించిన ఆమె, ఆపై హిందూ పౌరాణిక గాథల మత, తాత్విక, తాంత్రిక విషయాలను విస్తృతంగా చర్చిస్తూ 16 పుస్తకాలు వెలువరించారు.

దీనానాథ్ బాత్రా ఎవరు?

హిందీ, ఇంగ్లిష్ టీచరుగా, ఆపై ప్రిన్సిపల్‌గా పనిచేసి పదవీ విరమణ తీసుకున్న 84 సంవత్సరాల దీనానాథ్ బాత్రా, భారతీయ విద్యాబోధనలో దుష్ట పాశ్చాత్య ప్రభావాన్ని ఎదుర్కోవడానికి 'శిక్షా బచావో ఆందోళన్'

సంస్థను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పాకిస్థాన్‌లో భాగమైన పంజాబ్ ప్రాంతంలో జన్మించిన ఈయన, స్వాతంత్ర్యం తరువాత కుటుంబంతో సహా భారతదేశానికి తరలివచ్చారు. ఇప్పటికీ ఆయన పాకిస్థాన్‌లోని చిన్ననాటి ఊరు, బడి, దేవాలయం గుర్తుచేసుకుంటూ ఉంటారు. 'వసుధైక కుటుంబకమ్', 'ఏకం సత్ విప్రా బహుదా వదంతి' వంటి ఘనమైన సందేశాలను ప్రపంచానికి అందజేసిన హిందూమతానికి ప్రపంచంలో సరైన గుర్తింపు రాకపోవడానికి పాశ్చాత్య పండితులే కారణం అని బలంగా నమ్మే బాత్రా గత 10 సంవత్సరాలలో ఎంతోమంది రచయితలను, పుస్తక ప్రచురణ సంస్థలను కోర్టుకు తీసుకెళ్లారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉన్న రోజుల్లో మానవ వనరుల శాఖ మంత్రి మురళీ మనోహర్ జోషి ఆధ్వర్యంలో నడిచే 'విద్యాభారతి అఖిల భారతీయ విద్యా సంస్థాన్' కు బాత్రా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ రోజుల్లో, ఆ సంస్థ ద్వారా కేంద్రీయ విద్యాలయాలకు పుస్తకాలు అందజేసే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాలలో వివాదాస్పదమైన మార్పులను బాత్రా ప్రవేశపెట్టారు.

ఎ.కె. రామానుజన్ రాసిన మూడువందల రామాయణాల వ్యాసాన్ని ఢిల్లీ యూనివర్సిటీ చరిత్ర పాఠ్యాంశాల నుండి తొలగించడానికి కోర్టును ఆశ్రయించిన వారిలో బాత్రా ప్రముఖుడు. కోర్టు నియోగించిన కమిటీ రామానుజన్ వ్యాసం సిలబస్‌లో ఉండాల్సిందేనని తీర్పు చెప్పింది. ఆ రోజుల్లో ఢిల్లీ యూనివర్సిటీలో హింసాకాండ, అల్లర్లు చెలరేగడమే కాకుండా, అక్కడి ప్రొఫెసర్లకు బెదిరింపు ఉత్తరాలు, ఫోన్‌కాల్స్ వచ్చాయి. చివరికి 2011లో యూనివర్సిటీ ఆ వ్యాసాన్ని తొలగించడానికే నిర్ణయించుకుంది. ఫ్రంట్‌లైన్ పక్ష పత్రికలో సాఫ్రన్ టెర్రర్ వ్యాసాన్ని ప్రచురించినందుకు ప్రచురణకర్త ఎన్ రామ్ కు బాత్రా లీగల్ నోటీసు పంపించారు. కేంద్రీయ పుస్తకాలలో అభ్యంతరకరమైన భాగాలున్నాయని ఎన్ సి ఇ ఆర్ టికి వ్యతిరేకంగా బాత్రా 10 వేర్వేరు కోర్టు కేసులు కూడా వేశారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న వెండీ డానిగర్ పుస్తకాన్ని నిషేధించాలని గత నాలుగేళ్లుగా కోర్టులో పోరాటం చేసిన బాత్రా, పెంగ్విన్ ఉపసంహరణ నిర్ణయం సంతృప్తినిచ్చిందని, ఇకపై డానిగర్ రాసిన ఆన్ హిందూయిజం వంటి ఇతర పుస్తకాలపై దృష్టి సారిస్తానని అన్నారు.

ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛ

'నువ్వు చెప్పేదానితో నాకు ఏకీభావం లేదు. కాని అది చెప్పడానికి నీకున్న హక్కును రక్షించడానికి నా ప్రాణాలైనా ఇస్తాను' అని వోల్టేర్ అన్నాడంటారు. ఎన్నో ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాంగాల్లో వాక్ స్వాతంత్ర్యాన్ని ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. అయితే, ఈ వాక్ స్వాతంత్ర్యానికి ఎంతవరకు హద్దులు ఉండాలి అన్న విషయంలో వివిధ దేశాల్లో వేర్వేరు అభిప్రాయాలు ఉన్నాయి. వాక్ స్వాతంత్ర్యానికి ఏ రకమైన హద్దులూ ఉండకూడదా? ఒకరి వాక్ స్వాతంత్ర్యం ఇతరుల మనోభావాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నప్పుడు, విద్వేషాలను, హింసను ప్రేరేపించినప్పుడు, ఆ స్వాతంత్ర్యాన్ని అరికట్టాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలకు సమాధానం వెతికే ముందు వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన చరిత్రను పరిశీలిద్దాం.

ప్రపంచంలో మొట్టమొదటి ప్రజాస్వామ్యంగా పేరొందిన గ్రీక్ నగరం ఏథెన్స్ సోక్రటీస్ సత్యం, నీతి వంటి అంశాలు సాపేక్షమని, సంక్లిష్టమైనవని, ఒకరికి నీతిగా కనిపించేది మరొకరికి అవినీతి అవుతుందని లోతైన తాత్విక చర్చలు చేసేవాడు. తత్వశాస్త్రం పేరిట యువతను అవినీతికి పురికొల్పుతున్నాడన్న నేరారోపణతో ఆ మొట్టమొదటి ప్రజాస్వామిక నగరం ఆయనకు మరణశిక్ష విధించింది. తన బోధనలతో యువతను పెడదారి పట్టిస్తున్నాడనే నేరం మోపి ఏసుక్రీస్తును శిలువపైకి ఎక్కించి చంపించింది రోమన్ ప్రభుత్వం.

గెలీలియో గెలీలీ తాను చేసిన ఖగోళ పరిశోధనల సారాంశాన్ని పుస్తకంగా ప్రచురించాడు. అందులో చంద్రునిపై కొండల గురించి, శుక్రగ్రహం కక్ష్య గురించి, గురుగ్రహానికి ఉన్న ఉపగ్రహాల గురించి, సూర్యునిపై కనిపించే మచ్చల గురించి మాత్రమే కాక, గ్రహాలు భూమి చుట్టూ కాక సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయన్న ప్రతిపాదన కూడా ఉంది. భూమి చుట్టూ అన్ని గ్రహాలూ తిరుగుతున్నాయని నమ్మే క్రిస్టియన్ మతస్థులకు ఇది చెంపపెట్టుగా తోచింది. బైబిల్‌లోని సూత్రాలను ధిక్కరించే ఈ ప్రతిపాదనలు క్రిస్టియన్ల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని, అందుకే ఆ పుస్తకాన్ని నిషేధించాలని రోమన్ చర్చ్ 1615లో నిర్ణయించింది. ఈ నిర్ణయానికి ప్రతిగా గెలీలియో తన సిద్ధాంతాలను సమర్థించుకుంటూ మరో పుస్తకం రాశాడు. ఈ పుస్తకం పోపును సూటిగా విమర్శిస్తున్నట్టుగా, క్రిస్టియన్ మతానికి తిరుగుబాటుగా భావించి రోమన్ చర్చ్ గెలీలియోకు జీవిత ఖైదు శిక్ష విధించింది.

మిగిలిన మతాలతో పోలిస్తే, ఈ రకమైన మతమౌఢ్యం భారతదేశంలో ఇంతకు మునుపు లేదు. సిద్ధాంత చర్చలు, వాదవివాదాలతో భారతీయ తాత్విక చరిత్ర అంతా నిండి ఉంది. నాసదీయ సూక్తంలో దేవుడి జ్ఞానాన్నే ప్రశ్నించే తాత్విక చింతన భారతీయ దర్శనాల్లో మొదటినుంచీ కనిపిస్తుంది. ఉపనిషత్తుల్లో ఎన్నో సంవాద వివాదాలు కనిపిస్తాయి. వేదాలను నిరసించే వ్యాఖ్యలు ఉపనిషత్తులలోను, ఇతిహాస, పురాణాలలోను కనిపిస్తాయి. వైదికమతానికి ఆవల ఉన్న బుద్ధ, జైన, అజీవక, చార్వాక మతాలు కూడా సంఘాలను, ఆరామాలను ఏర్పరచి సిద్ధాంత చర్చలు బాహాటంగా చేసేవి. శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలైనవారు కూడా ఎన్నో రోజులు వాదవివాదాల్లో పాల్గొని తమ సిద్ధాంతాలని నిరూపించుకునేవారు. బౌద్ధులకు అద్వైతులకు, న్యాయమతస్తులకు బౌద్ధులకు మధ్య కొన్ని వందల సంవత్సరాలపాటు వాద-ప్రతివాదాలు జరిగేవని చెప్పుకుంటారు. మామూలు ప్రజానీకం కూడా ఇతర మతాల పట్ల సహనంతో మెలిగేవారనే అనుకోవాలి.

ఇక, వాక్ స్వాతంత్ర్యం విషయానికి వస్తే, ఆధునిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలలో ఒకరుగా భావించే తత్వవేత్త జాన్ స్టువర్ట్ మిల్ ఇతరులను దెబ్బతీసే 'క్రియ' శిక్షార్హమైనదే అయినా, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే 'అభిప్రాయం' శిక్షార్హం కాకూడదని అంటాడు. అయితే, ఆయన దృష్టిలో ఇటువంటి అభిప్రాయ వ్యక్తీకరణ కూడా కొన్ని అరుదైన సమయాల్లో శిక్షార్హం కావచ్చు. ఒక అభిప్రాయం ప్రత్యక్ష హింసను ప్రేరేపించేదయితే మాత్రమే దాన్ని చట్టరీత్యా నేరంగా నిర్ణయించడం సబబని ఆయన అభిప్రాయం.

అమెరికా రాజ్యాంగానికి తొట్టతొలి సవరణగా 1791 డిసెంబర్ 15న ప్రకటించిన భావ ప్రకటనా స్వేచ్ఛ అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. ఫస్ట్ అమెండ్‌మెంట్ రైట్ అంటూ అమెరికన్లు గర్వంగా చెప్పుకొనే ఈ రాజ్యాంగ సవరణ, అమెరికా దేశంలో ఎదుటివారికి ప్రత్యక్షంగా హాని కలిగించనంతవరకూ ఏ రకమైన అభిప్రాయాన్నైనా ప్రకటించే హక్కును కల్పిస్తుంది.

ఈ హక్కు వల్ల అమెరికాలో పుస్తక నిషేధాలు చాలా అరుదుగా జరిగాయి. అమెరికాలో బానిసల బతుకులను బాహాటంగా వర్ణించిన హారీ బీషర్ స్టోవ్ రాసిన అంకుల్ టామ్స్ కాబిన్ పై చాలామంది కన్నెర్రజేశారు. అందులో అసత్యాలు, అభూత కల్పనలు ఉన్నాయని, దక్షిణ అమెరికా రాష్ట్రాలను ఎప్పుడూ చూడని రచయిత్రి అక్కడి బానిసల గురించి రాయడం హాస్యాస్పదమని విమర్శలు గుప్పించారు. ఈ పుస్తకం అమ్మే దుకాణాలపై దాడులు, బెదిరింపులు కూడా జరిగాయి. అయినా, ఆ పుస్తకం నిషేధానికి గురికాలేదు. అలాగే గత రెండు శతాబ్దాలలో ఎన్నో పుస్తకాలు ఎంతో వివాదాస్పదమయ్యాయి కాని నిషేధానికి గురికాలేదు. క్రిస్టియన్ మతాన్ని విమర్శిస్తూ, అందులోని ప్రత్యామ్నాయ కథనాలను వివరిస్తూ వందలకొద్ది పుస్తకాలు, వేలకొలది పరిశోధక వ్యాసాలు వచ్చాయి. ఈ పుస్తకాలపై మతానుయాయులు ఎంతగా విరుచుకుపడ్డా ఆ పుస్తకాలు మాత్రం అమెరికాలో నిషేధానికి గురి కాలేదు. చివరకు అమెరికన్ జాతీయ పతాకాన్ని కాల్చివేయడం కూడా 'భావ ప్రకటనా స్వేచ్ఛ'లో భాగమేనని 1969లోనూ, 1989లోనూ అమెరికన్ న్యాయస్థానాలు తీర్పు ఇచ్చి, అమెరికా జాతీయ జెండాను కాల్చినందుకు అరెస్టు అయిన వారిని నిర్దోషులుగా విడుదల చేశాయి.

భారతీయ శిక్షాస్మృతిలోని 295ఎ సెక్షన్ చరిత్ర

విచిత్రమేమిటంటే, భారతదేశం గురించి ఇప్పుడు పాశ్చాత్యుల కథనాలను నిషేధించడానికి భారతీయ శిక్షాస్మృతిలో తరచుగా ఉపయోగించే 295ఎ సెక్షన్ ను మొదటగా ప్రవేశపెట్టింది బ్రిటిష్ ప్రభుత్వమే. పంజాబులో 1927లో రాజపాల్ అనే వ్యక్తి 'రంగీలా రసూల్' అంటూ మహమ్మద్ ప్రవక్త శృంగార కలాపాలను వర్ణించే చిన్న పుస్తకాన్ని రచయిత పేరు లేకుండా ప్రచురించాడు. అప్పటికే పంజాబులో హిందూ – ముస్లింల మధ్య గొడవలతో శాంతిభద్రతలు కొరవడిన సమయంలో ఈ పుస్తకం మరింత అలజడిని రేపింది. 153ఎ సెక్షన్ ప్రకారం ప్రచురణకర్త రాజపాల్ పై చర్య తీసుకోవాలని కొంతమంది ముస్లింలు కోర్టుకు వెళ్లారు. సెక్షన్ 153ఎ ప్రకారం ఇప్పటికే మరణించిన వ్యక్తి గురించి రాయడం నేరం కాదని, రాజపాల్ నిర్దోషి అని న్యాయమూర్తి దిలీప్ సింగ్ నిర్ణయించాడు. అయితే, అదే తీర్పులో మతపరమైన ఉద్రేకాలను రెచ్చగొట్టే అభిప్రాయాలు, పుస్తకాలు, కరపత్రాలు శిక్షార్హం చేయడానికి సెక్షన్ 295కు సరికొత్త క్లాజును జత చేయాలని సూచన కూడా చేశాడు. ఈ నిర్ణయం వెలువడిన తరువాత లాహోర్‌లో అల్లర్లు చెలరేగాయి. ఈ పుస్తకాన్ని ప్రచురించిన రాజపాల్ 1929లో హత్యకు గురయ్యాడు. దాంతో బ్రిటిష్ ప్రభుత్వం ఈ విషయాన్ని పునః సమీక్షించాలని ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దిలీప్ సింగ్ చేసిన సూచన ప్రకారమే సెక్షన్ 295కు సరికొత్త క్లాజును జత చేయమని సిఫారసు చేసింది. అయితే, ఈ కమిటీ సభ్యులలో ఒకరైన మహమ్మదాలీ జిన్నా, సెక్షన్ 295ఎ ను మతపరమైన దాడులను ప్రత్యక్షంగా రెచ్చగొట్టే అభిప్రాయాలకే తప్ప చారిత్రక దృక్పథాలను పరిశీలించే వారికి, మతాన్ని పరిశోధించే వారికి వర్తింపజేయకూడదని అన్నాడు.

అయితే, బ్రిటిష్ పాలనలోనూ, ఆ తరువాతి కాలంలోనూ పై సూచనను పెడచెవిన పెట్టి 295ఎ సెక్షన్ ఆధారంగా ఎన్నో పుస్తకాలను నిషేధించారు. రషీద్ జహాన్ రచించిన అంగారే లో కథలు ఇస్లాం మత గురువులను కించపరిచే విధంగా ఉన్నాయని 1932లో నిషేధించారు. మాక్స్ వైలీ రాసిన హిందూ హెవెన్‌ను 1934లో, ఆర్థర్ మైల్స్ రాసిన ది లాండ్ ఆఫ్ ది లింగంను 1937లో హిందూ మతస్తుల మనోభావాలు దెబ్బ తీస్తున్నాయని నిషేధించారు.

స్వతంత్ర భారతంలో కూడా ఇదే విధమైన నిషేధాలు కొనసాగాయి. ఆబ్రే మీనన్ రామాయణ కథను వ్యంగ్యంగా చిత్రిస్తూ రాసిన రామా రిటోల్డ్ 1954లో నిషేధానికి గురైనది. సల్మాన్ రూష్దీ రాసిన ది సాటానిక్ వర్సెస్ ని ఇదే సెక్షన్ ఉపయోగించి భారత ప్రభుత్వం 1988లో నిషేధించింది. ఈ పుస్తకాన్ని నిషేధించిన మొట్టమొదటి దేశం భారతదేశమే. రూష్దీదే మరో రచన, ది మూర్స్ లాస్ట్ సైలో బాల్ ఠాకరేతో సహా పలు రాజకీయ నాయకులను వ్యంగ్యంగా చిత్రించాడని భారత ప్రభుత్వం ఆ నవలను కూడా 1995లో నిషేధించింది.

గత 20 సంవత్సరాల్లో ఈ సెక్షనును ఉపయోగించి ఎన్నో పరిశోధనాత్మక మైన పుస్తకాలను కూడ హిందుత్వ వాదులు నిషేధింప జేయగలిగారు. శివాజీపై పరిశోధించి జేమ్స్ లేన్ రాసిన శివాజీ: హిందూ కింగ్ ఇన్ ఇస్లామిక్ ఇండియా (2003)లో శివాజీ జననం గురించి రాసిన కథనంపై పెద్ద దుమారం చెలరేగింది. శివసేన కార్యకర్తలు పూణేలో ఆయన పని చేసిన భండార్కర్ ఓరియెంటల్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ పై దాడి చేసి విలువైన తాళపత్ర గ్రంథాలను నాశనం చేశారు. శంభాజీ బ్రిగేడ్ అనే మరో సంస్థకు చెందినవారు లేన్ కు సహాయం చేసిన సంస్కృత పండితులపై దాడిచేశారు. ఈ పుస్తకాన్ని 2004లో మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. భారత సుప్రీంకోర్టు 2010లో ఈ నిషేధాన్ని తొలగించింది.

ద్విజేంద్ర నారాయణ్ ఝా 2003లో రాసిన ది మిథ్ ఆఫ్ ది హోలీ కౌ పెద్ద సంచలనాన్ని రేపింది. వైదిక బ్రాహ్మణులు ఆవుమాంసం తినేవారని ఆధారాలతో నిరూపించిన ఈ పుస్తకాన్ని హైదరాబాద్ సివిల్ కోర్టు నిషేధించింది. ప్రముఖ భారతీయ క్రికెటర్ రవిశాస్త్రి 2006లో ప్రత్యక్ష్య వ్యాఖ్యానం చేస్తూ తను బ్రాహ్మణుడే అయినా, తనకు బిల్ తాంగ్ అన్న వంటకం చాలా ఇష్టమని చెప్పుకుంటే, బిల్‌తాంగ్ ఆవు మాంసంతో చేస్తారు కాబట్టి ఈ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీశాయని ఇదే సెక్షన్ కింద ఆయనపై కోర్టులో కేసు వేశారు.

బాల్ ఠాకరే మరణించినప్పుడు ముంబైలో బంద్ నిర్వహిస్తే షాహీన్ దాదా అనే 21 సంవత్సరాల యువతి ' ఠాకరే వంటి మనుషులు రోజూ పుడుతుంటారు, చనిపోతుంటారు. దాని కోసం బంద్ నిర్వహించనక్కరలేదు' అని తన ఫేస్‌బుక్ పేజీపై రాసుకుంది. దాన్ని రీనూ శ్రీనివాసన్ అనే మిత్రురాలు 'లైక్' చేసింది. వారి వ్యాఖ్యలు ఠాకరే అభిమానుల మనోభావాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఆ ఇద్దరినీ పోలీసులు 295ఎ సెక్షన్ కిందే అరెస్ట్ చేశారు. తర్వాత రెండు రోజులకు షాహీన్ బంధువు ఆస్పత్రి మీద శివసేనకు చెందిన వ్యక్తులు దాడి చేశారు.

బాత్రా అభియోగాలు, నిజానిజాలు

వెండీ డానిగర్ పుస్తకం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని బాత్రా వేసిన దావాలో మొత్తం 47 అభియోగాలు ఉన్నాయి. హిందూమత మూల గ్రంథాలను చదివిన వారికి, డానిగర్ పుస్తకం క్షుణ్ణంగా పరిశీలించిన వారికి ఈ అభియోగాలు చాలా వరకు నవ్వు తెప్పిస్తాయి. ఈ అభియోగాలన్నింటికి వరుసబెట్టి జవాబు ఇవ్వడం నా ఉద్దేశ్యం కాదు కానీ, అందులో ప్రధానమైనవి కొన్నింటిని పరిశీలిస్తాను.

బాత్రా : ఈ పుస్తకాన్ని చదివితే, దీన్ని క్రైస్తవ మతబోధకుల

ఉత్సుకతతో, హిందువులను అవమానించి, వారి మతాన్ని కించపరిచే రహస్య కార్యక్రమంతో రాసినట్టు కనిపిస్తున్నది.

వాస్తవం : వెండీ డానిగర్ క్రిస్టియన్ మతస్తురాలు కాదు, యూదు మతానికి చెందిన వ్యక్తి అన్న నిజం తెలియజేయడం ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. అయితే, తనకు తెలియకుండానే తన రాతల్లో 'పాశ్చాత్య పక్షపాతం' చొరబడే ప్రమాదం ఉందని ఒప్పుకొనే నిజాయితీ ఆమెకు ఉన్నది.

బాత్రా : ఆమె రాసిన పుస్తకాల జాబితా మొత్తం చూస్తే, ఆమె హిందూయిజంలో ఉన్న ప్రతికూల అంశాల మీద, దురాచారాల మీద కేంద్రీకరించి, ఎత్తిపట్టి, వాటి గురించి మాత్రమే రాస్తున్నట్టు కనబడుతుంది. ఎంతో మంది హిందూ దేవతల గురించి ఆమె వాడిన మాటలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయి.

వాస్తవం : హిందూమతాన్ని వివరిస్తూ ఇంగ్లిష్‌లో ఇప్పటికే ఎన్నో పుస్తకాలు వచ్చాయి. ఈ పుస్తకం ఉద్దేశం హిందూమతంలో ప్రత్యామ్నాయ కథనాలను వెలికి తీసుకొని రావడమేనని ఆమె ముందుమాటలోనే చెప్పుకున్నారు. 'హిందూయిజం: ఒక ప్రత్యామ్నాయ చరిత్ర' అని అని పుస్తకం శీర్షికలోనే ఉంది. అయితే, ఈ పుస్తకంలో వివరించిన కథనాలు విభిన్న సంప్రదాయాలను తనలో కలుపుకొని, భిన్న అభిప్రాయాలను ఆదరించిన హిందూమతపు విశాల దృక్పథాన్ని, ఉత్కృష్టతను ఉగ్గడించేవిగానే ఉన్నాయి కాని, హిందూమతాన్ని కించపరిచే విధంగా లేవు. నిజానికి, ముందుమాటలో చెప్పుకున్నట్టుగా ప్రత్యామ్నాయ కథనాలు – ఇతిహాసపు చీకటికోణం కింద అట్టడుగున పడి కనిపించకుండా పోయిన కథలు – అంత ఎక్కువగా ఈ పుస్తకంలో లేవనేదే ఈ పుస్తకంపై నాకున్న ఫిర్యాదు.

బాత్రా : పుస్తకం ముఖపత్రం మీద కృష్ణ భగవానుడు ఒక నగ్నస్త్రీ పిరుదుల మీద కూచుని ఉన్నట్టుగా, చుట్టూ నగ్న స్త్రీలు ఉన్నట్టుగా చిత్రించారు. కృష్ణ భగవానుడిని ఇలా అశ్లీలంగా, నీచంగా చిత్రించడం హిందువుల మత మనోభావాలను దెబ్బతీయడానికే. శ్రీకృష్ణుడిని భగవంతుడి అవతారంగా భావించి హిందువులందరూ పూజిస్తారని, అలా పూజించడానికి ఎన్నో ఆలయాలున్నాయని పూర్తిగా తెలిసి కూడా రచయిత్రి, ప్రచురణకర్తలు ఈ పని చేశారు. వారి ఉద్దేశం స్పష్టంగా హిందువులను అపహాస్యం చేయడం, అవమానించడం, చిన్నబుచ్చడం, హిందూ సంప్రదాయాలను కించపరచడం.

వాస్తవం : భాగవతం దశమస్కంధంలో కృష్ణుడు గోపికలతో సాగించిన రాసక్రీడలను విపులంగా వర్ణించిన విషయం సంస్కృత భాగవతం కానీ, తెలుగు భాగవతం గాని మూల కృతులను చదువుకున్న వారికి తెలుసు. అలాగే సంస్కృత భాగవతంలో రాసక్రీడల శ్లోకాలు చదివిన వారికి ఈ పుస్తకం మీది ముఖచిత్రం అంత చోద్యంగా అనిపించదు. అయితే, పుస్తకం లోపల లోతైన చర్చలు చేస్తూ, పుస్తకం బయట ఆ చర్చలకు అంతగా పొంతనలేని గోపికల రాసలీల దృశ్యం ముఖచిత్రంగా ఉంచడంలో నిజంగానే ఔచిత్యం లేదు. అయితే, హిందూ మతాన్ని అవమానపరచే ఉద్దేశం కన్నా, పుస్తకాన్ని మార్కెటింగ్ చేయడం కోసం ఆకర్షణీయంగా ఉంటుందని ఈ ముఖచిత్రాన్ని ఎంచుకున్నారని నిర్ధారించడం అంత కష్టమైన పనేమీ కాదు.

బాత్రా : '(నా ఉపన్యాసంలో ఉటంకించిన) సంస్కృత గ్రంథాలు రాసిన కాలంలో వైభవోపేతమైన లైంగిక బహిరంగత్వం, అంతర్దృష్టి ఉండేవి. నేను సరిగ్గా ఆ గ్రంథాల్లోని ఆ భాగాల మీదనే కేంద్రీకరించాను' అంటూ, హిందూ పవిత్ర గ్రంథాలను చూడడంలో తన దృష్టి లైంగికమైనదని స్వయంగా రచయిత్రే చెప్పుకున్నారు. అందువల్ల రచయిత్రి దృష్టి కామెర్ల రోగి దృష్టివంటిది. అది లైంగికేచ్ఛతో తపించిపోయే స్త్రీ దృష్టి.

వాస్తవం : ఈ అభియోగం పూర్తిగా నిరాధారమైనది. వెండీ డానిగర్ ఇక్కడ ఈ పుస్తకం గురించి చెప్పడం లేదు. 2003లో జరిగిన ఒక సంఘటన గురించి చెపుతూ అప్పుడు తను పత్రికకు చెప్పిన విషయాల ఉటంకింపు ఇది. ఒకసారి వెండీ డానిగర్ లండన్‌లో ప్రసంగిస్తూ, 'లక్ష్మణుడు తనను కోరుకుంటున్నాడ'ని సీత నిందించిన సంగతి వాల్మీకి రామాయణంలో ఉందని ప్రస్తావించినందుకు ఒక హిందువు ఆమెపై కోడిగుడ్డు విసిరాడట. ఆ సంఘటనకు సమాధానంగా మరుసటి రోజు ఆమె పత్రికకు చెప్పిన మాటలనే బాత్రా ఇక్కడ ఉటంకించారు.

బాత్రా : రచయిత్రి వాల్మీకి రామాయణంలో నుంచి సీత తనను మోహిస్తున్నాడని లక్ష్మణుడిని నిందించిన మాటలను ఉటంకించారు. కాని ఆ మాటలు వాల్మీకి రామాయణంలో ఎక్కడ ఉన్నాయో పుస్తకంలో చెప్పలేదు.

వాస్తవం : ఇక్కడ బాత్రా ఉద్దేశం ఏమిటో అర్థం కాదు. వాల్మీకి రామాయణంలో సీత లక్ష్మణుడిని అలా అనలేదని, ఇదంతా వెండీ డానిగర్ కల్పనేనన్న ఆరోపణ ధ్వనిస్తుంది. అయితే, సీత రామునికి ప్రాణహాని కలిగిందన్న కోపంలో లక్ష్మణున్ని ఎంతగా దుర్భాషలాడిందో వాల్మీకి రామాయణం చదివిన వారికి విదితమే. మాయలేడిని పట్టితేవడానికి వెళ్లిన రాముడు 'సీతా, లక్ష్మణా' అని అరిచాడని విని సీత ఆందోళన చెందుతుంది. లక్ష్మణున్ని రాముని కోసం వెళ్లమంటుంది. లక్ష్మణుడు సీతను ఒంటరిగా వదిలేసి వెళ్లలేనంటాడు. అప్పుడు లక్ష్మణున్ని అనుమానిస్తూ అన్న మాటలు అరణ్యకాండలో 45వ సర్గలోని శ్లోకాలలో కనిపిస్తాయి. ఇది కచ్చితంగా వాల్మీకి రామాయణంలోనిదే. లక్ష్మణుడిని అనరాని మాటలు అన్నాను కాబట్టే నాకిలా జరిగింది అని సీత యుద్ధకాండలో కూడ వాపోతుంది. ఇదే కథ తెలుగులోని రంగనాథ రామాయణంలోనూ, థాయిలాండ్ వారి రామకియెన్ లోనూ కనిపిస్తుంది.

బాత్రా : హిందూయిజంలో లింగం అనేదానికి లైంగిక అర్థం లేదని, అది భగవంతుడికి (శివుడికి) అమూర్త ప్రతీక అని రచయిత్రికి తెలిసి ఉండాలి. అయినా ఆమె లింగాన్ని నిక్కబొడుచుకున్న పురుషాంగంగా చెప్పే భాగాల మీద మాత్రమే కేంద్రీకరించింది. ఉన్నతమైన హిందూ మతం పట్ల ఆమె మిడిమిడి జ్ఞానానికీ, సొంత మానసిక వైకల్యానికీ ఇది సూచన.

వాస్తవం : శివుని పూర్వ చరిత్ర గురించి నిజంగా మనకు చాలా విషయాలు తెలియవు. సింధులోయ నాగరికతకు సంబంధించి మొహంజొదారోలో లభించిన ముద్రికలలో జంతువుల మధ్య పద్మాసనంలో ఉన్న మూర్తి (పశుపతి?) శివుని తొలి రూపాల్లో ఒకటో కాదో మనకు తెలియదు. ఋగ్వేదంలో ప్రస్తావించిన 'శిశ్నదేవుడు' శివుడో కాదో మనకు తెలియదు. తొలుత అనార్య దేవునిగా ఉన్న 'రుద్రుడు' హిందూ మతంలో ప్రముఖ దేవునిగా ఎప్పుడు, ఎలా మారాడో మనకు అంతగా అంతు పట్టదు. శివుడిని జ్యోతిర్లింగంగా కీర్తించే శ్లోకాలు మనకు శ్వేతాశ్వతర ఉపనిషత్తులో కనిపిస్తే, పురాణాల్లో మాత్రం శివలింగాన్ని చర్మలింగంగా వర్ణించే కథలు కోకొల్లలుగా కనిపిస్తాయి. ఉదాహరణకు, పద్మ పురాణంలో భృగు మహర్షి కైలాసం వెళ్లినప్పుడు శివపార్వతులు ఏకాంతంలో ఉండి ఆయనను ఉపేక్షిస్తారు. కోపంతో భృగు మహర్షి పెట్టిన శాపం వల్ల శివుని అంగం భూమి మీద పడుతుంది.

ఆ లింగం నుండి వెలువడిన అగ్ని భూమిని కాల్చేస్తుండగా భయభ్రాంతులై ప్రజలు మొరపెట్టుకోవడంతో, ఆ తేజస్సును యోని రూపంలో పార్వతి మాత్రమే ధరించగలదని ఆ ఋషులు చెబితే, పార్వతి యోని రూపంలో ఆ లింగాన్ని ధరించి శాంతిపజేస్తుందట. శివపురాణంలోని కథలో మాత్రం శివుడు దారుకావనంలో దిగంబరంగా తిరుగుతున్న వేళ ఋషిపత్నులు శివుణ్ణి చూసి మోహించడంతో, కోపగించిన ఋషులు శివుణ్ణి శపిస్తారు కాబట్టి అతడి అంగం శివలింగంగా మారుతుంది. ఇదే కథ స్కంద పురాణంలోనూ, కూర్మ పురాణంలోనూ కనిపిస్తుంది.

వెండీ డానిగర్ తన పుస్తకంలో ఈ విషయం మీద అన్ని వైపుల కోణాలకు సమాన ప్రతిపత్తిని కలగజేస్తూ ఈ అంశాన్ని సున్నితంగానే ప్రస్తావించినట్టు నాకనిపిస్తుంది.

బాత్రా : హిందువులకు వేదాలే అత్యున్నత పవిత్ర గ్రంథాలనీ, వేదాలకు భిన్నంగా, అతీతంగా మరే గ్రంథంలో ఉండే మరే విషయమైనా చెల్లదనే మౌలిక సూత్రాన్ని రచయిత్రి తన 779 పేజీల ఉద్గ్రంథంలో పాఠకులకు ఎక్కడా చెప్పలేదు.

వాస్తవం : వేదసాహిత్యాన్ని చదువుకున్న వారికి ఆ వేదాలలో వర్ణించిన మతానికీ, తరువాతి కాలంలో అభివృద్ధి చెందిన హిందూ మతానికీ తేడాలు స్పష్టంగా తెలుసు. ఋగ్వేదంలో కనిపించే మిత్ర, వరుణ, అర్యమ, భగ, అంశ, ఇంద్ర, అగ్ని, ఉషస్ వంటి ప్రధాన దేవతలు తరువాతి హిందూ మతంలో ప్రాధాన్యత కోల్పోయారు. వేదాల్లో ప్రముఖమైన అగ్నిస్తోమ (సోమయాగం), అశ్వమేధ, పురుషమేధ, అగ్నిచయన, చాతుర్మాస్య యజ్ఞాలు తరువాతి కాలంలో కనిపించవు. ప్రస్తుతం హిందూ మతంలో ప్రధానమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తితత్వం, లక్ష్మి, పార్వతి, సరస్వతి వంటి స్త్రీ దేవతల ప్రస్తావన వేదాలలో కనిపించదు. హిందూ మతానికి ప్రధానమని చాటిచెప్పే దశావతారాల ప్రస్తావన గాని, కర్మ సిద్ధాంతం గాని, పునర్జన్మ సిద్ధాంతంగాని వేదాలలో ఎక్కడా కనిపించదు. నిజానికి వేదోత్తర కాలంలో వెలువడిన వాఙ్మయంలో వేదాల నిరసన బహుళంగా కనిపిస్తుంది. ఉదాహరణకు ముండకోపనిషత్తులో విద్యలు పర, అపర అని రెండు రకాలని చెపుతూ, నాలుగు వేదాలు తక్కువ తరగతికి చెందిన అపర విద్యలకు చెందినవని, పర విద్యలు బ్రహ్మతత్వాన్ని తెలిపి ముక్తిని ప్రసాదిస్తాయని ఘోషిస్తున్నాయి. భగవద్గీతలోనూ వేదవిద్యలను, కర్మకాండను నిరసిస్తూ శ్లోకాలు కనిపిస్తాయి. ప్రసిద్ధి చెందిన 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచనా' అన్న శ్లోకానికి ముందున్న నాలుగు శ్లోకాలు, వేదాలలో ఉన్న జ్ఞానం పైపైన ఆకర్షణీయంగా కనబడుతూ ఉన్నా అది త్రిగుణాత్మకమైన సంసార విషయాలకు చెందిందని, ఆత్మజ్ఞానానికి పనికిరాదని చెపుతున్నాయి.

బాత్రా : అత్యంత ప్రాచీన పవిత్ర గ్రంథమైన వేదాధ్యయనం స్త్రీలకు నిషేధం అని రచయిత్రి రాసిన మాట పూర్తిగా తప్పుడు ప్రకటన. రుగ్వేదంలో 29 మంది మహిళా రుషుల రచనలున్నాయి.

వాస్తవం : నిజానికి వెండీ డానిగర్ వేద వాఙ్మయంలో స్త్రీ రచయితల పాత్ర గురించి ఋగ్వేదానికి తను చేసిన అనువాద పుస్తకంలో విపులంగా చర్చించారు. అయితే, మహాభారతం నుండి మనుధర్మ శాస్త్రం దాకా స్త్రీలు, శూద్రులు వేదాలు చదవకూడదని చెబుతున్నాయి. నేడు కూడా భారతదేశంలో స్త్రీలు వేదాలు చదవడానికి అనర్హులని చెప్పే పండితులు చాలామంది ఉన్నారు. ఈ పరిస్థితిని వివరిస్తూ వెండీ డానిగర్ స్త్రీలు వేదాలు చదవకూడదని అంటారని, కానీ స్త్రీలు వేదరచనలో పాలుపంచుకున్నారని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయని ప్రస్తావించారు.

మతమౌఢ్యం వల్లే హిందూమతానికి అత్యంతప్రమాదం

ఇప్పటి పరిస్థితిని సరిగా అర్థం చేసుకుంటే, ప్రస్తుతం అతివాదుల నుండే హిందూమతానికి అత్యంత ప్రమాదం ఏర్పడుతోందని మనకు తెలుస్తుంది. మూల గ్రంథాలు చదివి భారతీయ సంస్కృతిలోని నిర్మాణ సంక్లిష్టతలను లోతుగా అర్థం చేసుకొనే జఠర పుష్టి లేని ఇప్పటి అతివాదుల దృక్పథం నిజానికి పూర్తిగా పాశ్చాత్యవాదం. పాశ్చాత్య మతాలలో లాగా హిందూ మతానికి ఒక దేవుడు, ఒక ప్రబోధకుడు, ఒకే మూల గ్రంథం ఉన్నాయని వాదించడం ఏ మాత్రం భారతీయం కాదు. హిందూ విశ్వాసం ఒక్కడే దేవుడన్నవాడిని, అనేక మంది దేవుళ్ళున్నారన్న వాడిని, అసలు దేముడే లేడన్నవాణ్ని కూడా సమానంగా ఆదరిస్తుంది. అలాగే శృంగారాన్ని సంకోచం లేకుండా చర్చించిన హిందూ మతం విశిష్టతను గుర్తించుకోకుండా, బ్రిటిష్‌వారి ద్వారా సంక్రమించిన విక్టోరియన్ నీతుల పరదాలు కప్పుకొని మన నాగరికతను మనమే చిన్నబుచ్చుకోవడం, విశాల వీథుల్లో పరిఢవిల్లిన హిందూ మతాన్ని ఇరుకు ఛాందస వీథుల్లో బురఖా వేసి నడిపించడం వంటిదే.

వెండీ డానిగర్ పుస్తకం ఇండియన్ మార్కెట్ల నుండి ఉపసంహరించడం వల్ల ఒరిగిందేమిటి? ఆ పుస్తకానికి ప్రపంచవ్యాప్తంగా ఎన్నడూ లేని ప్రచారం జరిగింది. అమెజాన్.కామ్‌లో పదకొండు వేల స్థానంలో ఉన్న పుస్తకం డిమాండ్ ఒక్క వారం రోజుల్లో ఆకాశాన్నంటి ఇప్పుడు ఆ పుస్తకం ప్రజాదరణలో 33వ స్థానానికి చేరుకుంది. ఇండియాలో కూడా డిజిటల్ కాపీలు, పెంగ్విన్ – ఇంటర్నేషనల్ కపీలు యథేచ్ఛగా లభ్యమవుతున్నాయి. ఈ పుస్తకానికి జరిగిన ప్రచారంతోపాటు మత దురభిమానంలో హిందువులు ముస్లింలకు ఏ మాత్రం తీసిపోరని, వారి మతాన్ని ఏ మాత్రం విమర్శించినా సహించరని ప్రపంచ వ్యాప్తంగా అందరూ అనుకోవడానికి ఈ నిషేధం ఆస్కారం కలిపించింది.

దృక్కోణాల విభేదం, లక్ష్యాల వైవిధ్యం వల్ల ఒకే సంఘటన, ఒకే సత్యం వేర్వేరుగా కనిపిస్తాయన్న సత్యం భారతీయ దార్శనికులకు ఏనాడో తెలుసు. అంధగజన్యాయం లాగా, హిందూ మత చరిత్ర అనబడే గజాన్ని వర్ణించే ఎన్ని ప్రత్యామ్నాయ కథనాలు ఉంటే నిజాన్ని అంత బాగా అర్థం చేసుకోగలం. మన భాషా, చరిత్ర, సంస్కృతుల గురించి లోతైన అవగాహన కలుగజేసే సిద్ధాంతాలను ప్రతిపాదించగలిగే పరిశోధనలు, పరిశోధకులు, విశ్వవిద్యాలయాలు భారతదేశంలోనే తయారయినప్పుడు నిజమైన భారతీయ తత్వం విశ్వానికి వెల్లడి అవుతుంది. అంతేకాని, అభిప్రాయ భేదాలను దీర్ఘ సంవాదాల ద్వారా పరిష్కరించుకొనే ఘనమైన సంప్రదాయం ఉన్న మన జాతికి ఇలా పుస్తకనిషేధాలు, పరిశోధకులపై బెదిరింపు దాడులు, భావప్రకటనాస్వేచ్ఛపై నియంత్రణలు : మునుపెన్నడూ లేని మతమౌఢ్యాన్ని, ఆత్మన్యూనతను పంచి పెంచి పోషిస్తాయే తప్ప ఏ రకంగానూ మేలు చేయవు. ఇటువంటి అతివాద ధోరణులకు ఊతం ఇచ్చే కాలంచెల్లిన 295ఎ సెక్షనును భారత శిక్షాస్మృతి నుంచి తొలగించడానికి ఉదారసంప్రదాయంపై గౌరవం ఉన్నవారంతా కృషి చెయ్యాలి. భారతీయ సంస్కృతిని రక్షిస్తున్నాం అని రొమ్ములు విరుచుకుంటున్న అతివాదుల చేతిలోనే మన సంస్కృతికి బమియన్ బుద్ధుల విగ్రహాలకు పట్టిన గతి పట్టకుండా చూసుకోవాల్సిన తక్షణావసరం మనందరిదీ కూడా.

('ఈమాట' అంతర్జాల పత్రిక మార్చ్ 2014 సంచికలోని 'హిందూ మత చరిత్రలో ప్రత్యామ్నాయ కథనాలకు ఆస్కారం లేదా?' అనే సుదీర్ఘ వ్యాసానికి రచయిత అనుమతితో చేసిన సంక్షిప్తీకరణ ఇది. పూర్తి వ్యాసం కోసం http://eemaata.com/em/issues/201403/3567.html చూడండి)

(రచయిత సాఫ్ట్‌వేర్ నిపుణులు) వీ

అధోలోకంలోకి బ్యాంకుల వ్యవసాయ రుణాలు

***వ్యవసాయ రంగానికి స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో ఇచ్చిన రుణాలతో పోల్చితే ఇప్పుడు ఇస్తున్న రుణాలు చాలా తక్కువనీ, అవి కూడ చిన్న, సన్నకారు రైతులకు కాకుండా భూకామందులకే లభిస్తున్నాయనీ అంటున్నారు* వి. హనుమంతరావు**

వర్షాలు పడితే పంట, పడకపోతే రైతుల కడుపు మంట. స్వతంత్రం వచ్చిన కొత్తలో మన దేశ స్థూల దేశీయాదాయంలో వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం 1947లో 51 శాతం నుండి 2010-2011లో 15.5 శాతానికి పడిపోయింది. కాని వ్యవసాయం మీద ఆధారపడే గ్రామ రైతాంగం, వ్యవసాయ కూలీల సంఖ్య 70 శాతం అలాగే ఉండిపోయింది. వ్యవసాయం ఇలా సాగిల పడిపోవడానికి కారణం రాను రాను, ముఖ్యంగా 1991 తర్వాత వ్యవసాయ రంగం మీద పెట్టుబడులు అవరోహణ, పారిశ్రామిక రంగంలో అధిరోహణ ఆవుకు మేత వేస్తేనే పాలిస్తుంది కదా, పోనీ బ్యాంకులేమయినా రుణాలిస్తాయంటే ఇస్తున్నాయి. కాని ఆ ఇవ్వడం పాలకుల మాటల్లో మాత్రమే కాని చేతల్లో మాత్రం కాదు. బ్యాంకులు వ్యవసాయానికి ఇచ్చే రుణాలు రైతాంగానికి చేరుతున్నాయ అంటే (ధనిక రైతులు కాదు) చేరడం లేదని బల్ల గుద్ది చెప్పవచ్చు.

ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. రైతాంగం అనే మాటకు అర్థం చిన్న, సన్నకారు రైతాంగం అని గుర్తుంచుకోవాలి. వాళ్లకే బ్యాంకు రుణాలు ఇచ్చి ఉంటే లక్షల మంది ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు? ప్రభుత్వ గణాంకాల ప్రకారమే రైతాంగంలో 40 శాతం మంది మాకీ వ్యవసాయం వద్దుబాబు అని ఎందుకు అంటున్నారు? కాగా ఈ వ్యాసం రైతులు, బ్యాంకు రుణాలకే పరిమితమని గుర్తుంచుకోవాలి. (పాలకుల గుస గుస: వాళ్ల భూములే లాగేసుకుంటున్నాం కదా వాళ్లకు రుణాలెందుకు?)

బ్యాంకులిచ్చే మొత్తం రుణాల్లో 40 శాతం ప్రాధాన్యతా రంగాలు, అంటే వ్యవసాయం, చిన్న పరిశ్రమలకు ఇవ్వాలనే ప్రభుత్వం జాతీయ బ్యాంకులను ఆదేశించింది. ఆ 40 శాతంలో 18 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాలి. కాని ఈ శాతం 10, 12 వద్దనే ఆగిపోతుంది. కాని సంవత్సరం ఆకరున ప్రకటన ఇచ్చేటపుడు కొన్ని బ్యాంకులు రైతులు ఇవ్వాల్సిన పాత బాకీలు ఏమైన ఉంటే, ఆ మొత్తాన్ని కూడా కలుపుకొని 18 శాతం ఇచ్చేశామని గణంగా చెప్పుకుంటాయి. బ్యాంకులను జాతీయం చేసినపుడు, రుణాలు ప్రధానంగా వ్యవసాయానికే అని ఇందిరా గాంధీ గణంగా చెప్పుకుంది.

ఇటు బ్యాంకులు, అటు ప్రభుత్వం విడుదల చేసిన గణంకాలు చూస్తే తాటి చెట్టంతగా లక్షలు, కోట్లు వ్యవసాయానికి ఇచ్చినట్లు కనిపిస్తుంది. కాని కాస్త లోతుకు పోయి చూస్తే అసలు రంగు బయట పడుతుంది.

1. వ్యవసాయదారులు బ్యాంకుల్లో జమచేసిన మొత్తంకన్నా తక్కువగానే వారికి రుణాలు ఇస్తున్నాయి. 2. వ్యవసాయానికి ఇచ్చినట్లు చెబుతున్న రుణంలో రైతులకు ఇవ్వాల్సిన వడ్డీ, గత సంవత్సరం బాకీలు అన్నీ కలుపుకొని బ్యాంకులు గణాంకాలు విడుదల చేస్తాయి. ఆ గణాంకాలు చూస్తే అబ్బో బ్యాంకులు వ్యవసాయానికి మస్తుగా రుణాలు ఇస్తున్నారే అని ప్రజలు అనుకోవాలి. కాని వ్యవసాయ రుణాలు రాను రాను కుదించుకు పోతున్నాయని పత్రికలు గోశిస్తున్నాయి. అసలు విషయం ఏమిటి అని చూడబోతే ప్రభుత్వం నిజ స్వరూపం బయట పడుతుంది. అంతకు ముందు తెలుసుకోవాల్సిన విషయమేమంటే వ్యవసాయ రుణాలు రెండు రకాలు. నేరుగా పంట పండించడానికి ఇచ్చే రుణాలు ప్రత్యక్ష రుణాలు, మిగతావి పరోక్ష రుణాలని అంటారు. రెండు కలిపి మొత్తం వ్యవసాయానికి ఇచ్చిన రుణాలు అని అంటారు. అసలు వ్యవసాయానికి ఇచ్చిన రుణాలంటే దాని నిర్వచనం ఏమిటి? పంట పండించడానికి రైతులకు (వారిలో చిన్న చితక రైతుల నుంచి పెద్ద పెద్ద భూఖామాందులున్నారు) ఇచ్చిన రుణం అని మనమందరం అనుకుంటాం. కాని ప్రభుత్వం ఈ నిర్వచనాన్ని తలకిందులు చేసి ప్రత్యక్ష, పరోక్ష రుణాలు రెండింటిని కలిపివేసి, లేదా వాటి నిర్వచనాలను మార్చివేసి, వ్యవసాయానికి ఇచ్చిన రుణాలు ఎలా ఎక్కువెక్కువగా ఇస్తున్నామో చూడండంటూ ప్రభుత్వం రైతుల, ప్రజల నెత్తిన కుచ్చుటోపి పెట్టేసింది. వ్యవసాయ రంగానికి ప్రత్యక్ష, పరోక్ష రంగాలలో ఎవరెవరికి ఇస్తున్నారో చూడండి.

1. టి, కాఫీ, రబ్బర్, సుగంద ద్రవ్యాల లాంటి తోటలకు ఇచ్చిన స్వల్పకాలిక రుణాలు.
2. వ్యవసాయ ఉత్పత్తులను తాకట్టుపెట్టుకొని ఇచ్చే రుణాలు.
3. వ్యవసాయం చేస్తున్నారనే పేరుతో (ఉదా : ద్రాక్ష ఇతర వ్యాపార పంటలు) కార్పొరేట్ తత్సమానమైన సంస్థలకు ఇచ్చే రుణాలు.
4. పంట పండించడానికి అవసరమయిన ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, పశుదానా, కోళ్ల దానాల్లో వ్యాపారం చేసే వారికి ఇచ్చే రుణాలు.
5. వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్ లైన్ల నిర్మాణానికి ఇచ్చే రుణాలు.
6. విద్యుత్ పంపిణీ కార్పొరేషన్‌లకు, కంపెనీలకు ఇచ్చే రుణాలు.
7. బిందు సేద్యం, తుంపర సేద్య వ్యవస్థలను ఏర్పాటుచేసే డీలర్లకు ఇచ్చే రుణాలు. (ఈ డీలర్లు పట్టణాల్లో ఉన్నాసరే)
8. అగ్రిక్లినిక్, అగ్రిబిజినెస్ చేసే సంస్థలు.
9. వ్యవసాయానికి రుణాలిచ్చే బ్యాంకేతర సంస్థలకిచ్చే రుణాలు.

10. వ్యవసాయ ఉత్పత్తులను నిలువచేసే గోదాముల శీతల గిడ్డంగుల నిర్మాణాలకు ఇచ్చే రుణాలు.
11. తేనెటీగలు, పందులు, కోళ్లు, చేపలు, పాల డైరీలకు ఇచ్చే రుణాలు.
12. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్నాసరే.

ఈ పట్టిక చూస్తే వ్యవసాయ రుణాల పేరుతో ఎవరెవరికి ఎందుకు వెళుతున్నాయో తేటతెల్లమవుతుంది. బడా రైతులు, వ్యాపారులు, కార్పొరేట్లకు రుణాలు ఇచ్చిన తర్వాత, చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వడానికి ఎంత వ్యవసాయ రుణం అందుతుందో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ రుణాల వ్యవహారంలో రెండు లక్షల రూపాయల లోపు రుణం పొందేవారికన్నా భారీ మొత్తాలు తీసుకునే వారి సంఖ్య అలాగే పట్టణాలకిచ్చే రుణాలు అత్యధికం. (రుణం రూపేన, వ్యక్తుల రూపేన)

నిర్వచనం మార్పువల్ల వాస్తవంగా పంట పండించేవారు వడ్డీ వ్యాపారస్తుల ఉచ్చులో పడి, తిరిగి చెల్లించలేక, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే ఆ ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణం. ఈ దోరణి చూస్తే, ప్రభుత్వ రంగ బ్యాంకులే ప్రైవేట్ రంగ బ్యాంకులుగా మారిపోతున్నాయి. సరిగ్గా ఈ మార్పునే ప్రపంచ బ్యాంకు కోరిక. అంటే అమెరికా కోరికే.

బ్యాంకుల కథ ఇంకా కంచికి వెళ్లలేదు. 1990-2008 మధ్య బ్యాంకులు గ్రామీణ శాఖల ద్వారా మొత్తం వ్యవసాయ రుణాల్లో పైన ఉదహరించిన కాలంలో 55.5 శాతాం నుంచి 38.4 శాతానికి తగ్గగా, నగరాలు, మహానగరాల ద్వారా 14.9 శాతం నుంచి 34 శాతానికి పెరిగాయి. (వ్యవసాయ రుణాలేమిటి, పట్టణాలు నగరాలకేమిటని అడగకండి) కేవలం మహానగరాలకే (అంటే ఢిల్లీ, కలకత్తా, మద్రాస్ లాంటివి) ఇచ్చిన వ్యవసాయ రుణాలు 4 నుంచి 20 శాతానికి పెరిగాయి. ప్రత్యక్ష రుణాలు తగ్గాయి, పరోక్ష రుణాలు పెరిగాయి. 1990 - 2011 మధ్యకాలంలో గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో వ్యవసాయ రుణాల వాటా గ్రామాల్లో 85.1 శాతం నుండి 66.9 శాతానికి తగ్గగా పట్టణాల శాతం 14.9 శాతం నుండి 33.1 శాతానికి పెరిగాయంటే దాని అర్థం ఏమిటో నేను వేరే చెప్పాల్సిన పనిలేదు.

పైన ఉదహరించిన వివరాలన్నీ కేవలం విహంగ వీక్షణం మాత్రమే. ప్రతి దోరణికి కావాల్సిన గణాంక వివరాలన్నీ, పట్టికలన్నీ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వంలో ఉన్న బ్యాంకింగ్ శాఖ ఇచ్చిన గణాంకాలే. నాది కేవలం విశ్లేషణ మాత్రమే. వ్యవసాయ రుణం నిర్వచనం ఇంత విస్తారంగా మార్పుచేసిన ప్రభుత్వమే నిర్వచించిన 18 శాతం రుణాలు ఈ రంగానికి అందలేదంటే ప్రభుత్వ వైఫల్యం లోతును అర్థం చేసుకోవచ్చు.

ఇవన్నీ దేశానికి సంబందించిన గణాంకాలు పెద్దచేపలు చిన్న చేపలను మింగేస్తాయంటారు. అలాగే కార్పొరేట్లు, బడా వ్యాపార సంస్థలు సింహ భాగం మింగేసిన తరువాత 70 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు మిగిలింది వదిలేసిన ఎంగిలి మెతుకులే. ఆ ఎంగిలి మెతుకులు పాటి ఓట్లే పాలక పార్టీకి పడకుండా ఉండడమే ప్రస్తుతం ఆ ఎంగిలి మెతుకులు తినేవారి లక్ష్యంగా ఉండాలి.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

విఎచ్ కాలమ్

పూల చెట్లకు డాలర్లు కాస్తున్నాయి

కవితకేది అనర్హం కాదన్నట్లు, విదేశీ మారకం పంపాదించడానికి పువ్వులు కూడా ఉపయోగపడతాయని ఎంత మందికి తెలుసు? రాజకీయ నాయకులు వస్తే పూలగుచ్ఛాలు, దండలు వేస్తారు. మెడలో వేయడం తడవుగా తీసి టేబుల్ మీద పడేస్తారు. అవి చెత్తబుట్టలోకి వెళ్లిపోతాయి. లేకపోతే పూల వ్యాపారస్తులు వాటిని తరలించుక పోయి మళ్లీ సొమ్ము చేసుకుంటారు. వివాహాల సమయంలో ఎన్నికిలోల పువ్వులో ఖర్చవుతాయి. వివాహం చేసేవారి ఆర్థిక స్తోమతబట్టి వందల, వేల రూపాయలు ఖర్చవుతాయి. ఆ తర్వాత అవి వీధిపాలే.

కాని పూవులు ఎగుమతి అవుతాయని, వాటి ఎగుమతుల ద్వారా దేశానికి 2011-12లో రు. 365 కోట్లు విదేశీ మారకం లభించింది. ప్రతీ సంవత్సరం ఎగుమతులు పెరుగుతున్నాయి. వాటి విలువా పెరుగుతూ వస్తోంది. ఉదాహరణకు 2009-10 లో రు. 294 కోట్ల విలువగల 26815 టన్నుల పూవులు ఎగుమతయ్యాయి. మరుసటి సంవత్సరంలో 28907 టన్నులు, విలువ 296 కోట్ల రూపాయలు. ఈ లెక్కన దేశంలో నాయకులకు వేసే దండల మూలంగా ఎన్ని కోట్ల విదేశీ మారకం నష్టపోతున్నామో లెక్కవేయండి.

వ్యవసాయం అంటే తిండిగింజలు, పప్పుదినుసులు, నూనె గింజలు, పత్తిలాంటి వాటివే గుర్తుకొస్తాయి. కాని పూలసాగు కూడా అంతే ముఖ్యమని గమనించాలి. కొన్ని రకాల పువ్వులు అన్నికాలల్లో పండించవచ్చు. (ఉదా : బంతి, చామంతి, గులాబీ, కనకాంబరాలు, కట్ ఫ్లవర్లకోసం లిల్లీ ఇలా ఎన్నో రకాలున్నాయి.

మహిళలు తలలో పెట్టుకోవడం మధ్య వయస్కులు వాడడానికే కాదు, అలంకరణ కోసమేకాదు, ఉదాహరణకు బంతిపూల నుంచి లభించే ఉత్పత్తులు కోళ్ల దాణాలో ఉపయోగిస్తారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకి ఉంది. కంటి రక్షణకు సంబంధించిన మందు తయారీలో వినియోగిస్తున్నారు. కాగా ఒక్క బంతి పూవుల ఎగుమతులు 220 కోట్ల విదేశీ మరకం లభిస్తుంది. అందుకనే కాబోలు చైనాలో బంతి విస్తారంగా పెంచుతున్నారు. ఒక్క గులాబీ ఎగుమతులే 2012-13 రు. 423 కోట్ల విదేశీ మారకం సంపాదించి పెడుతున్నాయి.

మన రాష్ట్రం కట్ ఫ్లవర్స్ ఉత్పత్తి దేశంలో అయిదవ స్థానంలో విడి పువ్వుల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే పువ్వులలో అమెరికాదే అగ్రస్థానం. చిన్న సన్నకారు రైతులు కూడా వీటి పెంపకం చేయవచ్చు.

(రైతునేస్తం' మాసపత్రిక ఆధారంగా)

వీ

రాజకీయార్థిక, సామాజిక అంశాలపై వ్యాస రచనను ప్రోత్సహించడానికి వీక్షణం సాగిస్తున్న కృషి మీకు తెలుసు. గత పన్నెండు సంవత్సరాలలో దాదాపు మూడు వేల వ్యాసాలు ప్రచురించడం మాత్రమే కాక, వ్యాస రచనలో శిక్షణ ఇచ్చేందుకు వర్క్‌షాప్‌లు కూడ వీక్షణం నడిపింది. ఆ ప్రయత్నంలో భాగంగానే కొత్త వ్యాస రచయితలను ప్రోత్సహించడానికి వారి తొలి వ్యాసాలు 'కొత్త కలాలు' శీర్షికన అచ్చు వేయాలని వీక్షణం నిర్ణయించుకుంది. చేయి తిరిగిన వ్యాస రచయితల ప్రమాణాలతో లేనప్పటికీ అవసరమైన విషయాల మీద ఉంటే కొత్త రచయితలకు ఆత్మ విశ్వాసం కలిగించడానికి, కొద్దిపాటి మార్పులతో ఈ శీర్షిక కింద అచ్చు వేయడం జరుగుతుంది. – సం.

హత్యల ద్వారా ఉద్యమాలను ఆపలేరు

తెలంగాణ ప్రజలను ప్రజాస్వామిక తెలంగాణ కోసం చైతన్యపరిచిన ఆకుల భూమయ్యను ప్రభుత్వం హత్య చేసిందనీ, ఆయన కల సాకారం కోసం విద్యార్థులు, మేధావులు ముందుకు సాగాలనీ అంటున్నారు విశ్వనాథ్

ఉద్యమాలే ఊపిరిగా, ప్రజలే ప్రాణంగా పనిచేసిన ఆకుల భూమయ్య వారసులుగా ముందుకు సాగుదాం. తెలంగాణ చరిత్ర అంతా పోరాట చరిత్రే. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు ఒక పోరాట చరిత్ర ఉంది. అది నక్సల్‌బరీ తరహాలోని జగిత్యాల జైత్రయాత్ర. పీడిత వర్గాలను తట్టిలేపి కరుడుగట్టిన భూస్వాములను తన్ని తరిమి సాయుధ పోరాటాన్ని ప్రారంభించింది. వేలాది ఎకరాల భూస్వాముల భూములను పీడితవర్గాలు ఆక్రమించుకొని చరిత్రను తిరగరాసింది. భారత ప్రజలకు విముక్తి బాటలు నాటిన మొక్కలను మొలకెత్తించి దేశ నలుమూలలా విస్తరింపజేసి ఈనాడు భారత ప్రజలకు దిక్సూచిగా నిలిచింది. ఆ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న క్రమంలో ఒక ప్రత్యేక పరిస్థితుల్లో పాలక వర్గాలు గత్యంతరంలేని స్థితిలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసాయి. ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకోవాలని పల్లెపల్లెకు, గడపగడపకు పోయి ప్రజలను వెన్నుతట్టి లేపుతున్న తరుణంలో కుట్రపూరితంగా యుపిఎ ప్రభుత్వం భూమయ్యను దారుణంగా మరోరూపంలో హత్య చేసింది. యాదృచ్ఛికంగా జరిగినట్టే యాక్సిడెంటల్ హత్యగా మోసం చేయడానికి పన్నాగాలు పన్నింది. ఈ తరహాలో హతమార్చడానికి ఎలాంటి ట్రాఫిక్‌జాం కాని ప్రదేశంలో ఈ హత్య జరగడం సాధారణ వ్యక్తులకు కూడా అర్థంకానిది ఏమిలేదు. పాలకులు అందరు కూడా ఒక కోవకు చెందినవారే కాబట్టి ఎవరు కూడా నోరు మెదపడం లేదు. ఇంత దారుణంగా హత్య చేసినా కూడా ఖండించకపోవడం అంటే ఇలాంటి హత్యలను సమర్థించినట్టే.

భూమయ్య ప్రయాణం ఒక సాధారణ ఉపాధ్యాయుడుగా ప్రారంభమై 1969 ఉద్యమం ఆవరించుకున్న నిశ్శబ్దాన్ని ఛేదించుకొని వచ్చిన తెలంగాణ నేల గర్వపడే విధంగా ఏటికి ఎదురీదుతూ జీవితమంతా జన చైతన్యం కోసం తపించాడు. నిరాడంబరంగా, నిండుగా కనిపించే సీదాసాదా వ్యక్తి, చూడడానికి ఉపాధ్యాయుడుగా కనిపించవచ్చు. కాని అవగాహనలో లోతైన చైతన్యంతో కూడిన దూరదృష్టి కలిగిన వ్యక్తి. భావితరాలకు భవిష్యత్ మార్గాన్ని చూపెడుతూ, తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థులను తట్టిలేపుతూ, తనవంతు పాత్రను 40 సంవత్సరాల నుండి నెరవేర్చు కుంటూ వస్తున్నాడు. మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన తర్వాత పీడిత ప్రజల విముక్తితోనే తెలంగాణ విముక్తి కూడా ముడిపడి ఉందని చెపుతూ, తోటి ఉపాధ్యాయులను కూడగట్టి యూనియన్ ఏర్పాటు చేశాడు. తెలంగాణ ఉద్యమాన్ని తన భుజానికి తగిలించుకొని ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా తన బాటను వదలలేదు. వేలాది మంది విద్యార్థులను చైతన్యం చేసి తెలంగాణ పోరాటానికి నాంది పలికాడు. కాచాపూర్ గ్రామాన్ని కంచుకోటగా తయారు చేసి చుట్టు పక్కల గ్రామాల నుండి ఉద్యమకారులను తయారు చేశారు. అనేక మందిని మొదటి, రెండవతరం నాయకులను తయారు చేసి భారత విప్లవానికి నాయకత్వం వహించేలా చేయడంలో అతని పాత్ర ఎనలేనిది.

నిరంతరం తెలంగాణ కోసం తపనపడుతూ, పీడిత ప్రజలు విముక్తి కావాలంటే తెలంగాణ కూడా విముక్తి కావాలనీ, దీనికోసం రకరకాల నిర్మాణాలను సృష్టించాడు. జనచైతన్య నాయకుడిగా, ప్రజాఫ్రంట్ రథసారథిగా కోట్లాది మంది ప్రజల్లో నిరంతరం నానుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం గొంతు విప్పుతూ పాలకులకు, ముఖ్యంగా ఆంధ్ర భూస్వాముల రాజకీయ నాయకుల కంట్లో కునుకు లేకుండా చేస్తూ కలవరపెట్టాడు. ఇది భరించలేని భూస్వామ్య పెట్టుబడిదారులు ప్రజా సంఘాల నేతల హత్యల ద్వారా ప్రజా ఉద్యమాలను నిరోధించవచ్చనే హెచ్చరికగానే ఇలాంటి హత్యలకు పూనుకుంటున్నారు.

తెలంగాణలో ఉన్న నాలుగున్నర కోట్ల ప్రజలు కోరుకుంటున్నది ఏమిటి? పాలక పార్టీలు కానీ, టిడిపి, టిఆర్ఎస్, బిజెపి ఏవిధంగా వ్యవహరిస్తున్నాయి? ఉవ్వెత్తున లేసిన తెలంగాణ ఉద్యమాన్ని అన్ని పార్టీలు వాడుకొని రాబోయే 2014 ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ఎవరికి వారే ఇప్పటి నుండే అన్నిరకాల ఏర్పాట్లు, పొత్తులు, నక్క జిత్తుల ఎత్తుగడలు వేస్తున్నాయి. ఏ ఒక్క పార్టీకి కూడా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనే లేదు. పైకి చూడడానికి తూతూ మంత్రంగానే మాట్లాడుతున్నాయి. అసలు విషయానికి వచ్చేసరికి అందరు కూడా ఒకే గూటి పక్షులుగా నాయకులు వ్యవహరిస్తున్నారు.

ప్రజలు మట్టుకు ఏది ఏమైనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొని, అంతిమంగా ప్రజాస్వామిక తెలంగాణ సాధించుకోవాలనే కాంక్షతో ఉన్నారు. అందుకోసం ఇప్పటి నుండే ఎలాంటి ఆంక్షలు లేని పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలి అనీ, నీళ్లు, ఖనిజ సంపదలు అన్ని ఎక్కడివి అక్కడి ప్రజలకే చెందాలనే డిమాండ్‌తో కూడిన విషయాలు ముందు పెడుతున్నారు. అన్నిరకాల వాటాలు, బడ్జెట్, ఉద్యోగాలు, రిజర్వేషన్, శాఖలకు సంబంధించినవి, తెలంగాణకు సంబంధించినవి ఇక్కడే ఉండాలని, పద్ధతి ప్రకారం జరగాలని, భూమి ఇతర విషయాలు కూడా ఫ్యాక్టరీలు, గనులు, విద్య, వైద్యం, హైదరాబాద్ తెలంగాణకే రాజధానిగా ఉండాలని, సక్రమంగా అమలు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మావోయిస్టు పార్టీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడం ప్రజల కాంక్ష కాబట్టి దీనికి మద్దతు తెలుపుతూనే ఇది తెలంగాణకు సరిహద్దులు పెట్టుకోవడమే తప్ప దీని నుండి ప్రజలకు ఒరిగేది ఏమిలేదని తెలిపింది.

ఆంధ్ర భూస్వాములు పోయి, తెలంగాణ భూస్వాములకు అధికారం వస్తది తప్ప దోపిడి పోదు. దగా పోదు. అవినీతి పోదు. అక్రమాలు పోవు. కాబట్టి మళ్లీ ఉద్యమాన్ని కొనసాగిస్తూనే మిలిటెంట్‌గా పోరాడి అన్నింటిని దిగ్బంధనం చేసి విద్యార్థి, కార్మిక, కర్షక, మేధావులు, అన్ని సెక్షన్ల ప్రజలు పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉంది.

ఈ విషయాన్ని గత కొన్ని సంవత్సరాలుగా భూమయ్య తన భుజాన వేసుకొని తెలంగాణలో ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి వినిపించారు. ప్రజలను వెన్నుతట్టి లేపుతూ, పెద్దఎత్తున ప్రజా ఉద్యమానికి సిద్ధం చేస్తూ కాలుకు బలపం కట్టుకొని, కంటి మీద కునుకులేకుండా, విరామం ఎరుగకుండా, ప్రజా సమస్యలే తన సమస్యలుగా భావించి నిరంతరం కృషి చేశారు. ప్రజలను చైతన్యం చేస్తున్న క్రమంలో భరించలేని కాంగ్రెస్ ప్రభుత్వం కనీవినని పద్ధతుల్లో మున్సిపాలిటీ వాహనంతో తొక్కించి హత్య చేసింది. విప్లవకారులను హత్య చేసి ఉద్యమాన్ని ఆపలేరని మనకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఆకుల భూమయ్యను హత్య చేసి ఆయన వాణి వినపడకుండా చేయాలనుకుంది ఈ ప్రభుత్వం. కాని చరిత్రలో హత్యలు, నిర్బంధాలు చేస్తూ ఉద్యమాలను అణచడం అనేది ఎవరితరం కాదు. ప్రజలు కసితో, మరింత రెట్టింపుతో పోరాడుతారనేది పాలకులకు తెలియదేమో. భూమయ్య వారసులుగా ప్రజాస్వామిక తెలంగాణ కోసం, ఇలాంటి పాశవిక హత్యలకు వెరువకుండా ధైర్యంగా నిలబడాలి. తాము నమ్మిన ప్రజాస్వామ్యం కోసం, తెలంగాణలోని ప్రతి ఒక్కరు కులాలకు, మతాలకు అతీతంగా పీడిత, తాడిత ప్రజలందరు ఏకమై ఉవ్వెత్తున మిలిటెంట్‌గా పోరాడాలి. హత్యలు చేస్తున్న పాలకులను నామరూపాలు లేకుండా చేయాలి. దోపిడి, పీడన లేనటువంటి రాజ్యం స్థాపించుకునే వరకు ఎక్కడ రాజీపడకుండా పోరాడి పాలకుల నిజస్వరూపాన్ని బహిర్గత పరచాలి. తెలంగాణ ప్రజల నిజమైన చైతన్యాన్ని చాటాలని భూమయ్య తన జీవితమే సీదాసాదాగా మల్చుకొని తాను నడిచే మార్గంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. ఏటికి ఎదురీదుతూ చివరి క్షణం వరకు శ్రమించాడు. పని చేస్తున్న క్రమంలో పాలకుల కుట్రలను నిరంతరం బహిర్గతం చేస్తూ తెలంగాణ ప్రజలను ఒక్కతాటి మీదకు తీసుకొచ్చాడు.

భౌగోళిక తెలంగాణ ఏర్పాటు చేసినా ప్రజల కష్టాలు పూర్తిగా పోవు. తెలంగాణలో ఉన్న భూస్వాములు, రాజకీయ నాయకులు అధికారంలోకి వస్తారు. మళ్లీ యథావిధిగానే ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ విషయాన్ని భూమయ్య భౌగోళిక తెలంగాణ కాదు, ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పరుచుకోవాలని కోరినందుకే ఆయనను హత్య చేశారు. రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావాలనేది ఇప్పటి నుండి ఎవరికివారు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ బూటకత్వాన్ని ఎండగట్టి భూమయ్య ఆశయాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలంగాణలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజలు పీడించ బడుతున్నారు. స్త్రీలు, పురుషులు, ఆదివాసులు, దళితులు అందరు కూడా కలిసి ఐక్యంగా పోరాడాలి. ప్రత్యేక తెలంగాణతో పాటు, ప్రజాస్వామిక తెలంగాణను సాధించుకునే వరకు పట్టిన పట్టును వదలకుండా పోరాడాలి. ఈనాడు దేశంలో ఎక్కడ చూసినా తిరుగుబాటు పోరాటాలే కనపడతున్నాయి. ఏదో ఒక రూపంలో ఎదిరించడమో, ప్రశ్నించడమో, అడగడమో రకరకాల పద్ధతుల్లో నిరసన ప్రదర్శనలే మనకు కనిపిస్తున్నాయి. కాబట్టి తెలంగాణలోని మేధావులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు ముందు ఉండి పోరాడాల్సిన అవసరం ఉంది.

(రచయిత సామాజిక కార్యకర్త)

వీ

(...12వ పేజీ తరువాయి)

సాధించడానికి కేంద్ర ప్రభుత్వం సహాయపడుతుందనీ, ఆంధ్రప్రదేశ్ లో రాజ్ భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, శాసనమండలి, తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందనీ, అటవీ భూమిని డినోటిఫై చేసి రాజధాని నిర్మాణానికి వీలు కల్పిస్తుందనీ సెక్షన్ 94 చెపుతాయి. పదమూడో షెడ్యూల్ లో విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్ ప్రస్తావన కూడ ఉంది.

ఇవన్నీ ప్రకటించినట్టుగా సక్రమంగా జరుగుతాయా అనేది ప్రశ్న. అలా జరిగినా ప్రస్తుతం ఉన్న అభివృద్ధి నమూనా ప్రకారం అది కేవలం సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు ప్రధానంగా ఉపయోగపడుతూ, అతి స్వల్పంగా ఎగువ మధ్యతరగతి ప్రయోజనాలు కూడ నెరవేర్చవచ్చు. నిజంగా ప్రజానుకూల అభివృద్ధి నమూనాకూ ఈ 'అభివృద్ధి పథకాల'కూ ఏమీ సంబంధం లేదు.

ఉన్నత విద్యావకాశాలు

భాగం 11 లో సెక్షన్ 95 ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ ఉన్నత, సాంకేతిక, వైద్య సంస్థలలో ప్రస్తుతం ఉన్న అడ్మిషన్ కోటాలు పది సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ఉమ్మడి అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది. విద్యారంగంలో తమకు అన్యాయం జరిగిందనే కారణంగానే లక్షలాదిగా తెలంగాణ విద్యార్థులు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోకి వచ్చారు. రాష్ట్ర విభజన వల్ల కోస్తా, రాయలసీమ విద్యార్థులకు విద్యావకాశాలు కొరవడుతాయనుకుంటే తప్పనిసరిగా వారికోసం ఆంధ్రప్రదేశ్ లో ఉన్నత విద్యాసంస్థలు నెలకొల్పవచ్చు. వాటికి విరివిగా నిధులు అందించి ప్రమాణాలు పెంచడానికి ప్రయత్నించవచ్చు. చట్టంలోని పదమూడో షెడ్యూల్ అటువంటి ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు గురించి మాట్లాడింది కూడ. కాని అదే సమయంలో తెలంగాణలోని విద్యాసంస్థలలో యథాస్థితిని పది సంవత్సరాల పాటు కొనసాగించడమంటే తెలంగాణ విద్యార్థుల అసంతృప్తిని మరొక పది సంవత్సరాలపాటు సజీవంగా ఉంచడమే అవుతుంది.

రెండు రాష్ట్రాలలో కొనసాగవలసిన పోరాటాలు

మొత్తం మీద నిశితంగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు ప్రతిపాదనలను ప్రకటించడం తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదు. ఇటు తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలన్నిటినీ భగ్నం చేయడంలోను, అటు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రయోజనకరమైన పథకాలను ప్రకటించక పోవడంలోను ఈ చట్టం నిజంగా ప్రజాద్రోహానికి పాల్పడింది. మరొకపక్క తెలంగాణ రాష్ట్రాన్ని నామమాత్రంగా ఏర్పాటు చేసి రాజకీయ వర్గాలకు, పాలకవర్గాలకు అధికారాన్ని అందించడంలో, ఆంధ్రప్రదేశ్ లో పోలవరంతో సహా భారీ నిర్మాణ కాంట్రాక్టులు వచ్చే అవకాశాన్ని కోస్తా, రాయలసీమ పాలకవర్గాలకు అందించడంలో ఈ చట్టం విజయం సాధించింది. రెండు రాష్ట్రాల ప్రజలు ఈ చట్టంలోని లోపాలకు, ఈ చట్టపు సంపన్న అనుకూల, బహుళజాతి సంస్థల అనుకూల దృక్పథానికి వ్యతిరేకంగా, ప్రజా ప్రయోజనాలు సాధించడం కోసం సాగించవలసిన పోరాటాలు మిగిలే ఉన్నాయి.

(రచయిత వీక్షణం సంపాదకులు)

అల్లరి చేస్తూ ఎదిగితే ఏమి సమస్య?

శారీరకంగా ఎదుగుదల లేని వికలాంగుల పట్ల సమాజంలో చిన్న చూపు ఉండకూడదనీ, వారికి మనోధైర్యాన్ని ఇచ్చి అన్ని రంగాల్లో ప్రోత్సహించాలనీ అంటున్నారు డా. సంధ్య మాలియె

'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెపుతోంది. ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థం అందులో ఉంది'. ఎస్. గోపాల్‌రెడ్డి దర్శకత్వం వహించిన 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమోరీస్' అనే సినిమా కోసం చంద్రబోసు రచించిన పాటలోనిది ఈ చరణం.

బ్యాక్‌గ్రౌండ్లో 'వికలాంగుల సహాయార్థం సంగీత విభావరి' అని సూచిస్తూ ఆర్ద్రతతో కూడిన బాణీలో ఈ గీతం సినిమాలోనూ, బయట ప్రేక్షకులకు కూడా కంటతడి పెట్టిచ్చింది. ఈ పాటను ఎంత పకడ్బందీగా రూపుదిద్దారంటే సూక్ష్మంగా ఆలోచిస్తే తప్ప ఇబ్బందిగా ఉంటుంది కాని, ఎక్కడ ఇబ్బందో అర్థం కాదు. ఒక పక్క అద్భుతమైన పదజాలం, భావోత్తేజాలతో కూడిన బాణితో, నిస్పృహలోనున్న నిరుద్యోగులను ఉత్తేజపరచేందుకు రూపుదిద్దబడింది, నిస్సహాయ పరిస్థితిలోనున్న వికలాంగుల ద్వారా తమ నిరుద్యోగులకు సందేశం ఇవ్వబడుతుంది. వికలాంగులు దయనీయమైన, నిస్సహాయ స్థితిలో ఉన్నారు. వారు ఎంత చేసినా ముందుకు వెళ్లలేరు. వారికి సహాయం చేయండి. మీరు మటుకు వారి నుండి స్ఫూర్తి తెచ్చుకొని ముందుకు వెళ్లండి. 'వారి చరితలు అంతులేనివి. వాటిని మార్చడానికి మీరు కావాలి' అని ఫీల్ గుడ్ ఫాక్టర్ అనే మానసిక సిద్ధాంతానికి అనుగుణంగా ఈ పాట కూర్చబడింది. మనకంటే ఉదాసీనులు, నిస్సహాయులు ఉన్నారు అని 'తమ పరిస్థితి ఎదుటి వాడి కన్నా మెరుగు' అని తమని తాము ఊరడించుకుంటూ ఉత్సాహ పరుచుకోవడమన్న మాట. వికలాంగుల మీద జాలి చూపెడుతూ వారి నుండి స్ఫూర్తి పొంది ముందుకు నడవడమన్నమాట.

వారి ధైర్యానికి (ఉన్నారో లేరో తెలియని) దైవాలు తలదించినా, స్వర్గాలు (ఎవరైనా చూశారా) సైతం తరించినా (తెలివిగల సభ్య సమాజ పదమాయజాలం) ఈ లోకంలో మటుకు వారి కష్టానికి ప్రతిఫలం, గుర్తింపు లేదు. వారి జీవితాలలో ఆశాజ్యోతి లేక, రాక నిరాశ పడి ఉన్నారు. కాని మీరు సకలాంగులు. మీరు నిరాశపడనవసరం లేదు. వికలాంగుల ధైర్యాన్ని, సంకల్పాన్ని చూసి స్ఫూర్తి తెచ్చుకొని ముందుకు నడవాలి. ఎందుకంటే మీ పరిస్థితి వారికన్నా మెరుగుగా ఉన్నది కాబట్టి మీకు మటుకు వారిలా కాక మంచి ప్రతిఫలం లభిస్తుంది. అప్పుడు మీరు వికలాంగులకు మార్గదర్శకులుగా జాలి చూపించి సహాయం చేయండి' అని నిగూఢంగా చెప్పబడింది.

పైన చెప్పినట్టు 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెపుతోంది. ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థం అందులో ఉంది'. అంటే సకలాంగులు సహజంగా అల్లరి చేస్తూ పెరుగుతారు. వికలాంగులు కాబట్టి అల్లరి చేష్టలకు తావులేదు, ఒదిగిమొదిగి మౌనంగా మాటలు రాని మొక్కలలాగా పెరుగుతారు. 'అందుకే వీరితో పాటను చిత్రీకరిస్తే మౌనంగా ఎదిగే మొక్కలతో ఉపమానం సరిగ్గా హత్తుకుపోతుంది' అనే సక్సెస్ ఫార్ములా అవలంబించి పాటను హత్తుకు పోయేలాగా చేశారు. కాని ఇది చాలా డామేజింగ్‌గా ఉంది. వికలాంగులు, అందునా అంధులైన పిల్లలు అందరి పిల్లలలాగే అల్లరి చేస్తూ పెరగరా? వైకల్యం ఉన్న పిల్లల బాల్యం కూడా అందరి పిల్లలలాగే మధురమైనది కాదా. వికలాంగుల దగ్గరకి వచ్చే టప్పటికి మౌనంగా, ఒదిగి మొదిగి ఉండాలని, ఆర్ద్రత, దీనత్వం, దయనీయత నిండిన పాటలు, మాటలు, బాణీలను సమకూర్చి, హీరో-హీరోయిన్స్ (సకలాంగులే) మాత్రం డాన్సులు వేస్తూ, ఆడపిల్లలని (హీరోయిన్స్) అల్లరిచేస్తూ, నూరు మందిని సైతం ఏకబిగిన వీరోచితంగా ఉత్త చేతులతో కొట్టే వీరత్వం సూచించే, హుషారు గొలిపే కథలు, మాటలు రాసి పాటలు, బాణీలు కట్టి చూపిస్తున్నారు. మానవతా విలువలను మన మనసులకి ఎట్లా మసి పూస్తున్నామనేది స్పష్టంగా అర్థమవుతుంది.

హైదరాబాద్‌లోని షాబాద్‌లో గల చిన్నజియర్ స్వామి వారి ఆశ్రమంలోగల 'నేత్ర విద్యాలయ' వెళ్లినప్పుడు అక్కడ పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. బ్యాట్‌కి చిరుగంటలు, బాల్‌లో చిరుమువ్వల శబ్దం చేస్తుంటే వారి శ్రవణేంద్రియాల ద్వారా శబ్దానికి అనుగుణంగా వారిదైన రీతిలో ఫీల్డింగ్, రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ చేసుకొని కేరింతలు కొడుతూ ఆడుకొంటున్నారు. 'డెఫ్ ఎనేబుల్డ్ ఇండియా' సంస్థ వారి ఆధ్వర్యంలో బెవకన్, ఇతర సంస్థలతో కలిసి స్పోర్ట్స్ మేళా గత ఫిబ్రవరి నెలలో జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించారు. అక్కడ పిల్లలు మాట్లాడలేరు, వినలేరు, తప్పితే వారిదైన 'సైన్ లాంగ్వేజ్'లో సంభాషించుకుంటూ ఎంతో ఉల్లాసంగా నడినెత్తిన సూర్యుడిని కూడా లెక్క చేయకుండా సుమారు 400 మంది వివిధ 'స్పీచ్ అండ్ హియరింగ్ ఇంపెయిర్డ్ స్కూల్స్' కు చెందిన పిల్లలు వివిధ రకాల ఆటలలో వారి చాతుర్యాన్ని ప్రదర్శించి బహుమతులు కూడా గెలుచుకున్నారు.

అదే చిన్న జియర్ స్వామి వారి ఆశ్రమ 'నేత్ర విద్యాలయం'లోని 52 మంది కంటిచూపులేని విద్యార్థులు గత మార్చ్ 2013లో స్క్రైబ్ సహాయం లేకుండా స్పీచ్ ఎనేబుల్డ్ జాస్ సాఫ్ట్‌వేర్ ద్వారా అందరి పిల్లలతో పాటు స్వతంత్రంగా ఇంటర్మీడియట్ బోర్డు ఎగ్జామ్, డిగ్రీ పరీక్షలు కూడా రాశారు. అడ్డంకులు తొలగించి సౌలభ్యాలు ఇవ్వగలిగితే వారు కూడా మిగిలిన పిల్లలలాగే అల్లరి చేస్తూ కేరింతలు కొడుతూ వారి ఆత్మవిశ్వాసంతో భావిభారత పౌరులుగా ఎదుగుతారు అని చెప్పడంలో సందేహం లేదు. ఛార్టర్డ్ అకౌంటెన్సీ ఎగ్జామ్ మనం అనుకునే తెలివిగల సకలాంగులైన పిల్లలే కోచింగ్ తీసుకుంటూ కింద పైన పడి కష్టం మీద పాస్ అవుతున్నారు. అటువంటిది దేవనార్ స్కూల్ ఫర్

బ్లైండ్‌కి చెందిన రాజశేఖర్ అనే కుర్రవాడు తన వైకల్యాన్ని పక్కన పెట్టి ఛార్టర్డ్ అకౌంటెన్సీ పరీక్ష పాస్ అయి చుక్కల్లో చంద్రుడిగా నిలిచాడు. ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నో, ఎన్నెన్నో. కాని వికలాంగుల శక్తి సామర్థ్యాలను అవగాహన చేసుకొనే సమర్థత, సరితూగే కొలమానాలు మనలో లేక వీరిని బలహీనులని, నిర్బలులని, నిస్సహాయులని ముద్రవేసి మన అవగాహనా లోపంతో 'వికలాంగుల సహాయార్థం' అనే ఈ 'చారిటీ షో'లు వారి హక్కుల నుండి దూరం చేసి వారిని నిస్సహాయులుగా ముద్రవేసి వారికి గుర్తింపు రాకుండా చేస్తున్నాయి. వారి ఆత్మాభిమానాన్ని ఖిన్నపరిచే ఈ ఆలోచనా విధానం వారి వైకల్యం కంటే వారిని ఎక్కువ బాధిస్తుంది. ఈ సో కాల్డ్ సఖ్యత్వ ప్రపంచంలో మన ఆలోచనలోపంవల్ల వారిని ముందంజ వేసే అవకాశం లేకుండా ఆపేస్తున్నాం. వారి భవిష్యత్తుని కాలదొక్కేస్తున్నాం.

ఒక ఇంజనీరింగ్ కాలేజీలో కొంతమంది విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నప్పుడు వారిలో ఒకరు 'గుడ్డివాళ్లను గుడ్డివారని కాక ఇంకేమని పిలవాలి' అని ప్రశ్నించారు. వారి వైకల్యంతప్ప వారికంటూ వేరే గుర్తింపు ఉండదు అన్నట్టు. అప్పుడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న రవి అనే విద్యార్థి 'ఏ టోన్లో, ఏ బ్యాక్‌గ్రౌండ్‌లో మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడుతారు అనేది ప్రధానం. గుడ్డివారు, అంధులు అనేవి పర్యాయ పదాలు కాదు' అని చెప్పారు. వీరు అన్ని భౌతిక, మానవీయ దృక్పథాలు, సంకుచిత ఆలోచనా విధానాలను, ప్రవర్తనల అడ్డంకులను, అవరోధాలను అధిగమించి విద్యను అభ్యసించ గలుగుతున్నారు. కాని చంద్రబోస్ అన్నట్టు 'సాగర మథనం మొదలవగానే విషమే వచ్చింది. కరెక్టే. కాని విసుగు చెందక కృషి చేసినా విషమే వస్తున్నది సార్. ఏ కోశాన, కోణాన చూసినా అమృతం వచ్చే సూచన కనిపించడం లేదు. వారి శక్తియుక్తులపై అవగాహన లేక, తెలుసుకోవాలనే అవసరం లేక, జాలి, అల్పులు, నిస్సహాయులు అనే ముసుగువేయడం వలన వికలాంగులకు ఉద్యోగాలు ఇచ్చి అన్నిరంగాలలో, హోదాలలో ముందుకు నడిపిస్తున్నవారు లేరు. ఒక వేళ ఉన్నా, వారి సంఖ్య అతి తక్కువ.

మీడియా చాలా శక్తివంతమైన మాధ్యమం. ఇవి దేశ చరిత్రలనే మార్చేయగలవు. దీనికి మార్కెట్‌రంగం తోడ్పాటు ఉంటే ఇంక తిరుగేముంటుంది. హీరో, హీరోయిన్స్ వేసుకునే దుస్తులని, హావ భావాలను, భాషను, హాస్యాన్ని ప్రజలు అనుకరిస్తున్నారు, మార్కెట్ ప్రోత్సాహంతో సినిమా అండ్ టి.వి. మీడియా కలిసి మెలిసి ఈ గ్లోబలైజెడ్ వరల్డ్‌లో చేదోడువాదోడుగా పని చేస్తున్నారు. జీరో సైజు అని, సిక్స్‌ప్యాక్ అని, ఫెయిర్ అండ్ సాఫ్ట్ స్కిన్ అని సహజత్వానికి దూరంగా ఒక 'సొంగమైన, సుకుమారమైన (స్త్రీలకు), కాయపుష్టి గల (పురుషులకు), తెల్లదనంతో కూడిన' రూపాన్ని సృష్టించి అందులో సరితూగగలిగిన వారే సమర్థులైన సకలాంగులని మిగిలిన వారి మీద కమెడియన్స్ ద్వారానో లేదా హీరో, హీరోయిన్స్ ద్వారానో అవహేళనా కరమైన హాస్యాన్ని మీడియా (సినిమా, టివి ప్రోగ్రామ్స్) సృష్టిస్తే (లావుగా ఉన్నారని, పొట్టిగా ఉన్నారని, నల్లగా ఉన్నారని ఇతరత్రా తులనలో సరిరాని/సరికాని వారి మీద), మార్కెట్ దానికి ఉపయోగానుగుణంగా వత్తాసు పలుకుతూ ముందుకు నడిపిస్తున్నది. వికలాంగులు ఈ మీడియా – మార్కెట్ కోఆప్టేషన్‌లో స్థానం సంపాదించుకోలేక నిర్బలులుగా, నిస్సహాయులుగా ముద్రవేయించుకోబడుతున్నారు. జనాలు వారు ముందుకు నడుస్తున్నా 'వారిని విధి కాటేసిన అసమర్థులు' అని మానవేతర వస్తువులుగా తీసిపడేస్తున్నారు.

నిజానికి వికలాంగులకు అలసత్వమంటే ఏమిటో తెలియదు. పుట్టినప్పటి నుండి ప్రతిక్షణం చెమట చిందిస్తూనే ఉన్నారు. కాని వారి నుదుటి రాత మార్చుకోలేక పోతున్నారు. మన తలరాతను బ్రహ్మ రాస్తారో లేదో తెలియదు కాని వీరి తలరాతను మాత్రం మనమే మన అవగాహనా రాహిత్యం వల్ల వారి శక్తి సామర్థ్యాలను గ్రహణం పట్టించి దైవాలు తలదించిన, స్వర్గాలు తరయించినా మనం మాత్రం కళ్లు మూసుకొని అందరిని ఒకే మూసలో పోసి చిన్నచూపు చూసి ముందంజ వేసే దారులను అవకతవక చిత్రీకరణ ద్వారా ఉదాసీనులని, నిస్సహాయులని ముద్రవేసి మూసేస్తున్నాం. ఎందుకు ఇంత చెపుతున్నా మంటే ఇది కొన్ని స్కూల్స్‌లో ప్రార్థనా గీతంగా, యూట్యూబ్‌లో 'మోటి వేషన్' సాంగ్‌లాగా వ్యాప్తి చెందింది. ఒక 'మేనేజ్‌మెంట్ స్కూల్' మీకు ఇష్టమైన స్ఫూర్తి గొలిపే పాట ఈ మధ్యకాలంలో వచ్చిన సినిమాలో ఏది అంటే కొంత మంది విద్యార్థులు ఈ పాట గురించి చెప్పారు. జనాల మీద, ప్రత్యేకించి యువత మీద ఈ పాట ప్రభావం చాలా ఉంది. ఈ పాటను చూసినప్పుడల్లా వీక్షించిన వారికి వికలాంగుల మీద జాలితో కూడిన కన్నీళ్లు వస్తాయి తప్పితే వారి సామర్థ్యాలు, యోగ్యత, ఆత్మాభిమానం, తమదైన ఒక వ్యక్తిత్వం, వారికంటూ అందరిలాగే కావలసిన స్వాతంత్ర్యం, హక్కులు, గుర్తింపు ఒకటి ఉందని, ఉంటుందనే భావన రానీయకుండా ఆర్ద్రతతో కూడిన బాణీలు కట్టి వారిని సమానులుగా కాక దయార్హులుగా రూపుదిద్ది, వికలాంగులను సినిమాని విజయం వరించే పథకంలో వాడుకున్నారు తప్పితే ఇది 'విన్–విన్ సిచువేషన్' కాదు.

ఈ మధ్య విడుదలైన ధూమ్–3 సినిమాలో అమీర్‌ఖాన్ సాహిల్, సమీర్ (ఆటిస్టిక్) అనే ద్విపాత్రలు పోషించారు. సాహిల్ అనే పాత్ర సమీర్‌ను 'నువ్వు బలహీనుడివి, చేతగానివాడివి. నేను లేకుండా నువ్వు ఏమి చేయలేవు' అన్నప్పుడు సమర్ 'నేను సమీర్‌ను. నేను బలహీనుడిని కాదు. నాకూ ఒక గుర్తింపు కావాలి. మనమిద్దరం ఒకటి కాదు. విడివిడిగా ఉండే ఇద్దరు మనుష్యులం' అని 'ప్రతి మనిషికి ఒక గుర్తింపు ఉంటుంది, అవసరము కూడా' అని ఆ సినిమా డైరెక్టర్ సమీర్ పాత్రను చాలా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌గా రూపుదిద్ది ప్రేక్షకులకు ఒక మంచి సందేశం ఇచ్చారు. సిరివెన్నెల, స్వాతిముత్యం సినిమాలలో వారి వైకల్యానికి కాక వారి సామర్థ్యాన్ని, కళను, కల్మషంలేని మనసులని, ఆలోచనా సరళిని ఆ పాత్రల ద్వారా జనాలు గుర్తించేలాగా దర్శకులు చిత్రీకరించారు. 'మయూరి' సినిమాలో నటించిన సుధాచంద్రన్ నిజ జీవితగాథను రామోజీ తెరకెక్కించి ఎంతో మందికి ప్రోద్బలం, మన స్థైర్యం కలిగించి, 'వికలాంగులు అసమర్థులు కారు' అని సకలాంగుల లోకానికి అవగాహనా బోధన చేసివారి సామర్థ్యాన్ని చాటుతూ, కమర్షియల్ హిట్ కొట్టి జైపూర్ ఫుట్‌ని ప్రమోట్ చేస్తూ దాని ఉపయోగాన్ని ప్రజలందరికి చాటి చెప్పారు. ఇది ఇటు మార్కెట్‌కు, సినిమా ప్రొడ్యూసర్‌కు, మనందరికీ 'విన్ – విన్ సిచువేషన్'. అడ్డంకులు తొలగించి కాస్త సౌలభ్యం కలిగిస్తే అన్నిటిలోనూ మేము కూడా సై అంటున్నారు వీరు.

మీడియా, మార్కెట్ అంతా తిమ్మినిబమ్మి చేయడం, బమ్మిని తిమ్మిని చేయడమే కదా. పాత్రను చిత్రీకరించడంలోనే అంతా ఉంటుంది. హీరోను విలన్‌గా, విలన్‌ని హీరోగా, హీరోను కమెడియన్స్,

కమెడియన్స్‌ని హీరోలుగా పాత్రలను రూపు దిద్దుతున్నపుడు, వికలాంగుల దగ్గరకు వచ్చేటప్పటికి మాత్రం అసమర్థులుగా, నిస్సహాయులుగా చిత్రీకరించి వారి గుర్తింపుకు సంకెళ్లు వేస్తున్నారు. మల్టీ హీరో సినిమాలు తీస్తున్నప్పుడు ఏ పాత్ర విలువ తగ్గకుండా ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఇస్తూ డైలాగ్స్, హీరోయిన్స్, పాటల జోష్ ఏవి తగ్గకుండా చేస్తారు. కాని వికలాంగుల గురించి మటుకు ఆ శ్రద్ధ ఎందుకు వహించరు? అంత నిర్లక్ష్య భావం ఎందుకు? వారి సామర్థ్యం మీద ఇంకా సందేహం ఎందుకు? ఈ మధ్య అమీర్ ఖాన్ స్టార్ టివి ప్రోగ్రాం 'సత్యమేవ జయతే'లో వికలాంగుల 'వీల్ ఛైర్' డాన్స్ చూసి మనమందరం పులకరించి పోలేదా. ఎంత మంది వికలాంగులు ఎన్ని విధాలుగా వారి వారి నైపుణ్యాలను, తెలివితేటలను అద్భుతంగా ప్రదర్శించడం లేదు. ఐనా ఎందుకు సకలాంగులమని అనుకుంటున్న మనకి ఈ సంశయం, చిన్న చూపు . ఇది వికలాంగులను చూసి వీరు కూడా పోటికి వస్తారని అభద్రతా భావమా?

ఈమధ్య టివిలో 'బ్లాక్' అని 'ఛాలెంజర్స్' అని వికలాంగులకు పాటల పోటీలు నిర్వహిస్తున్నారు. హర్షించ తగ్గ విషయమే. కాని 'స్పెషల్ ట్రైనింగ్' ఇచ్చి మెళుకువలు నేర్పి వారిని మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకు రాగలిగితే చాలా బాగుంటుంది. రామాచారి మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్, ఇతర మ్యూజిక్ డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు స్టేజికి సంబంధించిన, పబ్లిక్ పర్ఫార్మెన్స్, సినిమా రంగానికి ఉపయోగపడేటువంటి మెలకువలు మిగిలిన పిల్లలకు నేర్పించినట్లు వీరికి కూడా ప్రత్యేక శ్రద్ధతో నేర్పిస్తే వారి ఇన్‌స్టిట్యూట్స్‌కు నిండుతనం వస్తుంది. ఇది రెండు విధాలుగా ఉపయోగం. 1. వికలాంగులను మెయిన్‌స్ట్రీమ్‌లోకి తీసుకొని రాగలగడం. 2. మెయిన్‌స్ట్రీమ్‌లో ఉన్నామని అనుకుంటున్న మన మందరం వారి శక్తియుక్తులను గ్రహించి, వారిని చూసే వైఖరి జాలి, దయతో సహాయార్థం కోరే వారిగా కాక వారు కూడా గుర్తింపు ఉన్న పరిపూర్ణమైన వ్యక్తులుగా, వీరు కూడా మనలాగే సమానులు, సామర్థ్యం ఉన్న వ్యక్తులు అని ప్రజలకు అవగాహన తీసుకొని వచ్చి వారి వైఖరిలో మార్పు రాగలగడం. 2013 జూలైలో ముగిసిన 'పాడుతా తీయగా' అనే ఈ టివి వారి జూనియర్ లెవెల్ పాటల పోటీలో పరమేశ్వర్ రావు అనే బాలుడి అద్భుత ప్రదర్శన అందరినీ అలరించింది

ఈ మధ్య 'మిణుగురులు' అనే సినిమా అయోధ్య కుమార్ దర్శకత్వం వహించి చాలా బాగా తీశారు. ఇది కంటిచూపులేని వారి మీద సినిమా తీశారు. అందరూ అన్ని విధాలుగా బాగుంది అని అంటున్నారు. వికలాంగుల మీద స్పెషల్ ఫిల్మ్ ఆదరించడమే కాక వారిని కూడా సినిమాలో అందరి పాత్రల లాగే జాలితో కూడిన పాత్రలు, పాటలు కాక సమానమైన హోదా ఇస్తూ సినిమా, టివి ప్రోగ్రామ్స్ తీస్తే అవి పూర్తిస్థాయిలో వైవిధ్య భరితంగా, నిజానికి దగ్గరగా, నిండుగా ఉంటాయి.

కొంతమంది కంటిచూపులేని స్పెషల్ స్కూల్ విద్యార్థులను కలిసి 'మీకు ఏ హీరో ఇష్టం?' అని అడిగినప్పుడు ఆ పిల్లలు 'మెగా ఫామిలి కాక ఇంకెవరు' అని, మహేష్‌బాబు అని, జూనియర్ ఎన్‌టిఆర్, ప్రభాస్ లని సమాధానం ఇచ్చారు. కాని ఏ హీరోయిన్ ఇష్టం అని అడిగినప్పుడు మటుకు కాస్త తికమక పడ్డారు. 'అందరికి ఒక్కరో ఇద్దరో వాయిస్ ఇస్తారు. మాకు తేడా తెలియదు' అని సమాధానం చెప్పారు. అందుకని పాటలు రాసేవారు, బాణీలను కట్టేవారు, టివి ప్రోగ్రామ్స్, సినిమాలు తీసేవారు, నటవర్గం డైవర్స్ గ్రూప్‌ని మనసులో పెట్టుకొని ప్రోగ్రామ్స్, సినిమాలు తీస్తే బాగుంటుంది. వీరిలోను హీరోస్‌కి ఆర్డెంట్ ఫాన్స్ ఉన్నారు. సినిమా ప్రమోషన్ వైఖరి మారిన తరుణంలో హీరో హీరోయిన్స్, డైరెక్టర్, ప్రొడ్యూసర్, మొత్తం టీం ప్రజల మధ్యకు వెళ్లి మా సినిమా చూడండి అని దేశ విదేశాలకు వెళ్లి మరీ వారి సినిమాలను ప్రమోట్ చేస్తున్నారు. వీరిని కూడా ప్రేక్షకులుగా గుర్తుంచుకుంటే బాగుంటుందేమో. వీరు కూడా వీక్షకుల్లో భాగమే. ప్రపంచీకరణం ద్వారా మెగా ఆడియన్స్‌ని రీచ్ అయ్యాం. అందుకని సినిమా, టివి బాధ్యత కూడా చాలా పెరిగింది. వికలాంగులు కూడా కేరింతలు గొడతారు. మనిషికి మనిషికి వైవిధ్యం ఉన్నట్టు వీరి భాష, బాణీలో కొంచెం వైవిధ్యం ఉంటుంది. కాస్త సౌలభ్యాలు కలిగిస్తూ అందరిని ఒకే బాణీలో కట్టండి. జాలి, దయ అనే ముసుగుని తొలగించి వీరు మనతో పాటు సమానులే అనే భావనతో తప్పక ప్రాధాన్యతనిస్తూ ముందడుగు వేయాలి.

సామాజిక బాధ్యతను మనసులో పెట్టుకొని మనం చిత్రీకరించే వాటి మీద ప్రజలకు ఏ విధమైన ప్రభావం ఉంటుందో ఆలోచించాలి. పాటలో తప్పేమీ లేదు. అది చిత్రీకరించిన విధానం ఇబ్బందిగా ఉన్నది. ఆ పాట సినిమాలో చూస్తుంటే నాకు కూడా హీరో, మిగిలిన ఆడియన్స్ లాగే కన్నీళ్లు వచ్చినాయి. కన్నీళ్లు కాదు కావలసింది. చేయూతనిచ్చి సమానత్వ వైఖరి ప్రదర్శించాలి. మీ తప్పేమీ లేదు. మన చుట్టూ ఉన్న ప్రపంచం మనలను ఈ విధంగానే చూడడం నేర్పింది. వికలాంగులు చేతగాని వారని, దుర్బలులని, సహాయార్థులని మనం వారిని జాలి, దయతో కూడిన మనసులతో చూడాలని నేర్పింది. అట్లా కాకుండా వారు కూడా మనలో ఒకరిగా ఇంటిలో మన పెద్దవారు, స్కూల్స్‌లో మన గురువులు మనచుట్టూ ఉన్న సమాజం నేర్పగలిగితే ఆ విధంగానే రచించే వారు, చిత్రీకరించే వారు. కాస్త మసక బారిన రిథమ్ నుండి సహజ వైవిధ్యంతో గూడిన రచనలు, మాటలు, రాయగలిగినప్పుడు పాటలు, బాణీలు సమానమైన హోదా ఇస్తూ కట్టగలిగినప్పుడు మనం తీసే ప్రోగ్రామ్స్, సినిమాలు మనుషుల సంకుచిత దృక్పథాన్ని, ఆలోచనా విధానాన్ని, జీవనసరళిని మార్చగలిగినప్పుడు వాటి విలువ డబ్బు రూపేణానే కాకా మానవ విలువలను పెంచి సార్థకమవుతాయి. ఇదే యుఎన్‌సిఆర్‌పిడి (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ – ఐక్యరాజ్యసమితి వికలత్వం కలిగిన వ్యక్తుల హక్కులపై ఒడంబడిక) కోరుతుంది, కాదు ఆదేశిస్తుంది.

(రచయిత్రి పోస్ట్ డాక్టరల్ ఫెలో, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్, హైదరాబాద్) వీ

ఆదివాసుల మరణాలు

ప్రభుత్వం ప్రజా వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్, కార్పొరేట్ వైద్యానికి రాయితీలిస్తూ, ప్రాథమిక హక్కు అయిన వైద్యాన్ని పేదలకు అందకుండా చేస్తోందని అంటున్నారు **ఎం. నాగమణి**

ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపించడం గారడీవాళ్ల విద్య. అచ్చంగా మన్యంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కూడా దీన్నే పాటిస్తున్నారు. వ్యాధులతో ఏటా వందల సంఖ్యలో ఆదివాసులు ప్రాణాలు కోల్పోతున్నా, తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ఆదివాసుల మరణాలకు మొత్తం లెక్కలు చూపించడం లేదా? అంటే అదికాదు. ప్రసూతి, శిశు మరణాలతో పాటు మలేరియా, డయేరియా వంటి వాటితో మృత్యువాత పడుతున్నవారి సంఖ్యను చాలా తక్కువగా చూపిస్తున్నారు. ప్రభుత్వం అంతగా పట్టించుకోని వ్యాధులతో ఎక్కువగా మృతి చెందినట్లు రికార్డులకు ఎక్కిస్తున్నారు. ఇలా ఆదివాసుల మరణాల లెక్కలను మాయచేసి ప్రజలను నమ్మిస్తున్నారు. ఫలితంగా వాస్తవ మరణాలకు సంబంధించిన సమాచారం బయటకురాక, సరైన వైద్య సేవలు అందక ఏటా వందల సంఖ్యలో ఆదివాసుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

విశాఖ మన్యంలో వివిధ వ్యాధులతో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. 2005 నుండి 2012 వరకు వ్యాధులతో 2044 మంది ఆదివాసులు మృతి చెందారు. ఇందులో సగభాగం పసి పిల్లల మరణాలు ఉండడం విశేషం. సున్నా నుండి 5 ఏళ్ల గలవారు 775 మంది మృతి చెందగా డయేరియా, మలేరియా, క్షయ, మెటర్నటీ, ఆస్తమా మరణాలు 1,350 వరకు నమోదయ్యాయి. ఆస్తమాతో 5 ఏళ్లలో 694 మంది ఆదివాసులు మరణించారు.

ఓవైపు మన్యంలో అనారోగ్య మరణాలు తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం చెపుతున్నా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అరకొర వైద్య సేవలు, మందుల కొరత, సకాలంలో వైద్య సేవలు అందక ఆదివాసులు ప్రాణాలు కోల్పోతున్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందక జన్మించిన శిశువు రక్తహీనత వంటి వ్యాధులతోనే మృత్యువు ఒడికి చేరుకుంటున్నారు. తప్పుడు నివేదికలతో కాలం వెళ్లదీస్తున్న అధికారులకు నమోదు అవుతున్న మరణాల సంఖ్య చెంపపెట్టు అవుతున్నాయి.

మన్యంలో ఆరోగ్యసేవలు అందించడానికి ప్రవేశపెట్టిన ఫిక్ పాయింట్ ప్రోగ్రాం సక్రమంగా అమలు జరగడం లేదు. ఏజెన్సీ 11 మండలాల్లో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 56 మంది వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా 45 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో చాలా మంది తాత్కాలిక సిబ్బంది కావడంతో విధులు సక్రమంగా నిర్వహించడం లేదు. గ్రామంలోని 'ఆశ' కార్యకర్తల వద్ద అవసరం మేరకు మందులు ఉండడం లేదు. క్షేత్ర స్థాయిలో ఉండాల్సిన ఆరోగ్య సహాయకులు, ఎఎన్ఎం, ఎంఎచ్ పర్యవేక్షకులు పూర్తిస్థాయిలో లేకపోవడం, సిబ్బంది స్థానికంగా లేకపోవడంతోపాటు, ఆదివాసుల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి మూలంగానూ, ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం కొరవడడం వలన కూడా ఆదివాసులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

తప్పుడు నివేదికలు

మన్యంలో వివిధ వ్యాధులతో సంభవిస్తున్న మరణాలపై ఉన్నతాధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు అందిస్తున్నారు. మలేరియా, డయేరియా, పసిపిల్లల మరణాలు పరిమితంగా చూపిస్తూ, మిగత వాటిని ప్రభుత్వం అంతగా పట్టించుకోని క్షయ, ఆస్థమా వటి మరణాలుగా రికార్డులకు ఎక్కిస్తున్నారు. దీనివల్ల వాస్తవ పరిస్థితులు బయటకు రావడం లేదు. ఉదాహరణ ఏజెన్సీలో 2010లో మొత్తం 2,198 మంది మరణించారు. ఇందులో మలేరియాతో 11, పసిపిల్లల మరణాలు 65, ప్రసూతి మరణాలు 13, క్షయతో 42, ఆస్తమాతో 84, ఇతర మరణాలు 1,983గా చూపించారు. ఆ ఏడాది డయేరియా మరణాలు అసలు లేవని అధికారులు తేల్చారు. అదే ఏడాది మన్యంలో మలేరియా విజృంభించి వందల సంఖ్యలో మరణాలు సంభవించాయి. పాడేరు మండలం, లింగాపుట్టు గ్రామంలోనే 20 మందికి పైగా మలేరియాతో మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అయినప్పటికీ అధికారులు వాస్తవ పరిస్థితులను దాచిపెట్టడం గమనార్హం.

ఆందోళనకరంగా శిశు మరణాలు

మన్యంలో సంభవించిన శిశు మరణాలు ఆందోళన కలిగే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో శిశు మరణాల రేటు 53 శాతం ఉంది. ఈ ఆరేళ్లలో 775 మంది చిన్నారుల ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. వీటితోపాటు ప్రసూతి మరణాలు 65 ఉన్నాయి. ఆదివాసి మహిళలలో ప్రతి 1000 మందికి 80 మంది ప్రసవ సమయంలో బిడ్డతో సహ తల్లులు కూడా మృత్యువాత పడుతున్నారు. రాష్ట్రంలో ప్రసవ సమయంలో చనిపోయే మహిళల సగటు 3.65 శాతంగా ఉంది.

కబళిస్తున్న క్షయ

మన్యంలో ఆస్థమా, క్షయ వంటి భయానక వ్యాధులను విస్మరిస్తున్నారు. దీంతో ఈ వ్యాధులు చాపకింద నీరులా విస్తరించి ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. 2005 నుండి 2012 మధ్యకాలంలో క్షయ, ఆస్తమా వ్యాధులకు గురైన వారికి సరైన వైద్యసేవలు అందక

1,108 మంది ఆదివాసులు మృతి చెందారు. ఉదాహరణ హుకుంపేట మండలం, సీసాయి పనుకులో క్షయ వ్యాధితో గత నాలుగేళ్లలో 20 మందికి పైగా ఆదివాసులు మృతిచెందారు. ఈ వ్యాధులపై అధికారులు దృష్టి సారించడంలో తగినంత ప్రణాళికబద్ధంగా లేరనేది స్పష్టమవుతోంది. నేటికి 90 శాతం ఆదివాసులు కనీస వైద్య సౌకర్యాలు లేక జీవిస్తున్నారు. 49 శాతం ఆదివాసులు పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారు. 65 శాతం ఆదివాసులు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. 90 శాతం రక్తహీనతతో బాధ పడుతున్నారు. పౌష్టికాహారం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, అధికారుల, రాజకీయ నాయకుల, సిబ్బందీ అక్రమాల వల్ల లబ్ధిదారులకు చేరడం లేదు. ఫలితంగా పౌష్టికాహారం అందక ఆదివాసుల్లో రక్తహీనత ఏర్పడి, రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులకు గురై మృత్యువాత పడుతున్నారు. మన్యంలో మలేరియా మరణాలు, పిల్లల పౌష్టికాహార లోపాలు, గర్భిణీల్లో రక్తహీనత, అవిద్య, అజ్ఞానం, భూమి విస్థాపనం, సామాజిక వివక్ష వంటి సమస్యల తోరణాలు ఒకవైపు. మరొకవైపు ప్రపంచీకరణ పల్లవిస్తున్న ఈ తరుణంలో అభివృద్ధి పేరుతో సాగిస్తున్న పారిశ్రామికీకరణ వల్ల నేడు ఆదివాసులు మనుగడ కోసం పెనుగులాడుతున్నారు.

విలువైన కలప కొరకు ఆదివాసుల అడవిని దొంగిలించడంతోపాటు, ప్రకృతి, పండ్లు, జీవులతో ఆదివాసులకు ఉన్న అనుబంధాన్ని చంపేశారు ఆధునిక పాలక ఆసాములు. ఆదివాసి వ్యవసాయ జీవనం, జీవవైవిధ్యం అడవి వైవిధ్యం మధ్య ఉన్న అనుబంధాన్ని చిన్నాభిన్నం చేసేశారు. నూతన ఆర్థిక విధానాల అమలు క్రమంలో ఆదివాసుల ఆహార పంటలన్నీ తుడిచి పెట్టుకుపోయాయి. ఆహార పంటల పోకతో ఆరోగ్యమూ, ఆయుషు, వైవిధ్య జీవనం అన్ని పోయాయి. శారీరక దృఢత్వానికి, ఆనాటి సహజ పోషకాహార పంటలకు దృఢమైన సంబంధం ఉంది. భారీ లాభాలనిచ్చే విదేశీ కంపెనీల వివిధ విత్తనాలను తిష్ట వేయించడానికై ఆదివాసుల సమస్త జనుల విత్తన వైవిధ్యాన్ని పాలకులు ధ్వంసం చేశారు. దీంతో శక్తిని, ఆరోగ్యాన్నిచ్చే ఆహారం ఆదివాసులకు మృగ్యమైంది. తమవి కానీ పంటలతో ఆహార సంక్షోభం పెరిగి ఆదివాసుల జీవితాలకు అభద్రత భావం నెలకొంది. అందుకే రక్తహీనత, పోషకాహార లోపంతో ఎప్పుడు ఆదివాసులు మరణిస్తారో తెలియని దౌర్భాగ్య పిరిస్థితులు సృష్టించ బడ్డాయి. ఆదివాసుల మరణాలకు, రక్తహీనతకు, పోషకాహార లోపానికి, ఆరోగ్యానికి ఆయుషునిచ్చే ఆహార పంటల అదృశ్యానికి, ఇతర పంటలు ప్రధానమైన దానికి మధ్య ప్రాణపదమైన సంబంధం ఉంది. ఆదివాసులు ఉద్యమ పంథా వీడకుండా, చైతన్యంతో ఎప్పటికప్పుడు పోరాడితేగాని పాలకులు ఆ సమస్యలను పరిష్కరించరు. అయితే ఆదివాసుల మరణాలకు ఇదొక్కటే కారణం కాదు. నాణేనికి రెండు (బొమ్మ, బొరుసు) ముఖాలు ఉన్నట్లే ఆదివాసుల మరణాలకు కూడా అనేక కారణాలు ఉన్నాయి. అదేమిటో చూద్దాం.

ఇక మన్యంలో ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు. అదే విధంగా వైద్యాన్ని కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈరోజు చిన్న జ్వరానికి కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు దొరకని పరిస్థితి. ప్రభుత్వం తనంత తానుగా ప్రభుత్వరంగంలో వైద్యాన్ని నాశనం చేసి ప్రైవేట్ వైద్యానికి, కార్పొరేట్ తరహా వైద్యానికి రాయితీలిచ్చి పోషిస్తోంది. పేద ప్రజలకు, ఆదివాసులకు వైద్యం అందకుండా చేస్తోంది. పాలకుల దృష్టిలో రోగం అనేది డబ్బు సంపాదించే బంగారం లాంటి అవకాశంగా మారిపోయింది. దీంతో చాలా మంది వైద్య వృత్తిలో ఉన్న వైద్యుల్లో ఒక తప్పుడు భావన నెలకొని ఉంది. మూటలకొద్దీ డబ్బు సంపాదించే స్వప్నాలతో ఈ వృత్తిలోకి చాలా మంది వస్తున్నారు. దీంతో వైద్య వృత్తి ఒక సామాజిక బాధ్యత అనే భావాన్ని మరచిపోయి, సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. 'రోగులు ఎక్కువ వస్తే ఈ సీజన్ బాగుంది' అనుకునే రకాలు వీళ్లు. 'దేవుని తర్వాత దేవునంతటివాడు వైద్యుడు' అనేది పాత నానుడి. దేవుడేమో కంటికి కానరాడు, వైద్యుడేమో ఫంక్తు వ్యాపారి అయ్యాడు. మన్యంలో వైద్యుడు లేడు. డబ్బుంటే వైద్యం ఉంటుంది. లేకుంటే మృత్యువే గతి.

మొత్తం మీదా చూస్తే మహానగరాల్లో లెక్కలేనన్ని ఆసుపత్రులు, డాక్టర్లు ఉన్నా వైద్యం పౌరులకు అందని యాని పండే. నగరాల్లోని మురికి వాడల్లో ఉండే రోగాలూ, రోష్టులూ, అడవిలో లేకపోయినా ఇరుచోట్ల పరిస్థితుల్లో పెద్దగా తేడా లేదు. అక్కడైనా, ఇక్కడైనా పేదరికమే వైద్యానికి, రోగికి మధ్య అడ్డుగోడలా నిలుస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ వాల్డెన్ బెల్లో మాటల్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అందరికి సరిపడినంత ఆహారం ఉంది. కానీ విషాదం ఏమిటంటే ఒకపక్క వేలాది, లక్షలాది మంది పిల్లలు, పెద్దలు, మహిళలు, పోషకాహార లేమితో, కరువుతో అలమటిస్తుంటే, ధనికులు పొట్టలు నింపే విధంగా ప్రపంచంలోని ఆహార వనరులు, పశువులు బందీ అయిపోయాయి. అక్షరాల ఆదివాసి ప్రాంతంలో జరుగుతున్నది ఇదే! ఒకవైపు మన్యంలోని కొండలలో జరుగుతున్న అక్రమ మైనింగ్ (బాక్సైట్)ను అరికట్టలేని ప్రభుత్వం, తాను స్వయంగా మద్దతిచ్చి ప్రోత్సహిస్తున్న పారిశ్రామికీకరణను నియంత్రించుకోలేని ప్రభుత్వం మరోవైపు ఆదివాసుల ప్రగతి, అభ్యుదయం వంటి బూటకపు మాటలతో వారి కన్నీళ్లు తుడవడానికి కర్చీపులు సిద్ధం చేస్తే వాటిని నమ్మడమెలాగ? అందరికి ఆరోగ్యం అనే రాజ్యాంగ మౌలిక భావనను తుంగలో తొక్కి 'డబ్బున్న వాడికే వైద్యం' అంటూ కొత్త నిర్వచనాలిస్తూ మోసగిస్తున్న ప్రభుత్వ విధానాలకు, నిజాయితీలేని తనాన్ని నిలదీయడానికి ఆదివాసులు నడుంభిగించాలి. ఆదివాసుల చావులకు కారణం నడుస్తున్న ఈ చరిత్రను తిరగరాయడమే ఆదివాసుల ముందున్న తిరుగులేని కర్తవ్యం.

(రచయిత ఆదివాసి ఉద్యమ కార్యకర్త)

ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం, సమాచారం ఈ ఎలక్ట్రానిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు రాయడం గానీ, ఫోన్ చేసి చెప్పడం గానీ చేయాలి. అలాగే, బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు బదిలీ చేసినప్పుడు అది ఎందుకో వివరాలు వీక్షణం కార్యాలయానికి ఫోను ద్వారా గాని, కార్డు ద్వారా గాని తెలపాలి. – సం.

మరో యుద్ధ భూమిగా మారనున్న విశాఖ

***మన్యం ప్రాంతాలలోని ఖనిజ వనరులను దోపిడీ చేయడానికి పాలకులు ఆదివాసులపై ప్రత్యక్ష యుద్ధానికి పాల్పడుతున్నారనీ, నిత్యం సాయుధ బలగాలతో బహుళజాతి కంపెనీలకు అండగా నిలుస్తున్నారనీ అంటున్నారు* కొర్ర జ్యోతి**

మన దేశ పాలకులు 2009 ఆగస్టు నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ఆదివాసులపై, వారి గ్రామాలపై బహుముఖ దాడిని ప్రారంభించారు. ఈ దాడుల్లో దేశ వ్యాప్తంగా వందల మంది ఆదివాసులు చనిపోయారు. వేలాది మంది నిర్వాసితులు అయ్యారు. సామ్రాజ్యవాదుల స్వప్రయోజనాల కోసం పాలకులు (సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, చిదంబరం, జైరాం రమేష్, సుశీల్‌కుమార్ షిండే) 2008లో వచ్చిన ద్రవ్య అర్థిక సంక్షోభం నుండి బయట పడడానికి పడరానిపాట్లు పడుతున్నారు. ముఖ్యంగా దేశంలో చత్తీస్‌గడ్, జార్ఖండ్, బీహార్, ఒడిశా, బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై అమెరికా సామ్రాజ్యవాదుల దేగకన్ను పడింది. ఈ ప్రాంతాల్లో ఉక్కు, ఇనుము, బాక్సైట్, ఫైబర్, సీసం, బంగారం లాంటి రకరకాల ఖనిజాలు ఉన్నాయి. ఈ ఏడు రాష్ట్రాల పరిధిలో ఉన్న ఆదివాసులు అడవిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. 1947కు ముందు నుండి (ఎంఎన్‌సి, సిబిబి కంపెనీల ద్వారా) ఐదు లక్షల మందికి పైగా ఆదివాసులు నిర్వాసితులుగా మారినారు. ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. రాబోయే కాలంలో భారీ ప్రాజెక్టుల ద్వారా ఆదివాసుల నిర్వాసితుల సంఖ్య పెరగనుంది. ఆదివాసి మనుగడే ప్రశ్నార్థకంగా మారనుంది.

విశాఖ ఏజెన్సీలో 11 మండలాలు ఉన్నాయి. అందులో నాలుగు మండలాల పరిధిలో బాక్సైట్ తవ్వకాల ప్రమాదం తీవ్రంగా ఉంది. ఈ నాలుగు మండలాల పరిధిలో 247 గ్రామాలు, 9,312 కుటుంబాలు నిర్వాసితులుగా మారనున్నాయి. ఇక అరకు నుండి తూర్పు గోదావరి గుర్తెడ్ వరకు 384 కిలోమీటర్ల పొడవునా 24 కొండలు 4200 హెక్టర్ల పరిధిలో 1000 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. బాక్సైట్ వెలికి తీయడం కోసం ప్రతి సంవత్సరం జెర్రెల ప్రాంతం నుండి 4.5 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను తరలించనున్నారు. దీనికోసం 16 టన్నుల టిప్పర్లను వినియోగిస్తే ప్రతి సంవత్సరం 2.81 లక్షల లోడ్లు తరలించాల్సి ఉంటుంది. అంటే ఆయా లారీలు రోజుకు 770 ట్రిప్పులు తిరగాల్సి ఉంటుంది. దీని ద్వారా వచ్చే దుమ్ము, ధూళి సోకి రోగమొస్తే ఆదివాసుల బతుకులు గాలిలో దీపంలాగా మారనున్నాయి. మన పాలకులు ఇలాంటి ప్రమాదాలను పెడచెవిన పెడుతున్నారు.

ఖనిజ తవ్వకాలకు అనుబంధంగా గ్రీన్‌హంట్ దాడులను దేశ వ్యాప్తంగా తీవ్రతరం చేస్తున్నారు. విశాఖ మన్యంలో గత మూడు సంవత్సరాల నుండి (ఆంధ్ర–ఒడిశా – బార్డర్) పోలీసులే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. ఒక పక్క ఏజెన్సీ పంచాయితీలలో నెలల తరబడి 500 – 700 మంది సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, గ్రేహౌండ్స్ పోలీసులను మోహరిస్తూ దాడులు, హత్యలు, అరెస్టులు, లూటీలు, బూటకపు సరెండర్స్, అత్యాచారాలు చేస్తున్నారు. మరోపక్క ఐపిఎస్ అధికార్ల ద్వారా దుప్పట్లు, చీరలు, మంకీ క్యాప్‌లు, నెట్లు, బాలు, సైకిల్ మంచినీటి కుండీలు విలాస యాత్రల ఖర్చులు లాంటివాటి ద్వారా ఆదివాసి యువకులను మభ్యపెడుతున్నారు. గత మూడు సంవత్సరాల నుండి పదిమంది ఆదివాసులను బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా హత్య చేశారు. ఈ మధ్య కాలంలో 2014 జనవరి 11న చీకటిపల్లి కొండలపై వేటకోసం వెళ్లిన నలుగురు ఆదివాసులపై బిఎస్‌ఎఫ్ పోలీసులు కనీసం అటకాయించకుండానే విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రంఘో అనే ఆదివాసి (సువ్వపల్లి గ్రామస్తుడు) అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌కు ఎప్పటిలాగే కట్టుకథని అల్లారు. కనీసం మీరు ఎవరు అని ప్రశ్నించాల్సిన బాధ్యతను మరిచి (ఉల్లంఘించి) ఫైర్ చేశారు. పైగా ఈ పోలీసులపై కేసు నమోదు చేయకపోగా, ఆ గ్రామస్తులను చితకబాది నలుగురిని గాయపర్చారు. కనీసం కడచూపు కోసం శవాన్ని కూడా అందకుండా చేశారు.

దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన బిఎస్‌ఎఫ్ పోలీసులు ప్రాణం విలువ కూడా తెలియకుండా వ్యవహరిస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుండి ఏజెన్సీ పరిధిలో కార్పెట్ సెక్యూరిటీని పెంచుతూ వస్తున్నారు. ఈ మధ్య కాలంలోనే పెద్దవలసలో క్యాంపు (అవుట్ పోస్ట్) ఏర్పాటు పూర్తి చేసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాలను కోరుకొండ, జెర్రెల, సప్పర, దారకొండ, బూసుపుట్, మద్దిగరువు లాంటి ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఏర్పాట్ల వైపు సన్నహాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన పాత క్యాంపులు (అవుట్ పోస్టుల్ని) 63 దగ్గర పూర్తి చేయాలని చూస్తోంది. (ఈ 63 అవుట్ పోస్టులు 1985లో ఎన్‌టి రామారావు హయాంలో ఉన్నవి) ఈ 63 అవుట్ పోస్టులు ఏర్పడితే 1975 ఎమర్జెన్సీని మరోసారి చవిచూడాల్సి ఉంటుంది. 1975 ఎమర్జెన్సీ కానీ 1985 అప్రకటిత యుద్ధాన్ని కానీ, ఏజెన్సీ ఆదివాసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఒక పక్క దేశానికి మేము రక్షక భటులమంటూ, ఐపిఎస్ అధికారులు ప్రజల ముందు ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఇదే నిజం అంటూ మన పాలకులు సంకలు ఎగరవేస్తున్నారు. గత నవంబర్ 9 నుండి జనవరి 10 వరకు మనదేశ రక్షక భటులు దళారీ నిరంకుశ వర్గమైన సామ్రాజ్య వాదుల ఆస్తుల కోసం (ఎస్ఆర్ కంపెనీ పైపుకోసం) పడరాని పాట్లు పడ్డారు. ఎస్ఆర్ కంపెనీ పైపుని మూడు రాష్ట్రాల ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకించడం, అడ్డుకోవడం, వెల్డింగ్‌లు ఊడదీయడం లాంటివి చేస్తుంటే, ఎస్ఆర్ కంపెనీ ప్రయోజనాలను కాపాడడానికి మన రక్షక భటులు (పోలీసులు) కంపెనీ యాజమాన్యంతో కలిసి పైపు వెల్డింగ్ దగ్గర ఉండి చేయించారు. అంటే దళారీ నిరంకుశ, భూస్వామ్య వర్గాలు, సామ్రాజ్యవాదుల రక్షణ కోసం మన దేశ రక్షక భటులు ఎంత అంకితం అయ్యి ఉన్నారో చూడండి. పైగా పైపుని అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామంటూ ఆదివాసులను మరీ దగ్గర ఉండి బయటపెట్టడం

కుల సమస్య - మార్క్సిస్టు అవగాహన - ఒక నోట్

భారత సమాజంలో అతి ముఖ్యమైన, క్లిష్టమైన కుల సమస్యను మార్క్సిస్ట్ దృక్పథం నుంచి ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్నపై మావోయిస్టు రాజకీయ ఖైదీల మధ్య జరిగిన చర్చను వివరిస్తున్నారు **రవి**

సాధారణంగా కుల సమస్య – కుల నిర్మూలన గురించిన చర్చలో తరచుగా మార్క్సిస్టులు కులం–వర్గాల మధ్య ఉన్న సంబంధం గురించిన ప్రశ్నను ఎదుర్కొంటారు. కులం ప్రాథమికమైనదా? వర్గం ప్రాథమికమైనదా? భారత సమాజంలో గుణాత్మక మార్పు తేవడానికి ప్రాతిపదికగా ఉండాల్సింది కులమా లేక వర్గమా అనే ప్రశ్న కానీ, భారతదేశ ప్రత్యేక పరిస్థితిలో కులమే వర్గమా అనే ప్రశ్న కానీ సర్వ ప్రథమంగా ఎదుర్కొనే ప్రశ్న. దానికి తోడు కులం పునాదిలో అంతర్భాగమా లేక ఉపరితల అంశమా అనేది కూడా గత ఏడెనిమిది దశాబ్దాలుగా మార్క్సిస్టులకు, అంబేద్కర్‌వాదులు / దళితవాదులకు మధ్య నలుగుతున్న ప్రశ్న. ఈ అంశాలతోనే కులసమస్యపై చర్చను ప్రారంభించటం సముచితంగా ఉంటుంది.

కులం–వర్గం మధ్య సంబంధం

వర్గాలంటే ఏమిటి?

‘ఉత్పత్తి సాధనాలతోనూ, సామాజిక శ్రమ సమీకరణలో తమ పాత్రతోనూ తత్ఫలితంగా సామాజిక సంపదలో వారి వాటా పరిమాణంతోనూ, దాన్ని సంపాదించే పద్ధతితోనూ ఉండే సంబంధం (చాలా సందర్భాలలో ఈ సంబంధాన్ని చట్టం ద్వారా రూపొందించి స్థిరీకరించడం జరుగుతుంది) ద్వారానూ, చారిత్రకంగా నియతమైన సామాజిక ఉత్పత్తి విధానంలో వారు ఆక్రమించే స్థానం ద్వారానూ, ఒకరితో ఒకరు భిన్నంగా ఉండే విశాల ప్రజా సమూహాలే వర్గాలు’ – లెనిన్.

కుల వ్యవస్థలో వివిధ కులాల మధ్య సంబంధాలను పై సూత్రీకరణ ఆధారంగా విశ్లేషిస్తే కులం చారిత్రకంగా వర్గం యొక్క రూపమే. భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో ఆవిర్భవించిన వర్గ సంబంధాల నిర్దిష్టరూపమే కులం తప్ప మరొకటి కాదు. ఉత్పాదన సంబంధాలలో ఒక వ్యక్తి స్థానమేంటి అనేది కుల వ్యవస్థ నిర్ణయాత్మకంగా, ఖచ్చితంగా నిర్ణయించింది. చారిత్రకంగా చూసినప్పుడు కులాన్ని వర్గం కంటే భిన్నమైనదిగా చూడటం సరియైంది కాదు. అంబేద్కర్ కులాన్ని “దడి కట్టుకున్న వర్గం’గా అభివర్ణించినప్పుడు ఈ అవగాహన ఒక మేరకు ప్రతిఫలించింది కానీ దానిని ఆయన కానీ, మరెవ్వరు కానీ మరింత వివరించడానికి, పెంపొందించడానికి ప్రయత్నం చేయలేదు.

అయితే సమస్త దృగ్గోచర విషయాలన్నీ నిరంతరం మార్పు చెందుతూ ఉండటమనేది ఒక పరమ సత్యం. అట్లాగే కులం కూడా దాని పుట్టుక నాటి నుండి పరిణామ రహితంగా లేదు. అది మారుతూ ఉంది. అట్లాగే కులం –

చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో నవంబర్ 8న 5000 మంది ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న హోంగార్డ్‌ని ప్రజలు పట్టుకొని ప్రజా కోర్టులో పెట్టి చంపితే దీన్ని సాకుగా చూపుతూ నవంబర్ 9 నుండి జనవరి 10 వరకు ఎడ తెరపిలేకుండా గ్రామాలపై కూంబింగ్‌లు, దాడులు చేశారు. ఈ ప్రాంత ఆదివాసి పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న అప్పారావు, నాగేశ్వరరావు, గణపతి, నాగేష్‌పడాల్, చిన్నబాబు, బాస్కరరావు, మల్లేశ్వరరావులను లొంగి పోవాల్సిందిగా పదేపదే నోటిస్‌లు పంపడం, ఇండ్లపై దాడులు చేస్తున్నారు. వంతల మల్లేశ్వరరావు ఇంటి పై వారంలో మూడుసార్లు దాడిచేసి రు. 25,000 డబ్బు, 20,000 బంగారం లూటీ చేశారు. పైగా ఈ ఆదివాసి నాయకులపై విష ప్రచారానికి పూనుకున్నారు. వీరు సోషల్ అడిట్‌ని బెదిరించి 95 లక్షల అవినీతి చేసినట్లు మీడియా ద్వారా ప్రచారానికి పూనుకున్నారు. వాస్తవానికి సోషల్ అడిట్‌కు ఈ నాయకులకు సంబంధం లేదు. అది 95 లక్షలు కాదు అని సోషల్ అడిట్ తర్వాత బ్యాలన్స్‌ను చూస్తే 53 లక్షలు మాత్రమేనని తేలింది. పైగా ఈ అవినీతికి, ఆదివాసి నాయకులకు సంబంధం లేదని సోషల్ అడిట్ స్వయాన అంగీకరించాడు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడంలో సామ్రాజ్యవాదులకు గ్లోబల్ ప్రచారకర్తగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ ఇరువురు ఒఎస్‌డి దామోదర్, ఎస్‌ఐబి వెంకట్రావులు (సిఐ) బాగా ఉపయోగపడుతున్నారు. వీరు అవినీతి పరులను పట్టుకునే అధికారులే అయితే ఏజెన్సీ ప్రాంతం ప్రతి స్కూల్, ప్రతి హాస్టల్ ప్రతినెల నీళ్లల మింగి బ్యాంక్‌లో కూడబెట్టిన గిరిజన మంత్రి బాలరాజుని నిలదీసే ధైర్యం ఈ ఐపిఎస్ అధికారులకు ఉందా? కనీసం సోదచేసే ధైర్యం ఉందా అంటే రెండు లేవని చెప్పుకోవాలి. ఇలాంటి అవినీతిపరులను పోషించేది, కాపాడేది కూడా ఈ రక్షక భటులే! పీడిత ప్రజల రక్తంతో కట్టిన బలవంతులలో చదువుకున్న ఈ ఐపిఎస్ అధికారులకు పీడిత ప్రజల బాధ ఎలా అర్థం అవుతుంది.

మన్యం ప్రజల్లారా గత మూడు సంవత్సరాల నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడులతో విశాఖ మన్యాన్ని యుద్ధభూమిగా మార్చి వేస్తున్నారు. ఈ మధ్య కాలంలో యుద్ధ సన్నహాల కోసం ఏజెన్సీ మండలాల పరిధిలో తొమ్మిది మండలాల్లో హెలీప్యాడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అంగీకారం తెలుపగా, నాలుగు మండలాల పరిధిలో హెలికాప్టర్ల నిర్మాణం పూర్తి చేసుకుంది. మరో ఎనిమిది అవుట్ పోస్టుల కోసం సన్నాహాలు స్పీడప్ చేస్తుంది. ఈ తొందరపాటు చర్యలను చూస్తే రాబోయే రోజుల్లో మరిన్ని దాడులకు గురిచేసి, ఇక్కడ ఉన్న బాక్సైట్ ఖనిజాన్ని తరలించడం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నాల్లో భాగమే ఈ హెలిప్యాడ్లు, అవుట్ పోస్టు నిర్మాణం. మన్యం ప్రజల్లారా మీరు ఇప్పుడు కానీ సాయుధులు కాకుంటే మీకు ఈ ప్రాంతంలో జానెడు భూమిని కూడా మిగలకుండా ఈదేశ పాలకులు చేస్తారు. మీ భూమిని కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యమై సాయుధంగా తిరగబడాలి. భూమిని, అడవిని, నీరుని కాపాడు కోవడానికి సాయుధులై కదం తొక్కాలి.

(రచయిత ఆదివాసి మహిళా సంఘం కార్యకర్త) వీ

వర్గాల మధ్య సంబంధం కూడా మారుతూ ఉంది. కులం ఆవిర్భవించి వేళ్లూనుకున్న తరువాత భారతదేశపు భూస్వామ్య వ్యవస్థలో కులం, వర్గం దాదాపు అభిన్నమైనవిగా ఉండటం చూడవచ్చు. అయితే ఆంగ్లేయులు భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక పటలంలోకి ప్రవేశించి కుల-వర్గ సంబంధాల్లో ఎన్నో మార్పులకు కారణమయ్యారు. ఒకనాడు కులానికి, వర్గానికి ఉన్న దాదాపు అభిన్నమైన సంబంధాన్ని దెబ్బతీశారు. ఆ మార్పులు గత ఆరేడు దశాబ్దాల్లో మరింతగా ఊపందుకొని నేడు కులం, వర్గం ఒకటే అని ఏ మాత్రం అనలేని స్థితికి దారితీసాయి.

పై విషయాలను కొంత వివరంగా చూద్దాం.

భూస్వామ్య భారతంలో సాధారణంగా కులమే వర్గపు రూపంగా, వ్యక్తీకరణంగా ఉండేది. ఒక వ్యక్తి కింది కులానికి చెందిన వారైతే (శూద్రులు, అతిశూద్రులు- దళితులు) ఆ వ్యక్తి పాలిత వర్గానికి, దోపిడీ, పీడనలకు గురయ్యే వర్గానికి చెందిన వారే అయి ఉండేవారు. అట్లాగే ఒక వ్యక్తి అగ్రకులానికి (ద్విజులకు) చెందిన వారైతే ఆ వ్యక్తి పాలక వర్గానికి, దోపిడీ వర్గానికి, అణచివేసే వర్గానికి చెంది ఉండేవారు. లేదా కనీసం అందుకు అవకాశం కలిగి ఉండేవారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థకు, వర్గ వ్యవస్థకు మధ్య చాలా సన్నిహిత సంబంధం, ఏకత్వం ఉండేది. పుట్టుకతోనే నిర్ణయమయ్యే ఒక కులపు సభ్యులు కావడంతోనే సామాజిక ఉత్పత్తి సంబంధాల్లో వారి స్థానం నిర్ణయమై పోతుంది. ఈ లక్షణాన్ని బట్టి చూసినప్పుడు భూస్వామ్య భారతదేశంలో కులాన్ని సమాజపు పునాదిలో భాగంగా చూడటమే వాస్తవికతకు దగ్గరగా ఉంటుంది. భూస్వామ్య భారతంలో కులానికి ఎంత కీలకమైన ప్రాముఖ్యత ఉన్నదంటే భారతదేశంలో భూస్వామ్యాన్ని "కుల భూస్వామ్యం" / కుల ఆధారిత భూస్వామ్యం అనటం సరియైనది. (బానిస వ్యవస్థ - స్లేవ్ హోల్డింగ్ సిస్టం స్థానంలో భారత దేశంలో నిర్దిష్టంగా ఉన్న వ్యవస్థను శూద్ర వ్యవస్థ - శూద్ర హోల్డింగ్ సిస్టం అనడం సరియైందని అమరుడు కామ్రేడ్ సాకేత్ రాజన్ 'మేకింగ్ హిస్టరీ' పేరుతో రాసిన కర్నాటక చరిత్ర పుస్తకంలో ప్రతిపాదించాడు. అట్లాగే కా. ఆజాద్ నాయకత్వంలో పార్టీలో అధ్యయనం కోసం రాసిన 'ఇండియన్ ఎకానమీ" నోట్స్‌లోనూ శూద్ర వ్యవస్థ అనే భారతదేశంలోని తొలి వర్గ సమాజాన్ని వర్ణించారు) ఇందువల్ల అప్పుడు భారతదేశంలో "భూస్వామ్య ఉత్పత్తి విధానానికి సంబంధించిన ఏ విశ్లేషణ అయినా కులవ్యవస్థకు తగిన కేంద్రస్థానం ఇవ్వాల్సి ఉంటుంది.

అయితే ఇదంతా భారతదేశంలో కుల భూస్వామ్యానికి / కుల ఆధారిత భూస్వామ్యానికి సంబంధించిన చారిత్రక విశ్లేషణకు పనికి వచ్చేది మాత్రమే.

కుల ఆధారిత భూస్వామ్యం గత నూట యాభై ఏళ్లల్లో తీవ్రమైన మార్పులకు లోనైంది. బ్రిటిష్ వలస పాలన సుస్థిరమైన తర్వాత రెండు చోదక శక్తులు ఈ మార్పులకు కారణమైనాయి. ఒకటి కుల వ్యతిరేకపోరాటాలు, భూస్వామ్య / జమీందారీ వ్యతిరేక పోరాటాల వంటి ప్రజా పోరాటాలు. రెండు-వలస దోపిడీ ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు. ఈ ఉత్పత్తి సంబంధాలు అప్పటి నుంచి మరింత విస్తరించాయి, పెరిగాయి. ఈ రెండు కారణాలు కూడా అంటే ప్రజా పోరాటాలు, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ఒకదానినొకటి ప్రభావితం చేస్తూ, బలపరుస్తూ కుల, భూస్వామ్య వ్యవస్థలో మార్పులు తేవడానికి దోహదపడినాయి.

కులం-వర్గం మధ్య ఉండిన సన్నిహిత సంబంధం, ఏకత్వాలపై ప్రజాపోరాటాల ప్రభావం

19వ శతాబ్ధపు ద్వితీయార్థంలోనూ, 20వ శతాబ్దపు ప్రథమార్థం లోనూ దేశంలోని విశాల భాగాల్లో చెలరేగిన బ్రాహ్మణ వ్యతిరేక, భూస్వామ్య / జమీందారీ వ్యతిరేక పోరాటాల వల్ల భూమిపై అగ్రకులాల ఏకఛత్రాధిపత్యం బీటలు వారింది. శూద్రకులాల్లోని పై కులాలు అంటే వ్యవసాయ కులాలు అగ్రకులాలను పూర్తిగానైనా తొలగించి వేశాయి లేదా బలహీనపడుతున్న కుల భూస్వామ్య వ్యవస్థలో తమకు కూడా శీర్ష స్థానంలో చోటు ఇచ్చేందుకు బాధ్యులను చేశాయి. అంటే కులం - వర్గాలకున్న అభిన్న సంబంధం దెబ్బతిన్నది. పీడిత, అణగారిన కులాలలోని ఒక సెక్షన్ ఊర్ధ్వ చలనంతో పీడక, దోపిడీ కులాల స్థానంలోకి వెళ్లాయి. ఈ క్రమంలో వ్యవసాయ శూద్రకులాలు, అగ్రకులాల కులఅణచివేత నుండి బయటపడగలిగాయి. 1947 వరకు దేశంలోని దాదాపు అన్ని చోట్ల ఈ శూద్రకులాల్లోని సెక్షన్లు గ్రామీణ ప్రాంతంలో పాలక ఆధిపత్యవర్గంగా అవతరించాయి. అంతేకాదు, అగ్రకులాల వారసత్వాన్ని అందుకొని కుల అణచివేతను చేపట్టాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల ప్రభావం

వలసపాలన, పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క అవసరాలు కార్మికవర్గం, పట్టణ మధ్యతరగతి వర్గాల రూపంలో రెండు నూతన వర్గాలను సృష్టించాయి. ఈ వర్గాలు పెద్ద ఎత్తున విస్తరించాయి. ఆధునిక కార్మికవర్గం ప్రధానంగా దళితుల నుండి, కింది స్థాయి శూద్రకులాల (అంటే చేతివృత్తులు తదితర కింది కులాల) నుండి, ఒక మేరకు వ్యవసాయ శూద్రకులాల నుండి ఏర్పడింది. ఎన్నో ఒత్తిళ్లు, అవసరాల మధ్య ఈ పీడిత కులాల నుండి కొందరు ఆధునిక కార్మిక వర్గ శ్రేణులలోకి వచ్చారు. ఈ కార్మిక వర్గం నిజంగా బహుళ-కులాల వర్గం. కాలక్రమంలో అగ్రకులాలలోని పేదలు, నిర్భాగ్యులు కూడా ఈ వర్గంలో చేరారు. ఇక వలస పాలనాధికార యంత్రాంగాన్ని నడిపించడం కోసం సృష్టించిన పట్టణ మధ్య తరగతిలో కూడా దళితుల నుండి అగ్రకులాల దాకా ఉన్నారు. ఈ మధ్యతరగతి కూడా బహుళ కులాల వర్గం.

ఈ విషయాలను వర్గ దృష్ట్యా చూసినప్పుడు విభిన్న కులాల్లో వర్గ విభజనలు ఏర్పడినాయని అర్థమవుతుంది. ఉదాహరణకు వ్యవసాయ శూద్రకులాల్లో దోపిడీవర్గం, దోపిడీకి గురవుతున్న వర్గం రెండూ ఏర్పడినాయి. ఇతర శూద్రకులాల్లో కూడా కార్మికవర్గం, మధ్య తరగతి వర్గం ఏర్పడినాయి. ఇక దళితుల విషయానికి వస్తే దళితుల్లోని విశాల రాశులు భూమిలేని రైతాంగం గానే ఉండిపోయారు లేదా కార్మిక వర్గ శ్రేణుల్లో చేరారు. అయితే ఒక చిన్న సెక్షను మధ్య తరగతిలోకి ప్రవేశించడంలో విజయవంతమైంది.

ఈ రకంగా ఈ కులాలలో వర్గ విభజన జరిగే క్రమం 1947 తర్వాత మరింతగా కొనసాగింది. ఈ రోజు కుల అణచివేత ఎట్లా ఉందని పరిశీలించే ముందు, 1947 తదనంతర కాలంలో జరిగిన కొన్ని ముఖ్య పరిణామాలను గమనంలోకి తీసుకోవాలి.

తెలంగాణ సాయుధ పోరాటం, ఆ తదుపరి 1969 నుండి దేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవం గ్రామీణ భారతంలోని వర్గ సంబంధాలను పెద్ద కుదుపు కుదిపి తీవ్రమైన మార్పులకు లోను చేయటంతో పాటు కుల సంబంధాలలో కూడా పెను మార్పులకు కారణమైనాయి. విప్లవోద్యమ వ్యాప్తిని అరికట్టేందుకు పాలకవర్గాలు ఏదో ఒక మేరకైనా సరే భూసంస్కరణలను అమలు పరచారు. దానితో పాటు హరిత విప్లవం ద్వారా ఎర్ర విప్లవాన్ని అదుపు చేసే ప్రయత్నం కూడా చేసారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అవసరాలకు కూడా హరిత విప్లవం అవసరమే కాబట్టి ఉభయ ప్రయోజనాల కోసం దీనిని అమలు పరచారు. (ఈ రోజు వేలాది కోట్లు గుమ్మరించి పోరాట ప్రాంతాల్లో సమీకృత కార్యాచరణ పథకం (ఐఏపి) వంటివి అమలు చేసే ప్రయత్నం లాగా)

గ్రామీణ ప్రాంతంలో దోపిడీ వర్గంలోకి ఎదగగలిగిన శూద్ర రైతాంగంలోని ఒక సెక్షను 'భూసంస్కరణల'ను, 'హరిత విప్లవ ప్రణాళిక'లను కూడా ఉపయోగించుకొని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలపడింది. నేడు ఈ సెక్షను పాలకవర్గంలో చేరడమే కాకుండా ప్రాంతీయ స్థాయి నుండి

కేంద్ర ప్రభుత్వం దాకా రాజ్యాధికారం కూడా చెలాయిస్తున్నాయి.

శూద్రకులాలలోని కొన్ని సెక్షన్లు బడా పెట్టుబడిదారుల శ్రేణుల్లోకి కూడా గణనీయమైన సంఖ్యలో చేరుకున్నాయి. గతంలో బడా పెట్టుబడిదారీ వర్గం మొత్తంగానే అగ్రకులాలు – మార్వాడీలు, బనియాలు (వైశ్యులు), పార్శీలతో కూడి ఉండేది. ఈ రోజు మాత్రం అతిపెద్ద పెట్టుబడిదారుల్లో కూడా ఎంతో మంది శూద్రులలోని పై శ్రేణి వాళ్లు ఉన్నారు. ఈ రకంగా వాళ్లు పాలక వర్గంతో తమ స్థాయిని సుస్థిరపరుచు కున్నారు.

ఇక దళితుల విషయంలో కుల–వర్గ సంబంధాల్లో వచ్చిన మార్పులకు వ్యవసాయిక విప్లవపోరాటం, పెరుగుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలతో పాటు రిజర్వేషన్లు ఒక ముఖ్యమైన భూమిక నిర్వహిస్తున్నాయి.

వ్యవసాయ విప్లవానికి పట్టుగొమ్మలు భూమిలేని వ్యవసాయకూలీలు, పేద రైతాంగం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత అధిక శాతం దళితులు భూమిలేని వ్యవసాయ కూలీలు, పేద రైతాంగమే. కాబట్టి విప్లవోద్యమం 'దున్నేవారికే భూమి' నినాదంతో వీరిని సమీకరించినప్పుడు భూపోరాటాలు, కూలీరేట్ల పోరాటాలతో పాటు, దాదాపు అన్నిచోట్లా అది ఆత్మగౌరవ పోరాటంగా కూడా జమిలిగానే సాగింది. ఆర్థిక దోపిడీలతో పాటు ఆర్థికేతర దోపిడీ హింసలు అణచివేతలను కూడా సవాలు చేసి నిలవటంతో అగ్రకులాల భూస్వాములు, తదితరులు కూడా తమ కుల అభిజాత్యాన్ని వదులు కోవలసి వచ్చింది. గ్రామ సంఘాలకు దళితులే ఎన్నో చోట్ల నాయకత్వం వహించి అగ్రకుల అహంకారపు మెడలు వంచారు. ఇందులో తమ వర్గ బంధువులతో కుల మత ప్రమేయం లేకుండా కలిసే ఇది సాధించారు. తెలంగాణ, బీహారుతో సహా ఎన్నో ప్రాంతాల్లో పదుల వేల ఎకరాల భూమిని భూస్వాముల అక్రమ కబ్జానుండి విముక్తం చేసి తమ సాగులోకి తెచ్చుకోవటంతో విప్లవోద్యమం బలంగా సాగిన గ్రామీణ ప్రాంతాల్లో కులసంబంధాల్లో నిస్సంశయంగా మార్పులు చోటు చేసుకున్నాయి. దళితులపై కారంచేడు, చుండూరు వంటి కులదాడులు, తెలంగాణలోని ఉద్యమ ప్రాంతాల్లో జరగటం అసాధ్యం అనే పరిస్థితులు నెలకొన్నాయి.

వ్యవసాయిక విప్లవ పోరాటం ద్వారా దళితుల జీవన స్థాయిలో ప్రత్యక్షంగా కలిగిన మెరుగుదలతో పాటు, దానికి మించి వారు కుల భూస్వామ్య బంధనాల నుండి ఏదో ఒక మేరకు బయటపడడం, ఆ క్రమంలో కలిగిన చైతన్య వికాసం వల్ల కూడా ఇతర అవకాశాలను వినియోగించుకునే పరిస్థితులు మెరుగుపడ్డాయి.

1947 తర్వాత దళితుల్లో రిజర్వేషన్లు ఉపయోగించుకునే చైతన్యం, అవకాశాలు ఏదో మేరకు మెరుగవడంతో వీటి ద్వారా ఒక సెక్షన్ దళితులు క్రమంగా మధ్య తరగతిగా ఎదగ గలిగారు. కొందరు ఎన్నికల రాజకీయాలను ఉపయోగించుకోవడం, అధికార వర్గంలోకి (ఉన్నత స్థాయి బ్యూరోక్రసీలోకి) ఎదగడం ద్వారా రాజకీయంగా దళారీబూర్జువా వర్గంగా ఎదగడమే కాకుండా అత్యంత చిన్న సెక్షనే కావచ్చు కానీ స్వయంగా పెట్టుబడిదారులుగా, దళారీ పెట్టుబడిదారులుగా కూడా ఎదుగుతున్నారు.

అయినా దళితుల విషయంలో ఈ మార్పులన్నీ సాపేక్షికంగా చిన్న సెక్షనుకు సంబంధించినవే. ఇప్పటికీ దళిత కులాల అత్యంత అణచివేతకు గురవుతున్న కులాలే కాక, దళితుల్లో అత్యధికులు అత్యంత దోపిడీకి గురవుతున్న భూమిలేని వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కార్మికులు.

ఏదేమైనా వ్యవసాయిక వర్గ పోరాట గతి నియమాలు (డైనమిక్స్), పెట్టుబడిదారీ ఉత్పత్తి విస్తరణ నేటికీ కొనసాగుతున్నవి. వాటితో పాటే కులాల్లో వర్గ విభజన కూడా అప్రతిహతంగా సాగుతున్నది. దాంతో సామాజిక ఉత్పత్తి సంబంధాల్లో ఒక వ్యక్తి స్థానాన్ని అంటే ఆ వ్యక్తి వర్గ స్థితిని నిర్ణయించడంలో కుల సభ్యత్వపు ప్రాధాన్యత రోజురోజుకూ తగ్గిపోతున్నది. దళితుల విషయంలో మాత్రమే ఇందుకు చాలా మట్టుకు మినహాయింపు ఉంది.

పై మార్పుల నేపథ్యంలో ఈ రోజు కుల అణచివేత రూపు రేఖలు ఎట్లా ఉన్నాయి?

1) ఈ రోజు కుల అణచివేత, దోపిడీ ప్రధానంగా దళితులపైనే కేంద్రితమై ఉంది. శూద్రకులాల్లోని ఏ సెక్షన్లయితే దోపిడీదార్లుగా ఆవిర్భవించి పాలక వర్గంలో అంతర్భాగమయ్యాయో ఆ సెక్షన్లే నేడు ఈ కుల దోపిడీ, అణచివేతలకు ప్రధాన వాహికగా మారాయి. అయితే ఈ సెక్షన్ల కులాల్లోని అత్యధికులు మాత్రం ఇంకా దోపిడీకి గురయ్యే మధ్య తరగతి రైతాంగం, పేద రైతాంగం, వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గాలకే చెంది ఉన్నారు. అయితే వీళ్లు ఆర్థికంగా దోపిడీకి గురవుతూనే ఉన్నా వీరిపై కుల అణచివేత, వివక్షలు మాత్రం గతించిపోయాయి. దాదాపు శూన్యమే అయ్యాయి. అయితే ఈ కులాలకు చెందిన దోపిడీకి గురయ్యే సెక్షన్లు ఇప్పటికీ విద్య, సాంస్కృతిక విషయాల్లో వెనుకబాటుతనం రూపంలో గత కాలపు గుదిబండను మోస్తూనే ఉన్నారు. అది కూడా క్రమంగా తగ్గుతోంది. అయితే ఈ కులాల్లోని పై వర్గాలు తమ కుల గుర్తింపును రక్షించుకోవడమే కాక పెంచి పోషిస్తున్నారు. ఎందుకంటే దానివల్ల రాజకీయ లబ్ధి కోసం మొత్తం కులాన్నంతా సమీకరించగలగటమే కాకుండా దళితులపై అణచివేత సాగించడానికి అవసరమైన మందబలం కూడా సమకూరుతుంది.

2) శూద్ర కులాల్లోని కింది తరగతుల (చేతి వృత్తులు, సేవావృత్తుల వాళ్లు) విషయానికొస్తే కుల అణచివేత అనేది చాలామట్టుకు గత కాలానికి సంబంధించినది గానే మిగిలింది. కులవృత్తికే అంటిపెట్టుకొని ఉండటం, అగ్రకులాలను వెట్టి చేయటం, ఇతర ఆర్థికేతర అణచివేత వంటి రూపాల్లో కుల అణచివేత నగణ్యంగా మారింది. భూస్వామ్య అణచివేత, కుల అణచివేత బలంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఎంతో కొంత బలంగా ఉంది. ఈ కులాలు సాధారణంగా దోపిడీకి గురయ్యే మధ్య, పేద రైతాంగం, కార్మిక వర్గం, పట్టణ మధ్య తరగతి వర్గాలకు చెంది ఉన్నాయి. అయితే విద్య, సంస్కృతీ సంబంధమైన వెనకబాటు తనం మాత్రం చాలా తీవ్రంగానే ఉంది. ఎన్నికల రాజకీయాలు, దాంతో దొరికే తృణమో, పణమో ఈ శూద్రకులాల్లో కుల చైతన్యం, గుర్తింపు కొనసాగడానికి సాయపడుతున్నాయి. దళితులకు వ్యతిరేకంగా సమీకరణల్లో ఈ సెక్షన్లు సులభంగా చేరుతున్నాయి.

3) దళితుల విషయానికొస్తే మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. దళితుల్లోని మెజారిటీకి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో – కులమే వాళ్ల వర్గస్థితిని నిర్ణయించేదిగా ఉంది. అంటే ఉత్పాదనా సంబంధాల్లో అత్యంత దోపిడీ, అణచివేతలకు గురవుతున్న వర్గంగా వారి స్థితి, వారి కులం వల్లే నిర్ణయమవుతున్నది. తమకంటే ఉన్నత కులాల తీవ్రహింస, ఆర్థికేతర నిర్బంధం, ఉన్నత కులాలకు తమ కుల నిర్ధారితమైన "హేయమైన, "నీచమైన" వృత్తుల ద్వారా సేవలందించటం, అంటరానితనం, వివక్ష, వెలివేత (సెగ్రిగేషన్) వంటివన్నీ దళితులు నేటికీ ఎదుర్కోవలసి వస్తోంది. దళితులు సంఘటితమై మిలిటెంట్‌గా ప్రతిఘటించి, నిలదొక్కుకున్న చోటనే కుల అణచివేత తీవ్రతను ఒక మేరకు తగ్గించుకోగలిగారు. గత ఐదు దశాబ్దాలుగా శూద్ర, ఉన్నత కులాలు దళితులపై దాడులు, అత్యాచారాలు చేస్తూ కుల అణచివేతకు వాటిని ఒక ఆయుధంగా మలుచుకున్నారు. దళితులు తల ఎత్తుకొని నిలబడినప్పుడల్లా వారి స్థైర్యాన్ని దెబ్బతీయడం కోసం, భయపెట్టి లొంగదీసుకోవడం కోసం దాడులు చేస్తున్నారు. ఈ దాడులకు భారత రాజ్యపు యంత్రాంగం, రాజకీయ నాయకత్వం విభిన్న రూపాల్లో మద్దతు తెలుపుతున్నది. అత్యాచారాలు నివారించకుండా మౌనంగా చూస్తూ ఉండటం లేదా తర్వాత చట్టం చేతికి చిక్కకుండా రక్షణ కల్పించడమో చేస్తున్నా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్ల కూడా దళితులకు ముఖ్యంగా కింది స్థాయి ఉద్యోగాలు తక్కువ స్థాయి పనులున్న ఉద్యోగాల్లోనే స్థానం దొరికింది.

స్థూల చిత్రాన్ని ఒకసారి చూస్తే అది ఇలా ఉంది. శూద్రకులాలకు

సంబంధించినంత వరకు కుల అణచివేత దాదాపు లేనట్టే. ఎక్కడైనా ఇంకా కొనసాగుతున్నా దాని గమనం మాత్రం అణచివేత మాయమయ్యే దిశలోనే ఉంది. ఈ రోజు కుల అణచివేత దాదాపు పూర్తిగా దళితులపై కేంద్రీకృతమై ఉంది. దళితులకు సంబంధించినంత వరకు కులం-వర్గం మధ్య చాలా సన్నిహిత సంబంధమే ఇప్పటికీ ఉంది. అయినా రెండు ఒకటే అనే స్థితి మాత్రం లేదు. కుల అణచివేత మాత్రం దళితులపై చాలా హింసాత్మకంగా కొనసాగుతోంది. ఈ రోజు వివక్ష, అణచివేత, దాడుల రూపంలో కానీ, "నీచమైన" వృత్తులు దళితులకే పరిమితం కావడం కానీ, ఇంకా ఇటువంటి విషయాల్లో కుల సమస్య అంటే ప్రధానంగా దళితుల సమస్యే. దళితులపైన కుల అణచివేతను, దాడులను ప్రధానంగా సాగిస్తున్నది ఆర్థిక, రాజకీయ అధికారాన్ని నూతనంగా చేజిక్కించుకున్న శూద్ర ఉన్నత కులాలు. ఈ ఉన్నత శూద్ర కులాలు దళితులపై దాడులు చేయడానికి తమలోని పేదలను కూడా సమీకరించడంలో విజయవంతమవుతున్నారు.

మొత్తంగా చూస్తే కులం ఒక దోపిడీ, అణచివేత వ్యవస్థగా, ఓ వ్యక్తి వర్గ స్థితిని నిర్ణయించే వ్యవస్థగా అంటే కులం - వర్గం ఒకటిగా ఉండి ఒకానొక కులానికి చెందితే ఉత్పాదన సంబంధాల్లో వాళ్ల స్థానం ఇది అని ఖచ్చితంగా చెప్పే స్థితి శూద్రకులాలకు సంబంధించినంతవరకు అంతరించిపోయింది, లేదా ఆ దిశలోనే ప్రయాణం సాగుతోంది. కానీ 16.5 కోట్ల దళితుల్లో మెజారిటీకి సంబంధించినంత వరకు మాత్రం అది ఇంకా భద్రంగా కొనసాగుతూనే ఉంది.

అయితే రెండు సహస్రాబ్దాలుగా నెలకొన్న కుల అణచివేత విద్య, సాంస్కృతిక పరంగా శూద్ర కులాల్లో కూడా ఎంతో వెనుకబాటు తనాన్ని మాత్రం వదిలింది. దాంతో ఉన్నత కులాలతో పోలిస్తే ఈ విషయాల్లో ఎన్నో అడ్డంకులు అననుకూల పరిస్థితులను ఎదుర్కొంటున్నారు, ఎదుర్కొంటారు.

కులానికి సంబంధించినంత వరకు పునాదిలో పైన చర్చించినట్టు పెనుమార్పులు సంభవించినా ఒక గుర్తింపుగా, చైతన్యంగా, సాంస్కృతికంగా, నిచ్చెనమెట్ల ఆధిక్యతా భావజాలంగా, హెచ్చుతగ్గుల వ్యవస్థగా, ఆచార వ్యవహారాల్లో భారతీయ జీవన వ్యవస్థలో కులం చాలా బలంగా కొనసాగుతూనే ఉందనేది గుర్తుంచుకోవాలి. కులానికి సంబంధించిన ఈ 'ఉపరితల అంశాల్లో' కూడా మార్పులు చోటు చేసుకున్నప్పటికీ అవి పునాదిలో వచ్చిన మార్పులంతగా గణనీయమైన మార్పులు కావు. ఆధునిక భారత సమాజం, మరీ ముఖ్యంగా రాజకీయాలు కులానికి సంబంధించిన ఈ ఉపరితల అంశాలను పునః సంఘటితపరచి బలపరచే శక్తులను సృష్టించాయి. ఈ ఉపరితలాంశాల ప్రభావం పునాదిపైన పడుతూ దాని సమూలమైన మార్పులో అడ్డంకిగా మారుతోంది.

ప్రాథమికమైనది కులమా? వర్గమా?

ఈ ప్రశ్నకు సమాధానం నిర్ధారించడంలో గతంలో మార్క్సిస్టులు లోపభూయిష్టంగా వ్యవహరించడంతో ఈ విషయంలో గందరగోళం, అపనమ్మకాలకు దారి తీసింది.

భారత దేశంలో భూస్వామ్య కాలంలో వర్గం కులం రూపంలోనే వ్యక్తమైందని ఒప్పుకొని ఉంటే ఇంత వివాదమే ఉండేది కాదు. అయితే పైన చర్చించిన నూట-యాభై, రెండు వందల ఏళ్ల పరిణామాల వల్ల వర్గమే ప్రాథమికమైనదీ, నిర్ణాయకమైనదీ అయిన కేటగిరీ అనేది నిస్సందేహమైన విషయం. (దళితుల విషయంలో మాత్రం కులం, వర్గాల మధ్య సన్నిహిత సంబంధం ఉంది). ఈ కేటగిరీనే (వర్గమే) అన్ని విషయాలనూ ప్రభావితం చేస్తుంది. కాబట్టి అన్ని సామాజిక దృగాంశాల పట్ల వర్గ దృక్పథాన్ని, వర్గ విశ్లేషణా పద్ధతిని అనుసరించడమే సరియైంది. కులం ప్రాథమికమైనదనే వైఖరి నేటి పరిస్థితిలో తప్పు వైఖరి, వ్యతిరేకించవలసిన వైఖరి.

కులం మీద వర్గం ఎందుకు ప్రాథమికమైనదంటే అన్ని కులాల్లోనూ వర్గ విభజన ఉంది. అంటే అన్ని కులాల్లోనూ దోపిడీ, అణచివేతలకు గురవుతున్న వర్గం, అణచివేతకు గురి చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న వర్గం ఉన్నాయి. ఒకనాడు అణచివేతకు గురైన కులాల్లోని కొన్ని సెక్షన్లు కూడా ఈనాటి పాలకవర్గాల్లో భాగమే. వర్గ గుర్తింపు కన్నా కుల గుర్తింపు ప్రాథమికమైనదని అనటమంటే వర్గదోపిడీకి, అణచివేతకు పాల్పడేవారితో రాజీపడటమనే అర్థం.

కుల వ్యవస్థ నిర్మూలన పాలక వర్గాలకు వ్యతిరేకంగా అన్ని పీడిత, తాడిత వర్గాల ఐక్యపోరాటంతోనే సాధ్యం.

కులం - పునాది - ఉపరితలం

'తమ మనుగడ కోసం అవసరమైన సామాజిక ఉత్పత్తిలో మనుషులు అనివార్యంగా నిర్దిష్ట సంబంధాలలో ప్రవేశిస్తారు. ఆ సంబంధాలు వారి ఇష్టానికి అతీతంగా ఉంటాయి. ఆ సంబంధాలనే ఉత్పత్తి సంబంధాలు అంటాం. భౌతిక ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో ఒక ప్రత్యేక దశకు తగినట్టుగా ఉండే ఈ సంబంధాలు సమాజపు ఆర్థిక నిర్మాణాన్ని రూపొందిస్తాయి. ఈ నిజమైన పునాది మీదనే ఒక చట్టపరమైన, రాజకీయమైన ఉపరితలం లేచి నిలుస్తుంది. నిర్దిష్టమైన సామాజిక చైతన్య రూపాలు ఈ ఉపరితలానికి సంబంధంలో ఉంటాయి.' - మార్క్స్

కులానికి సంబంధించినంతవరకు పునాది - ఉపరితలాల మధ్య సంబంధం విషయంలో గతంలో కమ్యూనిస్టులు చాలా కాలం పాటు ఎంతో యాంత్రికమైన అవగాహనను కలిగి ఉన్నారు. చారిత్రకంగా కులాన్ని వర్గం నుండి విడదీయడమే కాక కులాన్ని ఉపరితల అంశంలో భాగంగా చూశారు. పునాది - ఉపరితలాల మధ్య ఉండే సంబంధాన్ని తప్పుగా, యాత్రికంగా అర్థం చేసుకోవడం వల్ల ఈ అవగాహన మరింత లోపభూయిష్టమైంది. పునాది - ఉపరితలాల మధ్య సంబంధాన్ని యాంత్రికంగా కారణం - ఫలితం వంటి సంబంధంగా అర్థం చేసుకున్నారు. పునాది - ఉపరితలాల మధ్య కారణ ఫలితాల సంబంధ ముండడం అనేది సరియైందే అయినా వాటి మధ్య సంబంధం అంతకు మించినది. రెండింటి మధ్య ఉన్నది సరళమైన ఏకపక్ష సంబంధం కాదు. ఫలితపు ప్రభావం కారణంపై పడే అవకాశం కూడా ఇందులో ఉంది. ఒకసారి ఒక ఫలితమంటూ అస్తిత్వంలోకి వచ్చాక అది పునాదిని ప్రభావితం చేయడమే కాక, అది ఇతర ఎన్నో రకాలుగా అభివృద్ధికి, పరిణామాలకు లోనవుతుంది. ఇవన్నీ పూర్తిగా కారణంతోనే నిర్ణీతం కావు.

పునాది - ఉపరితలాల మధ్య సంబంధాన్ని యాంత్రికంగా అర్థం చేసుకునే ప్రమాదం గురించి ఏంగెల్స్ హెచ్చరించే ఉన్నాడు.

'చరిత్ర పట్ల భౌతికవాద అవగాహన ప్రకారం చరిత్రలో అంతిమ నిర్ణాయక అంశం నిజ జీవితపు ఉత్పత్తి, పునరుత్పత్తి మాత్రమే. మార్క్స్ గానీ, నేను గానీ ఇంతకన్నా ఎక్కువ ఎప్పుడు చెప్పలేదు. అందువల్ల ఒకవేళ ఎవరైనా మా మాటలను వక్రీకరించి, ఆర్థిక అంశమే ఏకైక నిర్ణాయక అంశంగా చెపితే వారు మా ప్రతిపాదనను అర్థరహితమైన, అమూర్తమైన, పనికిరాని నిర్ధారణగా మారుస్తున్నారన్నమాట. ఆర్థిక పరిస్థితి పునాదిగా ఉంటుంది. కాని, ఉపరితలంలోని విభిన్న అంశాలు.... కూడ చారిత్రక పోరాట క్రమంలో తమ ప్రభావాన్ని చూపుతాయి. చాలా సందర్భాలలో వాటి రూపాన్ని నిర్ణయించడంలో ప్రబలమైన పాత్ర వహిస్తాయి.' - జె. బ్లాక్‌కు రాసిన ఉత్తరంలో ఎంగెల్స్,

(ఇంకా ఉంది)

(రచయిత రాజకీయ ఖైదీ, కేంద్ర కారాగారం, హజారీబాగ్) వీ

డా. అంబేద్కర్ 'కుల నిర్మూలన' పుస్తక వివాదం

డా. బి.ఆర్. అంబేద్కర్ రచన 'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్'ను అరుంధతీ రాయ్ ముందుమాటతో, వివరణలతో నవయాన ప్రచురణ సంస్థ వెలువరించిన సందర్భంగా జరిగిన వివాదం గురించి వివరిస్తున్నారు **ఎడ్ల పోచయ్య**

డా. బి. ఆర్. అంబేద్కర్ రచనలలో సుప్రసిద్ధమైనది అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ (కుల నిర్మూలన). దీన్ని అంబేద్కర్ లాహోర్ లో జాత్ పాత్ తోడక్ మండల్ అనే ఉదార హిందూ సంస్థ ఆహ్వానం మీద వారి సభలో చదవడానికి ప్రసంగ వ్యాసంగా రాశారు. కాని ఆ సభ జరగకముందే వ్యాసంలో కొన్ని భాగాలను మార్చవలసిందిగా ఆ సంస్థ సూచించింది. సభను ఒకటికి రెండుసార్లు వాయిదా వేసి, అసలు జరపకుండానే ఉండిపోయింది. 'జాత్ పాత్ తోడక్ మండల్ లాహోర్ వార్షిక సమావేశంలో సమర్పించడానికి తయారు చేసిన ప్రసంగ పత్రం. కాని ఈ ప్రసంగంలో వ్యక్తమైన భావాలు ఆ సమావేశానికి సహించ రానివనే కారణంతో ఆహ్వానసంఘం సమావేశాన్ని రద్దు చేసినందువల్ల ఈ ఉపన్యాసం చేయలేకపోయాను' అని ముఖపత్రం మీదనే పేర్కొని అంబేద్కర్ 1936 మే 15న ఆ పుస్తకాన్ని మొట్టమొదటిసారి ప్రచురించారు.

ఆ పుస్తకం వెలువడిన వెంటనే ఖండన మండనలు సాగాయనీ, వాటిలో గాంధీ చేసిన విమర్శలకు మాత్రం జవాబు చెప్పదలిచాననీ అంటూ, గాంధీ విమర్శనూ, తన ప్రతి విమర్శనూ, జాత్ పాత్ తోడక్ మండల్ తో తనకు నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలనూ కలిపి అంబేద్కర్ 1937లో రెండో కూర్పు ప్రచురించారు. మూడో కూర్పు 1944లో వెలువడింది. గడిచిన 78 సంవత్సరాలలో అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ ఇంగ్లిషు మూలంలోనూ, అనేక భాషలలో అనువాదాలలోనూ వందలాదిసార్లు అచ్చయింది. లక్షలాది ప్రతులు ప్రచారంలో ఉన్నాయి. ఈ విభిన్న ప్రచురణలలో అనువాదకులు, ప్రచురణకర్తలు పుస్తకాన్ని సంక్షిప్తీకరించిన సందర్భాలు, అదనపు వివరణలు, ముందుమాటలు, పాదసూచికలు రాసిన సందర్భాలు కూడ ఎన్నో ఉన్నాయి.

కొలంబియా విశ్వవిద్యాలయంలో అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ మల్టీమీడియా స్టడీ ఎన్విరాన్ మెంట్ పేరుతో కొద్దిగా ఎడిటింగ్ చేసి, చాల వివరమైన పాదసూచికలు అందించారు. తెలుగులో కనీసం మూడు అనువాదాలు ఉన్నాయి. అసలు అంబేద్కర్ 'కులనిర్మూలన' అని ఉద్దేశించలేదని, అందరూ తప్పుగానే అర్థం చేసుకున్నారని, దాన్ని 'వర్ణ నిర్మూలన' గా అర్థం చేసుకోవడం మాత్రమే సరైనదని వాదిస్తూ సౌదా అరుణ సంపాదకత్వం వహించి, అనువాదం చేసి 2011 ఏప్రిల్ లో 'వర్ణ నిర్మూలన' వెలువరించారు.

కాగా ఇటీవల ఢిల్లీకి చెందిన, సాధారణంగా కుల సమస్యపై, దళిత దృక్పథంపై పుస్తకాలు ప్రచురించే నవయాన అనే సంస్థ 'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్'కు ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్ చేత ముందుమాట రాయించి, ప్రచురణకర్త ఎస్. ఆనంద్ వివరణలు రాసి ప్రచురించడం వివాదానికి దారితీసింది. రెండు మూడు వారాల వ్యవధిలోనే రౌండ్ టేబుల్ ఇండియా అనే వెబ్‌సైట్‌తో సహా ఇంటర్నెట్ మీదా, అచ్చులోనూ ఎన్నెన్నో వ్యాఖ్యలు, వాదనలు, ప్రతివాదనలు, ఖండనలు, హెచ్చరికలు విరివిగా వెలువడ్డాయి. ఈ వివాదం కొంతవరకు తెలుగుసీమ నుంచే ప్రారంభం కావడం విశేషం.

మామూలుగా ఆవిష్కరణ కార్యక్రమాల కన్న ఎక్కువగా ప్రచార, పరిచయ కార్యక్రమాలు నిర్వహించడం ఇంగ్లిష్ పుస్తకాల సంప్రదాయం. ఇంగ్లిష్ పుస్తకాల మార్కెట్ దేశదేశాలలో, దేశంలో అనేక ప్రాంతాలలో విస్తరించి ఉంది గనుక ఆయా మార్కెట్లలో ప్రచారం కోసం బుక్ ప్రమోషన్, బుక్ రీడింగ్, పుస్తకంపై సంభాషణలు వంటివాటి ద్వారా క్యాంపెయిన్ జరుగుతూ ఉంటుంది. అదే పద్ధతిలో 'అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్' పుస్తకానికి కూడ ఢిల్లీలో మార్చ్ 4న ఆవిష్కరణ, మార్చ్ 15న హిందీ కవి, ప్రచురణ కర్త అసద్ జైదీతో అరుంధతీ రాయ్ సంభాషణ, ముంబాయిలో మార్చ్ 7న టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సూర్యకాంత్ వాఘ్మోర్ తో సంభాషణ, హైదరాబాద్ లో మార్చ్ 9 ఉదయం ప్రఖ్యాత రచయిత, న్యాయవాది బొజ్జా తారకంతో అరుంధతీ రాయ్ సంభాషణ, ఆ సాయంత్రం హోప్ లైఫ్ ఆఫ్ కాస్ట్ చిత్ర ప్రదర్శన ఏర్పాటయ్యాయి.

అరుంధతీ రాయ్ కి ఉన్న పేరు ప్రఖ్యాతుల వల్ల ఆ పుస్తకం ఇంకా బైటికి రాకముందే ఆమె ముందుమాట 'ది డాక్టర్ అండ్ ది సేంట్' లోంచి కొన్ని భాగాలను ఢిల్లీ నుంచి వెలువడే కారవాన్ మాసపత్రిక ప్రచురించింది. ఔట్‌లుక్ వారపత్రిక మరికొన్ని భాగాలను ప్రచురించడంతో పాటు అరుంధతీ రాయ్ సుదీర్ఘ ఇంటర్వ్యూ కూడ ప్రచురించింది. ది హిందూ దినపత్రిక కూడ కొన్ని భాగాలు ప్రచురించింది. ఈ పద్ధతిలోనే ఆంధ్రజ్యోతి దినపత్రిక కూడ ఆ ముందుమాట లోంచి కొన్ని భాగాలను 'వైద్యుడు, ప్రవక్త' అనే శీర్షికతో మార్చ్ 6న ప్రచురించింది. ఈ శీర్షిక పూర్తిగా తప్పు. జాత్ పాత్ తోడక్ మండల్ డా. అంబేద్కర్‌కు రాసిన ఉత్తరాలలో ఆయనను వారు డాక్టర్ సాహెబ్ అని సంబోధించారు గనుక అరుంధతీ రాయ్ కూడ శీర్షికలో డాక్టర్ అని వాడి ఉండవచ్చు. దాన్ని అనువదించనక్కరలేదు. యథాతథంగా డాక్టర్ అని ఉంచవచ్చు. లేదా మేధావి అని అనువదించవచ్చు. ఇక సేంట్ అనే మాటకు సాధువు, ముని, సన్యాసి అనే అర్థాలున్నాయి గాని ప్రవక్త అనే అర్థం లేదు. నిజానికి అరుంధతీ రాయ్ అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ చర్చలో గాంధీ గురించి అంబేద్కర్ వాడిన పొలిటీషియన్ సేంట్ అనే మాట నుంచే ఆ

మాట తీసుకున్నారు. ఆమె వ్యాసం మొత్తంలో గాంధీ మీద చేసిన విమర్శలను, ఉపయోగించిన వ్యంగ్యాన్ని బట్టి చూస్తే ఆ మాటకు సన్యాసి అనే అర్థమే సరిపోతుంది. కనుక ఆ శీర్షికను 'మేధావీ సన్యాసీ' అని అనువదిస్తే బాగుండేది గాని వైద్యుడు, ప్రవక్త అనే పొరపాటు అనువాదం వల్ల తెలుగు దళిత శిబిరంలో చాల మందికి ఆగ్రహం కలిగింది. ఆంధ్రజ్యోతి సంపాదకులను, యాజమాన్యాన్ని ఖండిస్తూ, వారి 'కుల అహంకారాన్ని' కారణంగా చూపుతూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు సాగాయి. ఆంధ్రజ్యోతి కూడ మర్నాడే ఒక పాక్షిక సంజాయిషీ ఇచ్చి, క్షమాపణ కోరింది.

ఆంధ్రజ్యోతి వ్యాసం ప్రభావం వల్లనో, దానితో సంబంధం లేకుండానో, అసలు పుస్తక పరిచయ సభ మీద కూడ దళిత శిబిరంలో నిరసన వ్యక్తం కావడం మొదలయింది. అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ దళితుల పవిత్ర గ్రంథం అని, అరుంధతీ రాయ్‌కి గాని, ఎస్ ఆనంద్‌కు గాని ఆ పుస్తకం మీద చెయ్యి చేసుకునే అర్హత లేదని విమర్శిస్తూ, ఆ సభ దగ్గర నిరసన ప్రదర్శన జరుపుతామని కూడ కొందరు దళిత మేధావులు నిర్వాహకులకు హెచ్చరిక పంపినట్టు తెలిసింది. 'అంబేద్కర్ రచనలను రక్షించండి. నవయాన ప్రచురణను ఖండించండి. అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ మన పవిత్ర గ్రంథం. అరుంధతీ రాయ్, ఎస్. ఆనంద్ దాన్ని అపవిత్రం చేశారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దగ్గర మార్చ్ 9న నిరసన ప్రదర్శనలో పాల్గొనండి' అని ఎస్.ఎం.ఎస్.లు కూడ పంపినట్టు తెలిసింది. ఈ వివాదం ది హిందూ వంటి పత్రికలో వార్తగా కూడ వచ్చింది.

కారణమేమైనప్పటికీ హైదరాబాద్‌లోని రెండు కార్యక్రమాలనూ వాయిదా వేస్తూ నవయాన ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో హైదరాబాద్ కు పుస్తక ప్రతులు అందనందువల్ల వాయిదా వేస్తున్నామని ఒక కారణం చెపుతూనే, 'ఇంకా ఎక్కువమంది పుస్తకం చదవకుండానే పరుషమైన చర్చలు జరుగుతున్నందువల్ల, అందరికీ పుస్తకం అంది, పూర్తి సమాచారంతో చర్చ జరిగే అవకాశం కోసం' వాయిదా వేస్తున్నామని అన్నారు.

హైదరాబాద్ కార్యక్రమాలు వాయిదా పడినా చర్చ కొనసాగింది. మార్చ్ 15న దళిత్ కెమెరా అనే సంస్థ 'యాన్ ఓపెన్ లెటర్ టు మిజ్ అరుంధతీ రాయ్' అని ఒక బహిరంగ లేఖను ప్రచురించింది. దానిలో ఉపోద్ఘాతం కాక పన్నెండు ప్రశ్నలు సంధించారు. 'ది డాక్టర్ అండ్ ది సేంట్' వ్యాసం రాయడంలో ఆమె ఉద్దేశం ఏమిటనీ, అది అసలు అంబేద్కర్ రాసిన అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్‌కు పరిచయమేనా అనీ ప్రశ్నించారు. ఆ గ్రంథాన్ని పరిచయం చేయడానికి ఆమెకు ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించారు. ఇటువంటి పరిచయం రాయడానికి అంబేద్కర్ తో సంబంధం వల్ల, జీవితానుభవం వల్ల దళిత కార్యకర్తలు, మేధావులు తగినవారనే అభిప్రాయంతో ఆమె ఏకీభవిస్తుందా అని ప్రశ్నించారు. ఆమె ఎప్పుడైనా దళిత సమాజం గురించీ, దాని చరిత్ర గురించీ పరిశోధన చేసిందా అనీ, ఎప్పుడైనా దళిత ఉద్యమాలలో భాగం పంచుకుందా అనీ, అంబేద్కర్ పట్ల ఆమె సంరక్షకురాలిలా ప్రవర్తించడం సరయినదేనా అనీ ప్రశ్నించారు. ఆమె వ్యాసం గాంధీని పునస్సమీక్షిస్తున్నట్టుగా, గాంధీని పరిచయం చేయడానికి అంబేద్కర్‌ను వాడుకుంటున్నట్టుగా ఉన్నదంటే ఆమె జవాబేమిటని ప్రశ్నించారు. ఆమె అంబేద్కర్ రచనకు అన్యాయం చేసిందనీ, చాల అంశాలలో అంబేద్కర్ ను అపార్థం చేసుకోవడానికి అవకాశం కల్పించిందనీ అన్నారు. ఆమె తనకు అంబేద్కర్ మీద సాధికారత ఉన్నదని అనుకుంటున్నదా అనీ, పెట్టుబడిదారీ విధానం, ఆదివాసులు, బ్రాహ్మణిజం, కులం, వగైరా అంశాల మీద అంబేద్కర్ ను అంచనా వేయడానికి తగిన అర్హత ఆమెకు ఉన్నదా అనీ ప్రశ్నించారు. అంబేద్కర్ రచనలను, ఆచరణను చారిత్రక నేపథ్యంలో చదవకుండా ఆమె చేసిన విమర్శలు ఎలా సమర్థనీయమనీ, కేవలం అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ చదివి పెట్టుబడిదారీ విధానం మీద, ఆదివాసుల మీద అంబేద్కర్ అభిప్రాయాలను ఆమె ఎలా గుర్తించ గలిగిందనీ ప్రశ్నించారు. అసలు అంబేద్కర్‌ను స్వతంత్రంగా చదవకుండా గాంధీతో పోల్చి చదవడం ఉన్నతవర్గ, అగ్రకుల పఠన వ్యూహం కాదా అని ప్రశ్నించారు. అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ ను, అంబేద్కర్ ను ప్రజా చర్చలోకి తీసుకురావడానికి ఆమె తన పరిచయ వ్యాసాన్ని ఉపసంహరించుకుంటుందా అని ప్రశ్నించారు. డా. బి ఆర్ అంబేద్కర్ రాసిన అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ ను వాడుకుని అరుంధతీ రాయ్, నవయాన ప్రచార మాధ్యమాల ఆదరణ చూరగొన్నారని, అలా అంబేద్కర్ ను వాడుకోవడం అనైతికం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ లో జరగవలసి ఉండిన చర్చను ప్రస్తావిస్తూ, ఆ చర్చ ఆమె వ్యాసంపై కాగా అంబేద్కర్ నో, బొజ్జా తారకం వంటి దళిత మేధావినో వాడుకోవలసిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు.

ఈ ప్రశ్నలలో కొన్నిటికి జవాబిస్తూ అరుంధతీ రాయ్ ఒక లేఖ రాశారు. దానిలో ఆమె మొట్టమొదట ఒకరు మరొకరికి ప్రాతినిధ్యం వహించగలరా అనే ప్రశ్నను తీసుకుని 'ఇది చాల ముఖ్యమైనది... మన చర్చ సాధారణంగా దళితుల రాజకీయ ప్రాతినిధ్యం గురించినది కాదు. ఒక దళితేతర వ్యక్తి ఇటువంటి పరిచయ వ్యాసాన్ని రాయవచ్చునా, రాయగలరా అనేది. ఇదేమీ కొత్త చర్చ కాదు. అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం, ప్రపంచవ్యాప్తంగా స్త్రీ ఉద్యమకారులు, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షా వ్యతిరేక ఉద్యమకారులు, (స్వలింగ సంపర్కం తదితర భావాల) క్వీర్ ఉద్యమకారులు ఈ ప్రశ్ననే వేస్తున్నారు. దళిత జీవితానుభవాన్ని దళితులే సరిగా చిత్రించగలరని మీరు వాదిస్తుంటే మీతో ఏకీభవిస్తాను. కాని అంబేద్కర్ పరిచయం దళితులు మాత్రమే రాయాలని మీరు వాదిస్తుంటే నేను అంగీకరించలేను. రేపు గుజరాతీ బనియాలు గాంధీ గురించి తాము మాత్రమే రాయగలమంటే ఎలా ఉంటుంది? లేదా, అంబేద్కర్ గురించి ఇతరుల అవగాహన కన్న తమ అవగాహన మాత్రమే సాధికారికమైనదని, మౌలికమైనదని మహర్ లు అంటే ఎలా ఉంటుంది' అని ఆమె ప్రశ్నించారు.

అంబేద్కర్‌ను దళితులు చదివే పద్ధతికీ, దళితేతరులు, ఎక్కువ అవకాశాలున్న సవర్ణ హిందువులు చదివే పద్ధతికీ తేడా ఉంటుందంటే ఒప్పుకోవచ్చు గాని దళితుల పఠనం దానికదే 'సాధికారికమైనది' అనీ, దళితేతరుల పఠనం 'తప్పుదారి పట్టించేది' అనీ అంటే ఒప్పుకోలేనని ఆమె అన్నారు. ఇంతకూ ఆమెకు ఉన్న అవకాశాలైనా, ఆమాటకొస్తే ఆమెను ప్రశ్నిస్తున్నవారికి ఉన్న అవకాశాలైనా బ్రాహ్మణ్యం మీద పోరాడడానికా, లేక దాన్ని బలోపేతం చేయడానికా అని ఆమె

ప్రశ్నించారు. అంబేద్కర్ అపారమైన విస్తృతి ఉన్న మేధావి అనీ, ఆయన మార్క్సిజం, ఇస్లాం, బౌద్ధం, చట్టం, ఆర్థిక వ్యవస్థ లాంటి ఎన్నో అంశాల మీద రాశారనీ, ప్రతి భారతీయ పౌరుడినీ పాలించే భారత రాజ్యాంగ రచనా కమిటీకి అధ్యక్షుడిగా ఉన్నారనీ, అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ లో కూడ ఆయన ఎన్నో హిందూ పవిత్ర గ్రంథాల గురించి, సోషలిజం, ఆదివాసులు, ముస్లింలు, సిక్కులు వంటి అంశాల గురించీ రాశారనీ, కనుక ఆయన రచనల గురించి వ్యాఖ్యానించే, ఆయనకు పరిచయాలు రాసే అర్హత ఎవరికి ఉందో ఎవరికి లేదో ఎవరు చెప్పగలరనీ ఆమె ప్రశ్నించారు.

'నేను గతంలో భారీ ఆనకట్టల గురించీ, అణు బాంబుల గురించీ, కార్పొరేట్ ప్రపంచీకరణ గురించీ, మరెన్నో విషయాల గురించీ రాశాను. నిర్వాసితురాలిని కాకుండా, బాంబుల నిపుణురాలిని కాకుండా, అర్థశాస్త్రవేత్తను కాకుండా వాటి గురించి రాయడమేమిటని ప్రతిసారీ సరిగ్గా మీ అభ్యంతరాల లాంటి అభ్యంతరాలనే చాలమంది లేవనెత్తారు' అని ఆమె అన్నారు.

ఇక ఆమె దళిత చరిత్ర గురించి పరిశోధన చేసిందా, దళిత ఉద్యమాలలో ఎప్పుడైనా పాల్గొందా అనే ప్రశ్నకు జవాబిస్తూ, 'దళితేతరులకు అంబేద్కర్ గురించి రాయడానికే హక్కు లేదని మీరు అంటున్నప్పుడు, ఇక దళితేతరులు దళిత ఉద్యమంలో ఎలా పాల్గొన గలరు' అని ఆమె ప్రశ్నించారు. తనకేదో అధికారం ఉందని రాయలేదని, కాని తనకు, తాను నివసిస్తున్న సమాజానికి అవసరమైన విషయాలు రాసే రచయితగా ఇది రాశానని, తనకన్న మెరుగ్గా రాయగలవారు కూడ ఉన్నారని, ఒక పుస్తకానికి ఎన్ని పరిచయ వ్యాసాలైనా రావచ్చునని ఆమె అన్నారు.

నవయాన ప్రచురణ ప్రత్యేకత దానికి సమకూర్చిన వివరమైన పాదసూచికలేనని అంటూ దాన్ని కూడ ఎందుకు విమర్శిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ లో ఎన్నో వివరణ అవసరమైన విషయాలు, సంఘటనలు, తాత్విక భావనలు, మేధావుల, తత్వవేత్తల పేర్లు ఉన్నాయని, అలాగే అంబేద్కర్ అనువదించకుండానే ఎన్నో సంస్కృత శ్లోకాలు ఉటంకించారని, వాటికి వివరణలు రాయడం కూడ నేరం ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు.

తాను అంబేద్కర్ పట్ల సంరక్షకురాలిలా ప్రవర్తించాననే విమర్శకు జవాబుగా, 'నా వ్యాసం ముగింపులో ఇలా రాశాను: కులాన్ని నిర్మూలించ గలమా? ఆకాశంలో నక్షత్రాలను మార్చి అమర్చే ధైర్యం చేయనంత వరకూ అది సాధ్యం కాదు. తమను తాము విప్లవకారులుగా భావించుకునేవారు బ్రాహ్మణ్యం పట్ల మౌలిక విమర్శ అభివృద్ధి చేసేవరకూ అది సాధ్యం కాదు. బ్రాహ్మణ్యాన్ని అర్థం చేసుకున్నవారు పెట్టుబడిదారీ విధానం పట్ల తమ విమర్శను పదును పెట్టుకునేవరకూ అది సాధ్యం కాదు. మన తరగతి గదుల్లో కాకపోయినా, బైటనైనా మనందరమూ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అధ్యయనం చేసేవరకూ అది సాధ్యం కాదు. అప్పటివరకూ ఆయన అన్నట్టుగా మనం స్వస్థత కోరుకోని హిందుస్తాన్ 'రోగిష్టి మనుషులు'గానే మిగిలిపోతాం. – ఇది సంరక్షకురాలిలా ధ్వనిస్తోందా' అని ఆమె ప్రశ్నించారు.

తన పరిచయంలో గాంధీకి ఎక్కువ స్థానం దొరికిందనే విమర్శకు జవాబిస్తూ, 'అంబేద్కర్ గురించి మాట్లాడేటప్పుడు గాంధీ పేరు కూడ ప్రస్తావించవద్దని భావించే దళిత మేధావుల బృందం ఉందని నాకు తెలుసు. కాని నాకు దానితో ఏకీభావం లేదు' అంటూ అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ 1937 కూర్పులో గాంధీ గురించి అంబేద్కర్ రాసిన మాటలను ఉటంకించారు. 'గాంధీ గురించి మన మెదళ్లలో నింపిన భావాల కన్న భిన్నంగా ఆలోచించడానికి నాకు తోడ్పడినవి అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్ విషయంలో గాంధీతో అంబేద్కర్ చేసిన చర్చలూ, ఇతరంగా గాంధీ గురించి అంబేద్కర్ రాసిన సుదీర్ఘ రచనలే. గాంధీ అడుగడుగునా అంబేద్కర్ ను అడ్డుకున్నాడు. కాని ఈ విషయం దళితులకు మినహా ఎందరికి తెలుసు? ఇవాళ అధికారవర్గంలో, దాని పెంపుడు మేధావులలో కులానికి వ్యతిరేకంగా గాంధీ చేసిన పోరాటంలో అంబేద్కర్ ఒక సహాయకుడు (జూనియర్ పార్ట్ నర్) మాత్రమేనని చూపుతూ అంబేద్కర్ ను తమలో కలిపేసుకోవడానికి ఒక పెద్ద ప్రయత్నం జరుగుతున్నది. గాంధీ మంచితనానికి, సాధుత్వానికీ మూర్తీభవరూపం అనే ఆలోచన ఇంకా సాగుతున్నది. ఆ గాంధీ విగ్రహాన్ని దారిలోంచి తొలగించకుండా పాఠకులను అంబేద్కర్ దగ్గరికి తీసుకుపోలేం. ఆ పని అలవోకగా, అజాగ్రత్తగా, ఒకటో రెండో పేరాగ్రాఫులలో చేసేది కాదు' అని ఆమె రాశారు.

మొత్తానికి ఇప్పటికింకా పూర్తికాని ఈ వివాదం అనేక చర్చనీయాంశాలను వెలికితెచ్చింది. తెస్తున్నది. ఈ వివాదంలో పాలుపంచుకున్న వ్యక్తులను, వారి ఉద్దేశాలను, వారి నేపథ్యాలను పక్కన పెట్టి, వాదనలకు మాత్రమే పరిమితమై, ఆ వాదనల ఉచితానుచితాలను చర్చిస్తే, స్వయంగా ఆ పుస్తక రచన ద్వారా డా. అంబేద్కర్ ఆశించిన కులనిర్మూలనా దృక్పథానికి, ఆచరణకు ఆ చర్చ ఉపయోగపడితే అంతకన్న కావలసింది లేదు. వీ

(రచయిత పాత్రికేయులు)

రాబోయే సంచికలలో...

- ❖ **పతనావస్థలో ప్రజారోగ్యం - డా. నళిని**
- ❖ **ఈ శతాబ్దపు రైఫిల్ - విశ్వం**
- ❖ **బాల్కో వ్యతిరేక పోరాట విజయగాథ - నతాషా**
- ❖ **కల్లోల సాగరం - కోస్తా తీరం - ఇక్బాల్ ఎంజి**
- ❖ **క్రికెట్ ఓ విష జ్వరం - జె.ఆర్. నాగభూషణం**

ప్రపంచానికి వెనిజులా నేర్పే పాఠం

***వెనిజులాలో ఉధృతంగా జరుగుతున్న ఆందోళనలు, అల్లర్ల వెనుక గల అసలు కారణాలు, అవి ప్రపంచానికి నేర్పుతున్న పాఠాలు వివరిస్తున్నారు* నర్సింహ**

ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి ప్రజలందరి జీవితాల్లో గొప్ప మార్పు తేవడం సాధ్యమేనా? ఎన్నికల ద్వారా ప్రజానుకూల సమాజాన్ని నిర్మించడం సాధ్యమేనా? ఎంత అభ్యుదయకరమైన భావజాలం ఉన్నప్పటికీ, ఎంత నిజాయితీ కలిగిన వ్యక్తులు ఆ భావజాలం వెనుక ఉన్నప్పటికీ, ప్రజలు వారిని నమ్మి, వోట్లు వేసి, వారికి అధికారం ఇచ్చినప్పటికీ వారు ప్రజలకు చేయగలిగే మేలు చాలా తక్కువేనని వెనిజులా దేశ రాజకీయాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. ప్రపంచానికి ప్రస్తుత వెనిజులా నేర్పే అతి పెద్ద పాఠం ఇదే. ఎన్నికల ద్వారా అసమానతలు లేని ప్రజానుకూల సమాజం తేవడం సాధ్యమేనని నమ్ముతున్న వారందరూ తప్పక లోతుగా, అన్ని కోణాల నుండి పరిశోధించ వలసిన దేశం వెనిజులా.

వెనిజులాలో ఫిబ్రవరి రెండవ వారం నుండి విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్నారు. వీరికి మద్దతుగా నిలబడింది పెరెజ్ అనే ఒక ప్రధాన ప్రతిపక్ష నాయకుడు. దాదాపు అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఇప్పుడున్న ప్రభుత్వం కూలిపోవాలని కోరుకుంటున్నాయి. వీరికి అమెరికా మద్దతు. అమెరికా సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించి, స్వతంత్ర దేశంగా ఉండాలనుకునే ఏ ప్రభుత్వాన్నైనా కూల్చివేసి, తన తొత్తును అధికారంలోకి తెచ్చే వరకు ఆ దేశంలో అమెరికా అంతర్గత సమస్యలు సృష్టిస్తూనే ఉంటుందనే సత్యాన్ని జీవితంలో మొదటిసారి తెలుసుకున్న వారికి తప్పించి ఎవరికీ ఆశ్చర్యం కలిగించదు. కనీసంగా గత 70 సంవత్సరాలుగా అమెరికా చరిత్రంతా ఇదే. గత చరిత్రలోకి వెళ్లి వస్తే ఇప్పటి వెనిజులా పరిస్థితి అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.

ఇప్పుడు వెనిజులా దేశంగా పిలుస్తున్న ప్రదేశం గురించి ప్రపంచానికి తెలిసింది 1498లో కొలంబస్ కనుగొనడం వలన. అంతే 1522లో స్పెయిన్ సామ్రాజ్యం ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకొని తన వలస దేశంగా మార్చుకుంది. జర్మనీకి చెందిన వెల్సర్ అనే ఫైనాన్స్ వ్యాపారి స్పెయిన్ రాజవంశానికి ఇచ్చిన అప్పులు వారు తిరిగి తీర్చలేక పోయినందుకు, వారు అప్పుకు గ్యారంటీ కింద ఇచ్చిన వెనిజులా దేశాన్ని తన పరం చేసుకున్నాడు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత స్పెయిన్ రాజు వెనిజులాలోనే వెల్సర్‌ను ఉరి తీయించి వెనిజులాను తిరిగి తన ఆధీనంలోకి తీసుకున్నాడు. 16వ శతాబ్దపు మధ్యలో కూడా కేవలం రెండువేల యూరోపియన్లే ఆ దేశంలో తిష్టవేసి ఏలుతున్నారు (ఇంత పెద్ద భారత ఉప ఖండాన్ని కూడా కేవలం కొన్ని వేల మంది తెల్లవారే ఏలినారు కదా) . వెనిజులాలో బంగారు గనులు ఉన్నాయని తేలడంతో అక్కడ తవ్వకాలు మొదలైయ్యాయి. దాంతో గని కార్మికులుగా స్థానిక ఆదివాసి తెగలను, ఆఫ్రికా నుండి తెచ్చిన నల్లవారిని బానిసలుగా వాడుకున్నారు యూరోపియన్ దురాక్రమణదారులు. భారతదేశాన్ని మొదట్లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఏలినట్టుగా వెనిజులాను స్పెయిన్‌కు చెందిన గుయిపుజ్‌కోనా కంపెనీ ఏలింది. వలస ఆధిపత్యానికి వ్యతిరేకంగా 1808 నుండి 1819 వరకు వివిధ తిరుగుబాట్లు జరిగినా అవి విఫలమయ్యాయి. చివరగా 1821లో సైమన్ బొలివార్ నాయకత్వంలో వెనిజులా స్పానిష్ సామ్రాజ్యం నుండి విముక్తి అయింది. ఆ యుద్ధంలో సగానికి పైగా తెల్ల యూరోపియన్లు చంపబడ్డారు. బొలివార్ నాయకత్వంలో పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేశారు. దాదాపు 90సంవత్సరాల తర్వాత వెనిజులాలో ఆయిల్ నిల్వలున్నట్టు కనుగొనడంతో 'గొమెజ్' అనే నియంత చేతిలోకి వెనిజులా వెళ్లి పోయింది. 1930 ప్రాంతంలోనే వెనిజులా ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ ఎగుమతిదారుగా నిలిచింది. అయినా ప్రజల జీవితాల్లో మార్పు ఏమీ లేదు. 1948లో ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే సైనిక తిరుగుబాటులో కూలిపోయింది. ఈ తిరుగుబాటు వెనుక అమెరికా ఉన్నదని వేరే చెప్పనవసరం లేదు.

ఒపెక్ దేశాలు అమెరికాను ఎదిరించడం వలన ఏర్పడిన ఆయిల్ సంక్షోభం వలన (1970లో) వెనిజులా చాలా లాభపడింది. ఆయిల్, స్టీల్ పరిశ్రమలు జాతీయం చేయబడ్డాయి. అయినా, ప్రజల జీవితాల్లో మార్పేమీ జరగలేదు. ఎందుకంటే ఆస్తులు కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయి. 1983లో ఆయిల్ ధరలు దారుణంగా పడిపోవడంతో (పడిపోయేట్టు అమెరికా, యూరప్ దేశాలు చేయడంతో) వెనిజులా సంక్షోభంలోకి వెళ్లింది. సంక్షేమ పథకాలకు నిధులు లేక పేద ప్రజల పరిస్థితి పేనం నుండి పొయ్యిలో పడ్డట్టయింది. 1989లో కొత్తగా ఎన్నికైనా ప్రెసిడెంట్ ఐఎంఎఫ్ అప్పుల షరతుల్లో భాగంగా సరళీకరణ ఆర్థిక విధానాలు అవలంభించాడు. దాంతో ప్రజలు తిరుగబడ్డారు. దాదాపు రెండు వేల మంది చంపబడ్డారు. మిలటరీ పాలన పెట్టారు. నిజానికి, ఈ ప్రెసిడెంట్‌ను ప్రజలు ఎన్నుకోవడానికి కారణం ఐఎంఎఫ్‌ను, అమెరికాను, నయా ఉదారవాద ఆర్థిక విధానాలను తీవ్రంగా ఎండగడ్తూ, వ్యతిరేకిస్తూ ప్రజల వద్దకు వోట్ల గురించి వెళ్లాడు. ప్రజలు అతని మాటల్ని నమ్మి, గెలిపిస్తే, అధికారంలోకి రాగానే పూర్తి విరుద్ధంగా ప్రవర్తించి, చివరికి రెండువేల మందిని చంపే స్థాయికి కూడా వెళ్లాడు. ఇతను వెనిజులా చరిత్రలో అమెరికాకు అతిపెద్ద తొత్తుగా మారాడు. దేశాన్ని ఐఎంఎఫ్, అమెరికాల పరం చేయడాన్ని చూస్తూ సహించలేక కొందరు ఆర్మీ అధికారులు ఫిబ్రవరి 1992లో తిరగబడ్డారు. అయితే ప్రెసిడెంట్‌ను కూల్చలేక పోయారు. వారిలో ఒక్కడే హుగో చావెజ్. అందరిని అరెస్ట్ చేసి జైల్లో వేశారు. ఐఎంఎఫ్ దశాబ్దాల కాలంగా ఇచ్చిన సలహాలు పాటించిన వెనిజులా ఆర్థికంగా

కృంగిపోయి, దివాళా తీసింది. ప్రజలు అన్ని రాజకీయ పార్టీలపై అసంతృప్తితో రగిలి పోయారు. 1992 తిరుగుబాటు అనంతరం అరెస్టు అయిన చావెజ్ టెలివిజన్‌లో ప్రసంగించి తాను ప్రజల రాజ్యం కొరకు తిరుగుబాటు చేశానని చెప్పడం వలన ప్రజల్లో అతని పట్ల అభిమానం ఏర్పడింది. 1994లో కొత్త ప్రభుత్వం అతన్ని విడుదల చేసింది. 1998లో జరిగిన ప్రెసిడెంట్ ఎన్నికల్లో చావెజ్ పోటీ చేయడం, అన్ని రాజకీయ పార్టీలపై ఉన్న అసహ్యంతో చావెజ్‌కు వోట్లు వేయడంతో అతడు గెలిచాడు. (వెనిజులాలో అమెరికా తరహా అధ్యక్ష విధానం ఉంటుంది)

1992లో అరెస్టయినపుడు తాను సోషలిస్టు కాదని ఇంటర్వ్యూ ఇచ్చిన చావెజ్, అధికారంలోకి రాగానే తనది 'బొలివేరియన్ సోషలిజం' అని చెప్పాడు. 'నేను క్యాపిటలిస్టును కాదు కాని క్యాపిటలిజానికి వ్యతిరేకిని కూడా కాదు. నేను కమ్యూనిస్టును కాదు, కాని కమ్యూనిజానికి వ్యతిరేకిని కూడా కాదు' అని చావెజ్ అన్నాడు. అలాగే, తన మంత్రివర్గ సభ్యునితో నేను ట్రాట్స్కీవాదిని అని అన్నట్టుగా అతను చెప్పాడు. మొత్తంగా చూస్తే, చావెజ్ అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకి. జాతీయ పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ, ఆయిల్ అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయం నుండి పేద ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సంస్కరణవాదిగా అర్థం చేసుకోవచ్చు. మొదటిసారి 'బొలివేరియన్ సోషలిజం' అన్న చావెజ్, రెండవసారి అధికారంలోకి రాగానే దాన్ని '21వ శతాబ్దపు సోషలిజం' అన్న నినాదంగా మార్చాడు. సోషలిజం అనే పదం చావెజ్ నినాదంలో ఉన్నది కాని, చావెజ్ తరహా సోషలిజానికి మార్క్స్, లెనిన్, మావోలు చెప్పిన సోషలిజానికి సంబంధమే లేదు. చావెజ్ పార్టీ కమ్యూనిస్టు పార్టీ కూడా కాదు. తన లక్ష్య సాధనలో భాగంగా వివిధ బ్యాంకులను, పరిశ్రమలను తిరిగి జాతీయం చేశాడు. విద్య, వైద్యం లాంటి అంశాలలో ప్రగతిని సాధించాడు. అమెరికా ప్రోద్బలంతో 2002లో చావెజ్‌కు వ్యతిరేకంగా మిలటరీలో కొందరు తిరుగుబాటు చేసి, అతన్ని అరెస్టు చేశారు. అయితే, లక్షలాది ప్రజలు చావెజ్‌కు మద్దతుగా తిరగబడడం, వారికి మద్దతుగా సైన్యంలో ఒక వర్గం నిలబడడంతో రెండు రోజుల తర్వాత వారు చావెజ్‌ను వదలడంతో అతను మళ్లీ అధికారంలోకి వచ్చాడు. ఈ పరిణామాలను 'ది రివల్యూషన్ విల్ నాట్ బి టెలివైజ్డ్' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌లో లైవ్‌గా చిత్రీకరించారు. 2013 మార్చ్‌లో చావెజ్ క్యాన్సర్ వలన చనిపోయారు. యాసర్ అరాఫత్‌కు ఫ్లుటోనియం ఎక్కించడం వలన అతను అర్ధాంతరంగా చనిపోయాడని ఈ మధ్య తేలింది. ఆ కుట్ర వెనుక అమెరికా, ఇజ్రాయిల్‌లు ఉన్నాయని వేరే చెప్పనవసరం లేదు. చావెజ్ అర్ధాంతరంగా క్యాన్సర్‌తో చనిపోవడం వెనుక కూడా ఇలాంటి కుట్ర ఏదైనా ఉన్నా ఆశ్చర్యపడనవసరం లేదు. క్యాన్సర్‌తో చివరి దశలో ఉన్నప్పుడే చావెజ్ తన వారసునిగా మధురోను ప్రకటించాడు. అతనే ప్రస్తుత వెనిజులా ప్రెసిడెంట్.

చావెజ్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి నేటి మధురో పాలన వరకు తరచుగా ప్రజా ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఈ సారి మాత్రం మరీ ఉధృతంగా, హింసాత్మకంగా మారాయి. మార్చ్ నెలలో వెనిజులా ప్రభుత్వం ముగ్గురు అమెరికా దౌత్యాధికారులను దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. వారు వీధుల్లో ఆందోళనలు చేస్తున్న వారిని స్వయంగా కలిసి రెచ్చగొడుతున్నారని ప్రభుత్వం చెపుతుంది. ఈసారి ఆందోళనకారులు ఏకంగా బాంబులను కూడా విసురుతున్నారు. ఈ యువ ఆందోళనకారుల్లో అధిక భాగం ఎగువ మధ్యతరగతి, ధనిక కుటుంబాల వారేనని వారిని గమనిస్తున్న పరిశీలకులు అంటున్నారు. ఉక్రెయిన్ దేశంలో అమెరికా దౌత్యాధికారులు, ఫాసిస్ట్ నాజీల లక్ష్యాలతో ఏర్పడిన రైట్‌వింగ్ పార్టీలను బహిరంగంగా కలిసి వారికి మద్దతు పలికి ఉక్రెయిన్‌లో సంక్షోభానికి ఎలా కారణమయ్యారో, వెనిజులాలో కూడా అలానే చేస్తున్నారు. ఉక్రెయిన్‌లో ఆందోళనకారులు తుపాకులతో ప్రభుత్వ బలగాలపై కాల్పులు జరిపిన తీరుగానే వెనిజులాలో బాంబులు వాడుతున్నారు. ఇంతకూ వీరి డిమాండ్ ఏమిటంటే, దేశంలో ద్రవ్యోల్బణం పెరిగినందున మధురో ప్రెసిడెంట్ పదవి నుండి దిగిపోవాలి.

అయితే వాస్తవంగా వెనిజులా పరిస్థితి ఎలా ఉందో నిష్పక్షపాతంగా పరిశీలిస్తేనే అర్థమవుతుంది. ఒక అభ్యుదయ భావజాలంతో, ప్రధానంగా పేద ప్రజల జీవితాల్లో మార్పు తేవడానికి కమ్యూనిస్టు భావజాలానికి సంబంధం లేని తనదైన సోషలిస్టు భావజాలంతో చావెజ్ ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చాడు. ఏ దేశంలోనైనా మెజారిటీ ప్రజలు (కనీసంగా 90శాతం ప్రజలు) పేదరికం, అప్పులు, నిరుద్యోగం, పోషకాహార లోపం, సరైన వసతి, విద్య లేకపోవడం లాంటి ప్రాథమిక సమస్యలు ఎదుర్కోవ డానికి కారణం ఆ దేశంలో ఉన్న భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థ, వీరికి మద్దతుగా నిలిచే సామ్రాజ్యవాద వ్యవస్థ కారణం. ఎందుకంటే ప్రజలందరికీ చెందాల్సిన వనరులను కేవలం వీరు మాత్రమే అనుభవిస్తూ తమ ఆస్తులు పెంచుకుంటున్నారు. అలాగే, ప్రజల జీవన ప్రమాణాలు పెరగకుండా వారిని శ్రమ దోపిడి చేస్తూ లాభపడుతున్నారు. ఈ పునాది నిర్మాణాన్ని మార్చకుండా, ఉపరితల నిర్మాణంలో చేసే మార్పులు ప్రజల జీవితాల్లో కేవలం ప్రాథమిక స్థాయి మార్పులను మాత్రమే తేగలుగుతుంది. చావెజ్ కాని, అతనికి మద్దతుగా నిలిచిన వివిధ వామపక్ష పార్టీలు కాని ఈ పునాది నిర్మాణంలో మార్పు తేలేదు. పాత భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థ అలానే ఉంది. రాజకీయంగా అమెరికా సామ్రాజ్యవాద పెత్తనాన్ని తొలగించుకున్నారు. కాని అమెరికాతో వాణిజ్య సంబంధాలు అలానే ఉన్నాయి. నిజానికి, వెనిజులాలో తీయబడుతున్న చమురులో అధిక భాగం నేటికీ అమెరికాకు అమ్మక తప్పని (పాత ఒప్పందాలలో భాగంగా) పరిస్థితి. దేశంలోని భూస్వామ్య, పెట్టుబడి దారులు అమెరికా తొత్తులుగా మారి వీలైనప్పుడల్లా ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వారి అక్రమ ఆస్తులు అలాగే ఉన్నాయి. నిరుద్యోగం చాలా ఉంది. ఆహారం, ఆరోగ్యం, విద్య విషయంలో పరిస్థితి మెరుగైనప్పటికీ, పేద మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిలో గణనీయమైన మార్పులు ఏమీ జరగలేదు. దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూ సంస్కరణలు అమలు కానందున వ్యవసాయరంగం సంక్షోభంలో ఉన్నది. దేశ అవసరాల కొరకు చాలా వరకు (చివరికి తిండి పదార్థాలు కూడా) విదేశాల నుండి దిగుమతి జరుగుతున్నందున దేశీయ పారిశ్రామిక రంగం కూడా సంక్షోభంలో ఉంది. పెట్రోల్, డీజిల్ తప్పించి అన్నీ కూడా అధిక ధరలే. దీనికి కారణం రిటైల్ వ్యాపార వ్యవస్థ పూర్తిగా పెట్టుబడిదారుల చేతుల్లోనే ఉంది. వీరు ఈ మధ్య నూనె, పిండి లాంటి ముఖ్యమైన వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో వాటికి కొరత ఏర్పడి అధిక ధరలకు కొనాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక అసమానతలు కొట్టొచినట్టు కనబడతాయి. పేదల, ధనికుల ప్రాంతాలుగా విడిపోయిన పరిస్థితి ప్రతి పట్టణంలో, గ్రామంలో నేటికీ ఉంది. ఆశ్చర్యం ఏమిటంటే, ప్రపంచంలోనే అత్యంత హింసాత్మక దేశాల్లో వెనిజులా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. కేవలం రాజధాని నగరంలోనే రోజు డజన్ల కొద్ది హత్యలు జరుగుతున్నాయి.

మారుతీ సుజుకీ కార్మికుల పోరాటం

***కార్మికవర్గ చైతన్యంతో, ప్రజల మద్దతుతో మారుతీ సుజుకీ కార్మికులు ఐక్యంగా నిలబడి యాజమాన్య, ప్రభుత్వ అణచివేతలను ధైర్యంగా ఎదుర్కొంటూ పోరాటం కొనసాగిస్తున్నారని అంటున్నారు* పి.వి. రమణ**

హర్యానా ప్రభుత్వ సహకారంతో మారుతీ యాజమాన్యం కుట్ర పూరితంగా హత్యానేరం పేరుమీద వందలాదిమందిని అరెస్టులు చేసి, జైళ్లలో పెట్టినా, వేలాదిమందిని డిస్‌మిస్ చేసినా ఏమాత్రం అదరక, బెదరక కార్మికవర్గ చైతన్యంతో తమ హక్కుల్ని రక్షించుకోవడానికి ధర్నాలూ, నిరాహారదీక్షలూ, నిరసన ప్రదర్శనలతోపాటు వందలాది మైళ్లు జనజాగరణయాత్ర సాగించారు. మారుతీ సుజుకీ కార్మికుల పోరాటం భారతీయ కార్మికోద్యమ చరిత్రలో ఒకమైలురాయిగా చాలామంది విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ఈ ఉద్యమం యాజమాన్య దాడులను తిప్పికొట్టడానికీ, ఆటో ఉత్పత్తి సంస్థలలో పనిచేస్తున్న కార్మికులలో ఐక్యపోరాట చైతన్యాన్ని పెంచడం, యూనియన్‌ల ఏర్పాటు, గుర్తింపు, పని పరిస్థితులలో మార్పు, పనిభారం తగ్గింపు లాంటి ముఖ్యమైన సమస్యలతో పాటు ప్రత్యేకంగా పర్మనెంట్ కార్మికుల కోసమే కాకుండా కాంట్రాక్టు కార్మికుల కోసం కూడా ఉద్యమం కొనసాగించడం వీరి పోరాటంలో అభినందించదగ్గ విషయం. మారుతి సుజుకీ కంపెనీలో 2006లో ప్రారంభమైన మానేసర్ ప్లాంట్‌లో మొదటి మూడు సంవత్సరాలలో షిఫ్ట్‌కు 250 - 300 కార్లు ఉత్పత్తి అయితే, 2009 నుండి షిఫ్ట్‌కు 550 - 600 వరకూ పెరిగింది. దీనిని బట్టి పనిభారం ఏ స్థాయిలో పెరిగిందో తెలుస్తుంది. ఇందులో పనిచేసే కార్మికుడు కేవలం 42 సెకెన్లలో కారు ఇంజనుకు సంబంధించిన 142 విడిభాగాలను ఏమాత్రం తేడా రాకుండా చెక్ చేయాలి. మారుతి కార్మికులకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా వదలకపోవడం వలన చాలా మంది కార్మికులకు రీనల్, యూరినల్ సమస్యలు ఏర్పడ్డాయంటే వారిని ఏ స్థాయిలో హింసిస్తున్నారో అర్థమవుతుంది.

జూన్ 2011లో యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రారంభించిన కార్మికుల ఉద్యమం లాకౌట్‌లు, డిస్‌మిస్‌లు ఎదుర్కొని నిలబడింది. అప్పటి నుండి కార్మికులు నిరంతరం యాజమాన్యపు అణిచివేత చర్యలకు గురవుతూనే ఉన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పర్మనెంట్ కార్మికులు నిలబడడంపై యాజమాన్యం అప్పటికే చాలా కోపంతో ఉంది. 2012 జూలై 18న యాజమాన్యం కుట్రలో భాగంగా జరిగిన విధ్వంసం లో మంటలు చెలరేగి అవనీష్ కుమార్‌దేవ్ అనే అధికారి చనిపోయారు. దాన్ని హత్యగా చిత్రీకరించి కార్మికులపై కేసులు పెట్టారు. ఆ సంఘటన చోటు చేసుకున్నప్పుడు లోపలికి వందలాది మంది గూండాలు ఎందుకు వచ్చారో ఇంతవరకూ యాజమాన్యం వివరించలేదు. పైగా కార్మికులకు అనుకూలంగా ఉండే అధికారిని కార్మికులు ఎందుకు హత్య చేశారన్న దానికి కూడా సరైన జవాబులేదు. 2012 జూలై 18న సూపర్‌వైజర్ సంగ్రామ్ కిషోర్ వచ్చి టీ విరామ సమయంలో కార్మికులందరూ టీ తీసుకుంటుండగా, జియాలాల్‌తో ఉత్పత్తికి సంబంధించిన పనులు

దేశంలో కొన్ని ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తారనే గ్యారంటీ అసలే లేదు. ఈ పరిస్థితికి కారణాలు ఏమిటనే విషయాలపై లోతైన పరిశోధన అవసరం.

ఇంకో వైపు స్మగ్లింగ్‌కు కూడా వెనిజులా పేరు గాంచింది. పాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పోలీసు, మిలటరీ ఉద్యోగులు పాత వ్యవస్థ నుండి వచ్చిన వారే అయినందున ఈ అన్ని వ్యవస్థల్లో అవినీతి చాలా ఉంది. పెద్ద స్థాయి స్కాంలు, చమురు నిధుల అక్రమ తరలింపు ఆరోపణలు ఎన్ని వచ్చినప్పటికీ, అవి ఆగడం లేదు. వ్యక్తిగతంగా చావెజ్ కాని, మధెరో కాని అవినీతిపరులు కాకపోయినా, పాత వ్యవస్థ పునాది పైననే చావెజ్ తరహా సోషలిజం నడుస్తున్నందున ఈ సమస్యలన్నీ అలానే ఉన్నాయి. వెనిజులా ఎగుమతి ఆదాయంలో 96 శాతం, జిడిపిలో 25 శాతంగా ఉన్న చమురు ఆదాయం ఆధారంగానే ఇప్పటికీ వారి ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నది. చావెజ్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఈ ఆదాయం ఆధారంగానే నడుస్తున్నాయి. చమురు ధరలు పడిపోతే వెనిజులా ఆర్థిక సంక్షోభంలో పడిపోయిన అనుభవం గతంలో ఉంది.

మొత్తంగా చూస్తే, అభ్యుదయ భావజాలంతో, నిజాయితీతో మొదలైన చావెజ్ ప్రయోగం ఒక వనరు ఆధారంగా ఆర్జించే ఆదాయం ద్వారా ఉపరితలంలో మాత్రమే కొన్ని మార్పులు (అవి ముఖ్యమైనవే) చేయడంలో విజయం సాధించాడు. అయితే, పాత దోపిడీ వ్యవస్థపైనే ఈ ప్రయోగం చేయడం వలన చావెజ్ తరహా సోషలిజం ఒక స్థాయి తర్వాత ఆగిపోయింది. వ్యవసాయ రంగాన్ని భూస్వాముల నుండి, పారిశ్రామిక, సేవా రంగాలను దళారీ పెట్టుబడిదారుల నుండి, మొత్తంగా దేశ ప్రజలను అన్ని రకాల సామ్రాజ్యవాద శక్తుల నుండి విముక్తి చేస్తేనే వెనిజులా (ఆ మాటకొస్తే ఏ దేశమైనా) విముక్తి అవుతుంది. అప్పుడే నిజమైన సోషలిస్టు వ్యవస్థను నిర్మించగలం. దోపిడి వ్యవస్థను అలాగే ఉండనిస్తూ (అది కూడా చట్టపరంగా) ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి ప్రజల జీవితాల్లో గొప్ప మార్పులు తేవచ్చని, అసమానతలు తొలగించవచ్చని అనుకోవడం కేవలం ఊహాలోకంలో విహరించడమే అవుతుంది. క్యాన్సర్ రావడానికి కారణమయ్యే వ్యవస్థను శరీరంలో అలానే ఉండనిస్తూ, క్యాన్సర్ వ్యాధిని బాగు చేస్తామని అనడం లాంటిదే ఈ వాదన కూడా. కుళ్లిన శవాన్ని ఇంట్లో అలానే ఉంచి, సెంట్ వాసన పీలిస్తే సరిపోతుందనడం లాంటిదే ఈ వాదన కూడా. వెనిజులా నేర్పుతున్న పాఠం కూడా ఇదే.

(రచయిత పరిశోధకులు) వీ

చెపుతుండగా, కేవలం కొన్ని నిమిషాలు మాత్రమే ఉండే టీ విరామంలో ఇలా పనులు చెప్పడాన్ని అతను వ్యతిరేకించాడు. దాంతో ఘర్షణ జరిగింది. సంగ్రామ్ జియాలాల్‌ను కులం పేరుతో దూషించడంతో, జియాలాల్ అతన్ని కొట్టాడని ఆరోపణ ఉంది. తర్వాత యాజమాన్యం జియాలాల్‌ను సస్పెండ్ చేసింది. తర్వాత జరిగిన విధ్వంసం గురించి అందరికీ తెలిసిందే.

యాజమాన్యమే విధ్వంసం సృష్టించిందనడానికి రుజువులున్నాయి. సంఘటనకు కొద్దిరోజుల ముందు ఒక సీనియర్ అధికారి 'మానేసర్ ప్లాంట్‌కు పట్టిన చీడనంతా తొందరలోనే శుభ్రం చేయడం జరుగుతుంది' అని అన్నట్లుగా కొంతమంది కార్మికులు తెలిపారు. మారుతీ ప్లాంట్‌కు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలకు చెందిన ఇద్దరు పంచాయితీ పెద్దలు సంఘటనకు ముందురోజున అంటే జూలై 17న మారుతీ సుజుకీ యాజమాన్యానికి చెందిన ఉన్నతాధికారులు 'జూలై 18న పెద్ద సంఘటన జరగబోతోంది. మీ పంచాయతీ సిద్ధంగా ఉండండి' అని చెప్పినట్లు హార్డ్‌న్యూస్ విలేకరి తెలిపారు. పైగా స్పెషల్ పోలీసు ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలో గొడవ ప్రారంభం అవ్వక ముందు నుంచే ఫ్యాక్టరీలో ఎసిపి నాయకత్వంలో 70 మంది పోలీసులున్నట్లు తెలిపారు. దీనిని బట్టే యాజమాన్యం కుట్రపూర్వకంగానే ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలుస్తుంది. మంటల్లో చనిపోయిన అధికారి భార్య కూడా గొడవ జరుగుతున్నప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ఏమాత్రం జోక్యం చేసుకోకుండా నిలబడ్డారని ఆరోపించడం కూడా దీనిని రుజువు చేస్తోంది.

విధ్వంసం జరిగిన రోజునే 99 మందిని అరెస్టు చేశారు. వీరిలో 9 మంది గుర్గాం ప్లాంట్‌లో పని చేస్తున్న వారున్నారు. వారికి ఈ గొడవతో ఏమాత్రం సంబంధంలేదు. ఒక పర్మినెంట్, 25 కాంట్రాక్ట్ కార్మికులు సంఘటన జరిగిన రోజున సెలవులో ఉన్నారు. వీరిపై తీవ్రమైన సెక్షన్‌లతో 302, 307, 120(బి) కేసులు పెట్టారు. మొదట అరెస్టు చేసిన వారిలో ఉన్న 12 మంది యూనియన్ నాయకులతో పాటు జియాలాల్‌ను కూడా తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. బట్టలిప్పి కొట్టారు. ఒక చేతిని పైకి కట్టి వేలాడ దీశారు. రెండు కాళ్లనూ ఎంత వరకూ సాగుతాయో అంతవరకూ ఎడంగా లాగడం, రహస్యాంగాలపై కొట్టడం, మురికినీటిలో పూర్తిగా ముంచడం, గుదంలో ఇనపరాడ్లను దూర్చడం లాంటి దుర్మార్గమైన చర్యలతోపాటు వారందరి దగ్గరా తెల్ల కాగితాల మీద సంతకాలు చేయించారు.

మెజిస్ట్రేట్ ముందు ప్రవేశ పెట్టినప్పుడు కార్మికులందరూ దెబ్బలతో నడవలేని పరిస్థితిలో ఉన్నారు. వారి పరిస్థితిని రికార్డు చేయడానికి మెడికల్ ఎగ్జామినేషన్‌కు ఆగస్టు 2న కార్మికుల తరపున లాయరు పిటిషన్ వేస్తే పరీక్షలు సెప్టెంబర్ 21న నిర్వహించారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తే హైకోర్టు 'విదేశీ పెట్టుబడులకు ఆటంకం కలుగుతుందనే' కారణంతో బెయిల్ నిరాకరించడం దేశంలో కోర్టులు ఎవరి పక్షాన ఉన్నాయో తెలుస్తుంది. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా అది 2014, ఫిబ్రవరి 3కి వాయిదా వేసింది. నేటికి 149 మంది జైళ్లలో ఉన్నారు.

జైళ్లు, అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవు

మానేసర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న వారిలో అధిక శాతం 25 – 30 సంవత్సరాలు వయసున్న యువకులే. యూనియన్ నాయకులందరూ జైళ్లలో ఉండడం వలన, ఉద్యమాన్ని కొనసాగించడానికి ప్రొవెన్షియల్ కమిటీగా ఏర్పడి పనిచేస్తున్నారు. సంఘటన జరిగిన దగ్గర నుంచీ ఉద్యమంలో భాగంగా అనేక కార్యక్రమాలు కొనసాగించారు. అందులో కొన్ని ముఖ్యమైన వాటిని తెలుసుకుద్దాం. కార్మికుల పోరాటానికి సంఘీభావంగా 2012 నవంబర్ 7, 8 తేదీల్లో జైళ్లలో ఉన్న కార్మికులతో పాటు మానేసర్ ప్లాంట్‌లో పని చేస్తున్న 500 మంది కార్మికులు రెండు రోజుల పాటు మినీ సెక్రటేరియట్ వద్ద నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంపై పోలీసులు దాడి చేసి 29 మందిని అరెస్టు చేశారు. అరెస్టులకు ఏమాత్రం జంకకుండా కార్మికులు సాగించిన తీవ్ర నిరసన కారణంగా ప్రొవెన్షియల్ కమిటీ సభ్యులైన రామ్‌నివాస్, ఓం ప్రకాష్ లను మినహాయించి మిగిలిన 27 మందిని విడుదల చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ఇతర కార్మిక సంఘాలూ, పియుడిఆర్ లాంటి ప్రజా సంఘాలూ కొనసాగించిన ఒత్తిడి కారణంగా వారిని కూడా అర్ధరాత్రి విడుదల చేశారు. 2013 మే 18న ఖైతాల్‌లో ధర్నా చేస్తున్న 100 మంది కార్మికులను అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారిలో ఇంక్విలాబ్ మజ్దూర్ కేంద్ర నాయకుడు కామ్రేడ్ శ్యామ్‌బీర్, దీపక్‌లు క్రాంతికారీ నౌజవాన్ సభకు చెందిన కామ్రేడ్ అమిత్‌లు ఉన్నారు. వీరితోపాటు జెఎన్‌యు విద్యార్థులూ, ప్రజా సంఘాల కార్యకర్తలూ ఉన్నారు. పోలీసులు లాఠీచార్జ్, టియర్‌గ్యాస్, వాటర్ కెనన్‌లతో దాడి చేసి విధ్వంసం సృష్టించారు. స్త్రీలు, పిల్లలను కూడా విడిచిపెట్టలేదు.

సంఘటన జరిగి సంవత్సరం గడిచిన కారణంగా 2013, జూలై 18న మానేసర్‌లో నిరసన ప్రదర్శన, ఆమరణ నిరాహారదీక్ష కొనసాగించాలని నిర్ణయించారు. కైతాల్‌లో లీజర్ వాలీ పార్క్ నుండి 20 కిలోమీటర్ల వరకూ ఊరేగింపు నిర్వహించి మానేసర్‌లో నిరసన దీక్ష జరపాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికి ఆ చుట్టుపక్కల ప్రాంతాల నుండి 150 గ్రామాల పంచాయతీల నుండి పూర్తి స్థాయిలో మద్దతు లభించింది. చాలామంది గ్రామస్తులు స్వయంగా ఈ కార్యక్రమ పోస్టర్‌లను అతికించారు. అప్పటికే పార్క్‌లో 2000 మంది పోలీసులు, పారా మిలటరీ బలగాలూ ఫ్లాగ్ మార్చ్ జరిపారు. దీనిలో స్వయంగా పోలీసు కమిషనర్ పాల్గొన్నారు. మానేసర్‌లో 10,000 మంది పోలీసులు పారా మిలటరీ బలగాలు మోహరించాయి. రెండు చోట్లా ఆయుధాలు, లాఠీలు, వాటర్ కెనన్‌లూ, టియర్‌గ్యాస్ వాహనాలూ సిద్ధం చేశారు. పారిశ్రామిక ప్రాంతమంతా 144వ సెక్షన్ విధించి 96 మంది కార్మికులను, కార్యకర్తలను అరెస్టు చేశారు. అయినా భయపడకుండా తరువాతి రోజు అంటే 19న అనేక పరిశ్రమల నుండి వచ్చిన 1500 మంది కార్మికులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పంచాయతీ పెద్దలు, అరెస్టయిన వారి బంధువులు, ఖైతాల్‌లో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు పోలీసులు వారిపై టియర్ గ్యాస్, వాటర్ కెనన్‌లతో దాడి చేసి మరో 11 మందిని అరెస్టు చేశారు.

2013, జూన్ 27న ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ లేబర్ రైట్స్ (ఐసిఎల్ఆర్) ఆధ్వర్యంలో 'మర్చంట్స్ ఆఫ్ మెనేస్, రిప్రెస్సింగ్ వర్కర్స్ అండ్ ట్రేడ్ యూనియన్ రైట్స్ ఎట్ మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్' అన్న నివేదికను విడుదల చేశారు. భారతదేశంలో మే 25 – 31ల మధ్యన కమిటీ పర్యటించి తయారు చేసిన ఈ నివేదికను ఐసిఎల్ఆర్ అధ్యక్షుడు, అంతర్జాతీయ న్యాయవాది జీన్నే మైరర్ విడుదల చేశారు. కార్మికుల హక్కులను ఉల్లంఘిస్తున్న 'మారుతి సుజుకీ కంపెనీ, హర్యానా

ప్రభుత్వం రెండూ అంతర్జాతీయ కార్మిక, మానవహక్కులను కాపాడే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్స్ 87, 98ల ప్రకారం సంఘంగా ఏర్పడే హక్కు, సమస్యల పరిష్కారానికి సామూహిక సంప్రదింపులు జరిపే హక్కూ, వాక్ స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కు, చట్ట విరుద్ధంగా నిర్బంధించడాన్ని, హింసించడాన్నీ వ్యతిరేకించే హక్కులన్నీ అంతర్జాతీయ హక్కుల సూత్రాలలో భాగమే' అని ప్రకటించారు.

ఈ కమిటీలో ఐసిఎల్ ఆర్ బోర్డు మెంబర్ అశ్వినీ సుక్తాంకర్, దక్షిణాఫ్రికా నేషనల్ లేబర్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కొసాటాకు చెందిన చెరే మైనెసా, ఫ్రాన్స్‌కు చెందిన కార్మిక న్యాయవాది ఫ్రాన్సలిన్ లెపానీ, అమెరికాలో సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌కు చెందిన ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఇమ్మాన్యూల్ నెస్, జపాన్‌కు చెందిన ఇంటర్నేషనల్ బ్యూరో మాజీ అధ్యక్షుడు మసయో కాటో, భారత్‌కు చెందిన న్యూట్రేడ్ యూనియన్ ఇనీషియేటివ్‌కు చెందిన ఎన్. వాసుదేవన్, పియుడిఆర్‌కు చెందిన రంజనాపథి, సుజుకీ కంపెనీకి చెందిన మాజీ ఉద్యోగి, కార్మికనాయకుడు యాసుహీసా ఓటా, జపాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లేబర్ మూవ్‌మెంట్‌కు చెందిన హయా మాట్సోలు ఉన్నారు.

ఢిల్లీలో 2013, జూలై 13న 'జస్టిస్ ఫర్ మారుతీ వర్కర్స్ క్యాంపెయిన్' ఏర్పాటు చేశారు. దీనిలో రచయితలూ, కళాకారులూ, లాయర్లు, పత్రికా విలేకరులూ, ఉపాధ్యాయులూ, జెఎన్‌యు, డియు, జమియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులూ, వివిద కార్మిక సంఘాల నాయకులూ, సామాజిక రాజకీయ కార్యకర్తలు 400 మంది హాజరై కార్మికుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ప్రజా సంఘాల, కళాకారుల పాటలతో ప్రారంభమైన సమావేశంలో మారుతీ సుజుకీ వర్కర్స్ యూనియన్ నుండి మహవీర్ ప్రారంభోపన్యాసం చేశారు. తర్వాత భగత్‌సింగ్ బంధువైన ప్రొఫెసర్ జగ్‌మోహన్ మాట్లాడుతూ 'భగత్‌సింగ్ ఏ అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడాడో ఈనాడు అదే విధంగా కార్మికులూ పోరాటం చేస్తున్నారు. బహుళజాతి కంపెనీల, విదేశీ పెట్టుబడుల చేతిలో బందీలైన మన పాలకులు ప్రజాస్వామ్యపరంగా ఉన్న కార్మిక చట్టాలను కూడా తుంగలో తొక్కి అణిచివేస్తున్నారని' విమర్శిస్తూ పోరాడుతున్న కార్మికులకు తన సంఘీభావం తెలిపారు.

పంకజ్ బెస్ట్, ప్రొఫెసర్ అచిన్ వనాయక్, అరుంధతీరాయ్, సుప్రీంకోర్టు లాయర్ ప్రశాంతభూషణ్, అరుణారాయ్, ప్రఫుల్‌బిద్వాయ్, టాకీ మలంకొలాస్ లాంటి మేధావులూ, సామాజికవేత్తలూ సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్ నుండి ప్రముఖ కార్మిక నాయకుడు కరామత్ ఆలీ, అమెరికా నుండి కార్మిక సంఘ నాయకురాలు సుజానేలు కూడా పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

ఢిల్లీలో 2013, అక్టోబర్ 6న 'పెట్టుబడిదారుల దాడి–కార్మికుల పోరాటం' అన్న అంశంపై జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో క్రాంతికారీ నౌజవాన్ సభ అధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. దీనిలో మారుతీ సుజుకీ వర్కర్స్ యూనియన్ నుండి మహబీర్, వర్కర్స్ సోలిడారిటీ సెంటర్ నుండి రామ్‌నివాస్, ముఖుల్ శ్రీవాత్సవ, ఐఎఫ్‌టియు నుండి అనిమేష్, ఎస్ఎస్‌సి నుండి సుభాషిష్ శర్మ, ఎఐసిసిటియు నుండి సంతోష్ రాయ్, ఐఎంకె నుండి శ్యాంవీర్, ఐసిటియు నుండి శశి సోనేవానే, ఎంకెపి నుండి అమితావ్ భట్టాచార్య, కెఎన్ఎస్ నుండి సుభాషిణి పాల్గొన్నారు.

మినీ లాంగ్‌మార్చ్

న్యాయం కోసం పోరాడుతున్న కార్మికులు సాధారణ ప్రజలకు తమ పోరాటం గురించి వివరిస్తూ వారి సహకారం పొందడం కోసం జనజాగరణ యాత్ర పేరుతో నిరసన యాత్ర జరిపారు. 2014, జనవరి 15 నుండి 31 వరకు 16 రోజులు 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. జనవరి 15న హర్యానాలో కైతాల్ నుండి ప్రారంభమై జింద్, రోహతక్, జజ్జార్, గుర్గాంల గుండా ఢిల్లీకి ప్రయాణించారు. దీనిలో ఉద్యోగం నుండి తొలగించబడిన కార్మికులూ, వారి కుటుంబాలూ, అరెస్టై జైళ్లలో ఉన్న వారి కుటుంబాలూ పాల్గొన్నాయి.

జనజాగరణ యాత్ర 9వ రోజున అంటే జనవరి 23న రోహతక్‌కు చేరుకుంది. అక్కడ జరుగుతున్న ఎలక్ట్రిసిటీ, వాటర్ బోర్డు, రోడ్‌వేస్ కార్మికులూ, ప్రైమరీ టీచర్స్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, అంగన్‌వాడీ, ఆశా కార్మికులు కొనసాగిస్తున్న సమ్మెలకు సంఘీభావంగా మానసరోవర్ పార్క్‌లో సభ జరిపారు. ఆ ప్రాంత కార్మిక సంఘాలన్నీ ఈ సభలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో కేవలం కార్మికులే కాకుండా నిరుద్యోగ యువతా, రైతులూ, విద్యార్థులూ పాల్గొని సంఘీభావం తెలపడం గొప్ప విశేషం. దిగాంలో అక్కడి ప్రజలు సీనియర్ సెకెండరీ స్కూల్‌ను రాత్రి విడిదిగా ఏర్పాటు చేశారు. జజ్జార్‌లో జల్‌బోర్డు కార్మికులు రాత్రి బస కోసం తమ యూనియన్ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు.

మొత్తం యాత్రా మార్గంలో గ్రామాల నుండి అరెస్టయిన కార్మికుల కుటుంబాలూ, బంధువులూ నడిచారు. 'ఇంత చలిలో వణికిపోతూ మేము ఎందుకు నడుస్తున్నామని మీరంతా ఆలోచిస్తున్నారని మాకు తెలుసు. న్యాయం కోసం పోరాడినందుకు అరెస్టు చేసిన 149 మంది కార్మికుల కోసం, మా న్యాయమైన హక్కుల కోసం, యూనియన్లు నిర్మించుకునే హక్కు కోసం, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చెయ్యాలని కోరడం తప్పయిపోయింది. అందుకే ప్రభుత్వం, యాజమాన్యాలు మాపై కత్తికట్టాయి. దీనిని అర్థం చేసుకుని మాకు సంఘీభావం తెలపండని కోరుతూ' ప్రచారం చేశారు.

16 రోజుల జనజాగరణ యాత్ర హర్యానాలో ఖైతాల్ నుండి ప్రారంభమై జింద్, రోహ్‌తక్, జజ్జార్, గుర్గాంల మీదుగా చివరకు జనవరి 31న ఢిల్లీకి చేరుకుంది. ఈ సందర్భంగా జంతర్‌మంతర్ వద్ద బహిరంగ సమావేశం జరిగింది. ఈ సభలో ప్రధానంగా అరెస్టైన 149 మంది కార్మికులను వెంటనే విడుదల చేయాలనీ, డిస్‌మిస్ చేయబడిన 546 మంది పర్మినెంట్, 1800 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలనీ, కార్మికులపై కార్మికుల కుటుంబాలపై అణచివేత చర్యలు, తప్పుడు కేసులు ఆపాలనీ, కార్మికులపై మోపిన హత్యా నేరంపై నిస్పాక్షిక దర్యాప్తు జరిపి నిజమైన నేరస్తులను శిక్షించాలనీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పాల్గొన్నారు. అనేక పరిశ్రమలకు చెందిన కార్మికులు, కార్మిక సంఘాలు, మారుతి సుజికి కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతును ప్రకటించారు. వీటిలో ఎఐటియుసి, సిఐటియు, ఎఐసిసిటియు, ఎఐయుటియుసి, ఎన్‌టియుఐ, హెచ్ఎంఎస్, ఐసిటియు, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు

కార్మిక వర్గ విప్లవ నియంతృత్వం

త్వరలో వెలువడనున్న 'తత్వశాస్త్రం - చిన్న పరిచయం' అనే 48 అధ్యాయాల పుస్తకంలో నుంచి వీక్షణం పాఠకుల కోసం ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్ని ముందస్తుగా పంచుకుంటున్నారు రంగనాయకమ్మ

కార్మిక వర్గం, శ్రమ దోపిడీ నుంచి పూర్తిగా బైట పడడానికి, తనని దోచే యజమాని వర్గం మీద పోరాటాల ద్వారా విప్లవ సమాజాన్ని ఏర్ప ర్చుకోవాలి. ఆ విప్లవ సమాజం 'కమ్యూనిస్టు సమాజం'. దాని ప్రారంభ దశ, సోషలిజం. మనం, ఆ ప్రారంభ దశని గాక కమ్యూనిజాన్నే ప్రధాన విషయంగా దృష్టిలో పెట్టుకోవాలి. అవసరమైన సందర్భాల్లో ప్రారంభ దశని కూడా ప్రస్తావించుకోవాలి.

కార్మిక వర్గం, యజమాని వర్గం చేతి నుంచి రాజ్యాధికారాన్ని సాధించిన క్షణం నుంచీ, శ్రమ దోపిడీ సంబంధాల్ని మార్చి వేసే విప్లవ శాసనాలతో, విప్లవ పరిపాలన ప్రారంభిస్తుంది. ఆ రోజు నుంచే భూస్వాముల ఆధీనంలో ఉన్న భూముల్ని బైటికి తీయడమూ, పెట్టుబడిదారుల ఆధీనంలో ఉన్న పరిశ్రమలపై విప్లవ నిబంధనలు ప్రారంభించడమూ, చేస్తుంది. కానీ ఈ రెండు మార్పులతోనే దోపిడీ సంబంధాలు అంతరించవు.

కమ్యూనిస్టు సమాజం ప్రారంభమైన నాటి నుంచీ అక్కడ జరగవలసిన విప్లవకరమైన మార్పుల్ని కొన్నిటిని మనం ఇక్కడ ప్రస్తావించుకోవాలి. కనీసంగా ఆ మార్పులు కొన్ని ఇలా ఉంటాయి:

కార్మిక వర్గ రాజ్యపాలన (కార్మిక వర్గ విప్లవ నియంతృత్వం)

1. ఉత్పత్తి సాధనాల స్వాధీనం. 2. ప్రతి మనిషీ పని చేయాలి. 3. 'ఉత్పత్తి శక్తుల' సమస్య. 4. దోపిడీ శ్రమ విభజన రద్దు. 5. సరుకు ఉత్పత్తి రద్దు. 6. డబ్బు రద్దు. 7. 'ఉపయోగపు విలువ' దృష్టి.

(న్యూ) లాంటి అనేక సంఘాలున్నాయి. ఇతర నాయకులతో పాటు ఎఐటియుసి జాతీయ అధ్యక్షులు అమర్‌జిత్ కౌర్, సిఐటియు జాతీయ నాయకుడు తపన్ సేన్ హాజరయ్యారు. పాల్గొన్న అనేక ప్రజా సంఘాలలో హర్యానాకు చెందిన జన సంఘర్ష్‌మంచ్, ఇంక్విలాబ్ మజ్దూర్ కేంద్ర, శ్రామిక్ సంగ్రామ్ కమిటీ, క్రాంతి కారీ నౌ జవాన్ సభ, మజ్దూర్ పత్రిక, సంఘర్ష్‌రాత్ మెహనాట్ కాష్ పత్రిక, మజ్దూర్ ఎక్‌తా కమిటీ, పియుడిఆర్, సమతా మూలక్ మహిళా సంఘటన లాంటి సంఘాలు ఉన్నాయి.

కార్మికుల పోరాటానికి పంజాబ్ నుండి సిఎంఎం. మజ్దూర్ కార్యకర్తా కమిటీ, ఇంక్విలాబ్ జన ఆవాజ్ పత్రికా, తమిళనాడు నుండి సిఐటియు, హ్యూండయ్ మోటార్స్ ఎంప్లాయిస్ యూనియన్, టయోటా ఎంప్లాయిస్ యూనియన్ లాంటి అనేక రాష్ట్ర సంఘాలు తమ సంఘీభావ ప్రకటనలు పంపారు. ముంబైకి చెందిన ట్రేడ్ యూనియన్ సాలిడారిటి కమిటీ ముంబాయిలో మారుతి కార్మికుల పోరాటానికి మద్ధతుగా అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, కార్మికులు తయారు చేసిన ఆర్ట్ పోస్ట్‌కార్డులు, మ్యూరల్స్ అమ్మి పోరాటానికి సహాయ నిధులు సేకరించారు. ఈ సభలో విద్యార్థి, యువజన సంఘాలు ఎఐఎస్ఎ, డిఎస్ఎఫ్, డిఎస్‌యు, జెఎన్‌యుఎస్‌యు, నౌరోజ్, ప్రతిధ్వని, ఎస్ఎఫ్ఐ, టిఎన్ఎం, వివైఎస్ లాంటి అనేక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆటో ఉత్పత్తి సంస్థల కార్మిక సంఘాలు సుజుకీ పవర్ ట్రైన్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్, మారుతి ఉద్యోగ్ కాంగార్ యూనియన్, సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్, రికో ఎంప్లాయిస్ యూనియన్, ఎఫ్‌సిసి రికో ఎంప్లాయిస్ యూనియన్, రెవారీకి చెందిన నెరోలేక్ ఎంప్లాయిస్ యూనియన్, ఫరీదాబాద్‌కు చెందిన వీనస్ వర్కర్స్ యూనియన్, సుబ్రోస్ ఎంప్లాయిస్ యూనియన్, బజాజ్ మోటార్స్ ఎంప్లాయిస్ యూనియన్ లాంటి అనేక సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

అనేక గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు యాత్రకు కావలసిన సదుపాయాల ను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల సర్పంచ్‌లు వ్యతిరేకిస్తే ఆ ప్రాంత ప్రజలే చొరవ తీసుకుని సర్పంచ్‌లను లెక్క చేయకుండా కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఆహారం, వసతి ఏర్పాట్లు చేశారు. నిరసన ప్రదర్శనలలో పాల్గొని సంఘీభావం తెలియ జేశారు. వీరిపై నిఘా వేసిన సిఐడి, పోలీసులు కేతానా, ఘటోలీ గ్రామాల సర్పంచ్‌లను కార్మికులకు సహకారం అందించవద్దని బెదిరించారు.

మొదటి నుంచీ మారుతీ కార్మికుల పోరాటానికి మద్దతునిస్తూ, వారి పోరాట కార్యక్రమాలను నిరంతరం రికార్డు చేస్తున్న 'సన్‌హతీ' ఇది వర్గ పోరాటమే. చట్టాలన్నింటినీ ధిక్కరించి, ప్రజాస్వామ్య పద్దతులను ఏమాత్రం ఖాతరు చేయకుండా కేవలం పెట్టుబడిదారుల లాభాల కోసం కార్మిక పోరాటాలను దుర్మార్గంగా అణిచి వేస్తున్నారు. ఈనాడు వర్గ పోరాటం కేవలం బస్తర్, నియామ్‌గిరి లాంటి ప్రాంతాలకే పరిమితం కాలేదు. నేడు పట్టణాలలో, పల్లెటూళ్లలో శ్రమించే వారికి వ్యతిరేకంగా పెద్ద యుద్ధమే జరుగుతుంది. దీనికి వ్యతిరేకంగా చైతన్యంగా పోరాడ డానికి నూతన ఐక్య సంఘటనలు చాలా అవసరం' అని వ్యాఖ్యానించడం శతశాతం వాస్తవం.

గత మూడు సంవత్సరాలుగా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై కొనసాగిస్తున్న అణిచివేత చర్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ, అరెస్టులూ, జైళ్లకూ ఏమాత్రం భయపడకుండా నిజమైన కార్మికవర్గ చైతన్యంతో ముందుకు నడుస్తున్న మారుతీ సుజుకీ కార్మికుల పోరాటానికి ప్రగతిశీల శక్తులు తమ పూర్తి మద్దతు తెలపాలి.

(రచయిత కార్మికోద్యమ నాయకుడు) వీ

8. కమ్యూనిస్టు నీతీ, కళలూ, సంస్కృతీ. 9. 'జీతాల విధానం' రద్దు! 10.రాజ్యపాలన రద్దు! ఈ విప్లవకరమైన మార్పులన్నీ జరగడానికి 'కార్మిక వర్గ నియంతృత్వం' అవసరం అవుతుంది. ఇటువంటి అనేక విషయాల మీద కార్మిక ప్రజలకు స్పష్టత ఉండాలి.

ఏ విప్లవ విషయాన్నీ ఇక్కడ ఎక్కువ వివరంగా చూడలేం. అతి క్లుప్తంగా మాత్రమే ఇక్కడ చెప్పుకోగలం. వీటిని వివరంగా చూడడానికి 'కాపిటలే' ఆధారం.

కార్మిక వర్గ రాజ్యపాలన

ఇది, 'కార్మికవర్గ విప్లవ నియంతృత్వం' పేరుతో ప్రారంభమవుతుంది. దీన్ని గురించి మార్క్సు, ఎంగెల్సులు చెప్పిన విషయాలు కొన్ని ఇక్కడ చూస్తే, ఈ 'నియంతృత్వం' దేనికోసమో అర్థమవుతుంది. దోపిడీ వర్గం చేసే దోపిడీ పీడనల్ని సంపూర్ణంగా అంతం చేయడానికే కార్మిక వర్గానికి ఈ నియంతృత్వం అవసరం.

దోపిడీ వర్గం గనుక ఏ పోరాటాలకూ దిగకుండానే, దోపిడీ చేస్తూ జీవించడం నీచమని గ్రహించి దాన్ని వదిలేయడానికి అంగీకరిస్తే, ఏ వర్గాలూ, ఏ వర్గ నియంతృత్వాలూ ఉండవు.

ఎంగెల్స్, ఒక సందర్భంలో అంటాడు: 'ఎట్టి పెనుగులాటలూ లేకుండా అంతరించగల విజ్ఞత వెనకటి చెడ్డకు ఉంటే, జరగవలిసిన మార్పు చాలా శాంతియుతంగానే జరుగుతుంది'.

కార్మికవర్గం పోరాటానికి దిగిందంటే దానికి కారణం, కార్మికవర్గం కాదు; దోపిడీ వర్గమే. అది తన దోపిడీని వదలక పోవడమే!

'కార్మిక వర్గ విప్లవ నియంతృత్వం' గురించి, మార్క్సు ఎంగెల్స్‌ల వివరణలు కొన్ని చూడండి:

1. ఈ మొదటి కొటేషన్‌లో, 'కార్మిక వర్గ నియంతృత్వం' అనే మాటలు ఉండవు. కానీ, చెప్పింది ఆ విషయం మీదే. ఇది తేలిగ్గా అర్థమయ్యేదిగా కూడా ఉండదు. సమాజంలో, ఒక దోపిడీ వర్గ ఆధిపత్యాన్ని తదుపరి దోపిడీ వర్గం తీసివేసిందనీ, రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అది ఆ పని చేయగలిగిందనీ, ఈ మాటల్లో తెలుస్తుంది. కార్మిక వర్గానికి కూడా ఆధిపత్యం ఎందుకు అవసరమవుతుందంటే, సమాజంలో ఏ వర్గ ఆధిపత్యమూ లేకుండా చేయడానికే - అనే అర్థం ఈ మాటల్లో కష్టంగా తెలుస్తుంది, చూడండి:
   'ఆధిపత్యాన్ని (డామినేషన్) లక్ష్యంగా పెట్టుకున్న ప్రతీ వర్గమూ, తన ప్రయోజనమే అన్ని వర్గాల ప్రయోజనాలకూ ప్రాతినిధ్యం వహించాలంటే, ఆ వర్గం మొదట రాజకీయాధికారాన్ని జయించాలి. మొదటి క్షణంలోనే ఆ పని చేయడం, దానికి తప్పనిసరి అవుతుంది. సమాజ పాత రూపాన్ని పూర్తిగానూ, వర్గాల జనరల్ ఆధిపత్యాన్ని మొత్తం గానూ, రద్దు చేయవలసిన కార్మిక వర్గం విషయంలో కూడా ఇదే (మొదట రాజ్యాధికారాన్ని తీసుకోవడమే) జరగాలి.' (జర్మన్ ఐడియాలజీ, పేజీ 52. రాసిన కాలం 1845-46.)
2. మార్క్సు రాసిన 'ఫ్రాన్సులో వర్గపోరాటాలు 1848-50' పుస్తకంలో మాటలు: 'ఈ సోషలిజం సాధారణ రూపంలో, వర్గ విభేదాలన్నిటినీ నిర్మూలించడానికి మధ్యంతర దశగా, కార్మిక వర్గ నియంతృత్వం అవసరమని చెపుతుంది. ఈ వర్గ విభేదాలతో పాటు, అవి ఆధారపడి ఉన్న ఉత్పత్తి సంబంధాలూ, వాటికి అనుగుణమైన అన్ని సామాజిక సంబంధాలూ రద్దు కావాలని, ఈ సామాజిక సంబంధాల నుంచి ఉద్భవించే భావాలన్నీ విప్లవీకరణ చెందాలని కోరుతుంది.' (పేజీ 111, విశాలాంధ్ర ప్రచురణ, 1982).
3. మార్క్సు వెడిమేయర్ అనే ఆయనకి రాసిన (5-3-1852 నాటి) ఉత్తరంలో కొన్ని మాటలు: 'వర్గ పోరాటం తప్పని సరిగా కార్మిక వర్గ నియంతృత్వానికి దారి తీస్తుంది; ఆ నియంతృత్వం, అన్ని వర్గాల రద్దుకీ, వర్గరహిత సమాజానికీ జరిగే పరివర్తనా దశగా ఉంటుంది.'
4. మార్క్సు ఇంటర్నేషనల్ 7వ వార్షికోత్సవం గురించి చేసిన ఉపన్యాసంలో ఇది ఒక చిన్న భాగం, 1871లో:
   'పారిస్ కమ్యూనే ఈ నాటికి చిట్టచివరి ఉద్యమం. ఇంత వరకూ జరిగిన ఉద్యమాలన్నింటిలోకీ అది మిక్కిలి మహత్తరమైనది. కార్మిక వర్గం చేసిన రాజకీయాధికార ఆక్రమణే కమ్యూన్. అందులో రెండో అభిప్రాయానికే తావు లేదు. కమ్యూన్, వర్గపాలనకు సంబంధించిన నూతన రూపాన్ని నెలకొల్పలేక పోయింది. శ్రమ సాధనాలన్నింటినీ ఉత్పత్తి దారులకు బదిలీ చేసి, శరీరారోగ్యం కలిగిన ప్రతి ఒక్కరినీ తన జీవిక కోసం విధిగా పని చేసేలా చేసి, తద్వారా ప్రస్తుతం అమల్లో ఉన్న దోపిడీ పీడన పరిస్థితులను రూపుమాపినప్పుడే, వర్గపాలనకూ, దోపిడీ పీడనలకూ గల ఏకైక ప్రాతిపదిక తొలగిపోతుంది. కానైతే అటువంటి మార్పుని సాధించేందుకు, మొదట కార్మిక వర్గ నియంతృత్వం అవసరమవుతుంది. దానికి మొట్టమొదటి షరతు, కార్మిక వర్గ సైన్యం. యుద్ధ భూమిలో తనను విముక్తం చేసుకునే హక్కును కార్మిక వర్గం సాధించుకోవాలి. రాబోయే పోరాటం కోసం కార్మిక వర్గ శక్తులను సంఘటితం చేయడమే, సమకూర్చడమే, ఇంటర్నేషనల్ కర్తవ్యం.' (పారిస్ కమ్యూన్ గురించి మార్క్సు, ఎంగెల్సులు. పేజీ 304, మాస్కో ప్రతి 1979.)
5. 'పెట్టుబడిదారీ సమాజానికీ - కమ్యూనిస్టు సమాజానికీ మధ్య, మొదటిది తర్వాత దానిలోకి విప్లవాత్మక రూపాంతరీకరణ చెందే దశ ఉంటుంది. దీనికి అనుగుణమైన రాజకీయ పరివర్తన దశ కూడా ఒకటి ఉంటుంది. ఈ దశలో రాజ్యం కార్మిక వర్గ విప్లవాత్మక నియంతృత్వంగా తప్ప మరో విధంగా ఉండజాలదు.' (మార్క్సు, 1875లో. 'జర్మన్ కార్మికపార్టీ కార్యక్రమంపై వ్యాఖ్యలు', మార్క్సు, ఎంగెల్స్ సంకలిత రచనలు-2, పేజీ 211, మాస్కో ప్రతి 1981.)
6. ఎంగెల్స్, 1891లో : 'ఇటీవల, సోషల్ - డెమోక్రటిక్ అల్పబుద్ధులు, కార్మిక నియంతృత్వం అన్న పదాలు విని మరోమారు చచ్చేటంత భయంతో హడిలిపోతున్నారు. అయ్యా, పెద్ద మనుషులారా! ఇంతకీ మీరు ఈ కార్మిక వర్గ నియంతృత్వం ఎలా ఉంటుందో తెలుసుకోదలుచుకున్నారా? అయితే పారిస్ కమ్యూన్‌ని చూడండి! కార్మిక నియంతృత్వమంటే అదే'. (మార్క్సు రాసిన 'ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం' రచనకి, కొత్త ముద్రణకి, ఎంగెల్స్ రాసిన 'ఉపోద్ఘాతం' నుంచి. 'పారిస్ కమ్యూన్ గురించి' మార్క్సు, ఎంగెల్స్,' పేజీ 37, మాస్కో ప్రతి 1979.)

రష్యా, చైనాల్లో, సోషలిజాల్లో మొదటి అడుగులు ప్రారంభమ య్యాయి కదా? అక్కడ కమ్యూనిస్టు పార్టీల ప్రణాళికల్లో, 'కార్మిక వర్గ నియంతృత్వం' గురించి ఎలా రాశారు? అక్కడ ఎటువంటి విప్లవ శాసనాలు పెట్టారు? అక్కడ, యజమాని వర్గం వాళ్లు ఎటువంటి శ్రమలు ప్రారంభించారు? – ఈ విషయాలు మనకు కావాలి. వీటిని తర్వాత సంపాదించుకోవాలి.

'కార్మికవర్గ నియంతృత్వం' గురించి ఒక చిన్న సందేహమూ, చిన్న చర్చా

'నియంతృత్వం' అనే పేరుతో కార్మిక వర్గం, ఎటువంటి విప్లవ శాసనాలు తేదల్చుకుందో, సమాజంలో ఎటువంటి విప్లవకరమైన మార్పులు చేయదల్చుకుందో, సమాజాన్ని ఎంత తల్లకిందులుగా తిప్పదల్చుకుందో, ఈ విషయాల మీద నాకు ఏ మాత్రమూ సందేహాలు లేవు. అవన్నీ అత్యవసరం. అవన్నీ చేసి తీరాలి. ఆ చర్యల కోసం, ఆ మార్పుల కోసం, అడ్డుపడే దోపిడీ శక్తుల్ని పోరాటాల ద్వారా నిర్మూలించడం కన్నా కార్మిక వర్గానికి వేరే మార్గం ఉండదు. అదంతా న్యాయ పోరాటం. ఆత్మ రక్షణ పోరాటం. విముక్తి పోరాటం.

అయితే, కార్మిక వర్గ పోరాటం అంత న్యాయమైన పోరాటం అయి వుండగా, అది 'నియంతృత్వం' ఎలా అవుతుంది? అది 'ఆధిపత్యం' ఎలా అవుతుంది? – ఇది ఒక సందేహం.

కార్మికవర్గం కూడా ఒక వర్గమే. కానీ ఇది 'దోపిడీ వర్గం' కాదు. దోపిడీ వర్గాల చర్యలే, ఆ పాలనలే, నియంతృత్వాలు అవుతాయి. దోపిడీ నుంచి విముక్తి చెందే న్యాయమైన పోరాటం కూడా నియంతృత్వమే అవుతుందా? కార్మిక వర్గానికి లక్ష్యం ఏమిటి? – విముక్తి! తన శ్రమని తను నిలుపుకోవడం! దోపిడీ వర్గాన్ని ఆ నీచత్వం నుంచి బైటికి తీయాలనేది కాదు, కార్మిక వర్గ లక్ష్యం. కార్మిక వర్గం, తన శ్రమని తను కాపాడుకుంటే, అప్పుడు దోపిడీ వర్గం చచ్చినట్టు దాని శ్రమ అది చేసుకోవలిసి వస్తుంది. కార్మిక వర్గం, మళ్లీ మళ్లీ తను దోపిడీకి గురికాకుండా ఎటువంటి విప్లవ చర్యలు అవసరమో, అవి అన్నీ చేస్తుంది. అదంతా, దోపిడీ తలెత్తకుండా చేయడం కోసమే. దీని కోసం తప్పకుండా విప్లవకరమైన శాసనాలూ చర్యలూ మార్పులూ ఉంటాయి. అయినా దానికి 'ఆధిపత్యం' అనో, 'పెత్తనం' అనో, 'నియంతృత్వం' అనో, ఆ మాటలు ఎలా వర్తిస్తాయి? నిష్కారణంగా చెంప మీద కొట్టిన వాడిని తిరిగి కొడితే, అది 'పెత్తనం' అవుతుందా? దానికి, 'పెత్తనం' అనే మాట పనికి వస్తుందా? మనం మన పోరాటానికి 'నియంతృత్వం' అనే పేరు ఎందుకు పెట్టుకోవాలి?

ఈ సందేహాలకు జవాబు ఉంది. 'కార్మిక వర్గ ఆధిపత్యం' అనేది, దోపిడీ వర్గం మీదా, ఆ సంబంధాల మీదా, ఆ సాంప్రదాయాల మీదా, ఆ సంస్కృతుల మీదా, అటువంటి వాటినన్నిటినీ తీసివెయ్యడం కోసమే. అంతే కాదు, శ్రామిక ప్రజల్లో మెజారిటీ భాగం అంతా, దోపిడీ సాంప్రదాయాల్లోనూ, దోపిడీ సంస్కృతుల్లోనూ, పీకల దాకా కూరుకు పోయి ఉంటారు. ఆ జనం ద్వారానే రాజ్యాధికారాన్ని తీసుకోగలిగే మార్పు జరిగినా, ఆ మార్పు భావాలు అంతవరకే ఉంటాయి. ఆ మనుషులు, రాజ్యాధికారం కోసం సైనికులై పోరాడగానే వారు, పాత చెడ్డ సంస్కృతుల్ని వదిలించేసుకున్నారని అర్థం కాదు. కాబట్టి, శ్రామిక ప్రజలు కూడా ఎన్నో విప్లవ భావాలతో మారవలసి ఉంటుంది. శ్రామిక జనంలో కూడా ఆధిపత్య ప్రవర్తనలు ఉన్నప్పుడు, ఆ ఆధిపత్యాన్ని అణిచే శాసనాలు ఉంటే, అవి న్యాయమైనవే. అయినా, అవి ఆ నేరస్తుల మీద ఆధిపత్యాలే. కానీ, అవి, 'విప్లవ ఆధిపత్యాలు!'

యుద్ధాల్లో, అన్యాయ యుద్ధాలూ, న్యాయ యుద్ధాలూ, వుంటాయి. ఒక యుద్ధం ఎంత న్యాయమైనదైనా అది 'యుద్ధమే.' దానికి 'యుద్ధం' అనే పేరే ఉంటుంది. అలాగే, కార్మిక వర్గ పోరాటం ఎంత న్యాయమైనదైనా, అది ఇతర వర్గాల్నీ శ్రామిక వర్గంలోనేఉన్న దోపిడీ లక్షణాల్నీ, అణిచే పని చేస్తుంది కాబట్టి, ఆ అణచడం న్యాయమే అయినా, అది 'నియంతృత్వమే.'

'యుద్ధం' అనేది చెడ్డ మాటే. కానీ, 'న్యాయమైన యుద్ధం' అన్నప్పుడు, దానికి చెడ్డ అర్థం పోయి మంచి అర్థం వస్తుంది. అలాగే, 'నియంతృత్వం' అనేది చాలా చెడ్డ మాటే. కానీ, 'న్యాయమైన నియంతృత్వం' అనీ, 'విప్లవ నియంతృత్వం' అనీ, 'ఆత్మరక్షణ నియంతృత్వం' అనీ అన్నప్పుడు, ఆ నియంతృత్వానికి కూడా మంచి అర్థం వస్తుంది.

అయినప్పటికీ, కార్మికవర్గం, తన న్యాయమైన వర్గపోరాటాన్ని 'నియంతృత్వం' పేరుతో ఎందుకు చెప్పుకోవాలి? దాన్ని నియంతృత్వంగా ఎందుకు ఒప్పుకోవాలి? ఆ మాటే తప్ప ఇంకో మాట లేదా?

'కార్మికవర్గ విముక్తి పోరాటం'. 'శ్రమ దోపిడీ వ్యతిరేక విప్లవ పోరాటం'. 'కార్మికవర్గ ఆత్మరక్షణ పోరాటం'.ఇటువంటి ఏదో ఒక పేరు వల్ల, పోరాట లక్ష్యం ఏ మాత్రమూ మారకపోయినా, కార్మిక వర్గపోరాట శక్తీ, కార్మికవర్గ విముక్తి చైతన్యమూ, దెబ్బతింటాయా? – దెబ్బతినవు. కానీ, 'న్యాయపోరాటం, ధర్మ పోరాటం' అనే మాటల శక్తి కన్నా, 'విప్లవ నియంతృత్వం' అనే మాటలకు ఉన్న శక్తే, ఎక్కువ న్యాయాన్నీ, ఎక్కువ చైతన్యాన్నీ, చూపిస్తుంది. 'విప్లవ నియంతృత్వం' కూడా ఎల్లకాలం ఉండేది కాదు. దోపిడీ వర్గం తన తప్పు తను గ్రహించి, న్యాయమైన, సంస్కార వంతమైన, సమానత్వ సంబంధాల్ని ప్రేమించడం ఎంత తొందరగా నేర్చుకుంటే, విప్లవ నియంతృత్వంతో అవసరం అంత తొందరగా ఆగిపోతుంది. శాంతి కాంతి అంత తొందరగా వెలుగుతుంది.

'కార్మిక నియంతృత్వం' మీద ఎప్పుడైనా చిన్న సందేహం రేగినప్పటికీ నాకు నిజంగా 'కార్మిక వర్గ విప్లవ నియంతృత్వమే' ఇష్టంగా ఉంటుంది. 'కార్మిక నియంతృత్వాన్ని' మార్క్సు, ఎంగెల్సులు, 'కార్మిక వర్గ విప్లవ నియంతృత్వం' అనే పేరుతో చాలా సార్లు అన్నారు. 'విప్లవం' అనే విశేషణం లేకుండా దాన్ని అనకూడదు.

సందేహాలు వచ్చినా పేర్లు మార్చడం మొదలు పెడితే, ఒక్కో పార్టీ ఒక్కో రకంగా మారుస్తుంది. అది చాలా ప్రమాదం. సందేహాల్ని అణచుకోవడం కన్నా వాటిని చర్చించడం మంచిది.

'కార్మిక వర్గ నియంతృత్వం' అనే భావాన్ని, రెండవ ఇంటర్నేషనల్ వ్యతిరేకించింది. కానీ ఆ ఇంటర్నేషనల్ లక్ష్యం, వర్గపోరాటం కాదు, వర్గ సామరస్యం. మనలక్ష్యం, వర్గ సామరస్యం కాదు. వర్గపోరాటంలో అణువంత రాజీ కూడా కాదు. కార్మిక వర్గానికి అత్యవసరమైంది, కార్మిక వర్గ విప్లవ పోరాటమే! దాని కోసమే విప్లవ నియంతృత్వం! 'న్యాయమైన యుద్ధం' ఎంత న్యాయమైనదో, 'న్యాయమైన నియంతృత్వం' అంత న్యాయమైనది!

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్సు 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

వీక్షణం రచయితల సమావేశం 2014

వీక్షణం రచయితల సమావేశం 2014కు హాజరైన వీక్షణం రచయిత లకు, పాఠకులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు అందరికీ సాదర స్వాగతం. తెలుగుసీమలో విశిష్టమైన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా 2003 జనవరి సంచికతో పక్షపత్రికగా ప్రారంభమైన వీక్షణం 2005 జనవరి నుంచి మాసపత్రికగా మారి, ఒక్క సంచిక కూడ తప్పిపోకుండా ఇప్పటికి పన్నెండు సంవత్సరాలకు పైగా, 152 సంచికలు వెలువడిందంటే అదంతా మీ వంటి పాఠకుల, రచయితల, అభిమానుల ఆదరాభిమానాల ఫలితమే.

ఈ 152 సంచికలలో వీక్షణం దాదాపు ఎనిమిది వందల మంది రచయితలు రాసిన 2,460కి పైగా వ్యాసాలు, చర్చలు, అనువాదాలు ప్రచురించింది. ఈ ఎనిమిది వందల మంది రచయితలలో కనీసం వంద మంది తొలిసారిగా వీక్షణం ద్వారానే రచనలలోకి వచ్చి, ఆ తర్వాత వివిధ పత్రికలలో రచనలు చేస్తూ లబ్ధ ప్రతిష్ఠులు కావడం వీక్షణంకు గర్వకారణం.

వీక్షణంకు తొలి రెండు సంవత్సరాలు వి హనుమంతరావు గారు, ఆ తర్వాత పది సంవత్సరాలుగా నేను సంపాదకులుగా ఉన్నప్పటికీ ఇది మా వ్యక్తిగత కృషి ఎంతమాత్రమూ కాదు. రచనలో, అనువాదంలో, నిర్వహణలో, ఆర్థిక సహాయంలో, పత్రికను ప్రచారం చేయడంలో వేలాది మంది అభిమానులు తోడ్పడినందువల్లనే వీక్షణం ఇవాళ ఈ స్థానానికి చేరింది. ఈ సమష్టి కృషి మీద విశ్వాసం ఉన్న వీక్షణం నిర్వాహక బృందం ఈ సమష్టి తత్వాన్ని ఎప్పటికప్పుడు మరింత విశాలం చేయడానికి ప్రయత్నిస్తున్నది. అందుకే దాదాపుగా అప్పటికి ఏ పత్రికకూ లేని వార్షిక రచయితల సమావేశం అనే సంప్రదాయాన్ని 2007 లో ప్రారంభించి, ఇప్పటికి ఏడు సమావేశాలు నిర్వహించింది. వీక్షణం రచయితలు, పాఠకులు, అభిమానులు ఏడాదికొక సారైనా కలిసి పత్రిక లోటుపాట్ల గురించి, నిర్వహణ గురించి, భవిష్యత్తు గురించి విమర్శలు, అభిప్రాయాలు, సూచనలు పంచుకోవడమే ఈ సమావేశ లక్ష్యం. గత సంవత్సరం సాంకేతిక కారణాలవల్ల ఈ సమావేశం జరపలేక పోయాం. మొత్తం మీద కనీసం ఆరు వందల మంది ఈ సమావేశాల్లో పాలుపంచుకుని విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. వాటిలో మా శక్తిమేరకు సాధ్యమైనవన్నీ పాటించడానికి ప్రయత్నిస్తున్నాం.

వీక్షణంను సమష్టి వేదికగా మార్చడంలో మరొక అడుగు 'పాఠకుల వీక్షణం' అనే ఉత్తరాల పేజీకి ఇస్తున్న ప్రాధాన్యత. ఇంగ్లిష్ వార పత్రికలు, ముఖ్యంగా ఔట్‌లుక్ పాఠకుల ఉత్తరాలకు మూడు నాలుగు పేజీలు కూడ కేటాయించి, అన్ని రకాల అభిప్రాయాలను నిరాటంకంగా ప్రచురించి, ప్రజాభిప్రాయ వైవిధ్యానికి సూచికగా నిలుస్తుంది. తెలుగులో అంత విస్తృతంగా పాఠకుల అభిప్రాయాలను ప్రచురించే పత్రిక ఒక్కటి కూడ లేదు. పత్రికలన్నిటిలోను పాఠకుల ఉత్తరాల శీర్షిక ఉన్నప్పటికీ వాటిలో పొగడ్తల ఉత్తరాలు, అచ్చులో పేరు చూసుకునే కోరికతో రాసిన ఉత్తరాలు ఎక్కువగా ఉంటున్నాయి. భిన్నాభిప్రాయం, ఖండన, విమర్శ, చర్చ, కొత్త ఆలోచనలకు ప్రేరణ ఉండే ఉత్తరాలు తక్కువ. ఆ దిశలో వీక్షణం వీలైనన్ని ఎక్కువ ఉత్తరాలను, చర్చను, అభిప్రాయాలను ప్రచురించదలచుకున్నది. మా స్థల పరిమితులను బట్టి పాఠకుల వీక్షణంను ఇప్పటికి రెండు మూడు పేజీలకు కూడ విస్తరించాం.

వీక్షణం నిర్వహణను సమష్టిగా మార్చే మరొక ప్రయత్నంలో వీక్షణం ఏ నెలకానెల ఏ రచనలు ఉండాలో ఎంపిక చేసే సమావేశానికి వీలయినంత ఎక్కువ మందిని ఆహ్వానిస్తున్నాం. ప్రతి నెలా మొదటి వారంలో జరిగే ఈ సమావేశానికి హాజరై రచనల నిర్ణయంలో, ఎంపికలో, స్వయంగా రచనలు చేయడంలో పాలుపంచుకోవలసిందిగా అందరికీ ఇదే ఆహ్వానం.

తెలుగుసీమలో జరుగుతున్న అసహజ మరణాలన్నిటినీ ఒక్కచోట నమోదు చేసి, సమాజ దుస్థితికి అద్దం పట్టాలనే అవగాహనతో గత పది సంవత్సరాలుగా వీక్షణంలో ప్రతినెలా అసహజ మరణాల సూచి ప్రచురిస్తున్నాం. దాదాపు పదిహేడు జిల్లాల నుంచి ప్రతినిధులు దినపత్రికల జిల్లా అనుబంధాల నుంచి పంపుతున్న సమాచారంతో ఈ సూచి తయారవుతున్నది.

వీక్షణం తన చిన్న జీవితంలో, పరిమితమైన వనరులతో చేసిన మరొక ప్రయత్నం తెలుగులో వ్యాసరచన స్థాయిని పెంచడానికి తన వంతు కృషి చేయడం. తెలుగులో అతి ఎక్కువ దిగుబడి ఉన్న ప్రక్రియ వ్యాస ప్రక్రియే అయినప్పటికీ వ్యాస రచనా ప్రమాణాలు ఉండవలసినట్టుగా లేవు. లబ్ధప్రతిష్ఠులైన, చేయితిరిగిన రచయితల వ్యాసాలలో కూడ గణనీయమైన భాషా దోషాలు, అన్వయ దోషాలు, వాదనలలో పొరపాట్లు, వాదనకూ నిర్ధారణకూ పొంతన లేకపోవడం వంటి లోపాలు ఉంటున్నాయి. ఇతర భాషలలో లాగ వ్యాసప్రక్రియకు ప్రామాణిక నియమ నిబంధనలు గాని, మార్గదర్శక సూత్రాలు గాని తయారు కాకపోవడం, నిపుణులైన సంపాదకులు లేకపోవడం ఇందుకు కారణం. పూర్తిగా వ్యాసాలు మాత్రమే ప్రచురించే పత్రికగా వీక్షణం ఈ ప్రక్రియ అభివృద్ధికి తాను చేయగలిగినదేమైనా ఉంటే చేయదలచింది. అందుకే వ్యాసరచన మీద ఒక అధ్యయన తరగతి, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తయారుచేసి గత ఐదారు సంవత్సరాలలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చింది.

వీక్షణం సాధించిన ఈ విజయాలు గణనీయమైనవే అయినప్పటికీ, చేద్దామనుకుని చేయలేకపోయిన పనులు, సక్రమంగా చేయలేకపోతున్న పనులు చాలానే ఉన్నాయి. ఆ పనులు జరగాలంటే, సక్రమంగా జరగాలంటే మీ వంటి మిత్రుల సహకారం ఇంకా ఎక్కువ అవసరం.

మొట్టమొదట రచనల గురించి మాట్లాడుకుందాం. వీక్షణం పాఠకులలో చాల ఆదరణ సాధించినప్పటికీ, వెలువడుతున్న రచనలతో వ్యక్తిగతంగా నాకు, నిర్వహిస్తున్న బృందానికి పూర్తి సంతృప్తి లేదు.

వీక్షణంలో ఎటువంటి రచనలు ఉండాలి అని ఆలోచించినప్పుడు మా దృష్టిలో ఉండేవి మూడురకాల రచనలు: ఒకటి, ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలో కొన్ని వార్తలు, పరిణామాలు ఎక్కువగానే ప్రచారంలోకి వచ్చినప్పటికీ, ఆ వార్తల, పరిణామాల వెనుక కథలు బైటికి రావడం లేదు, ఆ వార్తలనూ పరిణామాలనూ ప్రజా కోణం నుంచి అర్థం చేసుకుని, వివరించే రచనలు రావడం లేదు. అటువంటి

రచనలు అచ్చువేయడం వీక్షణం బాధ్యత. రెండు, ప్రధాన స్రవంతి వార్తాపత్రికలు విస్మరించే, అతి తక్కువగా రాసే ప్రజా అంశాలు ఎన్నో ఉంటున్నాయి. అటువంటి అంశాల మీద వివరంగా, విశ్లేషణాత్మకంగా రాసే రచనలకు వీక్షణమే సహజమైన వేదిక కావాలి. మూడు, ఏ విషయాన్నయినా ప్రజానుకూల దృక్పథం నుంచి అర్థం చేసుకోవడానికి వీలైన సైద్ధాంతిక, విశ్లేషణాత్మక దృక్పథం ఇచ్చే రచనలు అచ్చు వేయడం కూడ వీక్షణం బాధ్యత.

ఈ మూడు రకాల రచనలు సమపాళ్లలో ఉండాలని, ఏ ఒకటో ఎక్కువై, మరొకటి తక్కువ కాగూడదని మా కోరిక. కాని ఈ మూడు రకాల రచనలు ప్రతి సంచికలోనూ తగినంతగా ఉండేట్టు జాగ్రత్త పడడంలో మేం విజయం సాధించ లేకపోతున్నామనే చెప్పాలి. నిజానికి ఈ మూడు రకాల రచనల సమతుల్యత అలా ఉంచి, మామూలు ప్రధాన స్రవంతి పత్రికలలో వచ్చే లాంటి రచనలే వీక్షణంలో కూడ వస్తున్నాయి. 'బైటి దినపత్రికలలో వస్తున్నటువంటి వ్యాసాలే వీక్షణంలో వస్తే ఇది చదవవలసిన అవసరం ఏముంది' అని గౌరవనీయ మిత్రులొకరు చేసిన వ్యాఖ్యను మేం సవినయంగా అంగీకరిస్తున్నాం. అయితే బైటి పత్రికలకన్న భిన్నంగా, విశిష్టంగా వీక్షణం రావాలంటే అందుకు మా పాత్ర కన్న మిన్నగా మీ అందరి పాత్ర, ఇతోధిక సహకారం అవసరం. వీక్షణం రచనల మీద ఎప్పటికప్పుడు నిర్మొహమాటమైన విమర్శలు రాయండి. వీక్షణంలో ఎటువంటి రచనలు రావాలో సూచించండి. వీక్షణంకు అవసరమైన లోతైన రచనలు మీరే చేయండి, లేదా చేయగల వారిని వీక్షణంకు పరిచయం చేయండి.

మరొకపక్క, ప్రతినెలా వీక్షణం పాఠకులు తెలుసుకోవలసిన అంతర్జాతీయ, దేశీయ, ప్రాంతీయ ఘటనలు, పరిణామాలు అసంఖ్యాకంగా జరిగిపోతుండగా వాటిలో అతి తక్కువ భాగాన్ని మాత్రమే వీక్షణం పట్టుకోగలుగుతున్నది. నాతో చాలమంది వ్యక్తిగతంగానూ, వీక్షణం ఆఫీసుకు ఫోన్ చేసీ ఎంతో మంది ఎన్నో విషయాలను ప్రస్తావించి ఈ నెల వీక్షణంలో దీని మీద వస్తుందా అని అడుగుతుంటే, ఇంతమంది పాఠకులు ఇన్ని విషయాల మీద వీక్షణం వైపు చూస్తున్నారు గదా అని గర్వం కలుగుతుంది. కాని అన్ని విషయాల మీద రాయడానికి తగినంతమంది రచయితలు, వ్యాఖ్యాతలు వీక్షణంకు లేరు గదా అని విచారం కూడ కలుగుతుంది. నిజానికి ప్రతినెలా వీక్షణం పాఠకులు తెలుసుకోవలసిన విషయాలు కనీసం వందో, యాభయో ఉన్నాయనుకున్నా వాటన్నిటికీ వీక్షణం చోటు కల్పించజాలదు. వీక్షణం ప్రతి సంచికలోనూ ఎక్కువలో ఎక్కువ ఇరవై వ్యాసాలు మాత్రమే ప్రచురించగలదు. ప్రచురించగలిగినవే ఇంత తక్కువ, ఇరవై వ్యాసాలు మాత్రమే అయినప్పుడు అవి ముఖ్యమైన విషయాల మీద, ప్రామాణికంగా, పాఠకుల జ్ఞాన అవసరాలు తీర్చేవిగా, నాణ్యమైనవిగా ఉండాలని ఆశించడంలో తప్పు లేదు. కనుక వీక్షణంలో ఏమి రావాలో, ఇంకా ఎంత మంచివి రావాలో, వస్తున్నవాటిని ఎట్లా మెరుగు పరచవచ్చునో ఎప్పటికప్పుడు నిర్దేశించే బాధ్యత మీలో ప్రతి ఒక్కరూ తీసుకున్నప్పుడే వీక్షణం ప్రమాణాలు ఇంకా మెరుగుపడతాయి.

ఇలా సమకాలీన పరిణామాలన్నిటి గురించీ రాయలేకపోవడం ఒక ఎత్తయితే కొన్ని రంగాల గురించి ఎప్పటికీ రచనలు రాకపోవడం మరొక ఎత్తు. దృక్పథం గురించి చర్చించే మౌలిక, సైద్ధాంతిక రచనలు చాల తక్కువ వస్తున్నాయి, అందువల్ల దృక్పథాన్ని ఇచ్చే రచనలు ఎక్కువగా అనువాదాలు వేయవలసి వస్తున్నది. క్రీడారంగం, సినిమారంగం, వ్యాపారరంగం వంటి వాటి గురించి రచనలు దాదాపుగా రావడమే లేదు. స్థూలంగా ఆర్థిక వ్యవస్థ గురించి రచనలు వస్తున్నాయి గాని సూక్ష్మ స్థాయిలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల గురించి, స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వంటి రంగాల గురించి అవసరమైన లోతైన పరిశోధనా వ్యాసాలు, వ్యాఖ్యలు రావడం లేదు. నిజానికి తెలుగుసీమలో ప్రగతిశీల దృక్పథం కలిగినవాళ్లు వేలాదిగా ఉన్నారని, వారిలో కొన్ని డజన్ల మంది అయినా లోతైన ఆలోచనలు చేయగలిగినవాళ్లు, రాయగలిగినవాళ్లు ఉన్నారని చూసినప్పుడు కొద్దిపాటి శ్రద్ధతో ఈ రంగాలలో వ్యాసాలు రాయడం సాధ్యమేనని అర్థమవుతుంది. వీక్షణంలో ఎక్కువగా వస్తున్నవి ప్రజా సమస్యల గురించి, ప్రజా ఉద్యమాల గురించిన వ్యాసాలు, వ్యాఖ్యలు, విశ్లేషణలు. ఇవి అవసరమే గాని ఇంకా ఎక్కువ లోతైన విశ్లేషణతో, సైద్ధాంతిక స్థాయిలో రావలసి ఉంది.

వీక్షణం చాల కాలంగా గుర్తించిన, ఎన్నోసార్లు రచయితల సమావేశాలలో పంచుకున్న లోపం మహిళల రచనలు చాల తక్కువగా ఉండడం. ఏ రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణ అయినా సమాజంలో సగభాగమైన మహిళల గురించి పట్టించుకోకుండా ఉండడం అసహజం, అసాధ్యం. కాని ఇప్పటిదాకా వెలువడిన రెండున్నర వేల వ్యాసాలలో ప్రత్యక్షంగా మహిళల గురించి పట్టించుకున్నవి పదో వంతు కూడ ఉండవు. అది ఒక సమస్య అయితే, మహిళా రచయితల కొరత మరింత పెద్ద సమస్య. రాజకీయార్థిక, సామాజిక పరిణామాలు మహిళల మీద ఏ ప్రభావాలు వేస్తాయో, వేయగలవో ఎంత సానుభూతి గల పురుషులయినా పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. తప్పనిసరిగా ఆ పరిణామాల మీద మహిళలు రాయవలసిందే. కాని వీక్షణం రచయితలలో మాత్రమే కాదు, తెలుగు రాజకీయార్థిక, సామాజిక విశ్లేషకులలోనే మహిళలు అతి తక్కువ. మనలో ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఆలోచించి, పరిష్కరించడానికి శ్రద్ధ పెట్టవలసిన సమస్య ఇది. మన కుటుంబాలలో, పరిచయస్తులలో, మహిళా ఉద్యమ కార్యకర్తలలో రచయితలు కాగలిగినవాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించి వారిచేత ఈ విషయాల మీద రచనలు చేయించడం వీక్షణం కొరకు మాత్రమే కాక మన సమాజ పురోగతికి కూడ చాల అవసరం.

వీక్షణంలో రచనలకు సంబంధించి మరొక రెండు లోపాలకు కూడ మమ్మల్ని క్షమించవలసిందిగా సంపాదక బృందం తరఫున కోరుతున్నాను. రచనల నాణ్యత, ఎడిటింగ్ సక్రమంగా లేకపోవడం, అచ్చుతప్పులు విరివిగా ఉండడం అనేవే ఆ లోపాలు. ముందే చెప్పినట్టు వ్యాసప్రక్రియ తెలుగులో తగినంతగా అభివృద్ధి చెందలేదు గనుక చాలమంది వీక్షణం రచయితల వ్యాసాలలో లోపాలు ఉంటున్నాయి. వాటిని సరిగా ఎడిట్ చేసి వాటి నాణ్యతను మెరుగుపరచి అచ్చువేయడం అనేక కారణాలవల్ల మాకు కుదరడం లేదు. కాగా వీక్షణంలో ఎంత ప్రయత్నించినప్పటికీ, ఎన్ని స్థాయిలలో పర్యవేక్షించినప్పటికీ అచ్చుతప్పులు ఎక్కువగానే వస్తున్నాయి. రచన, కంపోజింగ్, ప్రూఫ్ రీడింగ్, దిద్దినవి కూడ అచ్చుప్రతిలోకి రాకపోవడం వంటి అనేక స్థాయిలలో ఎక్కడ పొరపాటు జరిగినా చివరికి పత్రిక పొరపాట్లతో వస్తున్నది.

ఇక వీక్షణం ఆర్థిక పరిస్థితి గురించి కూడ మీతో పంచుకోవాలి. వీక్షణంకు ప్రతినెలా రు. 90,000 – 95,000 ఖర్చు అవుతుంది. ఇందులో రు.42,000 సిబ్బంది జీతాలు, రు. 15,000 కార్యాలయ

నిర్వహణ, రు. 35,000 న్యూస్ ప్రింట్, ముద్రణా వ్యయం. ఈ ఖర్చుకుగాను చందాలు, విడిప్రతి అమ్మకాలు, విరాళాలు, వీక్షణం అమ్మే పుస్తకాల మీద కమిషన్ రూపంలో దాదాపు రు. 60,000 తిరిగి వస్తున్నాయి. అంటే ప్రతినెలా కనీసం రు.30,000 లోటు ఉంటున్నది. ఈ లోటును పూడ్చుకోవడం వీక్షణం తక్షణం చేయవలసిన పని. అది జరగకపోతే వీక్షణం నడవడం అసాధ్యం.

నిర్వహణా వ్యయం తగ్గించుకోవచ్చునని కొందరు మిత్రులు సూచిస్తున్నారు. కాని, ప్రస్తుతం వీక్షణం కార్యాలయం కనీసమైన ఖర్చులమీద మాత్రమే నడుస్తున్నది. ఇంటి యజమానులు నేరెళ్ల వేణుమాధవ్ నేరెళ్ల శోభావతి గార్లు ఔదార్యంతో కార్యాలయ అద్దె చాల తక్కువ తీసుకుంటున్నారు. కార్యాలయానికి అవసరమైన విద్యుత్తు, పత్రికలు, ఫోన్లు, ఇంటర్నెట్ వంటి ఖర్చులను తగ్గించడం సాధ్యం కాదు. ఇక సిబ్బంది నలుగురు ఉద్యోగులు బైట ఇతర పత్రికలలో వారి స్థాయి వారు తీసుకుంటున్న జీతాలలో సగానికన్న తక్కువకు ఇక్కడ పని చేస్తున్నారు. కనుక కార్యాలయ నిర్వహణ ఖర్చులుగాని, సిబ్బంది జీతాలు గాని, ముద్రణా వ్యయం గాని ఏదీ తగ్గడానికి అవకాశం లేదు.

అసలు కార్యాలయం, సిబ్బంది లేకుండా పత్రిక నడపాలని కూడ కొందరు సూచిస్తున్నారు. కాని ఏడెనిమిది ప్రధాన స్రవంతి పత్రికలలోను, ఐదు ప్రత్యామ్నాయ పత్రికలలోను పనిచేసిన అనుభవంతో నా అవగాహన ఏమంటే పత్రిక క్రమబద్ధంగా రావాలంటే కార్యాలయం, సిబ్బంది వంటి స్థిరమైన వ్యవస్థ అవసరం. పార్ట్ టైమ్ పనిచేసే కార్యకర్తల వంటి ఉద్యోగులతో, ఇళ్ల నుంచి పత్రికలు నడపవచ్చుగాని అవి క్రమబద్ధంగా రావడానికి అనేక అడ్డంకులుంటాయి. ప్రతి నెలా రావాలనే నియమం ఉండదు. వస్తే వస్తుంది, లేకపోతే లేదు అనే స్థితిలోనే అనేక పత్రికలు వస్తున్నాయి. కాని వీక్షణం ఇప్పటికి 152 సంచికల్లో ఒక్క సంచిక కూడ మిస్ కాలేదు, ఎప్పుడూ రెండు సంచికలో, మూడు సంచికలో కలపడం జరగలేదు. పోస్టల్ డిపార్ట్ మెంట్ ఇచ్చిన తేదీకే ప్రతి నెలా పోస్ట్ అవుతూ, మార్కెట్లో ఏ నెల సంచిక ఆ నెల ఒకటో తేదీకల్లా ఉంటున్నదంటే అది ఒక వ్యవస్థా నిర్మాణం ఉండడం వల్లనే అని నా అభిప్రాయం.

నిజానికి ప్రధాన స్రవంతి పత్రికలు వ్యవస్థా నిర్మాణం మీద, కార్యాలయం మీద, సిబ్బంది జీతభత్యాల మీద ఇంకా ఎక్కువ ఖర్చు పెడతాయి. వాటి అమ్మకం ధరకూ ఉత్పత్తి వ్యయానికీ పదులరెట్ల తేడా ఉంటుంది. ఐనా అవి లాభాలు కూడ చేసుకుంటున్నాయంటే కేవలం వ్యాపారప్రకటనల వల్ల, ప్రభుత్వ ప్రకటనల వల్ల మాత్రమే జరుగుతున్నది.

వీక్షణంలో అసలు ప్రకటనలే ఉండగూడదనుకునే మిత్రులు కూడ ఉన్నారు. కాని నెలకు ముప్పై వేల రూపాయల లోటుతో పత్రికను మూసివేయడమా, అరవై ఎనిమిది పేజీల పత్రికలో ఒక మూడు పేజీలు అమ్ముకుని మిగిలిన అరవై ఐదు పేజీలు ప్రజానుకూలంగా నడపడమా అనే అనివార్యమైన సవాల్ నిలిచినప్పుడు మేం ప్రకటనలు తీసుకోవడానికి అంగీకరిస్తున్నాం. ప్రకటనలు తీసుకోవడాన్ని తప్పు పట్టే మిత్రులకు సవినయంగా మేం చేయగల విజ్ఞప్తి ఒక్కటే. ఆ ప్రకటనల వల్ల లోపల మేం రాసే, ప్రచురించే ఏ విషయమైనా ప్రభావితమైతే, ప్రజావ్యతిరేకమైన రచనలు వస్తే తప్పకుండా ఖండించండి.

ఇంతకూ వీక్షణంకు కావలసినట్టుగా ఆ మూడు పేజీల ప్రకటనలు కూడ రావడం లేదు. వ్యాపార ప్రకటనలు ఇవ్వగలిగిన వారందరూ వీక్షణంకు ఇవ్వడం లేదు. ఒక్క పేజీ ప్రభుత్వ ప్రకటన మాత్రం 2010 వరకూ కొంత క్రమబద్ధంగానే వస్తుండేది, ఆ తర్వాత అది కూడ మూడు నాలుగు నెలలకు ఒక పేజీ గా మారిపోయింది. నిజానికి సంవత్సరానికి కొన్ని వందల కోట్ల రూపాయలు ఉండే ప్రభుత్వ ప్రకటనల్లో 95 శాతం పెద్ద పత్రికలకే అందుతున్నాయి. చిన్న పత్రికల యజమానులు, సంపాదకులు ప్రభుత్వంతో పోరాడి, తప్పనిసరిగా మొత్తం బడ్జెట్ లో కనీసం ఐదు శాతం చిన్న పత్రికలకు ఇవ్వాలని నిబంధన విధించేలా, రెండు దశాబ్దాల కిందనే ఒక హక్కుగా సాధించుకున్నారు. ఆ నిబంధనను కూడ ఇటీవల ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నది. అంతేగాక, ప్రభుత్వ విధానాలను, ప్రజలకు తెలియవలసిన విషయాలను ఈ ప్రకటనల్లో చెప్పవలసి ఉండగా ముఖ్యమంత్రులు, మంత్రులు చాల తప్పుడు పద్ధతిలో తమ ఫొటోలతో, తమ వ్యక్తిగత ప్రచారానికి ఈ ప్రకటనలను వినియోగించుకుంటున్నారు. ప్రకటన వస్తేనే చాలుననుకునే స్థితిలో ఉన్న చిన్నపత్రికలకు ఆ ప్రకటనలో ఉన్నదాన్ని విమర్శించే, తిరస్కరించే అవకాశం ఉండడం లేదు.

ఇక విద్యార్థి దశలో, గత జీవితంలో ప్రగతిశీల రాజకీయ, సామాజిక ఉద్యమాలలో ఉండి అనంతర కాలంలో నర్సింగ్ హోంలు, కాలేజీలు, వ్యాపార సంస్థలు పెట్టుకున్నవారు వందలాది మంది ఉన్నారు. వారు ఇప్పటికీ స్థూలంగా ప్రగతిశీల భావాల ప్రచారానికి తమకు చేతనైనంత చేయాలనే దృష్టితోనే ఉన్నారు. అటువంటి వారు తమ వ్యాపారాల గురించి వీక్షణం వంటి పత్రికలకు వ్యాపార ప్రకటనలు ఇవ్వవచ్చు. కాని గత పన్నెండు సంవత్సరాల అనుభవంలో ఆ ప్రయత్నం కూడ ఉండవలసినంత ప్రోత్సాహకరంగా లేదు.

వ్యాపార ప్రకటనల రంగంలో అటువంటి నిరుత్సాహకరమైన పరిస్థితి ఉండగా, వీక్షణం ఆర్థిక స్థితి మెరుగు పడడానికి చాల సంవత్సరాలుగా మరొక రెండు సూచనలు వస్తున్నాయి. ఒకేసారి పెద్దమొత్తంలో కార్పస్ నిధి వసూలు చేసి, దాన్ని ఫిక్స్ డ్ డిపాజిట్లలో పెట్టి, దాని మీద వడ్డీతో పత్రిక ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కవచ్చుననేది ఒక సూచన. వకుళాభరణం రామకృష్ణ గారు గతంలో రెండు మూడు రచయితల సమావేశాలలో ఈ సూచన చేశారు. కాని ఈ ప్రయత్నం ఇంకా చేయవలసే ఉంది. ప్రగతిశీల భావాలు ఉన్న మిత్రుల దగ్గర వీక్షణం కోసం చిన్న మొత్తాలలోనైనా విరాళాలు వసూలు చేయవచ్చుననేది మరొక సూచన. నిజానికి ఇది కొంతవరకు జరుగుతున్నది. వీక్షణంలో ఆర్థిక స్థితి గురించి ప్రకటనలు చూసి చాలమంది మిత్రులు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నారు. అవి ఎప్పటికప్పుడు వీక్షణంలో ప్రకటిస్తూనే ఉన్నాం. కాని అవి కూడ సరిపోయేంతగా రావడం లేదు.

ఇదీ వీక్షణం పన్నెండేళ్లు పూర్తి చేసుకుని పదమూడో ఏట ప్రవేశించి మీ ముందర ప్రకటిస్తున్న నివేదిక. వీక్షణం తెలుగు సమాజపు బిడ్డ. తెలుగు మేధోలోకపు బిడ్డ. ఇది ప్రజల పత్రిక. ఇది కొనసాగాలా ఆగిపోవచ్చునా నిర్ణయం పాఠకులదే, ప్రజలదే. పన్నెండు సంవత్సరాల పాటు కష్టమో నష్టమో భరించి నడిపాం. ఇక బాధ్యత మీదే. వీక్షణం నెలకొల్పిన ప్రమాణాల వల్ల, పొందిన అపారమైన ప్రజాదరణ వల్ల ఇది ఎటువంటి పరిస్థితిలోనూ ఆగిపోగూడదని కోరుకునే అభిమానులు ఎంతోమంది ఉన్నారు. వారి ఆదరణతోనే, విశ్వాసంతోనే వీక్షణం పది కాలాలపాటు నిలుస్తుందని, తెలుగు పాఠకులకు అవసరమైన రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా కొనసాగుతుందని హామీ ఇస్తున్నాం. అనేకసార్లు చెప్పినట్టు ఇది తెలుగు సమాజం తనతో తాను చేసుకునే సంభాషణ. ఈ సంభాషణ ఎప్పటికీ ఆగగూడదనీ, చిరకాలం కొనసాగాలనీ మా ఆశ. దాన్ని నిలబెట్టడం మీ చేతుల్లోనే ఉంది. వీ

వీక్షణం రచయితల సమావేశం 2014 నివేదిక

వీక్షణం రచయితల వార్షిక సమావేశం మార్చ్ 9 న హైదరాబాదు లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ఆవరణలో తెలంగాణ రిసోర్స్ సెంటర్ సమావేశ మందిరంలో జరిగింది. ఆ రోజే ఎన్నో కార్యక్రమాలు ఉండడం వల్ల హాజరయిన సభికుల సంఖ్య 40కి మించనప్పటికీ అర్థవంతమైన చర్చ జరిగింది. వీక్షణం భవిష్యత్తు గురించి విలువైన సూచనలు ఎన్నో వచ్చాయి.

సమావేశానికి అధ్యక్షత వహిస్తూ ప్రొ. కె ఆర్ చౌదరి వీక్షణం విశిష్టత గురించి మరొకసారి వివరించారు. 'ప్రజాపక్ష పత్రికలు ఎన్నో వెలువడుతున్నప్పటికీ, అవి సరిగ్గా రాకపోవడం, ఆగిపోవడం జరుగుతున్నది. వీక్షణం ఒక్కటే నిరాటంకంగా, మంచి ప్రమాణాలతో వస్తున్నది. దీన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత' అని ఆయన అన్నారు. వీక్షణంను అందరూ తమ పత్రికగా భావించి సహకరించాలని ఆయన కోరారు.

చర్చను ప్రారంభిస్తూ స్థాపక సంపాదకులు వి హనుమంతరావు వీక్షణం గురించి ఆలోచించవలసిన ప్రధానాంశాలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. 'వీక్షణం తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఈ విషయం పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ స్పందన ఉండవలసినంత ఉండడం లేదు. ఈ సమావేశంలోనైనా ఆచరణ సాధ్యమైన, అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి. వీక్షణం చదివే, ఆదరించే, రాసే మేధావివర్గం చాలానే ఉంది. వారు నాలుగంకెల, ఐదంకెల నెల జీతాలు కూడ పొందుతున్నారు. వారు తలచుకుంటే వీక్షణంను బతికించడం పెద్ద సమస్య కాదు. కాని వారినుంచి స్పందన ఉండడం లేదు. గతంలో ఎన్నోసార్లు సూచన వచ్చినట్టే వీక్షణంకు ఒక మూలనిధి ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాలి. ఇందుకు అన్నివైపుల నుంచీ ప్రయత్నాలు జరగాలి. ఇక వీక్షణంలో రచనల విషయానికి వస్తే కొన్ని కాస్త పైనుంచి వెళుతున్నాయేమో ఆలోచించాలి. సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ప్రయత్నించాలి. పుస్తక సమీక్ష తప్పనిసరిగా ఉండాలి. ఏది ఏమైనా వీక్షణం ఆగిపోగూడదు' అని ఆయన అన్నారు.

ఆ తర్వాత సంపాదకుడి నివేదిక చదివి వినిపించాక చర్చ ప్రారంభమయింది. చర్చల్లో వచ్చిన ముఖ్యమైన అభిప్రాయాలు:

ఎస్ ఆశాలత (హైదరాబాద్) : పత్రిక నిలబడాలి. రచనలు చేయడంతో పాటు చందాలు చేర్పించడం కూడ చేస్తాను. ప్రతి సంచికలోను పుస్తక పరిచయం, సమీక్ష ఉండాలి. వ్యవసాయం గురించి మామూలుగా ఏ పత్రికా పట్టించుకోవడం లేదు. వీక్షణం ప్రతినెలా ఒక వ్యాసమైనా వేయాలి.

చిమ్మె జాన్ బర్నబాస్ (కర్నూలు) : కుటుంబ సభ్యులకు ఏమైనా జరిగితే ఎట్లా ఖర్చుకు వెరవకుండా అవసరమైన పనులన్నీ చేస్తామో వీక్షణం నిలబడడానికి అలాగే చేయాలి. వెనుక పేజీ ప్రకటన చూడగానే అందుకే పరుగెత్తి వచ్చాను. ఇప్పటికే పత్రిక చాల మందికి, చాల లోతుకి చేరుతున్నది. దీన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. రచయితల, అభిమానుల, పాఠకుల సమావేశాలు ఏడాదికొకసారి కాకుండా ఆరునెలలకోసారి జరిపితే బాగుంటుంది.

మెరుగు రాజయ్య (గోదావరి ఖని) : అసంఘటిత రంగం గురించి, కార్మిక వర్గం గురించి ఎక్కువ రాయాలి. పత్రికను కార్మికుల దగ్గరికి తీసుకుపోగలిగితే మనుగడ సులభమవుతుంది. విత్తనాలు, ఎరువులు, కల్తీమందులు, న్యాయవ్యవస్థ వంటి ఎన్నో అంశాల మీద రచనలు ఇంకా పెరగాలి. లోపాలను, ప్రత్యామ్నాయాలను చూపాలి. రంగనాయకమ్మ వ్యాసం, దానిమీద చర్చా పరంపర అవసరం లేదు.

తుర్లపాటి లక్ష్మి (నిజామాబాద్) : పత్రికలో వ్యాసాలు కాస్త పైస్థాయిలో ఉంటున్నాయి. ఇంటర్, డిగ్రీ చదివినవారికి అందుబాటులో ఉండాలి. కాస్త స్థాయి తగ్గించాలి. ప్రత్యేక సంచికలు వేస్తే పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుంది. సినిమా సమీక్ష, కవిత్వం వేయడం గురించి కూడ ఆలోచించాలి.

కె. బాల్ రెడ్డి (హైదరాబాద్) : మూల నిధి ఏర్పాటు చేయడం గురించి, ఎక్కువ చందాలు చేర్పించడం గురించి అందరూ ఆలోచించాలి. ఇంత రెగ్యులర్ గా, ఇంత నాణ్యతతో వస్తున్న పత్రిక మరొకటి లేదు గనుక ప్రతి ఒక్కరూ దీన్ని నిలబెట్టే బాధ్యత తీసుకోవాలి. పుస్తక సమీక్షలు తప్పనిసరిగా ఉండాలి. ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా గురించి ఎక్కువ రచనలు వేయాలి.

ఎన్. సుధాకర శర్మ (హైదరాబాద్) : ఇటువంటి పత్రిక నిరాటంకంగా నడవాలంటే మూలనిధి అవసరం. ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసిన అనుభవంతో అటువంటి నిధి సేకరించడం కష్టం కాదనే అనుకుంటున్నాను.

ఎ. శంకర్ (నిజామాబాద్) : మూల నిధి తప్పకుండా ఏర్పాటు చేయాలి. పత్రిక ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి అందరమూ తలా ఒక చెయ్యి వేయాలి. ఉపాధ్యాయులు, లెక్చరర్లు వందలాదిగా హాజరయ్యే స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ల దగ్గర వీక్షణం చందాలు చేర్పించడం, విరాళాలు వసూలు చేయడం చేయాలి. ఏది ఏమైనా వీక్షణం మీద ప్రభుత్వ ప్రకటనలు వద్దు.

కె. ప్రభాకర్ (మిర్యాలగూడ) : వీక్షణంకు ఉన్న పేరు, ఆదరణ దృష్ట్యా మూల నిధి ఏర్పాటు చేయడం కష్టం కాదు. అసలు వీక్షణం రచయితల, పాఠకుల సమావేశాలు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి ఇటువంటి విజ్ఞప్తి చేస్తే ఫలితం బాగుంటుంది. జిల్లా గ్రంథాలయ సంస్థల చేత చందాలు కట్టించి, అన్ని గ్రంథాలయాలకు పత్రిక పంపితే పాఠకులు పెరుగుతారు. జిల్లాలలో వీలయిన చోట్ల మిత్రులు అలా గ్రంథాలయాల చందాలు చేర్పించే ప్రయత్నం చేయాలి. పత్రిక కొంత వరకు మేధావుల పత్రికగా మారుతున్నది. సరళం చేయాలి. వీక్షణంలో కవర్ కాని అంశాలు చాల ఉంటున్నాయి. వాటి మీద దృష్టి సారించాలి.

పి వి రమణ (విశాఖపట్నం) : ప్రపంచీకరణ విధానాల నేపథ్యంలో మధ్యతరగతిలో చాల మార్పులు వస్తున్నాయి. మధ్యతరగతి ప్రాధాన్యతలు మారిపోతున్నాయి. సీరియస్ రచనలు చదవడం, పక్కవాళ్లతో మాట్లాడడం తగ్గిపోతున్నాయి. వ్యక్తుల అహంకారాన్ని పెంచి, మనుషుల మధ్య సంబంధాలు తెగగొట్టడమే సామ్రాజ్యవాదపు పని. ఈ సందర్భంలో వీక్షణం వంటి పత్రిక అవసరం ఇంకా పెరుగుతున్నది. అందరమూ తలా ఒక చెయ్యివేసి దీన్ని కాపాడుకోవాలి. రచనల్లో నాణ్యత పెరగాలి. పుస్తక సమీక్ష తప్పనిసరిగా ఉండాలి.

ఎ. నర్సింహారెడ్డి (జనగామ) : వీక్షణం ద్వారానే రచయితగా

వెలుగులోకి వచ్చి, వీక్షణంను ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని మిత్రులతో కలిసి నిరంతర ప్రయత్నం చేస్తున్నాను. కాని శక్తి చాలడం లేదు. ఆ ప్రయత్నం లోకి మరింత మంది రావాలి. మూలనిధి ఏర్పాటు చేయాలి. రచనల స్థాయి గురించి కొందరు మాట్లాడుతున్నారు గాని కొన్ని అంశాలలో క్లిష్టత అనివార్యంగా ఉంటుంది. పాఠకులు కొంత కష్టపడాలి. అవసరమైన రచనల కొరత కూడ ఉంటున్నది.

ఎ ఉపేంద్ర (విజయవాడ) : వీక్షణం ముందున్న సమస్యల గురించి చాల చర్చ జరుగుతున్నది. ఆ సమస్యలు ఉన్న మాట నిజమే గాని అవకాశాలు కూడ ఉన్నాయని అనుకుంటున్నాను. విరాళాలు ఇవ్వగలవాళ్లు ఉన్నారు. వాళ్లను ఎలా కలుసుకోవడమనేదే సమస్య. ఒక క్రియాశీలమైన సంపాదకవర్గం, ఒక సహాయక బృందం ఉంటే ఆ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. తెలుగు పుస్తకాల సమీక్షలు మాత్రమే కాదు, ఇంగ్లిష్, తదితర భాషల్లో వస్తున్న మంచి పుస్తకాల సమీక్షలు, పరిచయాలు కూడ వీక్షణంలో రావలసి ఉంది. తెలంగాణ న్యాయమైన ఆకాంక్షకు అనుకూలంగా రచనలు ప్రచురించడంలో తప్పులేదు. కాని వర్గపోరాటాన్ని పణంగా పెట్టే రచనలు వచ్చాయేమో సమీక్షించుకోవాలి. ఇతర ప్రాంతాల ప్రజల సమస్యలను కూడ వీక్షణం పట్టించుకోవాలి. తెలుగు ప్రజల ఐక్యత గురించి మాట్లాడవలసిన బాధ్యత వీక్షణం మీద ఎక్కువగా ఉంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తరుణంలో, ప్రత్యామ్నాయ పత్రికలు తగ్గిపోతున్న వాతావరణంలో వీక్షణం అవసరం చాల ఉంది.

ఎం నర్సింహ (హైదరాబాద్) : తెలంగాణ ఉద్యమం విషయంలో కోస్తా, రాయలసీమ ప్రజలను అక్కడి పాలకవర్గాలు తప్పుదారి పట్టించగలిగాయి. అక్కడి ప్రజలకు అవగాహన కల్పించే పనిని వీక్షణం చేయాలి. ఏ విషయం మీదనైనా వ్యాసాలు రావడం లేదనుకున్నప్పుడు, ఆ రంగంలోని ప్రముఖులను ఇంటర్వ్యూ చేసి ప్రచురిస్తే ఆ రంగానికి తగినస్థానం దొరికినట్టవుతుంది. విరాళాల కోసం ప్రవాస భారతీయులను కూడ ఒక ముఖ్యమైన వనరుగా గుర్తించాలి. పెద్ద పెద్ద, పూర్తి పేజీ ప్రకటనలు మాత్రమే కాక, పుట్టినరోజు, పదవీవిరమణ వంటి సందర్భాలకు తగినట్టుగా చిన్న చిన్న ప్రకటనలు కూడ స్వీకరించాలి.

టి నళిని (హైదరాబాద్) : రచయితలందరూ వ్యాసాలు సరళంగా రాయడం అలవాటు చేసుకోవాలి. వీక్షణంను మరింత ఎక్కువగా విద్యార్థుల దగ్గరికి తీసుకువెళ్లగలిగితే ఆర్థిక సమస్యలు కొంతవరకు తగ్గుతాయి. అన్ని పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలకు, యూనివర్సిటీలకు వీక్షణంను పరిచయం చేయాలి. ప్రత్యేక సంచికల బదులు, ప్రతి సంచికలోనూ అన్ని రంగాల రచనలూ ఉండేలా చూడాలి. అసహజ మరణాల సూచి కేవలం అంకెలు మాత్రమే కాక, కొన్ని ఘటనలైనా తీసుకుని కేస్ స్టడీస్ రాయాలి.

దామెర రేణుక (కరీంనగర్), పి సత్తయ్య, ఎన్ భీమార్జున రెడ్డి (నల్లగొండ), ఎ. లింగన్న (భోనగిరి), సిఎచ్ నరహరి (దేవరకొండ), ఇ.ఎస్. బ్రహ్మాచారి (ఒంగోలు), గడీల సుధాకర్ రెడ్డి (సిద్దిపేట), కాకరాల, ఎం. రత్నమాల, నలమాస కృష్ణ, కొంతం దిలీప్, అపర్ణ తోట, స్రవంతి దాసరి, వై. భాస్కర్, వి. సురేష్ బాబు, డి. భానుమూర్తి, కవిని, పి. బాలాజీ వరప్రసాద్, పి రవీందర్ రెడ్డి, ఎస్ కిష్టయ్య, ఎం ధనంజయ రావు, ఎన్ వంశీమోహన్, సి రామకృష్ణ, హేమసుందర్ (హైదరాబాద్) తదితరులు కూడ చర్చలో పాల్గొన్నారు. ఇటు రచనల నాణ్యత, విస్తృతి పెంచడం గురించి, అటు ఆర్థిక పరిపుష్టి సాధించడం గురించి మిత్రులు చేసిన విలువైన నిర్మాణాత్మక సూచనల మీద వివరణ ఇస్తూ సంపాదకుడు తన ప్రతిస్పందన తెలిపాడు. సర్క్యులేషన్ మేనేజర్ యాటెల్లి రామచంద్రం వందన సమర్పణతో సమావేశం ముగిసింది. వీ

పాఠకులకు విజ్ఞప్తి!

వీక్షణం విడిప్రతి వెల, సంవత్సర చందాల రేట్లు పెంచక తప్పడం లేదు

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక విడిప్రతి వెల, చందారేట్లు జనవరి 2011 సంచిక నుంచి మూడు సంవత్సరాల పాటు ఏ మార్పూ లేకుండా ఉన్నాయి. ప్రతి నెలా న్యూస్ ప్రింట్ ఖరీదు, ముద్రణా వ్యయం, నిర్వహణా వ్యయం ఎంతగా పెరిగిపోతున్నా, ప్రతి సంచిక విడిప్రతి ఉత్పత్తి వ్యయంలో సగమే వెనక్కి వస్తున్నా, ప్రతినెలా పెద్ద ఎత్తున లోటుతో, ఆర్థిక ఇబ్బందులతో నడుస్తున్నా, ఆ భారాన్ని పాఠకుల మీద వేయకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ వచ్చాం. ఇక తప్పనిసరి పరిస్థితులలో ఏప్రిల్ 2014 సంచిక నుంచి వీక్షణం విడిప్రతి వెల, చందా రేట్లు పెంచక తప్పడం లేదు. మారిన రేట్ల ప్రకారం విడిప్రతి వెల రు. 20, సంవత్సర చందా రు. 200, మూడు సంవత్సరాలకు రు. 540, ఐదు సంవత్సరాలకు రు. 900, పది సంవత్సరాలకు రు. 1700 ఉంటుంది. వీక్షణంను ఆదరిస్తున్న పాఠకులు ఈ పరిస్థితిని అర్థం చేసుకుని ఎప్పటిలాగే సహకరిస్తారని ఆశిస్తున్నాం. కొత్త విడిప్రతి వెల, చందా రేట్లు 1 ఏప్రిల్ 2014 నుంచి అమలు లోకి వస్తాయి.

వీక్షణం మీ పత్రిక

వీక్షణం ప్రజల పత్రిక

వీక్షణంను నాలుగు కాలాల పాటు నిలబెట్టుకునే బాధ్యత ప్రజలదే

తెలంగాణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లు రాష్ట్రపతి మార్చ్ 1న ఆమోదించారు. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ రెండు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. మొదట రాష్ట్రపునర్వ్యవస్థీకరణ బిల్లును ఆమోదించారు. ఆ వెంటనే రాష్ట్రపతి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. రాష్ట్రపతి ఆమోదంతో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భావిస్తుంది.

సార్వత్రిక ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి ఇవన్ సంపత్ మార్చ్ 5న ప్రకటించారు. 16వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు 9 దశల్లో ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు జరుగుతాయన్నారు. దేశవ్యాప్తంగా 81.4 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. సార్వత్రిక ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభలకు కూడా ఎన్నికలు జరగనున్నాయన్నారు. మే 16న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయని ఎన్నికల కమిషన్ తెలిపింది.

బూటకపు ఎన్నికల్ని బహిష్కరించండి

త్వరలో లోక్‌సభ, శాసనసభలకు జరుగనున్న బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ ఉత్తర తెలంగాణ కమిటీ మార్చ్ 6న పిలుపునిచ్చింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు గత అవినీతిని కప్పిపుచ్చి ప్రజలను మరోసారి మోసం చేయాలని బూటకపు వాగ్దానాలతో మోసం చేసేందుకు సిద్దమవుతున్నారంది.

సైన్యం కాల్పుల్లో మిలిటెంట్ల మృతి

కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో మార్చ్ 10న కశ్మీర్ మిలిటెంట్లకు ఆర్మీ జవాన్లకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మిలిటెంట్లు ప్రాణాలు కోల్పోయారు. ఒక ఆర్మీ అధికారి గాయపడ్డారు. ఆ ప్రాంతంలో మిలిటెంట్లు ఉన్నారన్న సమాచారంతో మాలిక్‌పుర గ్రామంలో సైన్యం, పోలీసులు సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మిలిటెంట్లు అక్కడికక్కడే మృతిచెందారు.

కేసుల విచారణ త్వరగా జరగాలి

పదవిలో ఉన్న పార్లమెంట్, శాసనసభ సభ్యులపై నమోదయిన క్రిమినల్ కేసులను నమోదు చేసిన ఏడాదిలోగా పరిష్కరించాలని మార్చ్ 10న సుప్రీం కోర్టు దేశంలోని అన్ని ట్రయల్ కోర్టులను ఆదేశించింది. పబ్లిక్ ఇంట్రెస్ట్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు జస్టిస్ ఎం.ఆర్. లోథా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఏడాదిలోగా కేసులను పరిష్కరించడంలో విఫలమైతే సంబంధిత న్యాయమూర్తి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు తెలిపింది. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 మంది ఎంపిల్లో దాదాపు 150 మందిపై క్రిమినల్ కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

నక్సల్స్ కాల్పుల్లో పోలీసుల మృతి

చత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా బీరంఘాట్ అటవీ ప్రాంతంలో మార్చ్ 11న మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో 11 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు, 4 పోలీసులు, ఒక సాదారణ పౌరుడు మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ జవాన్లను హెయిర్ అంబులెన్స్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు. ఈ ప్రాంతంలోని రహదారిపై 30 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు, 14 మంది పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది.

నలిమెల భాస్కర్‌కు సాహిత్య అకాడమీ అవార్డు

ప్రముఖ రచయిత నలిమెల భాస్కర్‌కు అనువాద ప్రక్రియలో పనిచేసినందుకు ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు మార్చ్ 10న తెలిపారు. మళయాళ రచయిత పునాతిల్ కున్హాబ్దుల్లా రచించిన 'స్మారక శిలగళ్' నవలను నలిమెల భాస్కర్ 'స్మారక శిలలు' పేరుతో తెలుగులో అనువదించారు. ఆయన కవితా సంపుటి 'అద్దంలో గోదావరి' తెలుగు యూనివర్సిటీ సాహిత్య పురస్కారం లభించింది. ఆయన ఇప్పటివరకు 20కి పైగా పుస్తకాలను వెలువరించారు.

'నిర్భయ' నిందితులకు ఉరి

దేశ రాజధాని ఢిల్లీలో 2012, డిసెంబర్ 12న నడిచే బస్సులో జ్యోతిసింగ్ అనే యువతిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నేరస్తులకు కింది కోర్టు విధించిన ఉరిశిక్షను ఢిల్లీ హైకోర్టు సమర్థిస్తున్నట్లు జస్టిస్ రేవా ఖేత్రపాల్, జస్టిస్ ప్రతిభారాణిల ధర్మాసనం మార్చ్ 13న తన తీర్పులో స్పష్టం చేసింది. దోషులు చేసుకున్న అపీళ్లను కొట్టివేసింది.

ఆధార్ తప్పనిసరి కాదు

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పొందడానికి ఆధార్ కార్డును తప్పనిసరి చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించు కోవాలని మార్చ్ 23న సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అత్యాచారం కేసు దర్యాప్తు విషయంలో పౌరుల ఆధార్ సమాచారాన్ని సిబిఐతో పంచుకోవాలని బాంబే హైకోర్టు గోవా బెంచి ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. నిందితుని నుంచి లిఖిత పూర్వక అనుమతి లేకుండా ఆధార్ కార్డులోని బయోమెట్రిక్, ఇతర వివరాలను సంబంధిత అధికారులు ఇతరులకు ఇవ్వకూడదని స్పష్టం చేసింది.

ముజఫర్‌నగర్ అల్లర్ల బాధ్యత ప్రభుత్వానిదే

ముజఫర్‌నగర్ మత ఘర్షణలకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే ప్రాథమిక బాధ్యత వహించాలని మార్చ్ 26న సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. మత ఘర్షణలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని, పాలన యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై సిబిఐ లేక ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలన్న పిటిషనర్ విజ్ఞాపనను మాత్రం చీఫ్ జస్టిస్ పి. సదాశివమ్ నేతృత్వంలోని బెంచ్ తిరస్కరించింది. ముజఫర్‌నగర్ మత ఘర్షణల్లో 40 మంది మరణించగా 61 వేల మంది నిర్వాసితులయ్యారు. వీ

పాకిస్తాన్ ప్రభుత్వం - టిటిపి మధ్య చర్చలు

పాకిస్తాన్ ప్రభుత్వానికి తెహ్రిక్-ఎ-తాలిబన్ ఆఫ్ పాకిస్తాన్ (టిటిపి)ల మధ్య ఘర్షణలు, శాంతి చర్చలు నిరంతరంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 28న టిటిపి నెల రోజుల కాల్పుల విరమణను ప్రకటించి తన అనుబంధ ఇతర గ్రూపులను కాల్పుల విరమణను పాటించమని కోరినప్పటికీ అహరుల్ హింద్ అనే గ్రూప్ ఇస్లామాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో ఆత్మాహుతి దాడి జరిపి జడ్జితో సహా పది మంది న్యాయవాదులను హతమార్చింది. వాయిస్ ఆఫ్ బలోచ్ మిస్సింగ్ పర్సెన్స్ సంస్థ వ్యవస్థాపకుడు 72 ఏళ్ల ఖదీర్ బలోచ్, 11 ఏళ్ల అలీహైదర్ పర్జానాతో మరికొంతమంది బాధిత కుటుంబాలతో కలిసి క్వెటా నుండి ఇస్లామాబాద్‌కు సుమారు రెండు వేల కిలోమీటర్ల పాదయాత్ర జరిపి తప్పిపోయిన మనుషుల ఫొటోలను మీడియా ముందు సమర్పించారు.

వెనిజులాలో నిరసన ప్రదర్శనలు

మదురో ప్రభుత్వ సోషలిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా వెనిజులాలో నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. మూడు వారాల హింసాత్మక ప్రదర్శనలో 31 మంది మరణించారు. వీటిని అమెరికా ప్రోత్సహిత ప్రదర్శనలుగా మదురో అన్నారు. ఈ నేపథ్యంలో మధ్య అమెరికా దేశమైన పనామా రాయబారి ముగ్గురు దౌత్యవేత్తలను బహిష్కరించి, ఆ దేశంతో ఉన్న వాణిజ్య సంబంధాలను రద్దు చేశారు. తాజాగా మార్చ్ 21న ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికా స్టేట్స్ మీట్స్‌లో వెనిజులా సంఘర్షణను చర్చకు రానీయకుండా ఇరవై రెండు దేశాల మద్దతుతో నివారించగలిగారు.

థాయ్‌లాండ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు

థాయ్‌లాండ్‌లో యింగ్‌లుక్ షినావ్రతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నవి. ఫిబ్రవరి చివరి వారంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణలో 28 మంది మరణించారు. చైనా నుండి వలస వస్తున్న శరణార్థులను ఒక్కొక్కరికి 124 డాలర్ల జరిమానాను దక్షిణ థాయి న్యాయస్థానం విధించింది. రెండు నెలలుగా విధించిన అత్యవసర పరిస్థితి ప్రభావంతో టూరిజం నష్టం పోతుండడం, విదేశీ పెట్టుబడులకు విఘాతం కలుగుతుందని ఎమర్జెన్సీని ఎత్తివేసి, ప్రదర్శనలను నియంత్రించడానికి ఆంతరంగిక భద్రతా చట్టాన్ని అమలులోకి తెచ్చింది ప్రభుత్వం.

ఉక్రెయిన్ నుంచి క్రిమియా విముక్తి

విక్టర్ యనుకోవిచ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పశ్చిమ దేశాలకు అనుకూలంగా నెలల తరబడి నిరసనలు, ఘర్షణల అనంతరం, అధ్యక్షుడు యనుకోవిచ్‌ను పదవీచ్యుతుడిని చేసిన తరువాతి పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతమైన ఉక్రెయిన్, రష్యన్ భాష అధికంగా మాట్లాడే ప్రాంతంలో రష్యా జోక్యంతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహణ, 97 శాతం మంది రష్యాలో విలీనానికి ఓటు వేయగా క్రిమియా రష్యాలో అంతర్భాగం అయింది. ఈ ఒప్పందంపై రష్యా అధ్యక్షుడు పుతిన్, క్రిమియా నాయకులు మార్చ్ 18న సంతకాలు చేశారు. రష్యన్ పార్లమెంట్ డ్యూమా దీనికి అంగీకారం తెలిపింది.

చైనా - ఉయ్‌ఘుర్ వేర్పాటువాదుల ఘర్షణలు

ఉయ్‌ఘుర్ వేర్పాటువాదుల పరస్పర ఘర్షణలు, దాడులతో చైనా సంఘర్షణ పడుతోంది. మార్చ్ 1న చైనా ఈశాన్య ప్రాంతం జిన్‌జియాంగ్‌కు చెందిన వేర్పాటు వాదులు, కున్‌మింగ్ రైల్వే స్టేషన్‌లో కత్తులతో దాడి చేసి 29 మంది పౌరులను హతమార్చారు. జిన్ జియాంగ్ ప్రాంతం నుండి చైనాలోని ఇతర పట్టణాలకు నిరుద్యోగులైన ఉయ్‌ఘుర్ యువకులు ప్రత్యేకమైన నాన్‌బ్రెడ్, డ్రైఫ్రూట్ కేక్‌లను అమ్ముకునే పనిమీద జీవిక కోసం వలసవస్తారు.

సాన్ సాల్వడార్ అధ్యక్ష ఎన్నికలు

మార్చ్ 9న జరిగిన సాల్వడార్ అధ్యక్ష ఎన్నికలలో వామపక్ష గెరిల్లా మాజీ కమాండర్ సాంచెజ్ సెరెన్ అతి స్వల్ప మెజారిటీ 50.11 ఓట్లతో గెలిచినట్లు మార్చ్ 16న ప్రకటించారు.

మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల సందిగ్ధం

ఎన్నికల కమిషన్ నలుగురు సభ్యుల మీద కోర్టు ధిక్కార అభియోగంపై జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ఎన్నికల మిషన్ ఎన్నికలు నిర్వహించే సామర్థ్యంపై మాల్దీవుల జాతీయ అధ్యక్షుడు సందిగ్ధం వ్యక్తం చేశారు. స్వల్పంగా వాయిదా వేయమని అధ్యక్షునికి మిత్ర పార్టీ నాయకుడు పిటిషన్ దాఖలు చేసినప్పటికీ, మాల్దీవుల పార్లమెంట్‌కు ఎన్నికల ప్రక్రియ ముందు నిర్ణయించిన 22 మార్చ్‌న ప్రారంభమైంది. మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ డెమొక్రటిక్ పార్టీ ఎండిపి ముందంజలో ఉంది.

ఇరాక్‌లో బాంబు దాడులు

మార్చ్ 9న దక్షిణ ఇరాక్‌లోని హిల్లాలో ఒక చెక్‌పోస్టు దగ్గర పేలుడు పదార్థాలతో నిండుగా ఉన్న మినీ బస్‌ను నడుపుతూ ఒక వ్యక్తి తనను తాను పేల్చుకుని ఆత్మహుతికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సుమారు 32 మంది దాకా మరణించారు. 150 మందికి పైగా గాయపడ్డారు. చెక్‌పోస్టు వద్ద జరిగిన ఈ దాడిలో కనీసం 50 కార్లకు నిప్పంటుకుంది. ఆ కార్లలో ఉన్న ప్రయాణికులు వాటితో పాటే కాలి చనిపోయారు. మరోవైపు ఏప్రిల్ 30న ఇరాక్ పార్లమెంట్‌కు ఎన్నికలు సమీపిస్తుండగా తెగల మధ్య ఘర్షణలు తీవ్రమైనవి. మార్చ్ 21న సున్నీ మెజారిటీ ప్రాంతంలో జరిగిన దాడులలో దేశవ్యాప్తంగా 33 మంది మరణించగా, మార్చ్ 22న అధ్యక్ష నివాసావరణలో భద్రతా పోలీసు ఒకరు సీనియర్ ఇరాకీ జర్నలిస్టును కాల్చి చంపారు.

అఫ్ఘనిస్తాన్‌లో యథాతథ ఘర్షణలు

ఏప్రిల్ 5న అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తుండగా, 2014 చివరి కల్లా అమెరికా నాటో బలగాల దశల వారీ ఉపసంహరణ పూర్తి కానుండగా, నాటో దళాల వాయుసేన దాడులలో ఐదుగురు అఫ్ఘన్ సైనికులు మరణించారు. దీంతో కాబుల్ - అమెరికా నడుమ సంబంధాలు మరింత క్షీణించాయి. వాహనానికి అమర్చిన బాంబు పేలి నజ్‌యక్ జిల్లా గవర్నర్ మరణించారు. మార్చ్ 18న ఉత్తర అఫ్ఘన్‌లోని ఓ మార్కెట్ వద్ద ఆత్మాహుతి బాంబుదాడిలో 16 మంది మరణించారు. మార్చ్ 20న జలాలాబాద్ మీద జరిగిన దాడిలో పది మంది పోలీసులు హతమయ్యారు. మార్చ్ 21న కాబుల్‌లోని అత్యంత విలాసవంతమైన హోటల్ సెరెనా మీద జరిగిన దాడిలో ఒక ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఎఎఫ్‌పి)కు చెందిన విలేకరితో సహా 9 మంది మరణించారు.

సముద్రంలో కూలిన మలేషియా విమానం

మార్చ్ 8న కౌలాలంపూర్ నుంచి బీజింగ్‌కు బయలుదేరిన ఎంఎచ్ 370 విమానం దక్షిణ హిందూ మహాసముద్రంలో కుప్పకూలిపోయింది. ఆ సమయంలో విమానంలో 226 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నారు. రెండు వారాల పాటు 26 దేశాలు కలిసికట్టుగా గల్లంతైన విమానం కోసం అన్వేషణ జరపగా, ఉపగ్రహం ద్వారా లభించిన సమాచారం ప్రకారం అది సముద్రంలో కూలిపోయిందని మలేషియా ప్రభుత్వం ప్రకటించింది. ప్రయాణికుల్లో అత్యధికులు (154 మంది) చైనా దేశీయులు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాతో పాటు ఐదుగురు భారతీయులు కూడా ఉన్నారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎ.మల్లేశ్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 ఫిబ్రవరి నుండి 28 ఫిబ్రవరి 2014 వరకు 11 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1000)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	4	–	26	23	8	4	3	3	2	3	2	–	2	30	–	–	–	–	1	3
మహబూబ్‌నగర్	3	8	–	12	15	8	4	6	5	4	16	12	15	12	45	3	–	–	–	–	–
హైదరాబాద్	–	–	–	15	12	–	–	–	–	7	8	11	–	–	29	10	–	–	–	–	–
మెదక్	–	2	–	–	–	–	–	–	–	–	–	–	4	–	1	2	–	–	–	–	–
వరంగల్	వివరాలు అందలేదు																				
అనంతపురం	–	5	1	19	15	1	1	–	–	2	1	1	3	1	43	9	–	–	–	–	–
ఖమ్మం	–	3	–	8	12	1	10	3	1	–	2	1	1	2	23	10	–	–	–	1	–
నిజామాబాద్	–	–	–	10	10	1	1	–	–	5	4	5	6	1	19	30	–	–	–	–	–
కరీంనగర్	2	5	3	4	–	10	15	7	7	9	5	6	2	3	25	10	–	–	–	–	–
చిత్తూరు																					
కర్నూలు	–	2	1	6	8	5	4	10	8	5	4	3	9	4	25	19	–	–	–	–	–
శ్రీకాకుళం	–	–	–	4	5	–	4	2	–	2	1	1	4	1	20	6	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	11	8	–	2	1	3	5	–	–	–	4	13	15	–	–	–	6	1
మొత్తం	**5**	**29**	**5**	**115**	**108**	**34**	**45**	**32**	**27**	**41**	**44**	**42**	**44**	**30**	**273**	**114**	**–**	**–**	**–**	**8**	**4**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రారాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య - ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
సమాధిలోకి సామ్రాజ్యవాదం	డి. పాపారావు	200
కొత్తకోణం	ఎనిశెట్టి శంకర్	80
ఫారన్‌హీట్ 451	ఎనిశెట్టి శంకర్	90
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-1	శారదాంబ స్మారక కమిటీ	300
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70

చరిత్ర-జీవిత చరిత్ర

కశ్మీర్‌లో ఒక నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	రు. 150
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
కన్నబీరన్	వ్యాస సంకలనం	50
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
టాల్‌స్టాయ్ పరిచయ వ్యాసాలు	యన్.వి.ఎస్. నాగభూషణాచార్యులు	30
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	న్యూవిస్టా పబ్లికేషన్స్	100
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్నీ		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు ఆమరులు	విరసం ప్రచురణ	30

కథ - నవల

దండకారణ్యంలో కథలు(2005-2012)	విరసం ప్రచురణ	100
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
గంగానమ్మ	విజయ	15
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
ఒంద్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 153 - April 2014 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/03/2014 • Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16

ఎందరో అభిమానుల కోరిక

వీక్షణం ఎటువంటి పరిస్థితిలోనూ ఆగిపోగూడదు

రచయితల సమావేశం ప్రతిన

వీక్షణం మనుగడకోసం శాయశక్తులా కృషి చేద్దాం

మూలనిధి ఏర్పాటు చేద్దాం

వీక్షణం ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కి చిరకాలం కొనసాగాలంటే

- వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ కనీసం మరొక చందా చేర్పిద్దాం
- వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరమూ మన చందాతో పాటు కనీసం రు. 100 వీక్షణం మూలనిధికి విరాళంగా ఇద్దాం
- కళాశాలలను, విద్యాసంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు గ్రంథాలయాలను వీక్షణం చందాదారులుగా చేర్పించి వీక్షణం మరింత మంది పాఠకులకు చేరువయ్యేలా చూద్దాం
- ప్రతి న్యూస్ ఏజెంట్ దగ్గరా వీక్షణం విడిప్రతులు అమ్మకానికి ఉండే ఏర్పాట్లు చేద్దాం
- ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న పాఠకులు, అభిమానులు తమ బాధ్యతగా సంవత్సరాదాయంలో కనీసం ఒక శాతం వీక్షణం మూలనిధికి విరాళంగా ఇచ్చేలా చూద్దాం
- సామాజిక జీవితంలో క్రియాశీలంగా ఉన్న, విస్తృత పరిచయాలు ఉన్న వీక్షణం అభిమానులు తమకు తెలిసిన దాతల నుంచి వీక్షణం మూలనిధికి విరాళాలు సేకరించేలా చూద్దాం
- విద్యాసంస్థల, ఆరోగ్య సంస్థల, సాధారణ వ్యాపార సంస్థల నిర్వాహకులతో పరిచయాలు ఉన్న అధ్యాపకులు, మిత్రులు, సామాజిక కార్యకర్తలు వీక్షణం కోసం ఆయా సంస్థల వ్యాపార ప్రకటనలు ఇప్పించేలా చూద్దాం
- వీక్షణం ప్రచారం కోసం, ఆర్థిక సహాయం అర్థించడం కోసం మన ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేద్దాం

వివరాలకు

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao